
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 150

మంగళవారం 20-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రెండో స్థానంలో అమన్

ప్రపంచ రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో భారత రెజ్లర్ పురోగతి - 14లో



ఎయిర్‌లైన్స్‌కు పండుగే!

రానున్న పండుగల నేపథ్యంలో టికెట్ బుకింగ్‌లకు పెరిగిన డిమాండ్ - 15లో



హైకోర్టులో సిద్ధూకు భారీ ఊరట

మైసూరు భూకేటాయింపుల వివాదంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆ రాష్ట్ర హైకోర్టులో భారీ ఊరట లభించింది.

- వివరాలు 6లో



నిందితుడికి పాలిగ్రాఫ్ పరీక్ష

కోల్‌కతా వైద్యురాలి రేప్, హత్య కేసులో నిందితుడు సంజయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహణకు స్థానిక కోర్టు అనుమతించింది.

- వివరాలు 6లో



బీజేపీ, కాంగ్రెస్ మధ్యలో లోకల్

వివిధ పార్టీలతో కిక్కిరిసిన హరియాణా రాజకీయ రంగస్థలంపై ఆసక్తికర అసెంబ్లీ ఎన్నికల పోరుకు తెరలేచింది.

- వివరాలు 6లో



30 ఏళ్లలో అంతఃకలహాలు

జనాభా మార్పుల వల్ల దేశంలో వచ్చే 30 ఏళ్లలో అంతఃకలహాలు ఖాయమని మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో

రక్షా 'బంధనాలు'..!

బాలికల గురుకులంలోకి అన్నదమ్ములను అనుమతించని ప్రిన్సిపాల్

కిటికీల్లో నుంచే రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు

పండుగపూట పిల్లల ఆనందం ఆవిరి

తంగళ్లపల్లి/రామకృష్ణాపూర్: అన్నాచెల్లి..అక్కాతమ్ముడు అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీక. కానీ ఇక్కడ బంధనాల నడుమ ఆ వేడుకలు జరుపుకోవాల్సి వచ్చింది. కిటికీల సందుల్లో నుంచి అనేక ఇబ్బందులు పడుతూ రాఖీలు కట్టించుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ఉంది. సోమవారం రాఖీ పండుగ కావడంతో అక్కాచెల్లెళ్లతో రాఖీలు కట్టించుకుందామని సుదూర ప్రాంతాల నుంచి సోదరులు తల్లిదండ్రులతో కలిసి తరలివచ్చారు. అయితే వారిని ప్రిన్సిపాల్ గురుకులంలోకి అనుమతించలేదు. ఎంత ప్రాధేయపడినా ససేమిరా అన్నాడు. చివరకు చేసేదేమి లేక కిటికీల సందుల్లో నుంచి తమ అక్కాచెల్లెళ్లతో రాఖీలు కట్టించుకొని కన్నీళ్లు దిగమింగుకుంటూ తిరిగి వెళ్లారు. ఈ విషయంపై గురుకుల పాఠశాల సిబ్బందిని వివరణ కోరేందుకు

మిగతా 2వ పేజీలో ▶



సోదరులకు కిటికీలో నుంచి రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు

కుండపోత.. ఉక్కపోత!



పక్కపక్కనే ఉన్న రెండు ప్రాంతాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు

- అయితే అతివృష్టి లేదా అనావృష్టి
- కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు.. మరికొన్ని జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు
- వాతావరణ మార్పులతో గతి తప్పిన ఎండ, వానలు
- సాధారణ ఉష్ణోగ్రత, సాధారణ వర్షపాతం గణాంకాల్లో భారీ వ్యత్యాసం
- ఆగస్టులో అసాధారణ ఉష్ణోగ్రతలు
- విద్యుత్ వినియోగం భారీగా పెరిగిన వైనం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతంలో ఒక్కసారిగా కుండపోత వాన.. కానీ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్తాపూర్‌లో మాత్రం మండే ఎండ, ఆపై ఉక్కపోత. పక్కపక్కనే ఉన్న రెండు ప్రాంతాల్లో ఒకే సమయంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మోటార్ సైకిల్‌పైనో, కారులోనో అటునుంచి ఇటు, ఇటునుంచి అటు ప్రయాణించిన వారికి ఈ వింతైన అనుభవం ఎదురవుతోంది. గతంలో ఒకచోట వర్షం పడుతుంటే ఆ పక్కనున్న ప్రాంతం కాస్త చల్లగా ఉండేది. కానీ ఇప్పుడు అలా ఉండటం లేదు. వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. కొన్నేళ్లుగా భారీ స్థాయిలో చోటు చేసుకుంటున్న

మిగతా 12వ పేజీలో ▶

వర్షాకాలంలోనూ ఎండ వేడిమి...

పగటిపూటే కాకుండా రాత్రిళ్లు కూడా ఉక్కపోత కొనసాగుతుండటంతో ఏసీలు, కూలర్లను రోజంతా వాడక తప్పని పరిస్థితి నెలకొంది దీంతో ఈ నెలలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఆదివారం (ఆగస్టు 18న) 273.665 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగ్గా.. గతేడాది ఇదే రోజున 254.123 మిలియన్ యూనిట్ల వినియోగమే నమోదు కావడం ప్రస్తుత పరిస్థితిని స్పష్టం చేస్తోంది. వాస్తవానికి గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆగస్టు 12 నుంచి 17 వరకు అధిక విద్యుత్ వినియోగం నమోదు కావడం గమనార్హం.

రూ.31 వేల కోట్ల రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం..

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ

- పలు కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదని వెల్లడి
- లోపాలు సరిదిద్దిన వెంటనే 100% మాఫీ చేస్తామని వివరణ
- 17.13 లక్షల మందికి జరగని రుణమాఫీ... మంత్రి వెల్లడించిన గణాంకాలతో స్పష్టత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు రూ.31 వేల కోట్ల పంట రుణాల మాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వివరాలన్నీ క్లియర్‌గా ఉన్న 22,37,848 మంది రైతులకు సంబంధించిన రూ.2 లక్షల లోపు రుణాలు, వాటి వడ్డీలకు సంబంధించి మొత్తం రూ.17,933 కోట్లను ఆగస్టు 15లోగా ఏకకాలంలో మాఫీ చేశామని తెలిపారు. అయితే ఆధార్ కార్డు నంబర్‌లో 12 అంకెలకు బదులుగా 11, 13 అంకెలుండడంతో 1.20 లక్షల మందికి, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డుల్లోని పేర్లలో తేడాలుండడంతో 1.6 లక్షల మందికి, బ్యాంకులు ఇచ్చిన వివరాల్లో తప్పులుండడంతో 1.5 లక్షల మందికి, రేషన్ కార్డు లేకపోవడంతో 4.83 లక్షల మందికి, రూ.2 లక్షలకు మించి రుణం పొందిన 8 లక్షల మందికి రుణమాఫీ జరగలేదని మంత్రి వెల్లడించారు. ఆయా కారణాలతో మొత్తం 17.13 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగలేదని మంత్రి వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాలి



హైదరాబాద్ భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు కూడా ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మన క్రీడాకారులకు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

- వివరాలు 2లో


రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్



రాష్ట్రం నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ నామినేషన్ వేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ హాజరయ్యారు.

- వివరాలు 3లో

రుణమాఫీ కాలేదంటే రైతులను అరెస్టు చేస్తారా?



కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మండిపడ్డారు. రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తున్న రైతులను అరెస్టు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

- వివరాలు 3లో

ప్రతిదీ 'సోషల్'గా వద్దు



వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియా వేదికలపై పంచుకోవడం ముప్పు తెచ్చిపెడుతుందని సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం పెట్టే సమాచారం ఆధారంగా నేరగాళ్లు మనల్ని మోసం చేసేందుకు కొత్త ఆలోచనలకు తెర తీస్తున్నారని అంటున్నారు.

- వివరాలు 3లో

జర్నలిజం ముసుగులో రూ. 5 కోట్లు డిమాండ్



టీవీ5 మూర్తిపై సంచలన వీడియో విడుదల చేసిన వేణుస్వామి దంపతులు


- తన అనుచరుడితో మూర్తి బృందం బేరసారాలు
- అంత ఇచ్చుకోలేం... ఆత్మహత్య చేసుకుంటామన్న ప్రముఖ జ్యోతిషుడు, ఆయన సతీమణి వీణాశ్రీవాణి

సాక్షి, హైదరాబాద్: మీడియా ముసుగులో కోట్ల రూపాయలు డిమాండ్ చేసిన టీవీ 5 మూర్తి, ఆయన బృందం బండారంపై ప్రముఖ జ్యోతిషుడు వేణుస్వామి, ఆయన భార్య వీణాశ్రీవాణి సంచలన విషయాలు బయటపెట్టారు. ఈ మేరకు వారు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో టీవీ 5 మూర్తి అనుచరుడు జర్నలిస్టు అమర్, వీణాశ్రీవాణితో జరిగిన ఆడియో సంభాషణను కూడా జత చేశారు. రూ.5 కోట్లు ఇవ్వకపోతే మీ స్తోమత ఎంత.? ఎంతిస్తారో.? చెప్పండంటూ అమర్ ఆమెను ప్రశ్నించడం స్పష్టంగా రికార్డు అయ్యింది. జ్యోతిషం చెప్పుకునే వేణుస్వామికి అంతమొత్తం ఇవ్వడం సాధ్యంకాదని, ఆయన భార్య వివరిస్తున్నా.. అమర్ వినిపించుకోకుండా రూ. 50 లక్షలు ఇస్తారా? లేక రూ. కోటి ఇస్తారా.. ఏదో ఒకటి చెబితే వారితో సమావేశం ఏర్పాటు చేస్తానంటూ బదులివ్వడం గమనార్హం. రూ. 5 కోట్లలో

మిగతా 3వ పేజీలో ▶

120 సమీకృత గురుకులాలు

రూ.5 వేల కోట్లతో నిర్మిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



30 ప్రాంతాల్లో వెంటనే స్థల సేకరణ చేయాలి

ఏడెనిమిది నెలల్లోనే భవనాలు పూర్తి చేయాలన్నది లక్ష్యం

గురుకుల పాఠశాలలపై ఉన్నతాధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమీకృత గురుకులాల నిర్మాణానికి వెంటనే ఆయా నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5 వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 సమీకృత గురుకులాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని సాధ్యమైనంత త్వరగా స్థలాల సేకరణతో పాటు, భవనాల నమూనాలు (డిజైన్లు) పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాల్లో, పట్టణ ప్రాంతాల్లో 10 నుంచి 15 ఎకరాల్లో సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు కోసం స్థల సేకరణ చేయాలని చెప్పారు. రాబోయే ఏడెనిమిది నెలల్లో ఈ భవనాలను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని, అందుకు తగ్గట్టుగా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో విద్యార్థుల ప్రవేశాలు వందశాతం పూర్తి చేయాలని చెప్పారు.

ప్రతి విద్యార్థి మంచం పైనే పడుకోవాలి

ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచం పైనే పడుకునేలా చేయాలని ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶



... వాకౌట్లు ముమ్మరం చేద్దాం!

'ఫోర్త్ సిటీ' కోసం ప్రత్యేక అథారిటీ!



ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఏర్పాటుకు ప్రభుత్వం యోచన

- రెవెన్యూ శాఖ సహా వివిధ విభాగాలకు భాగస్వామ్యం
- త్వరలో జరగనున్న కేబినెట్ సమావేశంలో తుది రూపు
- 'హైడ్రా'కు చట్టబద్ధత పైనా నిర్ణయం.. ఆర్డినెన్స్ జారీ!

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివారులోని ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి చేయనున్న 'ఫోర్త్ సిటీ'కోసం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ ప్రాంతాన్ని అన్ని వర్గాలకు అనువుగా ఉండే ఫ్యూచర్ సిటీ మాదిరి నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రక్రియలో వివిధ విభాగాల మధ్య సమన్వయంతోపాటు ప్రభుత్వ ఆలోచనల అమలును పర్యవేక్షించేలా అథారిటీ పనిచేయనుంది. ఈ అథారిటీకి సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వం వహించనున్నారని తెలిసింది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం...

హైదరాబాద్ మహానగరంలో ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఫోర్త్ సిటీ అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేయాలని నిర్ణయించింది. దీనికోసం ఏర్పాటు చేయనున్న అథారిటీ సైబరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌తోపాటు దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉన్న నేషనల్ క్యాపిటల్ రీజియన్, గ్రేటర్ నోయిడా సహా మరికొన్ని సంస్థల పనితీరును అధ్యయనం చేయనుంది. ఆయా విభాగాల ఏర్పాటు తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, తలెత్తిన ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగనుంది.

సింగిల్ విండో విధానం ఉండేలా...

కొత్తగా ఏర్పాటవుతున్న నగరం కావడంతో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు కీలక ప్రాధాన్యం ఇవ్వాలని

మిగతా 5వ పేజీలో ▶

అధికారంలోకి వచ్చాక 'రాజీవ్' పేరు తొలగిస్తాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- విమానాశ్రయం సహా అన్ని చోట్లా...
- రాహుల్ వద్ద మార్కుల కోసమే సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం
- తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లిని అవమానించొద్దు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశంలో మాజీప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విగ్రహాన్ని మరోచోటకు తరలిస్తామన్నారు. నందినగర్ నివాసంలో కేటీఆర్ సోమవారం మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేర్ల మార్పుపై ఏనాడూ ఆలోచించలేదు. ఆరోగ్యశ్రీ పథకం, ట్రిపుల్ ఐటీ, ఉప్పల్ స్టేడియం, కరీంనగర్- మంచిర్యాల రాష్ట్ర రహదారి, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తదితరాలకు రాజీవ్‌గాంధీ పేరు ఉన్నా మా ప్రభుత్వం ఏనాడూ మార్చే ప్రయత్నం చేయలేదు. రాహుల్‌గాంధీ దగ్గర మార్కులు కొట్టేయాలనుకుంటే గాంధీభవన్‌లోనో, రేవంత్‌రెడ్డి ఇంట్లోనో రాజీవ్ విగ్రహం పెట్టుకోవాలి. రాష్ట్ర సాధన ఉద్యమమే ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగింది. కానీ వందలాదిమంది ప్రాణాలు తీసిన కాంగ్రెస్ మాత్రం

మిగతా 2వ పేజీలో ▶


ప్రాక్టి'కిల్'

ఇంటర్ కాలేజీలకు పట్టని ప్రయోగాలు

ప్రైవేట్ కాలేజీల్లో ల్యాబ్‌లు ఉన్నాయా?

ప్రాక్టికల్స్‌పై ఇంటర్ బోర్డు పట్టు

విధిగా ప్రయోగాలకు సూచన



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ప్రాక్టికల్స్‌ను కాలేజీలు చాలా ఈజీగా తీసుకుంటున్నాయి. దాని ప్రభావం విద్యార్థులపై పడుతోంది. ఫలితంగా వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉండటం లేదు. దీంతో ఉన్నతవిద్యలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) గత ఏడాది పరిశీలనలోనూ ఈ విషయం స్పష్టమైంది. ప్రైవేట్‌కాలేజీల్లో అసలు ల్యాబ్‌లు కూడా ఉన్నాయా? అనే సందేహాలు వస్తున్నాయి. కేవలం ప్రాక్టికల్స్ అప్పుడు మాత్రమే నామమాత్రపు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఫిజిక్స్ ప్రాక్టికల్స్ సరిగ్గా చేయని విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్‌విద్యలో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షలో ప్రాక్టికల్స్‌పై పలు వాస్తవాలు వెల్లడయ్యాయి. దీంతో అన్ని ఇంటర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ విధిగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో ఇంటర్ బోర్డు దీనిపై పట్టు పెంచింది.

80% కాలేజీల్లో ప్రాక్టికల్స్ అంతంతే

రాష్ట్రంలో 416 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. ప్రైవేట్ కాలేజీలు 3,100 వరకూ ఉన్నాయి. ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్స్ ముందు నుంచే చేయించాల్సి ఉంటుంది. ప్రభుత్వ కాలేజీల్లో ప్రాక్టికల్స్‌పై చాలా వరకూ దృష్టి పెడుతున్నారు. అరకొర వసతుల్లోనైనా విద్యార్థుల చేత ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. కానీ ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ప్రయోగాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. 2,500 కాలేజీల్లో కనీసం ఒక్క ప్రాక్టికల్ కూడా జరగలేదని తెలిసింది. కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు కావాల్సిన రసాయనాలు కొనుగోలు చేయని కాలేజీలు 2,200 వరకూ ఉన్నాయి. 1,600 కాలేజీల్లో ఫిజిక్స్ ప్రాక్టికల్స్ గురించే విద్యార్థులకు తెలియదు. బోటనీ, జువాలజీకి సంబంధించిన మొక్కలు, డిసెక్షన్‌కు కావాల్సిన జంతువులు ఎక్కడా కనిపించడం లేదు. వివిధ రకాల మొక్కలను సేకరించి, రికార్డుల్లో అతికించి (హెర్బేరియం) ప్రయోగాత్మకంగా వాటి కుటుంబాన్ని వివరించే నైపుణ్యం విద్యార్థుల్లో కనిపించడం లేదు. అన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో పరీక్షల సమయంలోనూ ఎగ్జామినర్లు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది.

నష్టపోతున్న సైన్స్ విద్యార్థులు

సైన్స్ నేపథ్యంతో ఇంటర్ చేసేవారే రాష్ట్రంలో ఎక్కువమంది ఉన్నారు. 4.20 లక్షల మంది ఏటా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిలో 1,65,708 మంది ఎంపీసీ విద్యార్థులు. 1,11275 మంది బైపీసీ విద్యార్థులు. దాదాపు 2.76 లక్షల మంది ఈ రెండు గ్రూపుల్లోనే ఉన్నారు. సగానికి పైగా ఉన్న ఈ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీపై ద్వితీయ సంవత్సరం ఆరంభం నుంచి ప్రతీ చాప్టర్‌పైనా ప్రాక్టికల్స్ చేయించాలి.

- ఫిజిక్స్‌లో యంత్ర పరికరం పనిచేసే విధానం ద్వారా మూల సూత్రాలను అర్థం చేసుకోవాలి. ప్రాక్టికల్స్ చేయకపోవడం వల్ల ఇంజనీరింగ్‌లో యంత్ర పరికరాలపై వాస్తవ అవగాహన కొరవడుతోంది. దీంతో ఇంజనీరింగ్ పూర్తయినా నైపుణ్యం ఉండటం లేదు.
- కెమిస్ట్రీలో రసాయనాల సమ్మేళనం, కొత్త రసాయనాల ఏర్పాటు, ట్రైట్రేషన్ (రసాయన కలయిక)తో వచ్చే సరికొత్త కెమికల్ ఈక్వేషన్స్‌పై విద్యార్థులకు పట్టు ఉండటం లేదు.
- బీఫార్మసీ, బైపీసీతో వెళ్లే ఇతర కెమికల్ సంబంధిత ఉన్నతవిద్యలో సరికొత్త ఆవిష్కరణలను అర్థం చేసుకోలేకపోతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.
- జువాలజీలో జంతువుల శరీరభాగాలపై డిసెక్షన్ ద్వారా జరిగే ప్రాక్టికల్స్ ద్వారా నాడీ, లివర్ వ్యవస్థ తెలుసుకోవచ్చు. ఇంటర్‌లో దీనిపై పట్టులేకపోవడం వల్ల ఉన్నతవిద్యలో ఈ అంశాలను థియరీగా నేర్చుకోవడమే తప్ప, ప్రాక్టికల్ నాలెడ్జ్‌లో వెనుకబడుతున్నారు.
- కీలకమైన బోటనీలో వివిధ వృక్ష జాతులపై ప్రాక్టికల్ అవగాహన కొరవడటం వల్ల ఫార్మసీలో మందుల తయారీ, వాటి ఈక్వేషన్స్‌పై విద్యార్థులకు నైపుణ్యం ఉండటం లేదని ఫార్మా పరిశోధక సంస్థలు అంటున్నాయి. ఇంటర్ నుంచే ప్రాక్టికల్స్‌పై దృష్టి పెడితే ఉన్నతవిద్యలో స్కిల్స్‌ను అందుకునే వీలుందని అధ్యాపకులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

నేడు గోదావరి బోర్డు సమావేశం

సీతారామ ఎత్తిపోతల డీపీఆర్‌పై చర్చ

సాక్షి, హైదరాబాద్: గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం కానుంది. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌పై చర్చించి ఆమోదించేందుకు ఈ సమావేశాన్ని గోదావరి బోర్డు నిర్వహించతల పెట్టింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించి డీపీఆర్‌ను తదుపరి ఆమోదం కోసం కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీకి గోదావరి బోర్డు పంపించనుంది. టీఏసీ ఆమోదం లభించిన తర్వాత చివరగా అపెక్స్ కౌన్సిల్‌లో ఆమోదించాల్సి ఉంటుంది.దీంతో ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్టు భావిస్తున్నారు. ప్రాజెక్టు ద్వారా 67.05 టీఎంసీల గోదావరి జలాలను తరలింపునకు హైడ్రాలజీ క్లియరెన్స్‌ఇస్తూ ఇటీవల కేంద్ర జలసంఘం నిర్ణయం తీసుకుంది.

రేపు ఓటుకు కోట్లు కేసు విచారణ

విచారించనున్న జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసును బుధవారం సుప్రీంకోర్టు విచారించనుంది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది. గత విచారణ సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి సమయం కోరడంతో మరోసారి విచారణ వాయిదా వేయొద్దని ధర్మాసనం సూచించింది. ఏదో ఒక సాకు చూపి వాయిదా కోరుతున్నారని పిటిషనర్ ఆళ్ల రామకృష్ణారెడ్డి తరపు సీనియర్ న్యాయవాది ఆర్.బసంత్ ఆరోపించిన సంగతి తెలిసిందే. అనంతరం జూలై 24కు కేసు వాయిదా వేయగా ఆ రోజు ఇతర కేసుల కారణంగా విచారణ సాగలేదు.

తెలంగాణలోనే కొనసాగుతాం

కేన్స్ టెక్నాలజీ సీఈవో రఘు ఫణికర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు కొనసాగించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములం అవుతామని కేన్స్ టెక్నాలజీ సంస్థ సీఈవో రఘు ఫణికర్ స్పష్టం చేశారు. ఈ నెల 23న కొంగర కలాన్‌లో కేన్స్ సంస్థ అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవానికి హాజరు కావాలని సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం సచివాలయంలో కలిసి ఆహ్వానించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఒసాట్) మిషన్ ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందన్నారు. ఇండియన్ సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) అనుమతి వచ్చిన తర్వాత ఒసాట్ యూనిట్ కార్యకలాపాలను ప్రారంభిస్తామని ఫణికర్ స్పష్టం చేశారు.

నాలుగు మెడికల్ కాలేజీల కోసం రేపు ఢిల్లీకి అధికారులు

ఎన్ఎంసీ ముందు హాజరై వ్యక్తిగత అప్పీలు

సాక్షి, హైదరాబాద్: అనుమతులు రాని 4 వైద్య కళాశాలలను రాబట్టేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య ఉన్నతాధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకోసం జాతీ య మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులను కలిసేందుకు బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కుత్బుల్లాపూర్, మహేశ్వరం, మెదక్, యాదాద్రి భువనగిరి వైద్య కళాశాలలకు అనుమతి ఇవ్వాలని అప్పీలు చేయనున్నారు. వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ 4 కొత్త మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ నుంచి అనుమతులు రాలేదు. కాగా, ఈ ఏడాది వైద్య విద్యా సంవత్సరంలో కొత్తగా ఎనిమిది మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

కష్టసుఖాల్లో అండగా ఉంటాం

విద్యుత్ ఉద్యోగులకు భట్టి విక్రమార్క హామీ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, వారు కూడా ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. పెట్టే ప్రతీ సంతకం, తీసుకునే ప్రతీ నిర్ణయం, చేసే ప్రతీ పని సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులున్నా విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్)లో పదోన్నతి పొందిన విద్యుత్ ఉద్యోగులు సోమవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒలింపిక్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాలి

- స్పోర్ట్స్ యూనివర్సిటీపై చర్చలో సీఎం రేవంత్
- క్రీడా పాఠశాలలు, అకాడమీలన్నిటినీ యూనివర్సిటీ పరిధిలోకి తేవాలి
- పతకాలు దక్కేలా మన క్రీడాకారులను తీర్చిదిద్దాలి
- తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని రకాల క్రీడలు, క్రీడా శిక్షణా సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న హైదరాబాద్ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ అందుకు వేదిక కావాలన్నారు. గతంలో ఆఫ్రో–ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చిన హైదరాబాద్ భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు కూడా ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధం కావాలని స్పష్టం చేశారు. ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులకు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. వారికి క్రీడా నిపుణులతో శిక్షణ ఇప్పించాలని సూచించారు. దేశ క్రీడా రంగానికి తెలంగాణ కేంద్ర బిందువుగా ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం సచివాలయంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో చర్చించిన సందర్భంగా సీఎం మాట్లాడారు.

వారెలా పతకాలు సాధించారో అధ్యయనం చేయండి

'ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలను, క్రీడాకారుల వివరాలను, వారు పతకాల సాధనకు శ్రమించిన తీరును పరిశీలించాలి. ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలి. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. మన శరీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించాలి. క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలి. ఇప్పటికే స్కిల్స్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టాం. స్పోర్ట్స్ యూనివర్సిటీకీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న సమీకృత గురుకుల పాఠశాలలకు కూడా యంగ్ ఇండియా పేరు పెడతాం. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలి. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి..'అని సీఎం ఆదేశించారు.

ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో క్రీడా పాఠశాల

'అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణా సంస్థలు అన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలి. ఇందులో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీ లాంటి వాటికి మొదటగా ప్రాధాన్యం ఇవ్వాలి. అనంతర శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలి. అలాంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్‌వర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా చూడాలి..'అని రేవంత్ చెప్పారు.

అనాథ బాలిక దుర్గకు అండగా ఉంటాం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన.. సాయం అందించిన మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క



బాలిక దుర్గకు సరుకులు అందజేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/నిర్మల్‌చైన్‌గేట్/తానూరు: తల్లి ఆత్మహత్యతో అనాథగా మారిన పదకొండేళ్ల బాలిక దుర్గకు అన్నివిధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్ తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగమణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకోగా, ఆమె కుమార్తె దుర్గ అనాథగా మారింది. తల్లి అంత్యక్రియలకు డబ్బుల కోసం దుర్గ భిక్షాటన చేసిన విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. దుర్గకు విద్య, వైద్యం, ఇతర అవసరాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో దుర్గకు ఉచితవిద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు. కాగా, బాలికకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క రూ.50 వేలు అందించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాలిక పేరుపై రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. మంత్రులిద్దరూ బాలికతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పి ఓదార్చారు. తహసీల్దార్, ఎంపీడీవో, బాలల సంరక్షణ అధికారులు బాలికను కలిసి ధైర్యం చెప్పడంతోపాటు నిత్యావసర సరుకులు అందించారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా యంత్రాంగం తక్షణ సహాయంగా అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించింది.

సీఎంకు రాఖీలు కట్టిన చిన్నారులు

వినికిడి సమస్యతో బాధపడుతూ ప్రభుత్వ సహాయంతో శస్త్ర చికిత్స చేయించుకున్న పలువురు చిన్నారులు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టి అభిమానం చాటుకున్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారుల వైద్యానికి సత్వర సహాయాన్ని అందిస్తున్నారు. వారికి కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పలువురు చిన్నారులు ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ ఆచార్య, వైద్యురాలు డీకే వీణ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రిని కలసి రాఖీలు కట్టారు.

దేశానికే ఆదర్శంగా కొత్త రెవెన్యూ చట్టం

- ఆర్వోఆర్ చట్ట ముసాయిదాపై చర్చాగోష్టిలో రెవెన్యూ మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రైతుల భూములకు ఎలాంటి చిక్కులు రాని, సమస్యలు లేని కొత్త చట్టాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ చట్టం దేశానికే ఆదర్శంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని టూరిజంప్లాజా హోటల్‌లో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్)–2024 ముసాయిదా చట్టంపై జరిగిన చర్చాగోష్ఠికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన వహించిన ఈ చర్చాగోష్ఠికి భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 'చట్టాలు సరిగ్గా చేయకపోతే వాటి ఫలితాలు ఎలా ఉంటాయో 2020 ఆర్వోఆర్ చట్టమే చెబుతోంది. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా 2024 ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తున్నాం. సామాన్యుడి నుంచి మేధావుల వరకు అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుంటున్నాం'అని చెప్పారు. ఈ చర్చాగోష్టిలో సీనియర్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు ట్రెసా రాష్ట్ర సమన్వయకర్త నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లను చేసింది వైఎస్సారే

గతంలో రెవెన్యూ వ్యవస్థను కాపాడింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అని ట్రెసా ప్రధానకార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ చెప్పారు. టీడీపీ హయాంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది అడ్డగోలుగా పేర్లు మార్చుకుంటూ వెళ్లారని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న దశలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వైఎస్ చొరవ తీసుకొని భూరికార్డులను మళ్లీ రెవెన్యూకు అప్పగించి కాపాడారని చెప్పారు. ఎమ్మార్వోగా ఉన్న పేరును తహసీల్దార్‌గా మార్చి దేశవ్యాప్తంగా రెవెన్యూ అధికారులిచ్చే సర్టిఫికెట్ల ధ్రువీకరణలో ఇబ్బందులు లేకుండా చేశారని గుర్తు చేశారు.

జీవో29 రద్దు చేయాలి


బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్

ములుగు రూరల్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని, గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు తీరని అన్యాయం చేసే జీవో 29ని తక్షణమే రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గ్రూప్–1 ఓపెన్ కేటగిరీ పోస్టులకు 1:50 నిష్పత్తిలో ఎంపిక అభ్యర్థుల జాబితాలో ఎంతమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ వర్గాలకు చెందినవారు ఉన్నారో ప్రభుత్వం బయటపెట్టాలన్నారు. గ్రూప్–1 ఓపెన్ కేటగిరీ పోస్టులకు రిజర్వేషన్ పాటించకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. జీవో 55 నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు.

అధికారంలోకి వచ్చాక 'రాజీవ్' పేరు తొలగిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మరోమారు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తెలంగాణతల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ విగ్రహాన్ని పెడుతోంది. తెలంగాణతల్లికి కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాన్ని తెలంగాణ సమాజం మరిచిపోదు. మళ్లీ నాలుగేళ్లలో తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తొలగించి కాంగ్రెస్ పార్టీ కోరుకున్న చోటుకు పంపిస్తాం. ఇతర రాష్ట్రాల తరహాలోనే తెలంగాణ మహనీయుడి పేరును విమానాశ్రయానికి పెడతాం. రాజీవ్‌గాంధీ పేరిట ఉన్న సంస్థల పేర్లను కూడా మార్చే దిశగా ఆలోచిస్తామని ఢిల్లీకి గులాములుగా ఉన్న కాంగ్రెస్ నేతలకు చెబుతున్నా'అని కేటీఆర్ అన్నారు.



తెలంగాణభవన్‌లో కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మహిళలు

తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

'తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సచివాలయం ఎదురుగా ప్రతిష్ఠించాలనే ఉద్దేశంతో ఒక ఐలాండ్ కూడా నిర్మించాం. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తల్లికి కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడుతోంది. జై తెలంగాణ అనని సీఎం రేవంత్ కనీసం అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ కూడా వేయలేదు. దివంగత మాజీ సీఎం అంజయ్య పేరిట ఏర్పాటు చేసిన పార్కును లుంబినీగా మార్చి, అదే పార్కు ఎదుట ఆయన్ను అవమానించిన రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారు'అని కేటీఆర్ విమర్శించారు.

పదేళ్ల పాలన ఓ యజ్ఞంలా సాగించాం

శ్రీలంక వాణిజ్యమంత్రితో కేటీఆర్

రాష్ట్రంలో పదేళ్ల పాటు పాలనను ఓ యజ్ఞంలా సాగించి అసాధారణ ఫలితాలు సాధించామని కేటీఆర్ అన్నారు. శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల మంత్రి సతాశివన్ వియలందేరన్ కేటీఆర్‌తో నందినగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతున్న సమయంలో హైదరాబాద్‌ను అవకాశాల అక్షయపాత్రగా మార్చిన తీరు స్ఫూర్తిదాయకమని సతాశివన్ అన్నారు. హైదరాబాద్ వంటి ఆర్థిక ఇంజిన్లను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందన్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణ సాధించిన ప్రగతిని తాను శ్రీలంక పార్లమెంట్‌లో ప్రస్తావించిన విషయాన్ని సతాశివన్ కేటీఆర్‌కు వెల్లడించారు. ఈ భేటీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నేతలు సురేందర్, దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

రాఖీ రోజు నా సోదరి వెంట లేదు

'ఎక్స్'లో కేటీఆర్ భావోద్వేగం

'ఈ రోజు నాకు రక్షా బంధనం చేయలేకపోవచ్చు. కానీ నీ కష్టసుఖాల్లో వెంట ఉంటా'అని కేటీఆర్ తన సోదరి కవితను ఉద్దేశించి భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. గతంలో తన సోదరి రాఖీ కట్టిన ఫొటోలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. '155 రోజులుగా కవిత ఎంతో వేదన అనుభవిస్తోంది. సుప్రీంకోర్టులో ఆమెకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది'అని పేర్కొన్నారు. కాగా రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణభవన్‌లో జరిగిన వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో మహిళలపై జరిగిన అత్యాచార ఘటనల వివరాలు ఇస్తామని మంత్రి సీతక్క చేసిన ప్రకటనపై కేటీఆర్ స్పందించారు. '8 నెలల్లో కొల్లాపూర్, షాద్‌నగర్ సహా అనేక చోట్ల మహిళల పట్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతోందో తెలుసు. కోల్‌కతాలో యువ వైద్యురాలిపై అఘాయిత్యం చేసి చంపేస్తే, నిరసన తెలుపుతున్న డాక్టర్లు తెలంగాణ తరహాలో న్యాయం చేయండి అంటున్నారు. దటీజ్ తెలంగాణ.. దటీజ్ కేసీఆర్'అని కేటీఆర్ అన్నారు.

రాఖీ కట్టి... ఆప్యాయతను చాటి: వివిధ సందర్భాల్లో తమకు అండగా నిలిచిన పలువురు కేటీఆర్‌కు రాఖీ కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. అనాథ విద్యార్థిని రుద్రరచన బీటెక్‌కు చదివేందుకు, వినికిడి లోపంతో బాధపడుతున్న ఐదేళ్ల జోహార్ ఖాన్ చికిత్సకు, కుక్కల దాడిలో ఐదేళ్ల బాలిక కృతిక గాయపడగా, ఆపరేషన్‌కు కేటీఆర్ ఆర్థిక సాయం చేశారు. రుద్రరచన, కృతికతో పాటు జోహార్‌ఖాన్ తల్లి కేటీఆర్‌కు రాఖీ కట్టారు.

ఆర్మీకి ప్రజలు అండగా నిలవాలి

ఏఓసీ సెంటర్ రాఖీ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ఏఓసీ సెంటర్‌లో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కంటోన్మెంట్: కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ సేవలో నిమగ్నమైన ఆర్మీ జవానులకు ప్రజలంతా అండగా నిలవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షాబంధన్ దేశ సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నమన్నారు. ఆర్మీ జవానులను సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ ఎక్కడికక్కడ ప్రజలు తమ సోదరభావాన్ని చాటాల్సిన అవసరం ఉందని చెప్పా రు. సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని ఆర్మీ యూనిట్‌లలో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ–ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాజేశ్ మనోచా, సంస్కృతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్ రావు, ప్రతినిధులు డాక్టర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు గాలికొదిలేసి.. ఇప్పుడు గాలి మాటలా?

- అంత లక్షణంగా ఉంటే లక్షన్నర కేసులెందుకు?
- వరంగల్ యాసిడ్ ఘటనలో దటీజ్ వైఎస్సార్ అన్నారు
- మహిళాభద్రతపై మీతో చెప్పించుకోవాల్సిన స్థితిలో లేము
- కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన సీతక్క



రాఖీ కట్టేందుకు వచ్చిన మంత్రి సీతక్కతో నవ్వులు చిందిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు మహిళా భద్రతను గాలికొదిలేసి.. ఇప్పుడు గాలి మాటలు చెప్పడం మానుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్‌కు మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హితవు పలికారు. 'మీ హయాంలో మహిళాభద్రత అంత లక్షణంగా ఉంటే.. మహిళలపై లక్షన్నరకు పైగా నేరాలెందుకు జరిగాయి'అని ప్రశ్నించారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. రాఖీ పండుగ రోజు కూడా మహిళామంత్రిని, మహిళా కమిషన్ చైర్పర్సన్‌ను నిందించడం కేటీఆర్‌కే చెల్లిందన్నారు. పండగపూట రాజకీయలబ్ధి కోసం కేటీఆర్ అవాస్తవాలు చెబుతున్నారన్న సీతక్క..మహిళాభద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఒక ప్రకటనలో గుర్తు చేశారు. బాధితులకు భరోసా కల్పించేందుకు మహిళా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది గత కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని సీతక్క ప్రశ్నించారు. మహిళా భద్రతకు తమ పార్టీ ఏం చేసిందో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన సబితాఇంద్రారెడ్డిని కేటీఆర్ అడిగి తెలుసుకోవాలన్నారు. వరంగల్‌లో అమ్మాయిలపై యాసిడ్ దాడి జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని చెప్పారు. అప్పట్లో దటీజ్ వైఎస్సార్ అని అంతా అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు.

సీఎంకు సీతక్క రాఖీ: రాఖీపౌర్ణమి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి సహచర మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోమవారం ఉదయం రేవంత్ నివాసానికి వెళ్లిన సీతక్క రాఖీని కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం సతీమణి గీత, కుమార్తె నైమిష, ఇతర బంధువులు పాల్గొన్నారు. సీతక్కతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, మట్టా రాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు నేరెళ్ల శారద తదితరులు సీఎం నివాసానికి వెళ్లి రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటుకున్నారు. ఆ తర్వాత రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు అసెంబ్లీకి వచ్చిన సీతక్క.. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పాత్రికేయులకు రాఖీలు కట్టారు.

రక్షా 'బంధనాలు'..!

▶ మొదటి పేజీ తరువాయి

'సాక్షి'ప్రయత్నించగా ఎవరూ స్పందించలేదు.



తండ్రి భుజం ఎక్కి రాఖీ కట్టించుకుంటున్న సోదరుడు

తండ్రి భుజాలపై రాఖీ బంధం: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో దాసరి అశ్విక, సహస్ర చదువుతున్నారు. రాఖీ పండుగకు సోమవారం పాఠశాలకు సెలవు ఇవ్వలేదు. రాఖీలు కట్టేందుకు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. దీంతో అశ్విక, సహస్రల తమ్ముడు దాసరి జితేంద్ర అక్కలపై ఉన్న ప్రేమతో ఎలాగైనా రాఖీ కట్టించుకోవాలని సాహసం చేశాడు. తండ్రి భుజంపైకి ఎత్తుకోగా హాస్టల్ కిటికీ వద్దకు వచ్చిన అక్కలు జితేంద్రకు రాఖీ కట్టారు. జితేంద్ర రాఖీ కట్టించుకున్న తీరును ఎవరో మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కూడా వైరల్ అయ్యింది. దీనిని అధికారులు తీవ్రంగా పరిగణించారు. గురుకుల జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు విచారణ చేపట్టి కలెక్టర్ కుమార్‌దీపక్‌కు నివేదిక అందజేశారు. రాఖీ పౌర్ణమికి సెలవు లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలతో గురుకులానికి వచ్చారని, విద్యార్థులందరినీ ఒకేసారి ఉదయం 11గంటలకు అనుమతి ఇచ్చామని చెప్పారు. ఓ విద్యార్థిని తండ్రి ఉదయం 9గంటలకే కిటికీలోతన పిల్లలకు రాఖీ కట్టించుకుంటూ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి గురుకులానికి ఇబ్బంది కలిగేలా చేశారన్నారు.

ప్రతిదీ 'సోషల్'గా వద్దు

- వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, రోజువారి కార్యక్రమాలు సోషల్ మీడియాలో షేర్ చేయకపోవడమే మేలు
- సోషల్ మీడియా ఖాతాలోంచి సమాచారం తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- సెక్యూరిటీ ఫీచర్లు తప్పక వాడాలని సూచిస్తున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్ : ఉదయం లేచింది మొదలు.. ఏ గంటకు ఏం చేస్తున్నాం.. ఎక్కడకు వెళుతున్నాం..ఇలా ప్రతిదీ సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయడం కొందరికి అలవాటుగా మారింది. ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు వాట్సాప్ స్టేటస్‌లో, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్‌లో షేర్ చేయడం యువతకు ఇప్పుడు ఓ ట్రెండ్‌గా మారింది. మన వ్యక్తిగత వివరాలు, వెళుతున్న ట్రిప్పులు పంచుకోవడంలో తప్పేముందని వాదించేవారూ ఉన్నారు. అయితే, ఇలా ప్రతిదీ సోషల్‌మీడియా వేదికలపై పంచుకోవడం మనకు తెలియకుండానే ముప్పు తెచ్చిపెడుతుందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం చేసే పోస్టులు, పెట్టే మెసేజ్‌లలోని సమాచారాన్ని విశ్లేషించుకుంటున్న సైబర్‌నేరగాళ్లు మనల్ని మోసం చేసేందుకు కొత్తకొత్త ఆలోచనలకు తెర తీస్తున్నారని వారు అంటున్నారు.

ఉదాహరణకు మీరు ఫలానా తేదీలో, ఫలానా సమయంలో ఒక ట్రిప్పునకు వెళ్లినట్టు అప్‌డేట్ చేశారనుకోండి. మీరు చెప్పిన వివరాలనే ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసానికి తెరతీస్తున్నారు. మీ మొబైల్ నంబర్, వివరాలు తీసుకొని 'మీరు ఫలానా రోజు ట్రిప్పునకు వెళ్లినప్పుడు లక్కీడిప్‌లో ఒక బహుమతి గెల్చుకున్నారు'అనో లేదంటే మీరు ప్రయాణానికి సంబంధించి, లేదా మీరు బస చేసిన హోటల్‌కు సంబంధించి రేటింగ్ ఇవ్వండి'అనో మాల్‌వేర్ ఉన్న లింక్‌లు పంపొచ్చు. లేదంటే మీరు జర్నీలో ఉన్నట్టుగా గ్రహించి 'మేం బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం ..మీ కేవైసీని వెంటనే అప్‌డేట్ చేసుకోకపోతే మీ డెబిట్, లేదా క్రెడిట్‌కార్డు బ్లాక్ అవుతుంది 'అంటూ ఒత్తిడిలో పెట్టి బ్యాంకుఖాతాను కొల్లగొట్టొచ్చు. లేదంటే మీరు వ్యక్తిగతంగా, సన్నిహితంగా కుటుంబసభ్యులతో తీసుకునే ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులు పెడుతున్న ఘటనలు నమోదవుతున్నాయిని వారు పేర్కొంటున్నారు. ఈ తరహా మోసాలన్నింటికీ మనం సోషల్ మీడియాలో పంచుకుంటున్న వివరాలే అని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మీ బంధువులను ఇబ్బంది పెట్టొచ్చు

మీరు విహారయాత్రలో లేదంటే మరేదో పనిలో ఉన్నట్టుగా మీ సోషల్ మీడియా ఖాతాల్లోని పోస్టుల ద్వారా గ్రహించే సైబర్ నేరగాళ్లు..మీ పేరిట మీ స్నేహితులు, బంధువులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టే ప్రమాదమూ ఉందని గ్రహించాలని నిపుణులు సూచిస్తున్నారు. మీరు ఒక రాష్ట్ర పర్యటనలో ఉన్నట్టుగా సమాచారం సేకరించి మీ సోషల్ మీడియా ఖాతాల్లో ఉండే స్నేహితులు, ఇతర బంధువులకు మీ పేరిట సందేశాలు పంపుతూ కూడా డబ్బులు కొల్లగొట్టే ప్రమాదముందంటున్నారు. ఇన్ని అనర్థాలకు కారణం మనకుమనంగా సోషల్ మీడియాలో పంచుకునే విషయాలే అని గ్రహించాలని వారు హెచ్చరిస్తున్నారు. అవసరం మేరకు సమాచారం పంచుకోవడంలో తప్పులేదని, కార్యక్రమాల వివరాలు, ఫొటోలు షేర్ చేసుకోవాలంటే మాత్రం తప్పక సోషల్‌మీడియా ఖాతాల్లోని సెక్యూరిటీ ఫీచర్లను ఎనేబుల్ చేసుకోవాలని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల మీ వివరాలు, ఫొటోలు కేవలం మీకు తెలిసిన వ్యక్తులు, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని వారికి మాత్రమే కనిపిస్తాయి. బయటి వ్యక్తులు వీటిని చూసే అవకాశం లేకుండా చేయవచ్చంటున్నారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సింఘ్వి. చిత్రంలో సీఎం రేవంత్, భట్టి, దీపాదాస్, ఉత్తమ్

రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వి నామినేషన్

హాజరైన రేవంత్, భట్టి, ఉత్తమ్, శ్రీధర్, పొంగులేటి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఎస్.ఉత్తమ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌లతో కలసి మొదటి సెట్ నామినేషన్‌ను అసెంబ్లీ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దీంతో పాటు మరో మూడు సెట్లను కూడా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలసి దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలు అనంతరం అభిషేక్ మను సింఘ్వి.. సీఎం రేవంత్‌ను వెంట తీసుకుని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లిన ఆయన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్ కేసు విచారణకు హాజరయ్యేందుకు అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు వెళ్లారు.

సీఎల్పీ కార్యాలయంలో సీఎం: నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అసెంబ్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా సీఎల్పీకి వెళ్లారు. అక్కడి నుంచి పార్టీ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్విని తీసుకుని అసెంబ్లీ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి నామినేషన్లు సమర్పించారు. అనంతరం సింఘ్వి వెళ్లిపోయాక మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి కాసేపు సీఎల్పీ కార్యాలయంలోనే కూర్చున్నారు. అక్కడే అల్పాహారం తీసుకున్న ముఖ్యమంత్రి కొద్దిసేపు పార్టీ నేతలతో మాట్లాడి వెళ్లిపోయారు.

రేపటి నుంచి క్రాస్ ఎగ్జామినేషన్!

సాక్షులను ప్రశ్నించనున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

- 'కాళేశ్వరం'పై ఇప్పటివరకు 57 మంది విచారణ
- 25 మందిని క్రాస్ ఎగ్జామిన్ చేయనున్న కమిషన్!
- తొలిరోజు రిటైర్డ్ ఈఎన్సీ మురళీధర్‌కు పిలుపు



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు మధ్యంతర నివేదిక సమర్పించి బయటకు వస్తున్న విజిలెన్స్ విభాగం డీజీ సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ బుధవారం నుంచి సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించనుంది. కమిషన్ ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, రిటైర్డు ఇంజనీర్లు, ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు, నిపుణులు కలిపి మొత్తం 57 మందిని సాక్షులుగా పరిగణించి విచారించింది. ఇచ్చిన సమాచారాన్ని, వాదనలను అఫిడవిట్ రూపంలోనూ సేకరించింది. తాజాగా వాటిల్లోని నిజానిజాలను నిర్ధారించుకోవడానికి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఉన్నత స్థాయి ఇంజనీర్లు, నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా పనిచేసిన ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులు.. మొత్తం 25 మందికి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించే అవకాశాలున్నాయి. తొలిరోజు ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన మాజీ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. ఆ తర్వాత సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) మాజీ చీఫ్ ఇంజనీర్ నరేందర్ రెడ్డిని విచారించనున్నట్టు తెలిసింది. రోజుకు ఒకరిద్దరు చొప్పున ఈ ప్రక్రియ కొనసాగే అవకాశముంది. బీఆర్‌కేఆర్ భవన్ 10వ అంతస్తులోని మీటింగ్ హాల్‌లో బహిరంగ విచారణ తరహాలో క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించడానికి కమిషన్ కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది.

క్రాస్ ఎగ్జామినేషన్ తర్వాతే మాజీ సీఎం, మంత్రి విచారణ

క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియలో పూర్తి సాక్ష్యాధారాలను సేకరించిన తర్వాతే మాజీ సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి టి.హరీశ్‌రావుతో పాటు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ఇతర ముఖ్యులకు నోటీసులు జారీ చేసి విచారించాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన వీరిని ప్రశ్నించడానికి ముందు సరైన సాక్ష్యాధారాలను సేకరించాలని కమిషన్ భావిస్తోంది.

రంగంలో ఫరక్కా బరాజ్ ఇంజనీర్లు

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో లోపాలను గుర్తించడానికి పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా బరాజ్ ఇంజనీర్ల సేవలను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వినియోగించుకుంటోంది. ఇప్పటికే ముగ్గురు ఇంజనీర్ల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను సందర్శించి పరిశీలించింది. ఈ మేరకు త్వరలోనే నివేదికను సమర్పించే అవకాశముంది. సాంకేతిక విషయాల్లో సహకారం కోసం ఇంజనీర్లతో కూడిన ఓ నిపుణుల కమిటీని కమిషన్ గతంలో ఏర్పాటు చేయగా, ఆ కమిటీ నివేదికను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారి ఒకరు కమిషన్ అనుమతి లేకుండా నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీకి అందజేశారు. దీంతో ఫరక్కా బరాజ్ ఇంజనీర్ల సహకారాన్ని తీసుకోవాలని కమిషన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. మరోవైపు కమిషన్ విచారణకు సహకరించడానికి కేంద్ర జలశక్తి శాఖ సానుకూలత వ్యక్తం చేసింది. ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘంతో పాటు ఇతర విభాగాల నుంచి జారీ చేసిన అనుమతులు, నిర్వహించిన అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని కమిషన్ కోరగా, కేంద్ర జలశక్తి శాఖ నుంచి సానుకూల స్పందన వచ్చింది.

కమిషన్ చేతికి విజిలెన్స్ మధ్యంతర నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై గత కొన్ని నెలలుగా విచారణ నిర్వహిస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సోమవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు మధ్యంతర నివేదిక అందజేసింది. విజిలెన్స్ విభాగం ఇన్‌చార్జి డీజీ సీవీ ఆనంద్ బీఆర్‌కేఆర్ భవన్‌లో జస్టిస్ ఘోష్‌ను కలిసి నివేదికను అందజేశారు. తుది నివేదిక సమర్పించేందుకు మరికొంత సమయం కేటాయించాలని ఆయన కోరగా, కమిషన్ అనుమతించినట్టు తెలిసింది.

మాజీ సీఎస్‌పై త్వరలో తదుపరి చర్యలు!

మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ గడువులోగా అఫిడవిట్ సమర్పించకపోవడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. గత నెలలో ఆయన కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చెప్పిన వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని కమిషన్ ఆదేశించగా అంగీకరించారు. కానీ ఇప్పటివరకు అఫిడవిట్ సమర్పించకపోవడంతో త్వరలో తదుపరి చర్యలు చేపట్టాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం కింద సమన్లు జారీ చేసే అవకాశమున్నట్టు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావుకు బెయిల్

- అనారోగ్యకారణాల దృష్ట్యా 15 రోజులపాటు మధ్యంతర బెయిల్
- ట్యాపింగ్ కేసులో ఏ–2గా భుజంగరావు.. ఈ ఏడాది మార్చి 23న అరెస్ట్
- హైదరాబాద్ విడిచి వెళ్లరాదని భుజంగరావుకు నాంపల్లి కోర్టు షరతులు

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు బెయిల్ మంజూరైంది. గుండె సంబంధిత చికిత్స నేపథ్యంలో 15 రోజులపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ నాంపల్లి మొదటి అదనపు సెషన్స్ జడ్జి కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ–2గా ఉన్న భుజంగరావును మార్చి 23న పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పలుసార్లు అతని తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పలు రకాల ఆరోగ్య సమస్యలతోపాటు గుండె సంబంధిత సమస్య ఉండటంతో వెంటనే చికిత్స అవసరమని లేదంటే ప్రాణాలకు ముప్పు ఉన్నదని ఆయన తరఫు న్యాయవాదులు న్యాయస్థానానికి సూచించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం మెడికల్ రిపోర్ట్‌లను పరిశీలించి వైద్య చికిత్స కోసం 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అంతేకాకుండా హైదరాబాద్ విడిచి వెళ్లకూడదని భుజంగరావుకు షరతులు విధించింది.

రూ.31 వేల కోట్ల రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం..

▶ మొదటి పేజీ తరువాయి

సాంకేతిక సమస్యలను పరిష్కరించి నూటికి నూరు శాతం రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు. అర్హతలుండీ రుణమాఫీ జరగని రైతుల నుంచి వివరాలను సేకరించి, తప్పులు సవరించి అప్‌లోడ్ చేయాల్సిందిగా వ్యవసాయ అధికారులను ఆదేశించామని, ఆ వెంటనే వారికీ రుణమాఫీ వర్తింపజేస్తామని చెప్పారు. సోమవారం జలసౌధలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు.

రేషన్‌కార్డు లేని రైతుల ఇళ్లకు అధికారులు

బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద లబ్ధి పొందేందుకు రైతులకు అవకాశమిస్తామని మంత్రి చెప్పారు. అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున రుణమాఫీకి కట్టుబడి ఉన్నామని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. రేషన్‌కార్డు లేని రైతుల ఇళ్లకు స్వయంగా మండల వ్యవసాయ అధికారి వెళ్లి కుటుంబసభ్యులను నిర్ధారించుకున్న తర్వాత రుణమాఫీ చేస్తామన్నారు. రూ.2 లక్షలకు మించి రుణం తీసుకున్న వారు ఆపైన ఉన్న రుణ మొత్తాన్ని చెల్లిస్తే వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని తెలిపారు.

ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి

రాజకీయ దురుద్దేశంతో రుణమాఫీపై ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవపట్టిస్తున్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌పాలనలో మొత్తం రూ.26 వేల కోట్ల రుణమాఫీ జరిగిందని, 2014–18 మధ్యకాలంలో ఏటా సుమారు రూ.4 వేల కోట్లు చొప్పున విడుదల చేసినా మొత్తం రూ.1,743 కోట్లు వడ్డీల కింద సర్దుబాటు కావడంతో అసలు రుణాలు అలానే మిగిలిపోయాయన్నారు. 2018లో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2018–19, 2019–20, 2022–23లో ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. 2020–21లో రూ.408.3 కోట్లతో 2.96 లక్షల మందికి, 2021–22లో రూ.1,339.5 కోట్లతో 3.88 లక్షల మందికి, 2023–24లో తొలి విడతగా రూ.6,763 కోట్లతో 10.68 లక్షల మందికి, రెండో విడతగా రూ.4,818.24 కోట్లతో 8.07 లక్షల మందికి రుణమాఫీ చేశారన్నారు. 20.84 లక్షల ఖాతాలకు సంబంధించిన రూ.8,579 కోట్ల రుణాలను గత ప్రభుత్వం మాఫీ చేయలేదన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతోనే కొందరు రైతుల ఖాతాల్లో లోపాలు చోటుచేసుకున్నాయని మంత్రి జూపల్లి వ్యాఖ్యానించారు.

120 సమీకృత గురుకులాలు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించిందని భట్టి తెలిపారు. ప్రస్తుతమున్న 1,029 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటివరకు మంచాలు, పరుపులు, దుప్పట్లు ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంతమందికి ఇవి కావాలి అనే దానిపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గురుకుల పాఠశాలలతో పాటు ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు తప్పనిసరిగా మరుగుదొడ్లు, స్నానాల గదులు, నీటి సరఫరా, విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలని, వసతి గదులకు తలుపులు, కిటికీలు, దోమలు రాకుండా వాటికి మెష్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై చెక్ లిస్టు రూపొందించి ఈనెల 29వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. చెక్ లిస్టును ప్రతి హాస్టల్లో ప్రదర్శించాలన్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తాం

విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలంటూ మంత్రి పొన్నం చేసిన విజ్ఞప్తిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిల జాబితాను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 800 మంది బీసీ విద్యార్థులకు, 500 మంది చొప్పున ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తామన్నారు.

పెద్దాపూర్ పాఠశాలపై సమీక్ష

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను తాము సందర్శించిన తర్వాత అక్కడ తీసుకున్న చర్యలపై గురుకులాల కార్యదర్శి రమణకుమార్‌ను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. విద్యార్థులకు మంచాలు, పరుపులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల మైదానం చదును చేయాలని, నూతన భవనాల నిర్మాణం కోసం కావాల్సిన ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

జర్నలిజం ముసుగులో రూ. 5 కోట్లు డిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి

జర్నలిస్టు ప్రేమ, రాంబాబుతోపాటు మీడియా హెడ్స్‌కు, సంస్థ అధినేత బీఆర్.నాయుడుకు వాటాలు ఉంటాయని అమర్ స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. మీడియా ముసుగులో తమని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వేణుస్వామి తన సతీమణితో కలిసి ఆరోపించారు. తాము ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో గత్యంతరం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మమ్మల్ని వారు తప్పకుండా చంపేస్తారు: వీణా శ్రీవాణి

వేణుస్వామి సతీమణి వీణాశ్రీవాణి కూడా టీవీ5 సంస్థతోపాటు జర్నలిస్ట్ మూర్తి గురించి మాట్లాడుతూ 'మమ్మల్ని రూ.5 కోట్లు అడుగుతున్నారు. అంత డబ్బు మేము ఎక్కడి నుంచి తీసుకురాగలం. నా బంగారంతోపాటు, నా కూతురు బంగారం అమ్మినా ఐదు శాతం డబ్బు రాదు. ఇచ్చే వరకు మమ్మల్ని వదిలేలా లేరు. దీంతో ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాం. కానీ, మేము అలా చేస్తే దానిని కూడా వారు తప్పుగా క్రియేట్ చేస్తారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక చనిపోయారని మళ్లీ వారే వార్తలు ఇస్తారు. ఈ వీడియో బయటకు వచ్చాక మాకు ఎలాగూ ప్రమాదం పొంచి ఉంటుంది. తప్పకుండా మమ్మల్ని వారు చంపేస్తారు. ఈలోపు వారు (టీవీ5 మూర్తి, టీమ్) ఎలాంటి వారో ఇలా ముందే ఈ ప్రపంచానికి తెలుపుతున్నాం. ఆడపిల్ల ప్రేమకు, రోజు నాకు మెసేజ్‌లు చేసే రాంబాబుకు వాటాలున్నాయంటే.. నాకు వ్యూజులు ఎగిరిపోయాయి. ఏమైనా పెట్టుకోండి. మా దగ్గర ఇంకా సాక్ష్యాలు ఉన్నాయి. ఒక ఆడపిల్లను అనుకోండి లేదా కుటుంబం అనుకోండి ఈ వీడియో చూసిన తర్వాత మాకు జర్నలిస్టులు, బ్రాహ్మణ సంఘాలు సపోర్ట్ చేస్తాయా? చదువుకున్న వారు సపోర్ట్ చేస్తారా? పోలీసులు, లాయర్లు, సుమోటోగా తీసుకొని సపోర్ట్ చేస్తారా? జ్యోతిషం చెప్పుకుంటే రూ.ఐదు కోట్లు డిమాండ్ చేస్తారా? బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటే ..లేనివారిని ఎలా వేధిస్తున్నారు. మమ్మల్ని కాపాడుకుంటే.. మరిన్ని వీడియోలు బయటపెడతాం. లేదంటే ఇదే ఆఖరి వీడియో. ఆత్మహత్య చేసుకుంటాం.'అని ఆ వీడియోలో స్పష్టం చేశారు.

నేను ఆత్మహత్య చేసుకునే స్థితికి తీసుకొచ్చారు: వేణుస్వామి

'టీవీ5 జర్నలిస్ట్ మూర్తి ఒకప్పుడు మహాటీవీలో పనిచేసేవారు. అప్పుడు నాపై దాడి చేసేందుకు ఆయన ప్రయత్నించాడు. నన్ను నాశనం చేయడానికి ఆ సమయంలోనే చాలా ప్రయత్నాలు చేశాడు. మూర్తి డిమాండ్ చేసిన డబ్బు నేను ఇవ్వలేదు. అయితే, చాలారోజుల తర్వాత ఇప్పుడు డబ్బు కోసం మూర్తి, ఆయన టీమ్ నన్ను ఇబ్బంది పెడుతోంది. ఒక పథకం ప్రకారం టీవీ5లో నా గురించి డిబేట్లు ఏర్పాటు చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నాడు. ఎంతోమంది కష్టాలను తొలగించిన నాకు చివరకు ఆత్మహత్య చేసుకునే స్థితికి మూర్తి వల్ల వెళ్లాను. వారు పెడుతున్న టార్చర్ భరించలేకపోతున్నాను'అంటూ వేణుస్వామి ఆ వీడియోలో పేర్కొన్నారు. ఆపై మూర్తి అనుచరుడు జర్నలిస్ట్ (అమర్) ఫోన్ కాల్‌ను తన ఇన్‌స్టాగామ్‌లో వేణుస్వామి షేర్ చేశారు. అందులో వారు రూ. 5 కోట్లు డిమాండ్ చేయడం అంత ఇవ్వకపోతే.. ఎంత ఇస్తారో చెప్పండంటూ సంభాషణ ఉంది. ఇలా వచ్చే డబ్బును ఎవరెవరు..? పంచుకుంటారో కూడా చెప్పుకొచ్చారు. చానల్ అధినేత బీఆర్.నాయుడు నుంచి ఆ సంస్థలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న వారికి, జర్నలిస్టు ప్రేమ, రాంబాబుకు వెళతాయని అమర్ ఆ ఆడియోలో వెల్లడించారు.

క్లుప్తంగా...

రుణమాఫీపై చర్చకు సిద్ధం

కాంగ్రెస్ నేత కోదండరెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు చేసిందేమిటో.. ఎనిమిది నెలల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఏం చేసిందో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి చెప్పారు. రుణమాఫీపై చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్కడికి వస్తారో చెప్పాలని, తామూ వస్తామని సవాల్ చేశారు. ఆయన సోమవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ నేతలు అల్లం భాస్కర్, గజ్జి భాస్కర్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తరహాలో తాము నాలుగుగోడల మధ్య కూర్చుని నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. అనవసరంగా రైతాంగాన్ని గందరగోళంలోకి నెట్టవద్దని సూచించారు. కాగా, మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఏఐసీసీ పిలుపు మేరకు ఈనెల 22న ఈడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే సమాధి కడతారు

మళ్లీ మీరు అధికారంలోకి వచ్చేది లేదు: టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ మీద తెలంగాణ ప్రజలకు నమ్మకం పోతోందని వారే ఆ పార్టీ కి సమాధి కడతారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ భ్రమ పడుతున్నారని అసలు ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తేలేదని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రుణమాఫీ జరగలేదంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కోసం బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లపైకి వస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ దుష్ప్రచారాలను ప్రజలు పట్టించుకోరని తెలిపారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం కూలుస్తామని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు పేరు మారుస్తామన్నది బీఆర్‌ఎస్ పార్టీ దురాలోచనని ఈలోపే ఆ పార్టీకి ప్రజలు సమాధి కట్టడం ఖాయమని చెప్పారు.

రాజీవ్ విగ్రహం జోలికి వస్తే తాట తీస్తారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ విగ్రహం జోలికి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తాట తీస్తారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హెచ్చరించారు. రాజీవ్ గాంధీ పేరెత్తే స్థాయి కేటీఆర్‌కు లేదని అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కూల్చేస్తామని అనడానికి కేటీఆర్‌కు నోరెలా వచ్చిందన్నారు. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన తమ నాయకుడి విగ్రహం కూలుస్తామంటే రక్తం మరుగుతోందని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన జరుగుతోందని, త్వరలోనే సెక్రటేరియట్ లోపల ఏర్పాటు చేస్తామని చెప్పారు. మాజీ సీఎం అంజయ్యపై కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించిన ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. కాగా, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కూలుస్తామని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

పేమెంట్ యాప్స్‌తో విద్యుత్ బిల్లులు

సాక్షి, హైదరాబాద్: పేమెంట్ యాప్స్‌తో వినియోగదారులు మళ్లీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఫోన్ పే సహా భీం యాప్, కెనరా బ్యాంక్, పేటీఎం, గూగుల్ పే యాప్స్ ద్వారా బిల్లుల చెల్లింపునకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాట్లు చేసింది. మరో వారం రోజుల్లో మరిన్ని థర్డ్ పార్టీ ఏజెన్సీలలో కూడా ఈ సదుపాయం కల్పించనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సంస్థ వెబ్‌సైట్ టీజీఎస్పీడీసీఎల్ ద్వారా సైతం బిల్లులు చెల్లించవచ్చని స్పష్టం చేసింది.

రుణమాఫీ కాలేదంటే రైతులను అరెస్టు చేస్తారా?

- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తున్న రైతులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోమవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీ కాలేదని ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలిపిన రైతులను అరెస్టు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసు యాక్ట్ పేరిట నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకూం జారీ చేయడం రైతుల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. రైతులు రుణమాఫీ కోసం కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారన్నారు. అయినా స్పందన లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నా ప్రభుత్వం మాత్రం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా పోలీసులతో అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు మద్దతుగా ఉద్యమాలు చేపడుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

కాంగ్రెస్‌తో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్

అందుకే అవినీతి కేసులన్నీ అటకెక్కించేశారు: బండి సంజయ్



రాఖీ పండుగ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి రాఖీ కడుతున్న సోదరి

కరీంనగర్ టౌన్/ గోదావరిఖని(రామగుండం): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు చెల్లించాల్సిన కప్పం కట్టేశారని.. అందుకే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ సహా కేసీఆర్ కుటుంబంపై ఉన్న అవినీతి కేసులన్నింటినీ అటకెక్కించారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తానన్న వాళ్లు ఇప్పుడు సైలెంట్ అయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ విలీనంపై మాట, ముచ్చట కూడా పూర్తి చేసినట్లు సమాచారముందని, మంచి ముహూర్తం చూసుకుని విలీనం చేయడమే తరువాయి అని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ సోమ వారం కరీంనగర్‌లోని తన నివాసంలో జరిగిన రక్షా బంధన్ వేడుకల్లో పాల్గొన్నారు.

పొంతన లేని ప్రచారం: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతనే లేదని బండి సంజయ్ అన్నారు. 6 గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, ఇవన్నీ అడుగుతుంటే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమంటూ డ్రామాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే కాంగ్రెస్ నేతలు రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరిఖనికి వచ్చిన ఆయన బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తప్పిపోయి చేతి గుర్తుకు ఓటేసిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలిట భస్మాసుర హస్తంగా మారిందన్నారు. పేదల కోసం ఎక్కువ ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.



వస్తువుల అశాశ్వతత్వపు స్వభావమే
వాటిని అద్భుతమైనవిగా చేస్తోంది.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 20 ఆగస్టు 2024

లంకలో ఎన్నికల సందడి

చాన్నాళ్లుగా అందరూ ఎదురుచూస్తున్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. వచ్చే నెల 21న జరగబోతున్న ఎన్నికల్లో 39 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. శ్రీలంక దివాలా తీసి ఎంతటి విపత్కర పరిస్థితులలో చిక్కుకున్నదో అందరికీ తెలుసు. 2022లో అధ్యక్ష భవనంపై, పార్లమెంటుపై ప్రజానీకం దాడి చేయటంతో అప్పటి అధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన కుటుంబ పరివారం దేశం విడిచి పరారయ్యారు. అంతకు మూడేళ్ల ముందు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో గొటబయ, ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానిగా ఆయన సోదరుడు మహిందా రాజపక్స తిరుగులేని మెజారిటీతో ఎన్నికయ్యారు. ఈమధ్య బంగ్లాదేశ్‌లో అచ్చం ఇలాంటి ఘటనలే జరిగి ప్రధాని షేక్ హసీనాకు పదవీభ్రష్టత్వం తప్పలేదు. రెండేళ్లనాటి శ్రీలంక పరిణామాలు చూశాకైనా ఆమె జాగ్రత్తగా అడుగులు వేసివుంటే ఇలా జరిగేది కాదు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉన్నవారు తమ గతాన్ని మాత్రమే కాదు... బంగ్లాదేశ్ వర్తమానాన్ని కూడా గమనంలోకి తీసుకోవాల్సివుంటుంది.

ఏవో సాకులు చెప్పి ఎన్నికలు వాయిదా వేసే సంస్కృతి శ్రీలంకలో ఏనాటి నుంచో కొనసాగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు రనిల్ విక్రమసింఘే ప్రధానిగా ఉన్నప్పుడు 2017లో ప్రావిన్షియల్ కౌన్సిళ్ల ఎన్నికలను వాయిదా వేశారు. అప్పటికి ఏడేళ్ల నుంచి ఇదే వరస. చిత్రమేమంటే 2022లో అంతగా జనాగ్రహం చవిచూశాక కూడా దేశంలో ఎన్నాళ్ల నుంచో మూలనపడివున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిధులు లేవన్న కారణంతో విక్రమసింఘే వాయిదా వేశారు. నిజానికి అధ్యక్ష ఎన్నికలు సైతం ఈ మాదిరే 'వాయిదా' తోవన పోతాయని చాలామంది అనుకున్నారు. వెంటనే ఎన్నికలు జరపాలంటూ వివిధ వర్గాలనుంచి నిరుడు డిమాండ్ వచ్చింది. కానీ దేశం ఇంకా ఆర్థికంగా కోలుకోలేదన్న కారణాన్ని చూపి వాయిదా వేశారు. మొత్తానికి ఎన్నికల కోలాహలం మొదలైంది. రెండున్నర దశాబ్దాల తర్వాత మొదటిసారిగా రాజపక్స కుటుంబం హవా లేకుండా ఎన్నికలు జరగబోతున్నాయి. తన కుటుంబం కోల్పోయిన పరువు ప్రతిష్ఠలను పునరుద్ధరించటమే ధ్యేయంగా మాజీ ప్రధాని మహిందా రాజపక్స తనయుడు 38యేళ్ల నామల్ రాజపక్స శ్రీలంక పొదుజన పెరమున(ఎస్‌ఎల్‌పీపీ) తరఫున పోటీ చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రనిల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అయిదు దశాబ్దాలు యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ) నాయకుడిగావున్నా స్వతంత్రుడిగా నిలబడ్డారు. గతంలో యూఎన్‌పీని చీల్చి సమగి జన బల వేగయ (ఎస్‌జేబీ) పార్టీని స్థాపించి ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సజిత్ ప్రేమదాస కూడా అధ్యక్ష స్థానానికి పోటీపడుతున్నారు. అయితే ఇతరుల కన్నా వామపక్ష అనుకూల నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ (ఎన్‌పీపీ) అధినేత అనూర కుమార దిస్సానాయకే విజయావకాశాలు ఎక్కువని లంకలో ప్రధాన సర్వే సంస్థ ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ పాలసీ (ఐహెచ్‌పీ) చెబుతోంది. అదే నిజమైతే దేశ రాజకీయాలు కొత్త మలుపు తిరగటం ఖాయం. మొదటి నుంచీ ఎస్‌ఎల్‌పీపీ, యూఎన్‌పీలే ప్రధాన పక్షాలుగా పోటీపడుతున్నాయి. కానీ 2020 పార్లమెంటు ఎన్నికలకు ముందు సజిత్ ప్రేమదాస నిష్క్రమించాక ఆ పార్టీ దయనీయ స్థితిలో పడిపోయింది. ఆ ఎన్నికల్లో యూఎన్‌పీకి దక్కింది కేవలం ఒక్క స్థానం మాత్రమే.

దశాబ్దాలుగా అనుసరించిన విధానాల వల్ల దేశం ఆర్థికంగా చాలా గడ్డు స్థితిలో పడిందన్నది వాస్తవం. ముఖ్యంగా రాజపక్స సోదరుల హయాంలో తమిళ టైగర్లను అణిచేయటానికి సాయం చేసిన దగ్గర్నుంచి చైనా పలుకుబడి విస్తరించింది. ఆ తర్వాత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందించే నెపంతో అది భారీయెత్తున అప్పులిచ్చింది. క్రికెట్ స్టేడియం, విమానాశ్రయం, హంబన్‌తోటా నౌకాశ్రయం వంటివన్నీ చైనా నిర్మాణరంగ నిపుణుల నేతృత్వంలో కళ్లు చెదిరే రీతిలో నిర్మించారు. కానీ వీటి బకాయిలు తీర్చడానికొచ్చేసరికి అంతా తారుమారైంది. చివరకు హంబన్‌తోటాలో అనుకున్న రీతిలో కార్యకలాపాలు పుంజుకోకపోవటంతో దాన్ని చైనాకే 99 యేళ్ల లీజుకు ఇవ్వాల్సివచ్చింది. దేశాన్ని చైనాకు తాకట్టు పెడుతున్నారని విపక్షాలు చేసిన ఆరోపణలన్నీ రాజపక్స సోదరులు తీసుకొచ్చిన మెజారిటీవాదం, దేశభద్రత వగైరా అంశాలతో కొట్టుకు పోయాయి. కానీ మూడేళ్లకే ప్రజలకు తత్వం బోధపడి తిరుగుబాటు చేశారు. 2022లో దేశం దివాలా తీశాక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) దాదాపు 300 కోట్ల డాలర్ల రుణం ఇచ్చింది. అయితే ఆర్థిక రంగంలో పెనుమార్పులు తీసుకురావాలన్న షరతు విధించింది. వ్యవస్థాగత సర్దుబాట్ల పేరుతో ఆ ప్రక్రియ ప్రస్తుతం అమలవుతోంది కూడా. కనుక ఎన్నికల అనంతరం విజేత ఎవరైనా ఈ ప్రక్రియను కొనసాగించాల్సిందే.

ప్రస్తుత అభ్యర్థుల్లో ఎన్‌పీపీ అధినేత అనూర కుమార దిస్సానాయకే ఒక్కరే అవినీతి మరక అంటని నేత. కావడానికి వామపక్ష అనుకూల సంస్థే అయినా సింహళ జాతీయవాదాన్ని ప్రవచించే జనతా విముక్తి పెరుమున రాజకీయ విభాగమే ఎన్‌పీపీ. ఒకపక్క తన పూర్వపు ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూసే చైనా... మొదటి నుంచీ లంకకు అన్ని విధాలా తోడ్పడుతున్న భారత్ ఈ ఎన్నికల సరళిని జాగ్రత్తగా గమనిస్తున్నాయి. ఇప్పటికే బంగ్లాలో భారత్ అనుకూల నేత హసీనా పదవి కోల్పోయారు. ఇదే అదనుగా లంకలో మళ్లీ తన హవా కొనసాగించాలని చైనా చూస్తోంది. అయితే చైనా వల్లే అప్పుల ఊబిలో కూరుకుని నిండా మునిగిన లంకలో అదంత సులభం కాదు. ఏదేమైనా జనామోదంతో ఏర్పడే ప్రభుత్వం వల్లే శ్రీలంక ప్రస్తుత కష్టాలు తీరతాయి.

అంతరిక్ష కేంద్రం మీదుగా గగన్‌యాన్!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

అంతరిక్షంలోకి చేరిన తొలి భారత వ్యోమగామిగా రాకేశ్ శర్మ రికార్డు సృష్టించిన నలభై ఏళ్లకు మరో భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టడం గర్వకారణమే. మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్) కోసం భారత్ ఎంపిక చేసిన నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా ఒకరు. బెంగళూరులో వీరికి రష్యా ఆధ్వర్యంలో శిక్షణ నడుస్తోంది. శుక్లాను ఐఎస్ఎస్ పైకి పంపే విషయాన్ని ప్రకటిస్తూ ఇస్రో ఆయన్ని గగన్‌యాత్రి అని పిలిచింది. దీంతో ఈయనకూ, మనం సమీప భవిష్యత్తులో చేపట్టే గగన్‌యాన్‌కూ సంబంధం ఉన్నట్లు స్పష్టమైంది. ఐఎస్ఎస్, గగన్‌యాన్ రెండూ వేర్వేరు రకాల అంతరిక్ష యాత్రలు. కాకపోతే ఐఎస్ఎస్ అనుభవాలు గగన్‌యాన్‌కూ ఉపయోగపడవచ్చునని ఇస్రో భావిస్తూండవచ్చు.

1969లో మనిషి తొలిసారి జాబిల్లిపై అడుగు పెట్టింది మొదలు మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలు బోలెడన్ని జరిగాయి. భూమి చుట్టూ తిరుగుతున్న స్పేస్‌స్టేషన్లకు వ్యోమగాములను పంపుతూనే ఉన్నాం. ఇలాంటి ప్రయోగాలకు సాధారణంగా శక్తిమంతమైన రాకెట్లను వాడుతూంటారు. అంతరిక్ష నౌక ఐఎస్ఎస్‌కు అనుసంధానమై కొన్ని రోజులు లేదా వారాలపాటు ఉంటుంది. ఆ తరువాత భూమికి తిరిగి వస్తుంది. 1970లలో సోవియట్ 'సాల్యూట్', అమెరికా 'స్కైలాబ్' ప్రయోగాలతో అంతరిక్ష కేంద్రాల యుగం ప్రారంభమైంది. తరువాతి కాలంలో సోవియట్ యూనియన్ మరింత పెద్దదైన మిర్ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. చివరగా అమెరికా, రష్యా, యూరప్ సంయుక్తంగా ఐఎస్ఎస్‌ను నిర్మించాయి. చైనా తియాన్‌గాంగ్ పేరుతో ప్రత్యేకంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని పదేళ్లుగా నిర్మిస్తోంది. 2035 కల్లా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తామని భారత్ కూడా సంకల్పించడం విశేషం.

భూ కక్ష్యలో తిరిగే అంతరిక్ష కేంద్రాన్ని చేరాలంటే శక్తిమంతమైన రాకెట్లు, మానవులను మోసుకెళ్లగల సామర్థ్యమున్న మంచి అంతరిక్ష నౌక అవసరం. ఇందుకు సోవియట్ యూనియన్ 'సోయుజ్', అమెరికా స్పేస్ షటిల్స్ తయారు చేసుకున్నాయి. ముప్పై ఏళ్లుగా వీటినే వాడుతున్నాయి. స్పేస్ షటిల్ రాకెట్ మాదిరిగా నిట్టనిలువుగా పైకి ఎగరగలదు. అంతరిక్ష నౌక మాదిరిగా సమాంతరంగానూ దూసుకెళ్లగలదు. విమానం మాదిరి ల్యాండ్ కూడా కాగలదు. అయితే 2003లో స్పేస్ షటిల్ కొలంబియా ప్రమాదానికి గురై అందులో భారతీయ సంతతి వ్యోమగామి కల్పనా చావ్లా మరణించింది మొదలు స్పేస్ షటిల్‌ల యుగం క్రమేపీ అంతరించింది. 2011 నాటికి పూర్తిగా నిలిపివేశారు. ఆ తరువాత కొన్నేళ్లకు 'నాసా' రష్యా తయారీ సోయుజ్ సాయంతో ఐఎస్ఎస్‌కు సరుకులు, వ్యోమగాములను రవాణా చేయడం మొదలుపెట్టింది.

ప్రైవేట్‌రంగ ప్రవేశం...

అంతరిక్ష ప్రయోగాల్లో ప్రైవేట్ కంపెనీలు పాల్గొనడం స్పేస్ షటిల్ కార్యక్రమం ముగిసిన తరువాతే మొదలైంది. దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాసా అమెరికన్ కంపెనీల నిధులు, టెక్నాలజీల సాయంతో అంతరిక్ష రవాణా వ్యవస్థలను నిర్మించుకుంది. ఈ క్రమంలోనే ఐఎస్ఎస్‌కు సరుకులు, సిబ్బందిని రవాణా చేసే పని ప్రైవేట్ కంపెనీల పరమైంది. ఈ విధానం పుణ్యమా అని స్పేస్‌ఎక్స్, యునైటెడ్ లాంచ్ అలయన్స్(యూఎల్ఏ) వంటి పలు ప్రైవేట్ కంపెనీలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టాయి. 2012 నుంచి తన ఫాల్కన్ రాకెట్ల ద్వారా పలు మార్లు ఐఎస్ఎస్‌కు సరుకులు రవాణా చేసిన తరువాత స్పేస్‌ఎక్స్ 2020లో మొదటిసారి సిబ్బంది రవాణా బాధ్యతను నిర్వర్తించింది. ఇంకోవైపు యూఎల్ఏ కూడా తన అట్లాస్ వీ రాకెట్ ద్వారా పలు కార్గో ట్రిప్‌లు విజయవంతంగా పూర్తి చేసి



మిషన్ గగన్‌యాన్: శుభాంశు శుక్లా, ప్రశాంత్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్

సిబ్బంది రవాణ చేపట్టింది. ఈ ఏడాది జూన్‌లో భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను ఐఎస్ఎస్‌కు మోసుకెళ్లిన స్టార్ లైనర్ యూఎల్ఏ తయారీనే. అయితే ఐఎస్ఎస్ చేరిన తరువాత ఈ స్టార్ లైనర్ మళ్లీ భూమ్మీదకు వచ్చే స్థితిలో లేనట్లు స్పష్టమైంది. థ్రస్టర్లలో సమస్యలు రావడంతో అది ఐఎస్ఎస్‌తోనే ఉండిపోయింది.

శుభాంశూ శుక్లాను ఐఎస్ఎస్‌కు చేర్చే బాధ్యతను ఇస్రో ప్రైవేట్ కంపెనీ 'ఆక్సియామ్ స్పేస్'కు అప్పగించింది. వాణిజ్య స్థాయిలో వ్యోమగాముల రవాణా చేపట్టగల సత్తా దీనికి ఉందని నాసా స్వయంగా సర్టిఫై చేసి ఉండటం గమనార్హం. అయితే ఆక్సియామ్‌కు సొంతంగా రాకెట్లు లేవు. స్పేస్‌ఎక్స్‌పై ఆధారపడుతోంది. 2021 మే నుంచి ఇప్పటివరకూ ఆక్సియామ్ మూడుసార్లు ఐఎస్ఎస్‌కు సిబ్బంది, సరుకులను రవాణా చేసింది. శుక్లాను మోసుకెళ్లడం నాలుగో మిషన్ అవుతుంది. కానీ ఆక్సియామ్, ఇస్రోల మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందానికి లోబడి శుక్లా ఐఎస్ఎస్‌కు వెళతారా? లేక ఇస్రో - నాసాల ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా (సర్వీస్ ఛార్జీలు ఉన్నా లేకున్నా) వెళతారా? అన్నది స్పష్టం కాలేదు. 1984లో భారత్, సోవియట్ యూనియన్ల మైత్రీ బంధానికి ప్రతీకగా రాకేశ్ శర్మ సోవియట్ అంతరిక్ష కేంద్రం సాల్యూట్‌కు వెళ్లారు. ఈ యాత్ర, శిక్షణలకు సంబంధించి సోవియట్ యూనియన్‌కు భారత్ డబ్బు ఏమీ చెల్లించలేదు. సాల్యూట్ తరువాత వచ్చిన మిర్ పైకి సోవియట్ యూనియన్ 13 దేశాలకు చెందిన 104 మంది వ్యోమగాములను తీసుకెళ్లింది. 2001లో మిర్ కూలిపోయే ముందు వరకూ ఈ యాత్రలు జరిగాయి. చాలా యాత్రలకు ఆయా దేశాలు డబ్బులు చెల్లించడం గమనార్హం.

1990-2000 మధ్యకాలంలో నిర్మాణమైన ఐఎస్ఎస్‌లో భారత్‌కు భాగస్వామ్యం లేదు. వ్యోమగామిని పంపే అవకాశమూ రాలేదు. అప్పట్లో ఇస్రో, నాసాల మధ్య సంబంధాలు అంత బాగా లేవు. రష్యా నుంచి మనం క్రయోజెనిక్ ఇంజిన్లు తెచ్చుకోవడంపై పెద్ద వివాదమే నడుస్తుండేది. ఇస్రో కూడా తన ఉపగ్రహ కార్యక్రమాలపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. పైగా వనరుల కొరత ఇస్రోను బాధిస్తూండేది.

ఇస్రో అజెండాలోకి మానవ సహిత అంతరిక్ష ప్రయోగం చేరే సమయానికి ఐఎస్ఎస్‌ను సందర్శించే వారి జాబితా పెరిగిపోయింది. గత పాతికేళ్లలో 23 దేశాలకు చెందిన 280 మంది వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు వెళ్లి వచ్చారు. వీరిలో కొంతమంది రెండు, నాలుగు సార్లు కూడా వెళ్లడం గమనార్హం. సునీతా విలియమ్స్‌నే ఉదాహరణగా తీసుకుంటే, ఆమె ఐఎస్ఎస్‌కు వెళ్లడం ఇది మూడోసారి. అమెరికా, రష్యాల వ్యోమగాములు సుమారు 220 మంది ఐఎస్ఎస్ వెళ్లిన వారిలో ఉండగా... మిగిలిన వాళ్లు జపాన్, కెనెడా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, డెన్మార్క్, యూకే, బెల్జియం, స్పెయిన్, స్వీడన్, నెదర్లాండ్స్, బ్రెజిల్, ఇజ్రాయెల్, కజకిస్తాన్, బెలరూస్, మలేషియా, దక్షిణాఫ్రికా, కొరియా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈలకు చెందినవారు. ఈ జాబితాలో 13 మంది ప్రైవేట్ వ్యక్తులు కూడా ఉన్నారు. ఆక్సియామ్ చేపట్టిన తొలి మానవ సహిత అంతరిక్ష యాత్రలోనూ నలుగురు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు.

2018లో ఇస్రో గగన్‌యాన్‌పై పని మొదలుపెట్టినప్పుడు భారతీయ వ్యోమగామిని ఐఎస్ఎస్‌పైకి పంపాలన్న ఆలోచన లేదు. ఎంపిక చేసిన నలుగురు వ్యోమగాములను యూరీ గగారిన్ స్పేస్ సెంటర్‌కు శిక్షణ కోసమని పంపారు. రష్యా అంతరిక్ష ప్రయోగ సంస్థలతో కుదిరిన ఒప్పందంలోనూ మానవ సహిత అంతరిక్ష యానానికి సంబంధించిన శిక్షణ ప్రస్తావన మాత్రమే ఉంది. అయితే ప్రధాని నరేంద్ర మోదీ 2022లో భారత స్వాతంత్ర్య 75 సంవత్సరాల వేడుకల సందర్భంగా గగన్‌యాన్ గడువు ఆచరణ సాధ్యం కానంత తక్కువ సమయానికి కుదించడంతో పరిస్థితి మారిపోయింది. అందుకేనేమో... ఏడాది తరువాత ఐఎస్ఎస్ ఆలోచన వచ్చింది. మోదీ అమెరికా పర్యటన సందర్భంగా దీనికి సంబంధించిన ప్రకటన కూడా చేశారు. అయితే గగన్‌యాన్ యాత్ర కోసం ఐఎస్ఎస్‌కు వెళ్లాల్సిన అవసరమేదీ లేదు కానీ అంతరిక్ష యాత్రకు సంబంధించి వాస్తవిక అనుభవం గడించేందుకు మాత్రం ఉపయోగపడుతుంది. ఏమైనప్పటికీ... అంతరిక్షంలోకి చేరిన తొలి వ్యోమగామిగా రాకేశ్ శర్మ రికార్డు సృష్టించిన నలభై ఏళ్లకు మరో భారతీయుడు అంతరిక్షంలోకి అడుగుపెడుతున్నాడంటే, అది మనందరికీ గర్వకారణమే.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిరంకుశత్వంపై పోరు



బెంగాల్‌లోని నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని వర్గాలూ ఒక్కటవుతున్నాయి. ఆఖరికి అత్యంత కటిక చీకటిమయమైన 1960లు-70ల కాలంలో కూడా ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ ఫుట్‌బాల్ క్లబ్బుల జండాలు ఉమ్మడిగా ఎగరలేదు. నేను చిన్నప్పటి నుంచీ ఈస్ట్ బెంగాల్ అభిమానిని. ఇలాంటి చారిత్రక దృశ్యం నేనెప్పుడూ చూడలేదు.

– కంచన్ గుప్తా, కేంద్ర ప్రభుత్వ సలహాదారు

పడగొట్టే కుట్ర



బెంగాల్‌లో బీజేపీ ఒక కుట్రపూరిత టూల్ కిట్‌ను బయటకు తీసింది. వారి ఎజెండా స్పష్టం. మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని పడగొట్టాలి. 'మమత కచ్చితంగా రాజీనామా చేయాలి' అనే ప్రచారాన్ని వ్యవస్థీకృతంగా నడుపుతున్నారు. ఒక నిజమైన నిరసనను బీజేపీ పూర్తిగా హైజాక్ చేసింది.

– సాకేత్ గోఖలే, తృణమూల్ ఎంపీ

కాపాడుకుందాం!



మన దేశంలోని మహిళల పైన మన లోలోపలి దయ, గౌరవం ప్రసరించాలి. మన దేశాన్ని సురక్షితంగా ఉంచేందుకు ఒక కరుణాపూరిత వాతావరణాన్ని సృష్టించాలి. దేవతలను పూజించే దేశం భారత్. మన సమాజంలో మహిళలం దరినీ దేవతల రూపాలుగానే పరిగణిస్తాం.

– అమ్జద్ అలీ ఖాన్, సరోద్ విద్వాంసుడు

కలిసి పెరుగుదాం!



చైనా, ఇండియా సహకారాత్మక భాగస్వాములు. అంతే గానీ ఒకరికొకరు పోటీ కాదు, ముప్పు కాదు. మన ఇరు దేశాలూ కలిసి సాగడానికి తగిన వివేకం, సామర్థ్యం మనకు ఉన్నాయి.

– యూ జింగ్, చైనా ప్రతినిధి

ఏ కాలంలో ఉన్నాం?



రాత్రి షిఫ్టులు చేయొద్దని వైద్యురాళ్లకు ఎలా చెబుతారు? మనం ఏమైనా 1850ల్లో జీవిస్తున్నామా? స్త్రీ గైనకాలజిస్టు డ్యూటీ చేయమని మగ కంటి డాక్టర్‌ను అడుగుతారా? ఈ రాజకీయ నాయకులకు పిచ్చిపట్టిందా?

– సౌమ్యా గుప్తా, గైనకాలజిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

తెలంగాణ తల్లి కోసం...

లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్‌గాంధీకి తెలంగాణ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, బుద్ధిజీవుల పక్షాన బహిరంగ లేఖ

సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండ టమే చారిత్రక న్యాయం! తెలంగాణ అస్తిత్వ వైభవానికీ, స్వరాష్ట్ర ప్రతిపత్తికీ, స్వాభిమానానికీ, సాధికారతకూ ప్రతీక తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లి ప్రస్తావన ఈనాటిది కాదు, తెలంగాణ రైతాంగ పోరాటం కాలంలోనే దాశరథి, రావెళ్ళ వెంకట రామారావు వంటి కవులెందరో తెలంగాణ తల్లిని ప్రస్తుతిస్తూ పద్యాలూ, పాటలూ రచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణ తల్లి భావన తిరిగి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పునరుజ్జీవం పొందింది. సమైక్యవాదులు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు విరుద్ధంగా, సమైక్య రాష్ట్ర ప్రతీకగా తెలుగుతల్లిని నిలిపే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బుద్ధిజీవులూ, సాహిత్యకారులూ, కళాకారులూ తెలంగాణ తల్లి రూపురేఖలను గురించి చర్చించటం ప్రారంభించారు. చర్చల పర్యవసానంగా తెలంగాణ తల్లి ఇప్పుడున్న విధంగా రూపుదాల్చింది. ఉద్యమకారులు స్వచ్ఛందంగా తెలంగాణ ఎల్లెడలా వేలాది విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. కనుక తెలంగాణ తల్లి ఈ మట్టిలో నుంచి, తెలంగాణ ఉద్యమ భావోద్వేగాల నుంచి పుట్టిన అస్తిత్వ ప్రతీక.

సమైక్య రాష్ట్ర అస్తిత్వ ప్రతీకగా తెలుగుతల్లి విగ్రహం గతంలో సెక్రటేరియట్ ముందు ఉండేది. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించి నూతన సెక్రటేరియట్ భవనం కూడా నిర్మాణమైన నేపథ్యంలో, నేడు తెలంగాణ సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటం చారిత్రక న్యాయం. సెక్రటేరియట్‌కు అమర వీరుల స్మారక కేంద్రానికి మధ్యనున్న స్థలంలో తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించాలని తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయుల పక్షాన శ్రీ రాహుల్‌గాంధీ గారికి విజ్ఞప్తి చేస్తున్నాం. సెక్రటేరియట్ ఎదురుగా తెలంగాణ తల్లిని పెట్టాల్సిన చోట భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన పట్ల మాకు అభ్యంతరాలున్నాయని తెలియజేస్తున్నాం. రాజీవ్ గాంధీ గారి మీద మాకు గౌరవం ఉంది. నగరంలో ఆయన విగ్రహం పెట్టాలనే ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ ఆలోచన పట్ల మాకేమీ అభ్యంతరం లేదు. అయితే, సెక్రెటేరియట్ ముందు తెలంగాణ తల్లి ఉండవలసిన చోట కాకుండా మరెక్కడైనా ప్రతిష్ఠించవలసిం



దిగా విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు నెల కొల్పినప్పుడే తెలంగాణ అస్తిత్వ ప్రతీకకు కావాల్సిన సాధికారత, ప్రతిపత్తి సిద్ధిస్తుంది. తెలంగాణ చరిత్రతో గానీ, పరిణామాలతో గానీ ప్రత్యక్ష సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అక్కడ పెట్టడం ద్వారా తెలంగాణ భావోద్వేగాలను గాయపర్చవద్దని కోరుతున్నాం. ఎన్నికల సమయంలో మీరు తెలంగాణ సాంస్కృతిక ఆకాంక్షలను గౌరవిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలుపుకొంటూ సెక్రెటేరియట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి మీరు సూచించాలని కోరుకుంటున్నాం.

తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక ఆకాంక్షలకు మద్దతుగా నిలుస్తారని ఆశిస్తున్నాం.

అభినందనలతో...

ప్రొఫెసర్ హరగోపాల్, టంకశాల అశోక్, అల్లం నారాయణ, గోరటి వెంకన్న, మల్లెపల్లి లక్ష్మయ్య, నందిని సిధారెడ్డి, అయాచితం శ్రీధర్, పరాంకుశం వేణుగోపాల స్వామి, హిమజ్వాల (ఇరివెంటి వెంకట్రమణ), నాళేశ్వరం శంకరం, దేశపతి శ్రీనివాస్, ఘంటా చక్రపాణి, కట్టా శేఖర్ రెడ్డి, తిగుళ్ళ కృష్ణమూర్తి, కూతురు శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ దంటు కనకదుర్గ, రసమయి బాలకిషన్, సంగిశెట్టి శ్రీనివాస్, ఏలె లక్ష్మణ్, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, బుద్ధా మురళి, ఎస్వీవీ శ్రీనివాస్ రావు, అనిశెట్టి రజిత, ఐనంపూడి శ్రీలక్ష్మి, కొమర్రాజు రామలక్ష్మి, శ్రీదేవి మంత్రి, రాజ్యశ్రీ కేతవరపు, వెంకట్ వర్దెల్లి, మంగళంపల్లి విశ్వేశ్వర్, పెద్దింటి అశోక్ కుమార్, వేముగంటి మురళి, కందుకూరి శ్రీరాములు, మల్లావఝుల విజయానంద్, డా॥ అంజనేయ గౌడ్, బద్రి నర్సన్, శ్రీరామోజు హరగోపాల్, రమేశ్ హజారి, కాంచనపల్లి, నవీన్ ఆచారి, జూలూరి గౌరీశంకర్, వఝుల శివకుమార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, వేముగంటి మురళీకృష్ణ ద్యావనపల్లి సత్యనారాయణ, పెన్నా శివరామకృష్ణ, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, డా॥ భీంపల్లి శ్రీకాంత్, వనపట్ల సుబ్బయ్య, లక్ష్మణ్ మురారి (బందూక్), కార్టూనిస్ట్ మృత్యుంజయ్, చిమ్మని మనోహర్, ఎదిరెపల్లి కాశన్న, డా॥ ఎ. జయంతి, స్వర్ణ కిలారి, బోల యాదయ్య, కె.వీరయ్య, యస్. బాల్‌రాం, ఉప్పరి తిరుమలేష్, అమర్ నాథ్, చిక్కొండ్ర రవి, బైరోజు చంద్రశేఖర్, బైరోజు రాజశేఖర్, బైరోజు శ్యాంసుందర్, వహీద్ ఖాన్, వేదార్థం మధు సూదన శర్మ, ఆర్. రత్నాకర్‌రెడ్డి, సి.హెచ్. ఉషారాణి, బెల్లంకొండ సంపత్ కుమార్, పొన్నాల బాలయ్య, కె.అంజయ్య, సిద్దెంకి యాదగిరి, చమన్ సింగ్, కె. రంగాచారి, తైదల అంజయ్య, నాగిళ్ల రామశాస్త్రి, ఘనపురం దేవేందర్, వీరేంద్ర కాపర్తి, ప్రగతి, పరదా వెంకటేశ్వర్‌రావు, ఆచార్య పిల్లలమర్రి రాములు, సంగాని మల్లేశ్వర్.

లక్ష్య సాధనకు దిక్సూచి అయ్యి...

సందర్భం



లక్ష్మణ్ ఏనుగు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 'మేము సైతం' అంటూ ప్రవాస తెలంగాణవారు 'తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్' (టీడీఎఫ్)ను ఏర్పాటు చేశారు. ప్రొ॥ జయశంకర్ సార్ స్ఫూర్తితో మలి ఉద్యమంలో మొలచి, వృక్షంలా ఎదిగింది ఈ సంస్థ. పట్టుమని పది మందితో అమెరికా కేంద్రంగా న్యూయార్క్ నగరంలో 1999లో ఏర్పాటైన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆ తర్వాత శాఖోపశాఖలుగా వివిధ దేశాల్లో విస్తరించింది. పొట్టకూటి కోసం గల్ఫ్ బాట పట్టిన కార్మికుడు మొదలు, ఆస్ట్రేలియా, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే యువకుడు కూడా 'జై తెలంగాణ' అని నినదించేలా చేసింది ఈ సంస్థ. నిధులు, నీళ్లు, నియామకాల్లో అప్పట్లో జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో వివరించటంలో విజయవంతం అయింది టీడీఎఫ్.



సామాజిక ప్రచార సాధనాల పరిధి ఇంతగా లేని రోజుల్లోనే తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ వినూత్న పంథాలో విస్తరించింది. ఉద్యమం దిశగా సమాజంలోని ప్రతి ఒక్కరినీ చైతన్యం చెయ్యడంలో కీలక భూమిక పోషించింది. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో పాటు, కవులు, కళాకారులను, మేధావులను కలవడం ద్వారా టీడీఎఫ్ తెలంగాణ వాణి, బాణీలను బలంగా వినిపించే ప్రయత్నం చేసింది.

ఓ వైపు బతుకు దెరువు కోసం దేశ దేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూనే, తాము కూడబెట్టిన దాంట్లో కొంత తెలంగాణ సాధన కోసం ప్రవాసులు ఖర్చు పెట్టి మరీ స్వరాష్ట్రం కోసం కృషి చేశారు. కవులు, కళాకారులను ఆహ్వానించి ఊరూరా తెలంగాణ ధూమ్ ధామ్‌లను ఏర్పాటు చేశారు. వ్యయ ప్రయాసలు కోర్చి తెలంగాణ ఉద్యమ వ్యాప్తిలో తనదైన పాత్ర పోషించింది ఈ సంస్థ.

ముఖ్యంగా విద్యార్థులను జాగృతం చేసింది. భవిష్యత్ తెలంగాణ బలిదానాల తెలంగాణ కావొద్దంటూ నినదించింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణ యువతే బాగుపడుతుందనే సందేశాన్ని బలంగా ప్రచారం చేసింది. రాజకీయ అవసరాలు, ప్రలోభాలతో ఉద్యమం పక్కదారి పట్టినప్పుడల్లా పట్టు విడవకుండా ఉద్యమ దివిటీని ముందుండి మోసింది. ఎక్కడెక్కడో పనిచేసే సంస్థ సభ్యులు తెలంగాణలో ప్రతీ పల్లెనూ, ప్రతీ గడపనూ తాకేలా తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించారనడం అతిశయోక్తి కాదు. ఉమ్మడి రాష్ట్ర పాలకుల హయాంలో జరిగిన మోసాలను, పక్కదారి పట్టిన నిధులను, నీటి కేటాయింపులో జరిగిన మోసాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ గుర్తించేలా చేసింది.

రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ పాలన ఎజెండాను రూపొందించటంలోనూ సంస్థ కృషి మరవలేనిది. కేసులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవటం, అమరుల కుటుంబాలను వీలైనంతగా ఆదుకోవటంలోనూ ఫోరం అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికీ హెల్త్ క్యాంపుల నిర్వహణ, యువతకు క్రీడా పోటీలు, డ్రగ్స్ మహమ్మారిపై పోరాటం, రైతు చైతన్య యాత్రలు వంటి పలు కార్యక్రమాల నిర్వహిస్తూ టీడీఎఫ్ తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. విదేశాల్లో తాము ఉంటున్న ప్రాంతాల్లో తెలంగాణ పండగలను నిర్వహిస్తూ మలి తరాలకు కూడా సంస్కృతీ, సంప్రదాయాలను పరిచయం చేస్తోంది.

రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు మారినా తెలంగాణ ఏర్పాటు లక్ష్యాల నుంచి మరలకుండా పాలన, విధాన నిర్ణయాలు ఉండేలా టీడీఎఫ్ తన ప్రభావాన్ని చూపుతోంది. నిర్ణయాలు గాడి తప్పిన సందర్భాల్లో ఉద్యమ పంథానే కొనసాగిస్తూ పాలకులను, పార్టీలను ప్రశ్నించటంతో ముందు ఉంటోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు దాటినా ప్రభుత్వాలు ప్రత్యేక ఎన్నారై పాలసీని ప్రకటించకపోవడం శోచనీయం. సమీప భవిష్యత్తులోనే ఎన్నారై పాలసీ రూపుదిద్దుకుంటుందనే ఆశాభావంతో టీడీఎఫ్ ఉంది.

పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్, రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తుంది.

తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ మాజీ అధ్యక్షుడు, న్యూయార్క్ (టీడీఎఫ్ పాతికేండ్లు పూర్తి చేసుకున్న యాదిలో)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.10.37 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.7.51 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.2.39 నుండి 4.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.11.43 నుండి 1.15 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.20.

క్లుప్తంగా...

నృసింహుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ శరత్ దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీలక్ష్మి నృసింహస్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేసిన అనంతరం ఆయనను అర్చకులు స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మపురి కోర్టు మేజిస్ట్రేట్ శ్యామ్‌ప్రసాద్ తదితరులున్నారు.

కేటీపీపీలో నిలిచిన విద్యుదుత్పత్తి

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో ఆదివారం రాత్రి నుంచి విద్యుదుత్పత్తి పూర్తిగా నిలిచి పోయింది. ప్రధాన ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ వల్ల ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతు పనులను సంస్థ అధికారులు ప్రారంభించారు. అవి పూర్తయ్యేసరికి మరో రెండు రోజుల సమయం పట్టవచ్చని కేటీపీపీ వర్గాల ద్వారా తెలిసింది.

గుండెపోటుతో బాలుడి మృతి


అక్షిత్

చెన్నారావుపేట: గుండెపోటుతో పదేళ్ల బాలుడు మృతి చెందాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌లో సోమవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. పూదోట రవికుమార్–సుజాత దంపతులకు కుమారుడు అక్షిత్ (10), కుమార్తె ఉన్నారు. కుమారుడు పెద్ద పెండ్యాలలోని మరియరాణి పాఠశాల హాస్టల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తిమ్మరాయినిపహాడ్‌లోని ఇంటికి వచ్చాడు. రాత్రి పది గంటల సమయంలో ఛాతీలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శ్వాస లేకపోవడంతో సిబ్బంది సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. అక్షిత్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

మావోయిస్టుల డంప్ లభ్యం


డంప్‌లో లభించిన పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో డీఆర్‌జీ బలగాలు, బస్తర్ ఫైటర్స్ చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కిష్టారం, బెజ్జీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు న్నారనే సమాచారంతో డీఆర్‌జీ కమాండర్ మడ్కం ముద్రజ్ ఆధ్వర్యాన సోమవారం కూంబింగ్ చేపట్టారు. అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు పారిపోయారు. అనంతరం అక్కడ గాలింపు చేపట్టగా డంప్ లభ్యమైంది. అందులో బీజీఎల్ రైఫిళ్లు, జనరేటర్, ప్రింటర్, మావోయిస్టుల దుస్తులేకాక భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

బట్టలు ఆరేస్తూ భార్య.. కాపాడబోయి భర్త

- విద్యుదాఘాతంతో దంపతుల మృతి


షమీనా


శ్రీను

కారేపల్లి: ఉతికిన బట్టలు ఇంటి ఆవరణలోని ఇనుపతీగపై ఆరవేసే క్రమంలో భార్య, ఆమెను కాపాడబోయిన భర్త విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపురంలో జరిగిన విషాదకర ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బానోతు శ్రీను(45), షమీనా(40) ఇరవై ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె ఉండగా ఆమె వివాహమైంది. సోమవారం ఉదయం బట్టలు ఉతికిన షమీనా తడి బట్టలను ఇంటి ఆవరణలోని ఇనుపతీగపై ఆరేసేందుకు సిద్ధమైంది. అయితే తీగకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్‌కు గురైన ఆమె కుప్పకూలిపోయింది. ఈ విషయాన్ని గమనించిన శ్రీను ఆమెను కాపాడే ప్రయత్నంలో అతడు కూడా షాక్‌కు గురై కేకలు వేశాడు. ఈ కేకలు విన్న స్థానికులు చేరుకుని మెయిన్ ఆఫ్ చేసి విగతజీవులుగా పడి ఉన్న భార్యాభర్తలను ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు.

ఎవరికి 'టెండర్' వేస్తారు?

- ఇప్పటికే పలుమార్లు రద్దుపై అనుమానాలు
- ఎరువుల రవాణాకు మార్క్‌ఫెడ్‌లో రూ.100 కోట్ల టెండర్
- పలుమార్లు నిబంధనల మార్పు...అయినా తమవారికి దక్కలేదని రద్దు
- చక్రం తిప్పుతున్న నేతలు, ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: టెండర్లు పిలవడం..రద్దు చేయడం మార్క్‌ఫెడ్‌లో సర్వసాధారణమైంది. దీంతో ఎరువుల రవాణా టెండర్లు పదేపదే రద్దు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కేవలం ఒక కంపెనీకే ఎక్కువగా లబ్ధి చేకూరేలా, టెండర్లలో సంబంధిత ఏజెన్సీకి అర్హత వచ్చినందున, ఆ గుత్తాధిపత్యాన్ని అడ్డుకునేందుకే టెండర్లు రద్దు చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. అయితే వరంగల్ జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధికి చెందిన ఏజెన్సీకి కట్టబెట్టేలా మళ్లీ టెండర్లు పిలవాలన్న భావనతోనే ఇదంతా చేశారన్న ప్రచారం జరుగుతోంది.

మొదటి నుంచీ వివాదాస్పదమే

యూరియా, డీఏపీ సహా అన్ని రకాల ఎరువులను మార్క్‌ఫెడే రైతులకు సరఫరా చేస్తుంది. ఎరువులను వివిధ జిల్లాల్లో ఉండే రేక్ పాయింట్ల నుంచి నిర్దేశించిన ప్రాంతాలకు లారీల్లో సరఫరా చేయాలి. అందుకోసమే రేక్ పాయింట్ల వారీగా ఏటా మార్క్‌ఫెడ్ టెండర్లు నిర్వహిస్తుంది. అందుకోసం ఏకంగా రూ.100 కోట్లు ఖర్చు చేస్తుంది. అయితే పదేళ్లుగా ఎక్కువ రేక్ పాయింట్లు ఒకే ఏజెన్సీకి దక్కాయి. ఆ ఏజెన్సీకి అనుకూలంగా టెండర్ నిబంధనలు ఉండటం వల్లే ఇలా జరిగిందన్న ఆరోపణలు వస్తూ ఉండేవి. ఈ నేపథ్యంలో పలు మార్పులుచేర్పులు చేయాలని గతేడాదే మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. అయితే గతేడాది టెండర్లలో కూడా అదే ఏజెన్సీకి ఎక్కువ రేక్ పాయింట్లు వచ్చాయి. ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులకు మధ్య లోపాయికారి ఒప్పందం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలూ ఉన్నాయి.

ఈసారి కూడా...

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ సీజన్‌కు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే టెండర్లు పిలిచారు. అయితే దరఖాస్తు చేసుకునే ప్రక్రియ పూర్తయ్యే సరికి ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపించి అప్పుడు దాన్ని తెరవలేదు. అయితే కోడ్ పూర్తయ్యాక సాంకేతిక కారణాలు చూపించి టెండర్లు రద్దు చేశారు. అలా ఇప్పటివరకు పలుమార్లు టెండర్లు పిలవడం, రద్దు చేయడం జరిగిపోయింది. తాజాగా రెండ్రోజుల క్రితం టెండర్ రద్దు చేయడంపైనా విమర్శలు వచ్చాయి. వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఏజెన్సీకే టెండర్ దక్కేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. అంతేగాక టెండర్ రద్దుకు ముందు ఒక ఏజెన్సీ నిర్వాహకుడు సంబంధిత మార్క్‌ఫెడ్ అధికారికి ఫోన్ చేసి తన ఏజెన్సీని అనర్హతగా ప్రకటిస్తే అంతుచూస్తానని బెదిరించడం చర్చనీయాంశమైంది. ఆ బెదిరింపుల వెనుక మార్క్‌ఫెడ్‌కే చెందిన ఒక అధికారి ఉన్నారన్న ప్రచారం జరిగింది. వాస్తవంగా సీజన్ ప్రారంభంలో అంటే మే నెల నాటికే టెండర్ ప్రక్రియ పూర్తి కావాలి. కానీ ఇప్పటివరకు టెండర్ల రద్దుతోనే కాలం గడిచిపోయింది. దీంతో ప్రస్తుతం గతేడాది టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలనే కొనసాగించే పరిస్థితి కనిపిస్తుంది. టెండర్ నిబంధనల సడలింపు చేసినా, తమ వారికి దక్కకపోవడం వల్లే ఇప్పటివరకు పలుసార్లు టెండర్లు రద్దు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోసారి కూడా నిబంధనలను సడలించి టెండర్లకు వెళతామని మార్క్‌ఫెడ్ వర్గాలు వెల్లడించాయి.

అవును టెండర్ రద్దు చేశాం

వివిధ కారణాల వల్ల ఎరువుల రవాణా టెండర్లు రద్దు చేశామని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుత్తాధిపత్యానికి చెక్ పెట్టేందుకే రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. తదుపరి మళ్లీ ఎప్పుడు టెండర్లకు వెళ్తామన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

'మంకీ పాక్స్'పై అప్రమత్తం

- గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లో మంకీపాక్స్ కేసులు స్వల్పంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంకీపాక్స్ ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లో 30 కేసులు నమోదయ్యాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. అయితే ముందస్తు జాగ్రత్త చర్యల్లో మెడికల్ కిట్స్, మందులు, ఆస్పత్రుల్లో ప్రత్యేకవార్డులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంకీపాక్స్ పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేకవార్డులు అందుబాటులో ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాలలో ప్రభుత్వ ఆస్పత్రులలో మంకీపాక్స్ వైరస్‌కు నివారణ మందులు, అవసరమైన కిట్స్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. వైద్యవిధాన పరిషత్‌పైనా మంత్రి సమీక్షించారు. టీవీవీపీ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అదనపు సేవలైన సెక్యూరిటీ, శానిటేషన్, డైట్, లాండ్రీ సేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. ఆస్పత్రుల భవనాల స్థితిగతులు, ఆస్పత్రి సిబ్బంది హాజరుపట్టికలను పరిశీలించడానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం ఆస్పత్రులను సందర్శించి ప్రతి 15 రోజులకోసారి నివేదిక సమర్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు ప్రతి నెలా చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా సమావేశాల్లో వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, ఆరోగ్య కుటుంబసంక్షేమ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్, తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రితో జూడాల భేటీ: ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలో డాక్టర్లు, మహిళా డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఆస్పత్రి సిబ్బందికి అవసరమైన భద్రతాచర్యలు చేపట్టాలని జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు మంత్రి దామోదరను కోరారు. ఈ మేరకు వారు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో రక్షణచర్యలు ఏర్పాటు చేయాలన్నారు. జీవో నంబరు 103 ప్రకారం రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎస్‌పీఎఫ్ ఫోర్స్‌తో భద్రత ఏర్పాట్లు ప్రవేశపెట్టాలని ఆ వినతిపత్రంలో మంత్రిని కోరారు. ఆస్పత్రుల్లో నియమించే కమిటీల్లో జూనియర్ డాక్టర్లను సభ్యులుగా చేర్చాలని చెప్పారు. వినతిపత్రంలోని అంశాలపై మంత్రి జూడాలతో చర్చించారు. జూనియర్ డాక్టర్లు వెల్లడించిన పలు అంశాలపై సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో జూడా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఐజాక్ న్యూటన్, , చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీనాథ్ ఉపాధ్యక్షులు డాక్టర్ సందీప్‌అరోలా, డాక్టర్ సందీప్‌చారి, డాక్టర్ అజయ్‌ప్రకాశ్, డాక్టర్ మోరే వంశీకృష్ణ, డాక్టర్ వెంకటేష్‌కుమార్ ఉన్నారు.

పిడుగుపాటుకు ఆరుగురు బలి

- పశువుల్ని మేపడానికి వెళ్లి విద్యార్థి మృతి
- గద్వాల జిల్లాలో ముగ్గురు, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇద్దరు..


కార్తీక్

గద్వాలరూరల్/తాండూరు రూరల్/మంథని: పిడుగుపాటుకు వేర్వేరు జిల్లాల్లో సోమవారం ఆరుగురు బలయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ముగ్గురు, మరో మూడు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు విడిచారు. వీరిలో ఒకరు విద్యార్థి. ఆయా ఘటనల వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా క్యాతూర్‌కు చెందిన వేముల రాజు (40) వర్షం పడుతుండటంతో చెట్టు కిందకు వెళ్లగా అదే సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గట్టు మండలం ఆరగిద్దలో తలారి నల్లారెడ్డి (30) వ్యవసాయ పనులు చేసుకుంటున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. మల్దకల్‌లో సీడ్ పత్తి పనుల కోసం వచ్చిన కర్నూలు జిల్లా కనకవీడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (15) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఇదే జిల్లాలో వేర్వేరుచోట్ల పిడుగులు పడి మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఉండవెల్లి మండలం కంచుపాడులో ఎద్దు మృతి చెందింది. కాగా, పెద్దపల్లి జిల్లా మంథని మండలం పందులపల్లికి చెందిన ఉడుత నారాయణ (58) పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు గాలించగా మృతదేహం కనిపించింది. పిడుగులు పడే ఆయన మరణించారని బంధువులు తెలిపారు. అలాగే, మంచిర్యాల జిల్లా బిట్టుర్పల్లికి చెందిన భాస్కర్‌గౌడ్ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

సంకిరెడ్డిపల్లిలో విద్యార్థి విషాదం

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన వితలప్ప, పద్మమ్మ దంపతుల రెండో కుమారుడు కార్తీక్ (15) 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు సెలవు కావడంతో కార్తీక్, అతని స్నేహితుడు సాయి కలిసి ఆవులు, మేకలను మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురిసి, పిడుగులు పడ్డాయి. ఒక పిడుగు నేరుగా కార్తీక్‌పై పడటంతో కిందపడిపోయాడు. కుటుంబసభ్యులు, అతడిని తాండూరు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. అప్పటి వరకు కళ్ల ముందున్న కొడుకు ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

వరదలో చిక్కుకున్న బస్సు


బ్రిడ్జి కింద చిక్కుకున్న బస్సు, ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద సోమవారం ఆర్టీసీ బస్సు వరద నీటిలో చిక్కుకుంది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి రైల్వే బ్రిడ్జి కిందకు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో వరద నీరు చేరింది. ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వస్తున్న బస్సు సుమారు ఐదు అడుగుల లోతు వరద నీటిలో చిక్కుకుని ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ మకరందు, పోలీసులు అక్కడికి చేరుకుని సిబ్బందితో వరద నీటిని తోడి.. బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కాగా జిల్లాలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 8.30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గంటలోనే 2.1 సెంటీమీటర్లు కురిసింది. భారీ వర్షానికి జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా భీమ్‌గల్ మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. నిజామాబాద్ నార్త్ మండలంలో 7.3 సెంటీమీటర్లు, నిజామాబాద్ సౌత్ మండలంలో 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

గిరిజనుల ఎదురుదాడి

- రావుట్ల బీట్ అటవీ ప్రాంతంలో పంటల సాగు
- జేసీబీతో పంటలు ధ్వంసం చేసిన అటవీ అధికారులు,పోలీసులు
- వాగ్వాదానికి దిగిన గిరిజనులు... పలువురు అరెస్టు


జేసీబీని చుట్టుముట్టిన గిరిజనులు

సిరికొండ: సాగు చేస్తున్న పంటలను ధ్వంసం చేయడంతో అటవీ అధికారులు, పోలీసులపై గిరిజనులు ఎదురుదాడికి దిగారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ అటవీ రేంజ్ పరిధి రావుట్ల బీట్ అటవీ ప్రాంతం కంపార్ట్‌మెంట్ నంబర్ 397లో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జంగిలోడి తండాకు చెందిన గిరిజనులు ఈ పంటలను సాగు చేస్తున్నారు. కాగా సిరికొండ, కమ్మర్‌పల్లికి చెందిన అటవీ అధికారులు పోలీసులతో కలసి జంగిలోడి తండా అటవీ శివారుకు చేరుకుని సాగు చేస్తున్న వరి పొలాలను, పత్తి పంటను జేసీబీతో ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న గిరిజనులు పెద్దసంఖ్యలో వచ్చి పోలీసులు, అటవీ శాఖ సిబ్బందిపై తిరగబడ్డారు. జేసీబీపై మహిళలు రాళ్లతో దాడి చేయడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఎంత నిలువరించినా గిరిజనులు ఆగలేదు. దీంతో జేసీబీలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. పంటలను సాగు చేసుకోవడానికి సిరికొండ ఎఫ్ఆర్వో ఎంవీ నాయక్‌కు రూ.5 లక్షలు ఇచ్చామని గిరిజనులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఇన్‌చార్జి డీఎఫ్‌వో నిఖిత అక్కడకు చేరుకుని అటవీ భూములను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, 14 రోజుల రిమాండ్ అయ్యేలా చూడాలని, అటవీ భూములను చదును చేసేందుకు వినియోగించిన వాహనాలను సీజ్ చేయాలని ఏసీపీకి సూచించారు. పనులను అడ్డుకున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకునిఅటవీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అమెరికా ఆనర్ అవార్డుకు ఫక్రుద్దీన్



మరిపెడ: ప్రతిష్టాత్మకమైన అమెరికా ఆనర్ అవార్డుకు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ షేక్ ఫక్రుద్దీన్ ఎంపికయ్యాడు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ (ఐసీఎస్) ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 28 మంది ఫొటోగ్రాఫర్లకు గౌరవ ఆనర్లు ప్రకటించింది. అందులో భారతదేశం నుంచి 13 మంది ఎంపికయ్యారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఉండగా.. తెలంగాణ నుంచి ఎంపికైన నలుగురిలో ఫక్రుద్దీన్ ఒకరు. ఆయనకు డిసెంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

'ఫోర్త్ సిటీ' కోసం ప్రత్యేక అథారిటీ!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కొన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు సైతం జరుపుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక అథారిటీ అధీనంలో పని చేయడానికి రెవెన్యూ, పట్టణాభివృద్ధి తదితర విభాగాల సిబ్బందిని తీసుకురానున్నారని తెలిసింది. దీనివల్ల భూముల సమీకరణ, కేటాయింపు, అనుమతుల మంజూరు, మౌలిక వసతుల అభివృద్ధి.. ఇలా ప్రతి అంశంలోనూ సింగిల్ విండో విధానం అమలు చేయడం ద్వారా పెట్టుబడిదారులను ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

సుదీర్ఘకాలం సజావుగా సాగేలా...

'గ్రేటర్'పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ల వంటి విషయాల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. పాత నగరం, ఏళ్ల క్రితమే అభివృద్ధి చెందిన కొత్త నగరంలోనే కాదు.. గత కొన్నేళ్లుగా కొత్త హంగులు సంతరించుకుంటున్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌తోపాటు పశ్చిమ ప్రాంతంలోనూ సమస్యలు తప్పట్లేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా సమకాలీన అంశాలనే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ సైతం రూపొందించాలని యోచిస్తోంది. కనిష్టంగా రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోనుంది. దీనికోసం అవసరమైతే ప్రత్యేక అథారిటీతో అభివృద్ధి చెందిన దేశాల్లోనూ అధ్యయనం చేయించే అవకాశం ఉంది.

కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు...

త్వరలో జరగబోయే కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు ఉండనున్నాయని తెలిసింది. ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక అథారిటీ సహా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సిబ్బంది, చట్టబద్ధతపైనా నిర్ణయాలు ఉండనున్నాయి. ప్రస్తుతానికి హైడ్రాను కేవలం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌గా పిలిచే జీవోతో ఏర్పాటు చేశారు. దీనికి పూర్తిస్థాయి చట్టబద్ధత లభించాలంటే చట్టం అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మంత్రివర్గ సమావేశంలో విధాన నిర్ణయం తీసుకోనుంది. దీని ఆమోదం తర్వాత ముసాయిదా బిల్లు రూపొందించి అసెంబ్లీ సమావేశాలు ప్రొరోగ్ అయ్యాక ఆర్డినెన్స్ జారీ చేయనుంది. వచ్చే శాసనసభ సమావేశాల్లో హైడ్రా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రాలోకి నేరుగా నియమించుకొనే, డిప్యుటేషన్‌పై తీసుకొనే సిబ్బందిపైనా కేబినెట్‌లో నిర్ణయం ఉండనుందని సమాచారం.

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం రూ.2 కోట్లు అప్పు చేసి..

- యువకుడి ఆత్మహత్య


సాయికుమార్

నల్లగొండ క్రైం, పెన్‌పహాడ్: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. బెట్టింగ్ మాయలో పడి రూ.2 కోట్లు అప్పు చేసి.. తీర్చే మార్గం లేక సాగర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. నల్లగొండ నెహ్రూగంజ్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న తడకమళ్ల సోమయ్య కుమారుడు సాయికుమార్ (28) అప్పు తెచ్చి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ పెట్టి రూ.2 కోట్లు నష్టపోయాడు. అప్పులు ఇచ్చిన వారు.. తిరిగి చెల్లించాలని అడగడంతో వారికి సమాధానం చెప్పలేక సాయికుమార్ మనస్తాపం చెంది ఈ నెల 17న ఇంట్లోంచి వెళ్లిపోయాడు. హాలియా వద్ద సాగర్ ఎడమ కాల్వలో దూకాడు. అతని సోదరుడు సతీశ్ అదేరోజు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సాయికుమార్ కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. కాగా సోమవారం సాయికుమార్ మృతదేహం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామ శివారులో సాగర్ ఎడమ కాల్వలో లభించినట్లు పెన్‌పహాడ్ ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాగునీటికి రోడ్డెక్కిన జనం


ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన జనం

పెద్దేముల్: తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కారు. గంటపాటు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. భగీరథ నీళ్లు రావడం లేదని, కాలనీలోని బోర్లు పాడయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ పనితీరుపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, నచ్చజెప్పినా వినలేదు. దీంతో మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్ మెకానిక్‌లను తీసుకొచ్చి బోర్లకు మరమ్మతులు చేపట్టడంతో శాంతించారు.

చివరి ఆయకట్టుకు నీరేది?

- రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులు

వేములపల్లి (మాడ్గులపల్లి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రంలోని వరదకాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రైతులు సోమవారం మాడ్గులపల్లిలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. 18 రోజుల క్రితం వరదకాల్వకు మంత్రులు నీటిని విడుదల చేసినా.. కాల్వ కంప చెట్లు, రాళ్లు, వ్యర్థాలతో నిండిపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు వాపోయారు. కాల్వ తూముల ద్వారా కొందరు రైతులు అక్రమంగా నీటిని మళ్లించుకోవడంతో మాడ్గులపల్లి మండలంలోని మాడ్గులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల చివరి భూములకు నీరందక రైతులు సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పద్మ రాస్తారోకో చేస్తున్న రైతుల వద్దకు వచ్చి ఇరిగేషన్ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. చివరి భూములకు నీరందించేలా కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు.

ఇటు బీజేపీ.. అటు కాంగ్రెస్
మధ్యలో లోకల్



హరియాణాలో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధం

లోక్‌సభ ఫలితాలతో జోరు మీదున్న కాంగ్రెస్	అధికార బీజేపీకి సవాలు విసురుతున్న వైనం	బలహీనపడిన జేజేపీ, ఐఎన్‌ఎల్‌డీ	వాటికి పడే ఓట్లు ఎవరి పుట్టి ముంచేనో!

అధికార బీజేపీ. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్. వీటికి తోడు ఐఎన్‌ఎల్‌డీ, జేజేపీ, బీఎస్పీ. ఇలా నానా పార్టీలతో కిక్కిరిసిపోయిన హరియాణా రాజకీయ రంగస్థలంపై ఆసక్తికరమైన అసెంబ్లీ ఎన్నికల పోరుకు తెర లేచింది. ఎన్ని పార్టీలున్నా రాష్ట్రంలో ప్రధాన పోరు మాత్రం కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటూ వస్తోంది. వరుసగా రెండోసారి అధికారంలో కొనసాగుతున్న బీజేపీకి తాజా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టి షాకే ఇచ్చింది. 2019లో రాష్ట్రంలో మొత్తం పదికి పది లోక్‌సభ స్థానాలనూ బీజేపీ గెలుచుకోగా ఈసారి వాటిలో సగానికి సగం 'హస్త'గతమయ్యాయి. ఆ ఊపుతో రెట్టించిన ఉత్సాహంతో కన్పిస్తున్న కాంగ్రెస్‌ను నిలువరించడం కమలనాథులకు అగ్నిపరీక్షే కానుంది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలు రెండు ప్రధానపార్టీల్లో ఎవరి పుట్టి ముంచుతాయన్నది ఆసక్తికరంగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2019 అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణా ఓటర్లు ఎవరికీ స్పష్టమైన మెజారిటీ ఇవ్వకపోవడంతో హంగ్ ఏర్పడింది. 90 అసెంబ్లీ సీట్లకు గాను 40 స్థానాలతో బీజేపీ ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. 10 సీట్లున్న జేజేపీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈసారి మాత్రం రాష్ట్రంలో ఓటరు తీర్పు స్పష్టంగానే ఉండనుందని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ''బీజేపీపై ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కూడా ఇందుకు అద్దంపట్టాయి. ఆ పార్టీకి ఓట్ల శాతం భారీగా తగ్గింది'' అని వారంటున్నారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), బీఎస్పీ వంటి పార్టీలు కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరి పుట్టి పుట్టి ముంచుతాయన్నది ఆసక్తికరంగా మారింది. గతంతో పోలిస్తే ఆ పార్టీలు బాగా బలహీనపడ్డా వాటికి పడే ఓట్లు అంతిమ ఫలితాన్ని తేల్చడంలో కీలకం కానున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఈ మూడు పార్టీలతో పాటు స్వతంత్రులు కాంగ్రెస్ ఓటుబ్యాంకునే చీల్చి తమను ఒడ్డున పడేస్తారని బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. దానికి తోడు ఎప్పట్లాగే జాటేతర ఓట్లన్నీ తమకే పడతాయంటోంది. కాంగ్రెస్ మాత్రం ఈ ఎన్నికల్లో జాతీయాంశాలు, మోదీ ఫ్యాక్టర్ వంటివేవీ లేవు గనుక బీజేపీ ఓటు బ్యాంకుకు మరింత భారీగా గండి పడటం ఖాయమని చెబుతోంది.

కురుక్షేత్ర యుద్ధం

ముళ్లబాటలో బీజేపీ...

2014లో హరియాణాలో సొంతంగా అధికారం సాధించిన బీజేపీ, 2019లో జేజేపీ పొత్తుతో దాన్ని నిలుపుకుంది. ఈసారి మాత్రం ఆ పార్టీకి పరిస్థితి ముళ్లబాటనే తలపిస్తోంది. జాటేతర ఓట్లన్నీ గుండుగుత్తగా పడటం రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమల వికాసానికి ప్రధాన కారణంగా నిలిచింది. దాంతో మనోహర్‌లాల్ ఖట్టర్ రూపంలో జాటేతర నేతను బీజేపీ సీఎంను చేసింది. ఆయన తొమ్మిదేళ్లకు పైగా పదవిలో కొనసాగారు. రైతు ఆందోళనలు, గట్టిగా పుంజుకున్న కాంగ్రెస్ నుంచి ఎదురవుతున్న సవాలు నేపథ్యంలో గత మార్చిలో నాయబ్‌సింగ్ సైనీ రూపంలో ఓబీసీ నేతను ముఖ్యమంత్రిని చేసింది. ఈ ఎత్తుగడ లోక్‌సభ ఎన్నికల్లో పెద్దగా కలిసి రాకున్నా ఏకంగా 35 శాతమున్న ఓబీసీ ఓట్లను ఒడిసిపట్టే లక్ష్యంతో సైనీ సారథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తోంది. అగ్ర కులాల, పట్టణ ఓటర్లపై పట్టును నిలుపుకునేందుకూ బీజేపీ ప్రయత్నిస్తోంది. వారికి వరుసగా తాయిలాలు ప్రకటిస్తోంది. బ్రాహ్మణుడైన మోహన్‌లాల్ బదోలీ రూపంలో ఇప్పటికే అగ్రవర్ణ నేతను రాష్ట్ర పార్టీకి అధ్యక్షున్ని చేసింది. ప్రచార దూకుడూ పెంచనుంది.

అడ్వాంటేజ్ కాంగ్రెస్, కానీ...!

ప్రచార పర్వంలో కాంగ్రెస్ దూసుకెళ్తోంది. కాంగ్రెస్ నుంచి మాజీ సీఎం భూపీందర్ హుడా, ఆయన కుమారుడు దీపీందర్, పీసీసీ చీఫ్ ఉదయ్ భాన్, సీనియర్ నాయకురాలు కుమారి సెల్జా మొత్తం 90 అసెంబ్లీ స్థానాల పరిధిలోనూ కలియదిరుగుతున్నారు. ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైతే పరిస్థితి కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. అయితే భూపీందర్, సెల్జా వర్గాల కుమ్ములాటలు పార్టీని కలవరపెట్టే అంశం. ఈ ఇంటి పోరును ఏ మేరకు కట్టడి చేస్తుందన్న దానిపైనే కాంగ్రెస్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయన్నది రాజకీయ వర్గాల అంచనా.

ప్రాంతీయ పార్టీలన్నీ కుదేలే...

జేజేపీ, ఐఎన్‌ఎల్‌డీ రెండూ కొన్నేళ్లుగా ఆదరణ కోల్పోతూ వస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో 26 శాతమున్న జాట్లే వాటి ప్రధాన బలం. వారు ఇటీవల కాంగ్రెస్ వైపు మొగ్గుతున్నారు. రైతుల ఆందోళనలు తారస్థాయిలో ఉన్న వేళ బీజేపీకి కొమ్ము కాయడం జేజేపీకి భారీగా చేటు చేసింది. జాట్లు పూర్తిగా దూరమయ్యారు. జేజేపీ ఓటు బ్యాంకుకు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా గండికొట్టింది. ఈసారి బీఎస్పీతో పొత్తు బాగా కలిసొస్తుందని ఆశలు పెట్టుకున్న ఐఎన్‌ఎల్‌డీదీ ఇదే పరిస్థితి. నేతల కీచులాటలు పార్టీని బాగా కుంగదీస్తున్నాయి. బీఎస్పీతో గతంలో పెట్టుకున్న పొత్తు దారుణంగా వికటించిన అనుభవం మరింత భయపెడుతోంది.

ఆప్ పరిస్థితీ అంతంతే...

పంజాబ్‌ను చేజిక్కించుకున్న ఊపులో హరియాణాలోనూ పాగా వేసేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలిస్తున్న సంకేతాలు కన్పించడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జత కట్టి పోటీ చేసిన ఒక్క స్థానంలోనూ ఆప్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దాంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను దూరం పెట్టి కాంగ్రెస్ ఒంటరిగానే బరిలో దిగుతోంది!

ఐఎన్‌ఎల్‌డీ

బలాలు
- గ్రామీణ ప్రాంతాల్లో గట్టి ఓటు బ్యాంకు
- బీఎస్పీతో పొత్తు

బలహీనతలు
- కొన్నేళ్లుగా ఎన్నికల్లో పరాజయాల పరంపర
- నానాటికీ తీవ్రమవుతున్న ఇంటిపోరు
- కాంగ్రెస్, బీజేపీల్లోకి అగ్ర నేతల వరుస ఫిరాయింపులు

జేజేపీ

బలాలు
- గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆదరణ
- రాష్ట్ర రాజకీయ దిగ్గజం దేవీలాల్ వారసత్వం

బలహీనతలు
- బీజేపీతో పొత్తు విచ్ఛిన్నం
- ఎమ్మెల్యేలు, నాయకుల ఫిరాయింపులు
- బీజేపీ ప్రభుత్వానికి మద్దతు కొనసాగించి రైతుల ఆగ్రహానికి లోనవడం

ఆప్

బలాలు
- ఢిల్లీ, పంజాబ్‌ల్లో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు
- బీజేపీ, కాంగ్రెస్‌లకు ఏకైక, సమర్థ ప్రత్యామ్నాయంగా తనను తాను ప్రచారం చేసుకుంటున్న తీరు

బలహీనతలు
- రాష్ట్రంలో ఇప్పటిదాకా ఏ ఎన్నికల్లోనూ ఖాతా తెరవలేకపోవడం
- కాంగ్రెస్‌తో పొత్తు లేకపోవడం
- ఒంటరి పోరులో దెబ్బ తినడం ఖాయమన్న అభిప్రాయం

హరియాణా అసెంబ్లీలో పార్టీల బలాబలాలు

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	40	36.49
కాంగ్రెస్	31	28
జేజేపీ	10	14.9
ఐఎన్‌ఎల్డీ	1	2.46
ఇతరులు	1	8.98
స్వతంత్రులు	7	9.17

జేజేపీ... కకావికలైన కింగ్‌మేకర్

జననాయక్ జనతా పార్టీ (జేజేపీ). 2018 డిసెంబర్లో హరియాణా రాజకీయ యవనికపై పుట్టుకొచ్చిన కొత్త పార్టీ. చౌతాలా కుటుంబంలో కుమ్ములాటల ఫలితంగా ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ) నుంచి వేరుపడి దుష్యంత్ చౌతాలా ఏర్పాటు చేసుకున్న జేజేపీ 2019లో తొలిసారి అసెంబ్లీ బరిలో దిగింది. 10 సీట్లే గెలిచినా హంగ్ ఏర్పడటంతో కింగ్‌మేకర్‌గా మారింది. కానీ ఐదేళ్లు తిరిగేసరికి నానా ఎదురుదెబ్బలతో బాగా బలహీనపడింది. 2021 రైతు ఆందోళన సమయంలో బీజేపీకి మద్దతు ఉపసంహరించకపోవడం జేజేపీకి చెప్పలేనంత చేటు చేసింది. అనంతరం రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 19 చోట్ల బరిలో దిగి బీజేపీకి పూర్తిగా దూరమైంది. దీనికి తోడు అసమ్మతి, ఫిరాయింపులతో దుష్యంత్ చౌతాలాకు తల బొప్పి కడుతోంది. గత ఏప్రిల్లో జేజేపీ రాష్ట్ర చీఫ్ నిషాన్‌సింగ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పదిమంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు ఇప్పటికే బీజేపీకి జైకొట్టారు. దుష్యంత్ తండ్రి అభయ్ చౌతాలాకు అత్యంత సమ్మకస్తునిగా మెలిగిన ఎమ్మెల్యే అనూప్ ధనక్ శుక్రవారం పార్టీకి గుడ్‌బై చెప్పారు. త్వరలో బీజేపీలో చేరనున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు శనివారం పార్టీకి రాజీనామా చేశారు. దాంతో ఇప్పుడు పార్టీలో దుష్యంత్, ఆయన తల్లి, మరో ఎమ్మెల్యే మాత్రం మిగిలారు. ఈ నేపథ్యంలో పునర్వైభవం దేవుడెరుగు, పార్టీ పుట్టి మునగకుండా చూసుకోవడమే దుష్యంత్‌కు పెను సవాలుగా మారింది.

కాంగ్రెస్‌కు కలిసొచ్చిన జాట్, రైతు, దళిత ఓట్లు

రాష్ట్రంలో నిర్ణాయక శక్తి అయిన జాట్లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గారు. వారికి తోడు రైతు, దళిత ఓట్లు కూడా ఆ పార్టీకే భారీగా పడ్డాయి. 90 అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను 42 చోట్ల కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించినట్టు ఓటింగ్ సరళి తేల్చింది. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సున్నా చుట్టడం తెలిసిందే. ఆ వెంటనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ దానికి 30 స్థానాలకు మించలేదు.

కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఒప్పుకుంది

హమాస్ సానుకూలంగా స్పందించాలి: బ్లింకెన్



టెల్ అవీవ్: గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదలపై ఉన్న విభేదాలను తగ్గించే ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ఆమోదం తెలిపిందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తెలిపారు. ఇదేవిధమైన సానుకూలతతో స్పందించాలని ఆయన హమాస్‌ను కోరారు. హమాస్ సంస్థ పెడుతున్న షరతులపై మాత్రం ఆయన ఎటువంటి వ్యాఖ్యా చేయలేదు. అలాగే, గాజా గుండా వెళ్లే ప్రధాన రహదారిపై పెత్తనం తమకే ఉండాలని ఇజ్రాయెల్ చేస్తున్న డిమాండ్ పైనా ఆయన స్పందించలేదు. గతేడాది అక్టోబర్ నుంచి హమాస్ చెరలో ఉన్న బందీలందరినీ విడుదల చేయడం, బదులుగా గాజా నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ ఉపసంహరణ, ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ఖైదీల విడుదల వంటి కీలకాంశాలు మూడు దశల్లో అమలవుతాయి. బ్లింకెన్ సోమవారం టెల్‌అవీవ్‌లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో రెండున్నర గంటలపాటు విస్తృతస్థాయి చర్చలు జరిపారు. అనంతరం బ్లింకెన్ మీడియాతో మాట్లాడారు. యుద్ధం కారణంగా పడుతున్న కడగండ్ల నుంచి పాలస్తీనియన్లకు విముక్తిని, హమాస్ చెరలో మగ్గుతున్న బందీలకు స్వేచ్ఛను ప్రసాదించే కాల్పుల విరమణ ఒప్పందం ఖరారుకు ఇదే సరైన సమయమని వ్యాఖ్యానించారు. 'ఇది నిర్ణయాత్మకంగా వ్యవహరించేందుకు ఎంతో అనువైన సమయం. శాంతిని, సుస్థిరతను సాధించేందుకు బహుశా ఇదే చివరి అవకాశం కావచ్చు' అని వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియను పక్కదారి పట్టించేందుకు ఎవరూ ప్రయత్నించకుండా చూసుకోవడం కూడా అవసరమని ఇరాన్‌ను ఉద్దేశించి ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. ఈ ఉద్రిక్తతలు మరిన్ని ప్రాంతాలకు వ్యాపిస్తే ఆ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. బ్లింకెన్ మంగళవారం కైరో చేరుకుంటారు. ఈజిప్ట్, అమెరికా తదితర దేశాల మధ్యవర్తిత్వంతో కైరోలో చర్చలు జరుగుతున్నాయి.

ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర మంత్రి ఓరం



న్యూఢిల్లీ: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయెల్ ఓరం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో కొత్త ప్రైవేట్ వార్డులో చేరారని, పల్మనరీ మెడిసిన్ అండ్ స్లీప్ డిజార్డర్స్ విభాగాధిపతి డాక్టర్ అనంత్ మోహన్ ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. మంత్రి ఆరోగ్య నిలకడగా ఉందని వెల్లడించాయి. మంత్రి ఓరం భార్య ఝింగియా ఓరం(58) శనివారం ఒడిశాలోని భువనేశ్వర్‌లోని ఓ ఆస్పత్రిలో డెంగితో చికిత్స పొందుతూ చనిపోవడం తెలిసిందే. అదే ఆస్పత్రిలో డెంగీతో మంత్రి ఓరం కూడా చికిత్స పొందారు. ఇలా ఉండగా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర జ్వరంతో సోమవారం సాయంత్రం ఢిల్లీ ఎయిమ్స్‌లోని అత్యవసర విభాగంలో జాయినయ్యారు. 'ఆయన మంచిగానే ఉన్నారు. చికిత్స అందుతోంది. ఎలాంటి ప్రమాదం లేదు' అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

'లాటరల్ ఎంట్రీ' బహుజనులపై దాడే

కేంద్రంపై రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులను లాటరల్ ఎంట్రీ విధానం ద్వారా ఎంపిక చేయాలంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీలు, ఓబీసీలు, ఈడబ్ల్యూఎస్ తదితరుల నుంచి రిజర్వేషన్లను లాక్కుని ఆర్‌ఎస్‌ఎస్ వాదులతో నింపేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రగా ఆయన సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేయడం, బహుజనులకు రిజర్వేషన్లు లేకుండా చేయడం ద్వారా బీజేపీ దేశాన్ని తనదైన శైలిలో రామరాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. లాటరల్ ఎంట్రీ విధానం అమలును ఆయన జాతి వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ విభాగాల్లో సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల పోస్టులను స్పెషలిస్టుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులతో లాటరల్ ఎంట్రీ విధానం ద్వారా భర్తీ చేసేందుకు యూపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్‌పై రాహుల్ ఇలా స్పందించారు.

ప్రభుత్వోద్యోగాల్లో కోటా ఉండాల్సిందే: చిరాగ్

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని లోక్‌జనశక్తి పార్టీ(రాం విలాస్) చీఫ్, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కుండబద్దలు కొట్టారు. లాటరల్ ఎంట్రీ విధానం అమలుపై కేంద్రంతో మాట్లాడతానన్నారు. 'ప్రభుత్వ నియామకమేదైనా సరే రిజర్వేషన్ నిబంధనలను అమలు చేయాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావుండరాదు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేవు. ప్రభుత్వం కూడా రిజర్వేషన్లను అమలు చేయకుంటే ఎలా? లాటరల్ ఎంట్రీ విషయం ఆదివారం నా దృష్టికి వచ్చింది. ఇది చాలా తీవ్రమైంది. దీనికి మేం అంగీకరించం. ప్రభుత్వంలో భాగస్వామిగా ఈ అంశాన్ని లేవనెత్తుతా' అని అన్నారు.



రక్షా బంధన్ సందర్భంగా సోమవారం ప్రధాని మోదీకి రాఖీ కడుతున్న స్కూల్ విద్యార్థులు

30 ఏళ్లలో భారత్‌లో అంతఃకలహాలు

బీజేపీ నేత కైలాశ్ విజయ్‌వర్గీయ వ్యాఖ్యలు



ఇండోర్: జనాభాలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల భారత్ వచ్చే మూడు దశాబ్దాల్లో అంతఃకలహాలను చవిచూడనుందని మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కైలాశ్ విజయ్‌వర్గీయ ఆదివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''సమాజంలో సాంఘిక సామరస్యం అత్యంత ఆవశ్యకం. జనాభాలో అసాధారణ మార్పులు భారత్‌లో 30 ఏళ్ల తర్వాత అంతఃకలహాలు, అంతర్యుద్ధానికి దారితీయొచ్చని రిటైర్డ్ సైన్యాధికారి ఒకరు నాతో చెప్పారు. అదే జరిగితే జనం బతకడమే కష్టమవుతుంది. హిందూ పదానికి బలీయమైన శక్తిని అందించేందుకు మనమంతా కృషి చేయాలి'' అన్నారు. ''హిందువులను కులాల మాటున విడగొట్టేందుకు కొందరు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. బ్రిటిష్‌వారి విభజించు, పాలించు సిద్ధాంతాన్ని వాళ్లు నమ్ముకున్నారు'' అని ఆరోపించారు. కైలాశ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

సిద్ధూకు భారీ ఊరట

గవర్నర్ విచారణ ఉత్తర్వుల నిలుపుదల ● ట్రయల్ కోర్టుకు హైకోర్టు ఆదేశాలు



బెంగళూరు: మైసూరు భూకేటాయింపుల వివాదంలో కర్ణాటక హైకోర్టులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు భారీ ఊరట లభించింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నమోదైన ఫిర్యాదులపై విచారణను ఆగస్టు 29వ తేదీదాకా వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల కోర్టును హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఆగస్టు 16న గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను సవాల్ చేస్తూ సోమవారం సిద్ధరామయ్య హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. '' గవర్నర్ ఉత్తర్వులు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. మంత్రి మండలి సిఫార్సు మేరకు తీసుకోవాల్సిన నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 163కు ఇదిపూర్తి విరుద్ధం. చట్టప్రకారం ఇది చెల్లదు. ఈ ప్రక్రియలో దోషాలున్నాయి. గవర్నర్ ఆదేశాలు రాజకీయ ప్రేరేపితంగా ఉన్నాయి. అందుకే ఈ ఉత్తర్వులను కొట్టేయండి'' అని సిద్ధరామయ్య తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. '' ఈ అంశంలో సీఎం పిటిషన్‌ను పూర్తిగా విచారించాల్సి ఉంది. అప్పటిదాకా ట్రయల్ కోర్టు ఎలాంటి విచారణ మొదలుపెట్టడానికి వీల్లేదు'' అని జడ్జి ఆదేశాలిచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల తర్వాత సిద్ధరామయ్య 'ఎక్స్'లో స్పందించారు. '' పిటిషన్‌ను విచారించి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సంతోషకరం. హైకోర్టుకు రుణపడ్డా. చివరకు సత్యమే విజయం సాధిస్తుందన్న నమ్మకం నాకు ఉంది' అని వ్యాఖ్యానించారు. హైకోర్టులో ముఖ్యమంత్రి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, గవర్నర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరై తమ వాదనలు వినిపించారు. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కు సంబంధించిన 14 ప్లాట్లను అక్రమంగా సీఎం భార్య పార్వతికి కట్టబెట్టారని సామాజిక కార్యకర్తలు ఎస్పీ ప్రదీప్ కుమార్, టీజే అబ్రహాం, స్నేహమయి కృష్ణలు చేసిన ఫిర్యాదుమేరకు గవర్నర్ ముఖ్యమంత్రిని విచారించేందుకు ఆమోదం తెలపడం తెల్సిందే. అబ్రహాం, కృష్ణ వేసిన పిటిషన్లు ప్రజా ప్రతినిధుల కోర్టులో మంగళ, బుధవారాల్లో విచారణకురానున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ర్యాలీలు

గవర్నర్ ఉత్తర్వులను తప్పుబడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు, ఆరోపణలకు నైతిక బాధ్యతగా సీఎం సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ కార్యకర్తలు పోటాపోటీగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు చేపట్టి ఒక్కసారిగా రాజకీయ వేడి పుట్టించారు.

తప్పు చేయలేదు, చేయను: సిద్ధూ

హైకోర్టులో రిట్ పిటిషన్ సందర్భంగా సీఎం మాట్లాడారు. '' నేనెలాంటి తప్పు చేయలేదు. నా జీవితం తెరచిన పుస్తకం. నా జీవితంలో ఎప్పుడూ ఏ తప్పు చేయలేదు. చేయబోను'' అని సిద్ధూ అన్నారు.

23న ఉక్రెయిన్‌కు మోదీ

21, 22 తేదీల్లో పోలండ్ పర్యటన



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 23న ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఆ దేశాధ్యక్షుడు వొలోదిమియర్ జెలెన్‌స్కీతో చర్చలు జరుపుతారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత 30 ఏళ్లలో భారత ప్రధాని ఉక్రెయిన్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.

రైలులో కీవ్‌కు

ఉక్రెయిన్ కంటే ముందు మోదీ పోలండ్‌కు వెళతారు. ఈనెల 21, 22 మోదీ పోలండ్‌లో పర్యటిస్తారు. పోలండ్ సరిహద్దుల్లో గల ఒక స్టేషన్ నుంచి రైలులో ప్రయాణించి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకుంటారు. ఇది దాదాపు 10 గంటల ప్రయాణం. తిరుగు ప్రయాణంలోనూ మోదీ రైలు ద్వారానే పోలండ్‌కు వస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో సహ పలువురు నేతలు ఉక్రెయిన్ పర్యటనకు రైలు మార్గాన్నే ఎంచుకోవడం విశేషం.

ఎయిర్‌పోర్టుల వద్ద అప్రమత్తం: కేంద్రం

ఎంపాక్స్ వ్యాప్తి నేపథ్యంలో సూచనలు



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఎంపాక్స్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికులు, విదేశీయులు రాకపోకలు సాగించే విమానాశ్రయాలు, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో సరిహద్దుల వెంట అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీచేసింది. ఎయిర్‌పోర్టులు, సరిహద్దుల వద్ద ఎంపాక్స్ లక్షణాలున్న వ్యక్తులను గుర్తిస్తే వారి ఐసొలేషన్, చికిత్సల కోసం నోడల్ కేంద్రాలుగా రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి, సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, లేడీ హార్డింగ్ ఆస్పత్రులను ఎంపికచేసింది. ఈ సౌకర్యాల కోసం మీ పరిధిలోనూ ఆస్పత్రులను ఎంపికచేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఎంపాక్స్ విషయంలో సంసిద్ధత, కేసుల గుర్తింపు, నిఘా పర్యవేక్షణ చర్యల కోసం ప్రధానమంత్రికి ప్రధాన కార్యదర్శి అయిన పీకే మిశ్రా ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

నిందితుడికి పాలిగ్రాఫ్ పరీక్ష

కోల్‌కతా/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలను రగిల్చిన వైద్యురాలి రేప్, హత్య కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించడానికి సోమవారం స్థానిక కోర్టు అనుమతించింది. ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో పీజీ ట్రైనీ డాక్టర్‌ను అత్యంత పాశవికంగా రేప్ చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుడికి ఏరోజు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించాలనేది సీబీఐ ఇంకా ఖరారు చేయలేదు. సంజయ్ రాయ్ మానసిక స్థితిని తెలుసుకోవడానికి సీబీఐ ఇదివరకే సైకోఅనాలసిస్ టెస్టు చేసింది. మరోవైపు కోల్‌కతా పోలీసులు సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం మోపుతున్నారు. అసత్య ప్రచారాన్ని అడ్డుకునేందుకేనని పోలీసులు చెబుతుండగా, నిరసనకారుల గళం నొక్కేందుకేనని విపక్షాలు మండిపడుతున్నాయి. వైద్యురాలి హత్యపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సీనియర్ డాక్టర్లు కునాల్ సర్కార్, సువర్ణ గోస్వామిలకు సమన్లు జారీ చేయడంతో వారు భారీ ర్యాలీతో కోల్‌కతా పోలీసు కేంద్ర కార్యాలయానికి వచ్చారు. వైద్య రంగానికి చెందిన వందలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'యువ డాక్టర్‌కు న్యాయం కోరుతున్నాం. మేమేమీ నేరం చేయలేదు. పోలీసులు తమ సమన్లను వెనక్కి తీసుకున్నారు. వైద్య పరివారం సహకారాన్ని కోరారు' అని డాక్టర్ కునాల్ సర్కార్ తెలిపారు. సీఎం మమతా బెనర్జీని బెదిరించినందుకు, బాధితురాలి పేరును సోషల్ మీడియాలో బహిర్గతపర్చినందుకు పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఆర్‌జీ కార్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ వరుసగా నాలుగోరోజు కూడా విచారించింది. మరోవైపు దేశ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల నిరసనలు సోమవారం కూడా కొనసాగాయి. కేంద్ర ఆరోగ్యశాఖతో సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయని, అంగీకారయోగ్యమైన ఒప్పందానికి రాలేకపోయామని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) వెల్లడించింది. వైద్యుల సమ్మె కొనసాగుతుందని ప్రకటించింది.



వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతా అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో గోడపై అరచేతులతో ముద్రలు వేస్తున్న ఓ కళాకారిణి

నేడు సుప్రీంకోర్టు విచారణ

దేశవ్యాప్తంగా డాక్టర్ల సమ్మె, తీవ్ర ఆగ్రహావేశాల నేపథ్యంలో సుప్రీంకోర్టు మంగళవారం పీజీ డాక్టర్ హత్యోదంతంపై సుమోటోగా విచారణ చేపట్టనుంది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం ఉదయం 10:30 గంటలకు విచారణ చేపడుతుంది. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ కన్సల్టెంట్స్ ఆఫ్ ఇండియా (ఫామ్కీ), ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా)లు సుమోటో కేసులో తమను భాగస్వాములను చేయాలని సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

అనుమతించిన కోర్టు

- కొనసాగిన జూనియర్ డాక్టర్ల నిరసనలు
- మమతపై వేలెత్తితే విరిచేస్తాం: మంత్రి

మరోవైపు, వైద్యురాలి హత్యోదంతంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని బదనాం చేస్తూ, రాజీనామా చేయాలని ఆమెవైపు వేలెత్తి చూపుతున్న వారి వేలు విరిచివేయాలని సీనియర్ మంత్రి ఉదయన్ గుహా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'మమతపై దాడి చేస్తూ ఆమెను వేలెత్తి చూపుతున్న వారు. రాజీనామాకు డిమాండ్ చేస్తున్న వారు ఎప్పటికీ సఫలం కాలేరు. మమత వైపు ఎత్తిన వేళ్లను విరిచేస్తాం' అని ఉదయన్ అంటున్న వీడియో వైరల్‌గా మారింది.

సాక్షి హైదరాబాద్
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



మందు గోలీల్లేవ్!

మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో సీజనల్‌ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పలు ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -8లో



వర్క్‌లెస్‌.. మోర్‌ ఫిట్‌..

ఉరుకులు, పరుగుల నగర జీవితంలో శరీరానికి శ్రమ లేకుండాపోతోంది. దీంతో శరీరంలో భారీగా కొవ్వులు పేరుకుపోతున్నాయి. - సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/24.0

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



టోలిచౌకిలో ముంచెత్తిన వరద

బంజారాహిల్స్‌లో ట్రాఫిక్‌జాం





అత్తాపూర్‌లో..



రారెత్తించిన వర్షం.. ట్రాఫిక్‌ నరకం

నగరంలో సోమవారం వర్షం దంచి కొట్టింది. వరద నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. గంటలకొద్దీ వాహనాలు నత్తలా నడిచాయి. షేక్‌పేట ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. ఫిలింనగర్‌-గచ్చిబౌలి, మెహిదీపట్నం- టోలిచౌకి మార్గాల్లో వాహనాలు ఆగిపోయాయి. తార్నాక ఎల్బీనగర్‌ దారిలో భారీ అంతరాయం ఏర్పడింది. తార్నాక నుంచి ఎల్బీనగర్‌కు సుమారు 3 గంటల పైగా నరకయాతన తప్పలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా పరిణమించిందో అర్థం చేసుకోవచ్చు. షేక్‌పేట్‌లోని సమతా కాలనీ, టూంబ్స్‌ చౌరస్తా, వినాయక్‌నగర్‌ రోడ్డు తదితర ప్రాంతాలలో రోడ్లపై నీరు చేరింది. దీంతో టోలిచౌకి నుంచి టూంబ్స్‌ వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

– సాక్షి, సిటీబ్యూరో

రాత్రి 9 గంటల వరకు పరిస్థితి ఇలా..

ప్రాంతం	వర్షపాతం (సెం.మీలలో)
షేక్‌పేట	5.4
యూసుఫ్‌గూడ	5.3
గచ్చిబౌలి	5.2
ఫిలింనగర్‌	4.9
బాలానగర్‌	4.4
జూబ్లీహిల్స్‌	4.3
గోల్కొండ	4.0

జనవరి 18 నుంచి 'జేకేఏ' కరాటే టోర్నమెంట్‌



గచ్చిబౌలి: దేశంలోనే తొలిసారిగా జపాన్‌ కరాటే అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా (జేకేఏ) ఆధ్వర్యంలో 'ఇన్విటేషనల్‌ ఇంటర్నేషనల్‌ కరాటే టోర్నమెంట్‌– 2025' నిర్వహించనున్నట్లు 7వ డీఏఎన్‌ జేకేఏ హెడ్‌క్వార్టర్స్‌ ఇన్‌స్ట్రక్టర్స్‌ టకుయా తనియామా, ఆనంద్‌ రత్న షిహాన్‌లు పేర్కొన్నారు. సోమవారం ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌లోని షెరటాన్‌ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరాటే టోర్నమెంట్‌ వివరాలను వారు వెల్లడించారు. జేకేఏ స్వర్ణోత్సవాల వేడుకలో భాగంగా కరాటే పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జేకేఏ ఇండియా చీఫ్‌ ఇన్‌స్ట్రక్టర్స్‌ రాపోలు సుదర్శన్‌, దయానంద్‌ కుమార్‌ మాట్లాడుతూ.. గచ్చిబౌలిలోని ఇండోర్‌ స్టేడియంలో 2025 జనవరి 18 నుంచి 22 వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. 8 నుంచి 35 ఏళ్లు, 40 నుంచి 70 ఏళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

24న వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన

సుల్తాన్‌బజార్‌: ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులకు కొత్త వసతి గృహాలు నిర్మించేందుకు ఈ నెల 24న మంత్రి దామోదర్‌ రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నరేందర్‌కుమార్‌ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఉస్మానియా కళాశాల నిర్మించినప్పుడు వైద్య విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలు ప్రస్తుతం నివాసయోగ్యంగా లేవన్నారు. ఈ విషయాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించి నూతన వసతి గృహాల నిర్మాణానికి రూ.121.90 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు.


గాంధీలో రూ.79.50 కోట్లతో..

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీ మెడికల్‌ కాలేజీ ప్రాంగణంలో నూతన వసతి గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.79.50 కోట్లు మంజూరు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌ రాజనర్సింహ ఈ నెల 24న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ వైద్యవిద్య మౌళిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఎంఎస్‌ఐడీసీ) ఇంజినీర్లతో కలిసి గాంధీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర సోమవారం స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం ఉన్న ఉమెన్స్‌ హాస్టల్‌ పక్కన వాలీబాల్‌ కోర్టు ప్రదేశాన్ని నూతన నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన స్థలంగా గుర్తించామని, పీజీలు, రెసిడెంట్‌ వైద్యులకు లేడీస్‌, బాయ్స్‌ హాస్టల్స్‌ వేర్వేరుగా నిర్మించనున్నట్లు ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర తెలిపారు. టీజీఎంఎస్‌ఐడీసీ చీఫ్‌ఇంజనీర్‌ దేవేంద్రకుమార్‌, ఎస్‌ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతిరావు, డీఈ అనిల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

మీటర్లు గిరగిరా!

సాయంత్రం వర్షం.. అర్ధరాత్రి తర్వాత ఉక్కపోత

- భారీగా నమోదవుతున్న విద్యుత్‌ వినియోగం
- తాజాగా 2900పైగా మెగావాట్ల డిమాండ్‌



గ్రేటర్‌లో విద్యుత్‌ వినియోగం ఇలా..

తేదీ	మెగావాట్లు	ఎంయూ
12	3332	68.03
13	3342	70.73
14	3414	72.08
15	2982	65.44
16	3381	69.03
17	3179	66.74
18	2949	63.01

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా వర్షాకాలంలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆఫ్‌లో ఉంటాయి. కానీ.. సీజన్‌తో సంబంధం లేకుండా వాటిని నిత్యం ఆన్‌లోనే ఉంచాల్సి వస్తోంది. ప్రస్తుతం రెయిన్‌ సీజన్‌లో సాయంత్రం చిరు జల్లులు కురుస్తుండగా.. అర్ధరాత్రి దాటిన తర్వాత ఉక్కపోత మొదలవుతోంది. దీనికి తోడు దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సిటీజనులు ఉపశమనం కోసం సిటీజన్లు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడుతున్నారు. ఫలితంగా వర్షా కాలంలోనూ విద్యుత్‌ డిమాండ్‌ అధికంగా నమోదవుతోంది.

గత ఏడాది ఆగస్టులో రోజుకు సగటున గ్రేటర్‌లో 2400 మెగావాట్ల లోపు విద్యుత్‌ డిమాండ్‌ నమోదు కాగా.. ప్రస్తుతం 2900 మెగావాట్లకుపైగా నమోదువుతండటం విశేషం. అదే విధంగా ఈ ఏడాది ఆగస్టు 14న 3414 మెగావాట్లు ఉండగా 72.08 ఎంయూల వినియోగం జరిగింది. రాత్రిపూట అకస్మాత్తుగా విద్యుత్‌ డిమాండ్‌ పెరుగుతుండటం, ఫీడర్లపై ఒత్తిడి పెరిగి తరచూ అంతరాయాలకు కారణమవుతోంది. అసలే దోమలు ఆపై ఇంట్లో ఫ్యాన్లు కూడా తిరగక పోవడంతో సిటిజన్లు కంటిమీద కునుకు లేకుండా గడపాల్సి వస్తోంది. వర్షాకాలంలో విద్యుత్‌ వినియోగం తగ్గి నెలవారీ బిల్లులు తక్కువగా వస్తాయని అంతా భావించారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది.

ఆశల లోగిళ్లు!

మళ్లీ తెరపైకి డబుల్‌ బెడ్రూం ఇళ్లు

- నిర్మాణాలు పూర్తి చేసుకోనున్న మరికొన్ని సముదాయాలు
- ప్రారంభానికి సిద్ధంగా బాకారంలోని గృహాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. డబుల్‌ బెడ్రూం ఇన్‌సీటూ (పాత గృహాలు తొలగించిన) ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తవుతుండటంతో లబ్ధిదారులను అందించేందుకు రంగం సిద్ధమవుతోంది. తాజాగా ముషీరాబాద్‌ పరిధి కవాడిగూడలోని బాకారంలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల సముదాయం నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులకు అందించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇటీవల హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి గృహ సముదాయాన్ని పరిశీలించారు. వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసి లబ్ధిదారులకు గృహాలను అందించాల్సిన ఆయన సూచించారు.

ఇప్పటికే 68 వేల కుటుంబాలకు..

ఇప్పటికే గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 68 ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌ బెడ్రూం ఇళ్ల సముదాయాల్లో సుమారు 68,841 మందికి గృహాలను అందజేసింది. అందులో పేదల పాత గృహాలు తొలగించి కొత్త గృహాలు నిర్మించిన (ఇన్‌సిటూ) కింద సుమారు 5,660 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. మిగతా గృహాల సముదాయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన ఇళ్ల పెండింగ్‌ పనులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.

ఇదీ పరిస్థితి

- మహానగర పరిధిలో ఇళ్లు లేని పేదలకు లక్ష గృహాలు నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 2015లో 100 శాతం సబ్సిడీతో ప్రాజెక్టును చేపట్టింది. మొత్తం మీద గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలో సుమారు 111 ప్రాంతాల్లో లక్ష డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చట్టింది. అందులో పాత గృహాలు తొలగించిన (ఇన్‌ సీటూ) 40 ప్రాంతాల్లో 8,898 గృహాలు, 71 ఖాళీ స్థలాల్లో 91,102 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి పనులు చేపట్టింది. మొత్తం 71 ప్రాంతాలకు గాను 42 ప్రాంతాల్లో పూర్తయిన 68,841 ఇళ్లు అందజేశారు.
- మిగతా 38 ప్రాంతాల్లో నిర్మాణ దశలోనే ఉన్నాయి. రెండు లొకేషన్లలో 2,026 గృహాలు వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. అలాగే.. 29 లొకేషన్‌ (ఇన్‌ సీటూ)పేదల పాత గృహాలు తొలగించి కొత్తగా నిర్మించిన 5,660 గృహాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తమ్మీద దాదాపు 31,000 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఏడాదిన్నర కాలంగా వీటి నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న డబుల్‌ బెడ్రూం ఇళ్లలో కొన్ని మాత్రం కేవలం 10 శాతమే పూర్తయినట్లు తెలుస్తోంది. పెండింగ్‌ పనులు పూర్తి చేసేందుకు రూ.1,500 కోట్లకు పైగా అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ.. బడ్జెట్‌లో రిక్తహస్తమే లభించింది.

బాలుడి ప్రాణం తీసిన నిర్లక్ష్యపు డ్రైవింగ్‌




దీక్షిత్‌ (ఫైల్‌)

మీర్‌పేట: ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. కారు ఢీకొట్టిన ప్రమాదంలో గాయాల పాలైన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కిరణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌కు చెందిన వరికుప్పల రామకృష్ణ, జ్యోతి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హస్తినాపురం జెడ్పీ రోడ్డులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రామకృష్ణ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి 7 నెలల పాప, ఒక బాబు దీక్షిత్‌ (22 నెలలు) ఉన్నారు. ఆదివారం రాత్రి 7.30 గంటలకు చిన్నారి దీక్షిత్‌ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఇంటి యజమాని దినేష్‌రెడ్డి కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టాడు. దీంతో చిన్నారి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే దినేష్‌రెడ్డి తన కారులో తీసుకెళ్లి కామినేని ఆసుపత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ చిన్నారి దీక్షిత్‌ అర్ధరాత్రి 2 గంటలకు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దినేష్‌రెడ్డి అక్కడి నుంచి పరారయ్యాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదం జరిగిన ఇంటి వద్ద సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా దినేష్‌రెడ్డి కారుతో బాలుడిని ఢీకొట్టినట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు.


నా బిడ్డను బతికించండి

గాంధీలో సరైన వైద్యం అందడంలేదు

- ఓ కన్నతల్లి ఆవేదన
- సోషల్‌ మీడియాలో వైరల్‌



జ్యోతి (ఫైల్‌)



గాంధీ ఆస్పత్రి: ప్రాణాపాయస్థితి కొట్టుమిట్టాడుతున్న తన కుమార్తెకు మెరుగైన వైద్యసేవలు అందించి కాపాడాలని ఓ కన్నతల్లి ఆవేదన సోషల్‌ మీడియాలో వైరల్‌ అయింది. సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడంలేదని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి చేరే వరకు ఫార్వర్డ్‌ చేయాలని వేడుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం మండపేట గ్రామం తాటిపూడికి చెందిన ఇల్ల శ్రీనివాస్‌, సుశీల దంపతులు. కొంతకాలం క్రితం నగరానికి వచ్చి అంబర్‌పేట తిరుమల నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వీరి కుమార్తె జ్యోతి (25) తల్లితండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది. ఈ నెల 18న ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌ నాలుగో అంతస్తు నుంచి కిందపడటంతో జ్యోతి తల, వెన్నెముక, కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఎంఎల్‌సీ (మెడికో లీగల్‌ కేసు) నమోదు చేసి అంబులెన్స్‌లో గాంధీఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. ప్రాథమిక వైద్యం అందించి, జూడాల సమ్మె కారణంగా అత్యవసర శస్త్ర చికిత్స చేయడం కుదరదని.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కావడంతో ఆరోగ్యశ్రీ వర్తించదని చెబుతూ గాంధీ వైద్యులు చేతులెత్తేశారని బాధితురాలి తల్లి సుశీల పేరిట సోషల్‌ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌ అయింది. సీఎం రేవంత్‌రెడ్డికి చేరేవరకూ పోస్టును ఫార్వర్డ్‌ చేయాలని వేడుకుంది. తాము పెట్టిన పోస్ట్‌ సోషల్‌ మీడియాలో సోమవారం వైరల్‌ కావడంతో అప్పటివరకు పట్టించుకోని గాంధీ వైద్యులు స్పందించారని, న్యూరోసర్జరీ, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు చికిత్సలు అందిస్తున్నారని బాధితురాలి బంధువు రవిశంకర్‌ మీడియాకు తెలిపారు. కాగా.. గాంధీ అత్యవసర విభాగంలో మెరుగైన ట్రీట్‌మెంట్‌ అందిస్తున్నామని, వైరల్‌ అయిన పోస్ట్‌లో వాస్తవం లేదని గాంధీ సూపరింటెండెంట్‌ సీహెచ్‌ రాజకుమారి స్పష్టంచేశారు. జ్యోతికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

పునాదిలోనే పురిటినొప్పులు!

అసంపూర్తి దశలో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం

- నిలిచిపోయిన నిమ్స్‌ ఎంసీహెచ్‌ బ్లాక్‌ నిర్మాణ పనులు
- భవనం అంచనాలు సైతం కుదింపు
- 8 నుంచి 3 అంతస్తులకే పరిమితం

లక్డీకాపూల్‌: నిమ్స్‌ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన సూపర్‌ స్పెషాలిటీ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్‌సీ) నిర్మాణ పనులు ఆపసోపాలు పడుతున్నాయి. భవన సముదాయం నిర్మాణ పనులు ఆరంభం అట్టహాసంగా జరిగినప్పటికీ కొంత కాలంగా అసంపూర్తి దశలోనే దర్శనమిస్తున్నాయి.

రూ.490 కోట్ల అంచనా వ్యయంతో..

- 200 పడకల సామర్థ్యంతో జీ+7 భవన సముదాయాన్ని నిర్మించేందుకు యాజమాన్యం కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. నిమ్స్‌ విస్తరణ పనులకు ప్రభుత్వం కేటాయించిన ఎర్రమంజిల్‌కి చెందిన 33 ఎకరాల్లోని ఐదు ఎకరాలను నిర్ధారించింది. రూ. 490 కోట్ల అంచనా వ్యయంతో కూడిన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణానికి అనుమతులు కూడా మంజూరు చేసింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్మితమయ్యే ఎంసీహెచ్‌ బ్లాక్‌కు గత ఏడాది మార్చి 27న అప్పటి మంత్రి హరీశ్‌రావు భూమి చేశారు.
- మొదట్లో పనులు సజావుగానే సాగాయి. నాలుగైదు నెలల నుంచి పనులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారాయి. పైగా భవన నిర్మాణంలో అంచనాలు కూడా తారుమారయ్యాయి. జీ+7 భవన సముదాయం కాస్త జీ+2కి పరిమితం చేశారు. దీంతో రూ.55 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు కొనసాగుతున్నాయి. అది కూడా కొంత కాలంగా అసలు నిర్మాణ పనులు ముందుకు సాగని పరిస్థితి.



నిలిచిపోయిన నిమ్స్‌ ఎంసీహెచ్‌ భవనం పనులు

బిల్లులు వస్తాయనే నమ్మకం లేకపోవడం వల్లే..

- ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్న నమ్మకం లేకపోవడంతోనే కాంట్రాక్టర్‌ పనులను ఉద్దేశపూర్వకంగానే నిలిపేసినట్టు సమాచారం. సకాలంలో బిల్లుల చెల్లింపులు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని నిర్మాణ సంస్థ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు దీని నిర్మాణానికి రూ. 15 కోట్లు వెచ్చించామని.. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా తీసుకున్న పాపాన పోలేదని కాంట్రాక్టర్‌ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు.

ఆశించిన మేరకు ఎంసీహెచ్‌సీ బ్లాక్‌ నిర్మాణం

ఆశించిన మేరకే ఎంసీహెచ్‌సీ భవన సముదాయ నిర్మాణం పూర్తవుతుందని నిమ్స్‌ విస్తరణ పనుల ప్రత్యేకాధికారి, డిప్యూటీ మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎన్‌.లక్ష్మీ భాస్కర్‌ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు జరుగుతూ ఉన్నాయన్నారు. అంచనా వ్యయం తారుమారు అన్నది వాస్తవం కాదన్నారు.

హడలెత్తిస్తున్న హైడ్రా



అక్రమణలపై ఉక్కుపాదంతో దూకుడు

- ఎప్పుడేమవుతుందోనని ప్రముఖుల ఆందోళన
- అక్రమాలకు కొమ్ముకాసిన అధికారుల్లోనూ వణుకు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు ఎన్నడూ చూడని విధంగా అక్రమ నిర్మాణాలు నేలమట్టం అవుతుండటంతో పలువురు ప్రముఖులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నేతలతో పాటు కొందరు సినీ ప్రముఖులు, మాజీ ఉన్నతాధికారులకు సైతం ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్లలో భారీ భవంతులుండటంతో తమ భవనాలకు ఎక్కడ ముప్పు వచ్చి పడుతుందోనని వణుకుతున్నట్లు సమాచారం. తమకున్న పరిచయాల ద్వారా రాజకీయ నేతలను సంప్రదించినా, వారు సైతం తామేమీ చేయలేమని, హైడ్రా స్వతంత్రంగా వ్యవహరిస్తోందని చెబుతున్నట్లు తెలుస్తోంది. హైడ్రా దూకుడును తట్టుకోలేని కొందరు రాజకీయ నేతలు ఇప్పటికే దాని తీరుపై తమ వైఖరి వెల్లడించడం తెలిసిందే. ఆదివారం గండిపేట ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్లలోని ఖానాపూర్‌, చిలుకూరు, అప్పోజీగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు.. తదుపరి కార్యాచరణలో భాగంగా హిమాయత్‌సాగర్‌ ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్లలో ఉండే అజీజ్‌నగర్‌, కొత్వాల్‌గూడ తదితర ప్రాంతాల్లోని భవనాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఏ ఒత్తిళ్లకు లొంగకుండా, హైడ్రా వ్యవహరిస్తున్న తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. గతంలో ఏదైనా భవనాన్ని కూల్చాలంటే, కూల్చివేత ప్రారంభం కాకముందే పైనుంచి అందే ఫోన్‌ సమాచారాలతోనే ఆగిపోయేవని ఇప్పుడా పరిస్థితి లేదని చెబుతున్నారు.

అధికారుల్లోనూ ఆందోళన..

అక్రమ నిర్మాణాలకు అనుమతులు.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేసిన జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సహా శివార్లలోని పురపాలికల అధికారులూ ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తికాకుండానే భవనానికి ఓసీ జారీ కావడాన్ని హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ ప్రస్తావించడంతో అలా ఓసీలు జారీ చేసినవారు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసిన వారు తమ అక్రమాలు ఎక్కడ వెలుగు చూస్తాయోనని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అందుకు బాధ్యులుగా తమపై కూడా చర్యలుంటాయేమోననే కలవరపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైడ్రా చర్యలతో అవకతవకలకు పాల్పడ్డ అధికారుల్లోనూ చర్చనీయాంశంగా మారింది.మరోవైపు పర్యావరణ పరిరక్షణకు కూడా హైడ్రా తరహా వ్యవస్థ ఉండాలని ఎన్విరాన్‌మెంట్‌ ప్రొటెక్షన్‌ డెవలప్‌మెంట్‌ కౌన్సిల్‌ ప్రభుత్వాన్ని కోరింది. మొత్తానికి హైడ్రా ఏర్పాటైన అనతికాలంలోనే తన పని తీరుతో ప్రత్యేకతను చాటుకుంటోంది.

ఆస్తుల విధ్వంసానికే వక్ఫ్ సవరణ బిల్లు



సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లు చట్టరూపం దాల్చితే వక్ఫ్ ఆస్తుల విధ్వంసానికి దారి తీస్తోందని తెలంగాణ ముస్లిం మత పెద్దలు అన్నారు. వక్ఫ్ సవరణ ప్రతిపాదనను వ్యతిరేకించడమే కాకుండా తిరస్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు సమావేశమై వక్ఫ్ బిల్లులోని వివిధ వివాదాస్పద క్లాజులు, వక్ఫ్ సంస్థపై వాటి ప్రభావంపై చర్చించారు. ఈ ప్రతిపాదన కేవలం సవరణ మాత్రమే కాదని, ప్రస్తుత చట్టాన్ని పూర్తిగా మార్చే కుట్రని, వక్ఫ్ సంస్థల వ్యవహారాలు, వక్ఫ్ సర్వే కమిషన్లు, వక్ఫ్ ట్రిబ్యునల్స్ వక్ఫ్ బోర్డులను నిర్వీర్యం చేయడమేనని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లకు అధికారాలు కట్టబెట్టితే వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ,సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను తప్పనిసరిగా చేర్చాలనే ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో క్రైస్తవ సంఘం మద్దతు కోరాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రతిపాదనలపై వక్ఫ్ బోర్డు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ తెలిపారు. ఈ సమావేశంలో పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు చేయూతగా...



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో పేరొందిన బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ (గతంలో బొండాడ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్) కేరళలోని వయనాడ్ ప్రాంతంలో వరద బీభత్సంపై మానవత్వంతో స్పందించింది. బాధితులకు చేయూత నందించేందుకు కేరళ ముఖ్యమంత్రి విపత్తు సహాయనిధికి రూ.25 లక్షలు అందించినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. మాటలకు అందని విషాదాన్ని మోస్తున్న వయనాడ్ బాధితుల జీవితాలను పునర్నిర్మించేందుకు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ సాయం అందించామన్నారు.

నేడు "వెన్ హిట్లర్ స్టోల్ పింక్ రాబిట్" చిత్ర ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: కరోలిన్ లింక్ దర్శకత్వం వహించిన 'వెన్ హిట్లర్ స్టోల్ పింక్ రాబిట్' చిత్రాన్ని ఈ నెల 20న బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాన్ని గోతె జంత్రమ్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సూరియా వాహన్‌వతి తెలిపారు. హృదయానికి హత్తుకునే కుటుంబ కథా నేపథ్యంలో సాగే ఈ జర్మన్ చిత్రం.. స్విట్జర్లాండ్, పారిస్, లండన్ మీదుగా ఓ యువతి సాగించిన వైవిధ్య భరిత ప్రయాణాన్ని కళ్లకు కడుతుందని తెలియజేశారు. ఈ చిత్ర ప్రదర్శన రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుందని, అందరికీ ప్రవేశం ఉందని వివరించారు.

మందు గోలీల్లేవ్...!

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. పీహెచ్‌సీల్లో మందుల కొరత

- యాంటిబయాటిక్స్ కొన్నింటికే పరిమితం.
- రక్తపోటు, షుగర్, నొప్పులు, విరేచనాలకు సంబంధించిన మందులు అంతంతే..
- సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయితే పలు ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ వేళల్లోనే ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. అయితే ప్రస్తుతం జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడిన వారు దవాఖానాలకు బారులు తీరుతుండటంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని దవాఖానాలు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. వాతావరణ మార్పులు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీంతో జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ , వైరల్ ఫీవర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే అనే తేడా లేకుండా మంచాన పడుతున్నారు.

◆ జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్కేసర్, శామీర్‌పేట) ఉన్నాయి. అలాగే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 26 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇందులో ఆరు డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 103 పల్లె,71 బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 24 గంటలు పని చేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి.పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతి రోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా, ప్రస్తుత సీజన్‌లో 200పైగా ఆసుపత్రులకు తరలివస్తున్నారు. ఏరియా ,కమ్యూనిటి ఆసుపత్రుల్లో వీరి సంఖ్య మరింత అధికంగా ఉంటోంది. అయితే ఆయా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతకు తోడు మందులు సరిపడా మందులు లేవు. కనీసం డైక్లోఫినాక్ మాత్రలు సైతం అందుబాటులో లేని దయనీయ పరిస్థితి నెలకొంది. యాంటీ బయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, వాంతులు, విరేచనాలు, రక్తపోటుతో పాటు.. చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన ఆయింట్మెంట్స్ కొరత తీవ్రంగా ఉంది.

అందుబాటులో ఉన్న మందులతో సర్దుబాటు చేస్తున్నాం

జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో జ్వర సర్వేలు ముమ్మరంగా చేస్తున్నాం . మెడికల్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశాం. పారిశుధ్య చర్యలను మెరుగుపరిచేందుకు పంచాయతీ అధికారులతో వైద్య సిబ్బంది సమన్వయం చేసుకుంటున్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అందుబాటులో ఉన్న మందులతో సమస్యలను పరిష్కరిస్తున్నాం. అవసరమైన మందులు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–డాక్టర్. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ ,మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

గుండె పోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

ఉప్పల్: గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌కు చెందిన యానంది కార్తీక్ (31) ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న అతడి భార్య సృజన రాఖీ పండగ నేపథ్యంలో పుట్టింటికి వెళ్లింది. సోమవారం ఉదయం కార్తీక్ సహ ఉద్యోగులు సృజనకు ఫోన్ చేసి కార్తీక్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో ఆమె ఇంటికి తిరిగి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి మంచంపై పడి ఉన్న భర్తను లేపేందుకు ప్రయత్నించగా అతడిలో చలనం లేకపోవడంతో 108కు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండె పోటు కారణంగా మృతి చెంది ఉండవచ్చునని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు తో పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: గుర్తు తెలియని విషం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భరత్ నగర్ ప్రాంతానికి చెందిన కుతాడి నర్సింగ్ రావు(59) మద్యం తాగే అలవాటు ఉంది. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతను పలు మార్లు వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు యత్నించగా వారిని వారించి ఇంట్లోనే నిద్రించాడు. సోమవారం కుటుంబసభ్యులు అతడిని నిద్ర లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. దీంతో 108కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలం ఆక్రమణకు యత్నం

కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఫార్చునా రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉన్న స్థలం పార్కుకు కేటాయించడం జరిగిందని, దీనిని ఆక్రమించే ప్రయత్నంలో భాగంగా కొందరు వ్యక్తులు సోమవారం ప్రొక్లెయినర్‌తో పాటు మెటల్ షీట్లను తీసుకువచ్చారన్నారు. స్థలం సరిహద్దుల చుట్టూ మెటల్ షీట్లను ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు సదరు భూమి ఆక్రమణకు ప్రయత్నాలు జరిగాయని, తాము ఎప్పటికప్పుడు అప్రమత్తమై స్థలాన్ని కాపాడుతూ వస్తున్నామన్నారు. ఈ భూమిలో ఎలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరగకుండా చూడాలని, పార్కుకు కేటాయించిన ఆ స్థలాన్ని అందుకోసమే వినియోగించేలా అభివృద్ధి చేయాలని తమ అపార్ట్‌మెంట్ నివాసితులు, స్థానికుల తరుపున కోరుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కునుకు పడితే.. కూత పెడతాయి!

- డ్రైవింగ్ వేళ నిద్రరాకుండా ఉండేందుకు అలారం కళ్లద్దాలు
- ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ
- దీనికి ఐఐటీ హైదరాబాద్ ఫెయిర్‌లో ఫస్ట్ ప్రైజ్





సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా రాత్రి వేళల్లో, మరీ ముఖ్యంగా తెల్లవారుజామున యాక్సిడెంట్స్ ఎక్కువగా జరుగుతుంటాయి. డ్రైవర్లకు నిద్రమత్తు ఆవహించడమే చాలా ప్రమాదాలకు కారణం. అయితే డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి నిద్ర రాకుండా ఉండేలా సరికొత్త కళ్లద్దాలకు రూపకల్పన చేశారు 9వ తరగతి విద్యార్థినులు. బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో చదువుకుంటున్న వడ్ల నిహారిక, శివంగి సాహూ ఈ సరికొత్త ఆవిష్కరణ చేశారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో కళ్లు మూతపడితే చాలు.. వెంటనే అలర్ట్ చేసేవిధంగా స్మార్ట్ కళ్లద్దాలను రూపొందించారు. ఈ కళ్లద్దాలు పెట్టుకున్నప్పుడు మన తల కదలికలతోపాటు కళ్లు కొట్టుకుంటున్న విధానాన్ని ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తుంటుంది. ఒకవేళ కళ్లు మూతపడినట్టుగానీ, తల వాలిపోయినట్టు గానీ అది గుర్తిస్తే, వెంటనే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. దీంతో వెంటనే డ్రైవర్ మేల్కొంటాడు. ఇటీవల ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్టర్ ఫెయిర్‌లో ఈ ఆవిష్కరణ మొదటి బహుమతి పొందింది. దాదాపు 18 స్కూళ్ల విద్యార్థుల ఆవిష్కరణలు ఫైనల్‌కు చేరుకోగా, ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి పొందారు. ఇక, రామాంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన వి.స్వాస్తికేయ, టి.లక్షయ్ అనే విద్యార్థులు రెండో బహుమతి పొందారు. వీరు డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ అనే ప్రాజెక్టు రూపొందించారు. సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌కు చెందిన రిధిమన్ సింగ్, యమూర్ శ్రీధర్ నిత్యశ్రీ, అనన్య పక్కి అనే విద్యార్థులు ఎయిర్ ప్యూరిఫికేషన్ కోసం రూపొందించిన మైక్రోఆల్గే అనే ప్రాజెక్టుకు మూడో బహుమతి దక్కింది.

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం



ప్రసాద్ (ఫైల్)



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

అమీర్‌పేట: కారు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆదివారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌కు చెందిన ప్రసాద్ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బంధువులతో కలిసి మెదక్ చర్చికి వెళ్లిన అతను ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా మైత్రివనం చౌరస్తా సమీపంలో ఎస్ఆర్‌నగర్ వైపు నుంచి అమీర్‌పేట వైపు వెళ్తున్న కారు వెనక నుంచి అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సమీపంలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో భావన అనే మహిళ కారు నడుపుతున్నట్లు గుర్తించారు. ఎల్‌బీనగర్ కొత్తపేటకు చెందిన భావన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. హైటెక్ సిటీ నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి తల్లిదండ్రుల ఆందోళన

ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో తల్లి దండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులతో కలిసి ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి తండ్రి సాయిలు వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా తల్లి యశోద ఇళ్లలో పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు.

అన్నా..గుర్తుంచుకో..

హెల్మెట్ లేని, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు రాఖీలు కట్టిన ట్రాఫిక్ పోలీస్‌లు..



వాహనదారులకు రాఖీలు కడుతున్న మహిళా కానిస్టేబుళ్లు

నాగోలు: రక్షాబంధన్ సందర్భంగా రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్, కొత్తపేట చౌరస్తాల వద్ద మహిళా కానిస్టేబుళ్లు రాఖీ కట్టించి హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ జగదీష్ మాట్లాడుతూ తోబుట్టువులకు ఎలా అయితే రక్షణ ఇస్తామో.. మన ప్రాణాలను కాపాడే హెల్మెట్, సీట్ బెల్ట్ వాహనదారులు అందరూ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ మనకు ఎంతో రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ సర్వర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం

హయత్‌నగర్: వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొంగర కలాన్‌కు చెందిన గోపగల్ల జనార్దన్(42) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొహెడలోని ఓ రిసార్టుకు ఆటోలో చికెన్ తరలిస్తుండగా.. నారాయణ కళాశాల మలుపు వద్ద వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బర్త్‌డే ఈవెంట్ పేరుతో మోసం

నలుగురిపై కేసు నమోదు

చైతన్యపురి: బర్త్‌డే ఈవెంట్ పేరుతో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వె వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముసారంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన దోతుల రాజశేఖర్‌రెడ్డి అనే వ్యాపారి తన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించాడు. ఇందుకు గాను తన దూరపు బంధువు ఈవెంట్ మేనేజర్‌గా పనిచేసే సుమంత్‌రెడ్డిని సంప్రదించాడు. అందుకు అంగీకరించిన సుమంత్ రెడ్డి తన భార్య సావిత్రి, తండ్రి విక్రమ్‌రెడ్డి, తల్లి సావిత్రిలను పిలిపించి రాజశేఖర్ రెడ్డి పరిచయం చేశాడు.సినీ హీరోయిన్ సమంత తమకు బాగా తెలుసునని 500 మంది అతిథులతో ఐటీసీ కోహినూర్‌లో గ్రాండ్‌గా ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపాడు. హీరోయిన్‌కు రూ. 30 లక్షలు, ఈవెంట్ నిర్వహణకు రూ.20లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో 2022 అక్టోబర్‌లో రాజశేఖర్‌రెడ్డి అతడికి రూ. 50 లక్షలు అందజేశాడు. అయితే ఆతర్వాత తమ నానమ్మ చనిపోవటంతో ఈవెంట్ రద్దు చేసుకుంటున్నట్లు రాజశేఖర్‌రెడ్డి వారికి సమాచారం అందించాడు. అయితే ఈవెంట్‌కు రూ. 5 లక్షలు, సమంతకు రూ. 10 లక్షలు ఇచ్చామని వారిని తిరిగి అడగలేమని, మిగిలిన రూ. 35 లక్షలు 2022 డిసెంబర్ లోగా తిరిగి ఇస్తామని చెప్పిన సుమంత్ రెడ్డి రూ. 7.35 లక్షల చెక్కు ఇచ్చాడు. అప్పటి నుంచి డబ్బుల తిరిగి ఇవ్వాలని పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువ ఫొటో గ్రాఫర్ ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

లంగర్‌హౌస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం రోజున ఓ ఫొటోగ్రాఫర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రశాంత్‌నగర్‌కు చెందిన నవీన్ ఫొటో గ్రాఫర్‌గా పని చేసేవాడు. అయితే అతడికి స్థిరమైన ఆదాయం లేకపోవడంతో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవాలని అతడి తండ్రి ప్రభాకర్ ఒత్తిడి చేసేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తండ్రి కొడుకుల మధ్య మరోసారి గొడవ జరిగింది. అదే సమయంలో తమ వద్ద తీసుకున్న డబ్బు చెల్లించాలని కొందరు వ్యక్తులు నవీన్‌కు ఫోన్ చేశారు. దీంతో మనస్తాపానికి లోనైన నవీన్ మధ్యాహ్నం ఇంటి పక్కన ఉన్న షెడ్‌లోకి వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి తండ్రి ప్రభాకర్ షెడ్‌లోకి వెళ్లి చూడగా నవీన్ ఉరివేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దింపి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి



అక్షర (ఫైల్)

కుత్బుల్లాపూర్: వేడినీళ్ల బకెట్‌లో పడి గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి అశ్విన్‌కాలనీకి చెందిన రతన్ ఈనెల 9న ఉదయం తన కుమార్తె అక్షర(03)కు స్నానం చేయించేందుకు బకెట్‌లో వేడి నీళ్లు పోశాడు. బాత్‌రూమ్‌లో సబ్బు లేకపోవడంతో తెచ్చుకునేందుకు వెళ్లగా అక్షర బకెట్‌లో పడి గాయపడింది. కుటుంబ సభ్యులు చిన్నారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు...

బైరాగిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



బండ్లగూడ: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బైరాగిగూడలోని సర్వే నెంబర్ 15/3లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఆర్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనంతరం సదరు స్థలంలో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి కూల్చివేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

21న స్కూల్‌లో జాబ్‌మేళా

శ్రీనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా నేషనల్ కెరీర్ సర్వీసెస్, డాన్ బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్‌సీఎస్ అధికారి విజయ్‌కుమార్ సోమవారం తెలియజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవనోవాజ్, టి.కార్తీక్‌లు పాల్గొన్నారు. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలను 94940 92219 నెంబర్‌లో సంప్రదించగలరని తెలిపారు.

ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి


భట్టి విక్రమార్కతో శోభరాజు

వెంగళరావునగర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని సోమవారం తెలుగు సినీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షులు (తెలంగాణ టైగర్ గ్రూప్ అధ్యక్షులు కె.శోభరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శోభరాజు మంత్రితో మాట్లాడుతూ నకిలీ యూనియన్లు, నకిలీ కళాకారులను ఏరివేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

వెండిచీర అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



బంజారాహిల్స్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వెండితో తయారు చేసిన చీరతో అలంకరించారు. దీంతో అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. శ్రావణపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి వేకువజామునే పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

కనుల పండువగా శ్రావణ పౌర్ణమి వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న భక్తులు, వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు



వెంకటేశ్వరకాలనీ: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం పలు ఆలయాల్లో సామూహిక రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. శ్రీ నగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వ్రతాన్ని ఆచరించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు, శశి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో కూడా పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలను నిర్వహించారు.

స్మృతివనం ఏర్పాటుకు చొరవచూపండి



బంజారాహిల్స్: తెలంగాణ లిబరేషన్ స్మృతివనాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటయ్యేలా చొరవ చూపాలంటూ 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో సమితి అధ్యక్షుడు మేచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావులు కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశర్‌రెడ్డి తాత కేవీ రంగారెడ్డి 1948లో రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, అలాగే ఆయన తండ్రి కొండా మాధవరెడ్డి చిన్న రాష్ట్రాల అధ్యక్షులుగా తెలంగాణ కోసం చేసిన పోరాటాల గురించి ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. గతంలో తాము ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు ఇదే విషయమై వినతిపత్రాలను అందజేయడం జరిగిందని విశ్వేశ్వర్‌రెడ్డితో ప్రస్తావించారు. పార్లమెంట్, కేబినెట్‌లో ఒప్పించి స్మృతివనం ఏర్పాటయ్యేలా చూడాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంగళరావునగర్: వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కార్మికనగర్‌లో నివాసం ఉండే అశోక్‌కుమార్ ఫ్లెక్సీ ప్రింటింగ్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 18న రాత్రి కృష్ణకాంత్ పార్క్ నుంచి యూసుఫ్‌గూడ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో అశోక్ కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

21న భారత్‌బంద్

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన భారత్‌బంద్ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ తెలిపారు. సోమవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన బంద్‌లో భాగంగా ప్రదర్శనలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారాలను ఆదేశాలను ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని ఆయన స్పష్టం చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చిందని శ్రీకృష్ణ గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీన జరిగే దేశవ్యాప్త బంద్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగుతాయని తెలిపారు.

సదా.. నీవే నాకు రక్ష

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు సదా నీవే నాకు రక్ష అని రాఖీ కట్టారు. అదే విధంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులకు మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు.

– బంజారాహిల్స్


టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది నరేందర్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి


ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.సి.రోహిణ్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఫిలింనగర్ మహిళలు


30 మంది (సోదరులు, సోదరీలు)లతో ఉన్న సురేందర్ యాదవ్ కుటుంబ సభ్యులు


మాజీ ఎమ్మెల్యే విష్ణుకు రాఖీ కడుతున్న జింకా ఆలీస్


కాంగ్రెస్ నేత నర్సింగ్‌రావుకు రాఖీ కడుతున్న ఇందిరానగర్‌వాసులు


ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు కె.బి.శ్రీధర్‌కు రాఖీ కడుతున్న ప్రొఫెసర్ శాంతిసుధా


రాఖీ వేడుకల్లో అమరావతి స్కూల్ చిన్నారులు


పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు శైలజ, వనజ


యూసుఫ్‌గూడలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్కలు


విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీ కడ్తున్న హజీరా సుల్తానా


కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి రాఖీ కడుతున్న మహిళా నాయకురాళ్లు


కార్పొరేటర్ దేదీప్య భర్తకు రాఖీలు కడుతున్న బీఆర్ఎస్ మహిళా నేతలు

ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు కఠిన శిక్షలు వేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. సోమవారం రాఖీపౌర్ణమి సందర్భంగా దానం నాగేందర్ నివాసం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మహిళలు పెద్దఎత్తున వచ్చి రాఖీలు కట్టి రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానంకు కార్పొరేటర్లు మహాలక్ష్మి, వనం సంగీతా, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ రాఖీలు కట్టారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసేవారు కోర్టుమెట్లు కూడా ఎక్కకుండా నేరుగా ఏదైనా చట్టం తీసుకొస్తే బాగుంటుందని అన్నారు. ఆడబిడ్డలు ప్రతియేటా రాఖీ పౌర్ణమి ఎప్పుడెప్పుడా వస్తుందా అని ఎదురు చూస్తుంటారని, ఎంత దూరంలో తమ సోదరులు ఉన్నా కూడా వారి వద్దకు వెళ్ళి రాఖీలు కట్టి వారి ప్రేమను చూపిస్తుంటారని అన్నారు. అదేవిధంగా మహిళలు, చిన్నారుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు వివిధ బస్తీల నుంచి వచ్చిన మహిళలు రాఖీలు కట్టారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు రాఖీ కడుతున్న గిరిజన మహిళలు


కార్పొరేటర్ వెల్దడ వెంకటేష్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

కుంగ్‌ఫూలో సత్తా చాటిన ఎస్పీఆర్‌హిల్స్ విద్యార్థులు



విజయం సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

ముగ్గురికి ట్రోఫీ..ఆరుగురికి మెడల్స్

రహమత్‌నగర్: కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా తొమ్మిది మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి మెడల్స్, ట్రోఫీలను సొంతం చేసుకున్నారు. 13వ నేషనల్ లెవల్ కరాటే, కుంగ్‌ఫూ 2024 చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చీఫ్ ఆర్గనైజర్లు ఎండి. నవీద్ బియాబాని, నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో రహమత్‌నగర్ డివిజన్ షావోలిన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కలర్ బెల్ట్స్ మొదటి విభాగంలో ఏ. ధనుంజయ్, బి. పావని, సయ్యద్ ఒమర్‌లు ట్రోఫీలు సాధించగా, మూడో విభాగంలో బి. ప్రశాంత్, ఎస్. ఉజ్వల్ విజ్ఞు, బి. వెంకటేశ్, బి.రిష్వంత్.సయ్యద్ ఉస్మాన్, కె, చందనలు మెడల్స్ సాధించారు. వీరందరు మాస్టర్ యాముల మనోహర్ దగ్గర ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మనోహర్ మాట్లాడుతూ మార్షల్ విద్యతో ఆరోగ్యం, ఆత్మరక్షణ సాధ్యమవుతుందన్నారు. మారుతున్న ఈ రోజుల్లో పిల్లలు సామాజిక మాధ్యమాలపై అత్యంత మక్కువ చూపుతూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మార్షల్ ఆర్ట్స్ విద్యను నేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

24న సెయింట్ థెరిస్సా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థుల సమ్మేళన వివరాలను ఆహ్వాన కమిటీ మెంబర్ ఆనంద్‌రాజ్ సోమవారం వెల్లడించారు. 1974లో ఒకటో తరగతిలో విద్యాభ్యాసం మొదలుపెట్టడం, 1984లో పదో తరగతి పూర్తి చేయడం జరిగిందని, ఆ బ్యాచ్ నుంచి గత 40 ఏళ్లుగా ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులను గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఈ నెల 24న శనివారం ఫిలింనగర్ క్లబ్ హౌస్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ వేడుకలు కొనసాగుతాయయని చెప్పారు.

వినాయకరావునగర్ బస్తీ యూత్ ప్రెసిడెంట్‌గా లఖన్ నాయక్

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ డివిజన్ వినాయకరావునగర్‌లో బస్తీ యూత్ కమిటీ ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షునిగా లఖన్ నాయక్, ఉపాధ్యక్షుడిగా గంధం రాకేష్, జనరల్ సెక్రటరీగా సంతోష్‌కుమార్, ట్రెజరర్‌గా నరేష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ యువకులు సామాజిక సేవలో ముందుండాలని సూచించారు. వినాయకరావునగర్ బస్తీ అభివృద్ధిలో తాను ముందుంటానని హామీ ఇచ్చారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, కాసుల మహేష్‌గౌడ్, వినాయకరావు నగర్ బస్తీ అధ్యక్షుడు ఆనంద్ నాయకులు బండారి కుమార్, రామకృష్ణ, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న బాబా ఫసియుద్దీన్

రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలి

ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

రాయదుర్గం: రిజర్వేషన్ లేకుండా లాటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ రాజ్యాంగ హక్కుల ఉల్లంఘననేనని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆయన మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 45 ఉద్యోగాల కోసం జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ స్థాయిలో నేరుగా లాటరల్ ఎంట్రీ ద్వారా నియమించడాన్ని తీవ్రంగా ఏఐఓబీసీఎస్ఏ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ నియామకాలలో రిజర్వేషన్ నిబంధనలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఈ 45 పోస్టులలో దళితులు, ఓబీసీలు, ఆదివాసి వర్గాల నుంచి ఎంపిక చేసేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం దీన్ని పరిశీలించి, లేటరల్ ఎంట్రీ నియామకాల్లో రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి

సనత్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను సోమవారం సనత్‌నగర్ తులసీనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. స్థానిక బస్తీ సంక్షేమ సంఘం నేతలు శంకర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంకయ్యగౌడ్, బోనాల శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ధనుంజయ్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, మల్లయ్యగౌడ్, రాముచారి, విజయ్‌సింగ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, అంజయ్యగౌడ్, సాయిరామ్‌గౌడ్, టిల్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం

సనత్‌నగర్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేసే కుట్రలను నిరసిస్తూ సోమవారం బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ స్వామి టాకీస్ వద్ద నుంచి మమతాబెనర్జీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా మమతాబెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడకుండా ఆధారాలను లేకుండా చేసే కుట్రను చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మోహన్, వెంకట సుబ్బారావు, మల్లారెడ్డి, అమ్ము రాంప్రసాద్, ఆనంద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మమ్మురంగా సంపుల నిర్మాణం

- ఒక్కో సంపు నిర్మాణానికి రూ.కోటికిపైగా నిధులు
- వరద నీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు
- సంపులు పూర్తయితే వరదనీటిని తోడి నాలాల్లోకి మళ్లింపు

బంజారాహిల్స్: వర్షాకాలంలో పలుచోట్ల వరద నీరు నిలిచిపోతూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటమే కాకుండా రోడ్లు పూర్తిగా దెబ్బతింటుండటంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భారీ సంపు నిర్మించి ఎప్పటికప్పుడు నీళ్లను తోడి సమీపంలోని నాలాల్లోకి మళ్ళించే ఈ బృహత్తర కార్యక్రమం ఇటీవలనే చేపట్టారు. పురపాలక శాఖ కార్యదర్శి దాన కిషోర్ నాలుగు రోజుల క్రితం నిర్మాణంలో ఉన్న ఈ సంపులను పరిశీలించారు. అంతకుముందు ఈ ప్రణాళికలను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్ రోస్ రూపొందించారు. వరదనీరు పేరుకుపోతున్న ప్రాంతాల్లో సమస్య పరిష్కారం కోసం సంపుల నిర్మాణం ఒక్కటే సాధ్యమని భావించిన అధికారులు ఆ మేరకు ఒక్కో సంపు నిర్మాణానికి రూ.1 కోటికిపైగా నిధులు విడుదల చేసి నిర్మాణాలను చేపట్టారు. జీహెచ్ఎంసీ సర్కిల్–17 పరిధిలో నాలుగు చోట్ల ఈ సంపుల నిర్మాణం జరుగుతున్నది. పంజగుట్ట కేసీపీ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్డుతో పాటు గుర్తించిన ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోనే వర్షం వచ్చినప్పుడు నడుముల్లోతు నీళ్లు నిలిచిపోతూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వీటి నిర్మాణానికి తెరతీశారు.


పంజగుట్ట కేసీపీ జంక్షన్‌లో సంపు


రాజ్ భవన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న సంప్

అడుగడుగునా ఆటంకాలు...

సంపుల నిర్మాణం జీహెచ్ఎంసీకి సవాల్‌గా మారింది.నిర్మాణ ప్రాంతాల్లో అడుగడుగునా సీవరేజీ వాటర్‌పైప్‌లైన్లు, కేబుల్ లైన్లు, కరెంటు బంచ్‌లు అడ్డంకిగా మారుతున్నాయి. వీటిని తొలగించడం, తాత్కాలికంగా షిఫ్ట్ చేసే క్రమంలో పనుల్లో కాస్త జాప్యం జరుగుతున్నది. ఇంకో వైపు తవ్వుతున్నప్పుడు నీటి ఊట మరో సమస్యగా మారింది. ఈ సంపుల నిర్మాణం హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో ఉండటంతో తవ్వకాల్లో నీళ్ళు భారీగా వస్తుండటంతో నిర్మాణ పనులు కొంత వరకు ఆలస్యంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

హజ్ యాత్రకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ షురూ

సాక్షి సిటీబ్యూరో: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా హజ్ యాత్రికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మౌలానా సయ్యద్ గూలామ్ అఫ్జల్‌బియబానీ ఖుస్రోపాషా పేర్కొన్నారు. సోమవారం నాంపల్లి హజ్ హౌస్ హజ్ కమిటీ కార్యాలయంలో 2025 హజ్ యాత్ర దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారుడు మహ్మద్ అలీ షబ్బీర్‌తో కలిసి ఆన్‌లైన్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ ఏడాది నుంచి కేంద్ర హజ్ కమిటీ.. యాత్రకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం దరఖాస్తు స్వీకరణతో పాటు అన్ని ప్రక్రియలను ఆన్‌లైన్ హజ్ సువిధ యాప్ ద్వారా ప్రారంభించిందన్నారు. వచ్చే నెల 15 వరకు దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్ పద్ధతిలో ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని డ్రా పద్ధతిలో యాత్రకు ఎంపిక చేస్తారన్నారు. ఈ ఏడాది నుంచి దరఖాస్తులు ఉచితంగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అనుమానాలను 040 23298793 నెంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారీ లియాకత్ హుస్సైన్ పాల్గొన్నారు.

ఏఈ సస్పెన్షన్.. మాతృశాఖకు సరెండర్

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ 20లోని ఏఈ ఆర్ రమేష్‌ను సస్పెండ్ చేయడంతోపాటు పేరెంట్ డిపార్ట్‌మెంట్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల మొదటి వారంలో ఇంజినీర్ల మధ్య చోటు చేసుకున్న ఘటనపై విచారణ చేసిన తర్వాత ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి సూపరింటెండెంట్ ఇంజినీర్ శంకర్‌తో వాగ్వాదం చేసుకోవడం ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నట్లుగా అప్పట్లో వినిపించిన విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ జరిపి ఈ చర్యలు తీసుకున్నారు. డిప్యూటేషన్‌పై టీజీహెచ్‌సీఎల్ నుంచి వచ్చిన ఆయనకు తిరిగి మాతృసంస్థకు సరెండర్ చేస్తున్నట్లు కూడా ఆర్డర్‌లో పేర్కొన్నారు.

ఆర్థిక వృద్ధికి విద్య కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ అభిరూప్ ముఖోపాధ్యాయ, హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: మానవ సామర్థ్యాలు, ఉత్పాదకత, ఆర్థికవృద్ధిని పెంపొందించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని న్యూఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ప్లానింగ్ యూనిట్ సీనియర్ ప్రొఫెసర్ అభిరూప్ ముఖోపాధ్యాయ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మానవ మూలధనంలో కొత్త నైపుణ్యాల భావన అవసరమని, నైపుణ్యాలను అందించడానికి వినూత్న పద్ధతులను పరిచయం చేసిందన్నారు. ఉన్నత విద్య నాణ్యత, నైపుణ్యాలకు సంబంధించిన విమర్శలన్నీ ఆర్థికాభివృద్ధికి సానుకూలంగానే ఉన్నా కొంత ప్రభావం చూపుతాయన్నారు. హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి




ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కూడిన ప్రతినిధి బృందంతో ఆర్.కృష్ణయ్య సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెంచాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు అనంతుల రామూర్తి, రాజేందర్, బలరామ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ వైద్యం.. ఓ ధైర్యం

- మారుతున్న నిమ్స్ రూపురేఖలు
- పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా చర్యలు
- ఇప్పటికే 500 పడకలు, రూ.70 కోట్లతో అధునాతన పరికరాలు
- మరో 2 వేల పడకలకు రూ.1,600 కోట్లతో దశాబ్ది బ్లాక్ నిర్మాణం



నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) రూపు రేఖలు మారుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రిలో పడకల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అత్యాధునిక పరికరాలను సమకూర్చుకుంటోంది. ఇప్పటికే అదనంగా 500 పడకలు ఏర్పాటు చేశారు. ఐసీయూ, డయాలసిస్ వార్డుల్లో కూడా పడకల సంఖ్యను పెంచారు. దాంతో పాటు రూ.70 కోట్లతో పెట్, ఎంఆర్‌ఐ, సీటీ, క్యాథ్ ల్యాబ్, షూట్ సిస్టం అందుబాటులోకి వచ్చింది. ఇటీవల ఎమర్జెన్సీ మెడిసిన్, క్లినికల్ హెమటాలజీ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీ, జీరియాట్రిక్ మెడిసిన్, స్టెమ్ సెల్ రీసెర్చ్ ఫెసిలిటీ (మూలకణ పరిశోధనల విభాగం) ఏర్పాటైంది.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా..

- వంద పడకల అత్యవసర వైద్య విభాగం కలిగిన నిమ్స్‌లో అప్పుడప్పుడూ పడకల కొరత ఎదురవుతూనే ఉంది. అందుకే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిమ్స్ విస్తరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన పనులు చకచకా జరుగుతున్నాయి.
- ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిర్మాణ పనులకు మహారాష్ట్ర బ్యాంకు రూ.1,600 కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ నిధులతో నిమ్స్‌కు ఎర్రమంజిల్ కాలనీలో కేటాయించిన 33 ఎకరాల విస్తీర్ణంలో మూడు బ్లాక్‌లు.. 2 వేల పడకల సామర్థ్యం కలిగిన బహుళ అంతస్తులతో దశాబ్ది బ్లాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో ఓపీ, ఐపీ, ఎమర్జెన్సీ సేవలకు ప్రత్యేకంగా బ్లాక్‌లు ఏర్పాటు చేయనున్నారు.

రోజుకు 3 వేల మంది ఓపీ..

- ప్రస్తుతం నిమ్స్‌లో రోజుకు 3 వేల మందికి పైగా ఓపీ తీసుకుంటున్నారు. సాధారణ ఓపీ రోగుల సంఖ్యను పరిశీలిస్తే.. గతేడాది 7,59,516 మంది, ఆరోగ్యశ్రీ ఓపీలో 3,13,212 మంది, ఈహెచ్‌ఎస్ ఓపీలో 76,064, ఆరోగ్యశ్రీ ఓపీ డేకేర్ డయాలసిస్, కీమోథెరపీలో 3,437 మంది, ఆరోగ్యశ్రీ ఓపీ డేర్ డయాలసిస్‌లో 70,108 మంది వైద్యసేవలు పొందారు.
- ఇన్‌పేషెంట్లుగా 60,571, ఐసీయూలో 4,016 మంది, ఆరోగ్యశ్రీ ద్వారా 22,526 మంది, ఈహెచ్‌ఎస్‌లో 4,807మంది చికిత్స పొందారు.
- ప్రస్తుతమున్న భవనంలో ఇంత మందికి సేవలు అందించడం కష్టసాధ్యంగా మారింది. అందుకే కొత్త భవనంలో ఓపీ సేవల కోసమే ప్రత్యేకంగా బ్లాక్ ఏర్పాటు చేయనున్నారు.
- భవిష్యత్తులో పెరుగనున్న రద్దీ, విస్తృతం కానున్న స్పెషాలిటీ సేవలను దృష్టిలో పెట్టుకొని 8 అంతస్తుల్లో ఓపీ బ్లాక్ నిర్మించనున్నారు.
- ఎమర్జెన్సీ సేవల కోసం ప్రత్యేకంగా మరో 8 అంతస్తులతో బ్లాక్ నిర్మిస్తున్నారు. ఇన్‌పేషంట్ల కోసం 13 అంతస్తులతో మరో బ్లాక్ ఏర్పాటు చేయనున్నారు.

కేన్సర్ బాధితుల కోసం రూ.4 కోట్ల బడ్జెట్

- తమకు కేటాయించిన స్థలంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దేవాలయానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు.
- ఇప్పటికే ఆయా భవన నిర్మాణాలకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన స్థలాన్ని కేటాయించాలని, ప్రస్తుతం ఆ స్థలాన్ని చదును చేస్తున్నామని తెలిపారు.
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేన్సర్ రోగులకు బడ్జెట్‌ను రూ.4 కోట్లకు పెంచామన్నారు. గతంలో రూ.2 నుంచి 3 కోట్ల మేర ఉండే బడ్జెట్‌ను పెంచి క్యాన్సర్ రోగులందరికీ ఉచిత మందుల సరఫరా కొనసాగిస్తామన్నారు.
- దాతల సహకారంతో రూ.1.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన లంగ్స్ ట్రీట్‌మెంట్ యూనిట్‌ని త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. అంతే కాకుండా రూ. 9 కోట్లతో డీఎస్‌ఏ సిమ్యులేటర్ ల్యాబ్ కూడా సమకూర్చుకోనున్నామని డైరెక్టర్ వివరించారు.



నిర్మాణ దశలో ఉన్న దశాబ్ది బ్లాక్

ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి కృషి

లక్డీకాపూల్ : కజకిస్తాన్, తెలంగాణ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను బలోపేతానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ తెలిపారు. సోమవారం ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక సమావేశం నిర్వహించారు. మహేశ్వరంలోని బీటీఆర్ గ్రీన్స్ - మ్యాక్ ప్రాజెక్ట్ లో కజకిస్తాన్‌లోని అస్తానా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ బోర్డ్ చైర్మన్ యూసుఫ్ అల్జాదర్‌తో ఈ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో యూసుఫ్ అల్జొదర్ అస్తానా అంతర్జాతీయ విమానాశ్రయం, వివిధ దేశాలలో 12 విమానాశ్రయాలను నిర్వహిస్తున్న టెర్మినల్ హోల్డింగ్స్ యూఏఈ కార్యకలాపాలపై సంక్షిప్తంగా వివరించారు. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రదీప్ పనికర్, ఏరో, కార్గో, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ఆశిష్ కుమార్ దేశ, విదేశాలలో తమ కార్యకలాపాలను వివరించారు.అనంతరం యూసుఫ్ అల్జొదర్ గౌరవార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ విందు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ ఓవెన్, హైదరాబాద్‌లోని యూఏఈ కాన్సుల్ జనరల్ ఆరెఫ్ అల్నువై, మధ్య ఆసియా ఐక్యరాజ్యసమితి మాజీ డైరెక్టర్ మొయిన్ కరీం, కెనడా ట్రేడ్ కమిషనర్, హైదరాబాద్‌లోని కెనడా హైకమిషన్ విక్రమ్ జైన్, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆశిష్ కుమార్, జైబర్ 365 వ్యవస్థాపకుడు, సీఈవో భారతదేశపు అతి పిన్న వయస్కుడైన బిలియనర్ పెరల్ కపూర్ హాజరయ్యారు.

బెంగాలీల నిరసన ర్యాలీ



చార్మినార్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ పాతబస్తీలో బెంగాలీలు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ కు చెందిన దాదాపు 14 బెంగాలీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని బాధ్యులైన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చేతుల్లో క్యాండిల్స్ పట్టుకుని చేలాపురా నుంచి చార్మినార్ వరకు కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. చేలాపురా, హైకోర్టు రోడ్డు, మదీనా సర్కిల్, పత్తర్ గట్టి, గుల్జార్ హౌస్, చార్ కమాన్ ద్వారా చార్మినార్‌కు చేరుకొని తిరిగి అక్కడ నుంచి చేలాపురా వరకు ఈ కొవ్వొత్తుల నిరసన ర్యాలీ కొనసాగింది.

నగరంలో నేడు..

- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ)ను సందర్శించనున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమార గురుబారన్. జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తున్న శ్మశాన వాటికలు, అర్బన్ క్లీనింగ్ నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించనున్న కమిషనర్
- హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ(హెచ్‌ఆర్‌ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే హైదరాబాద్ మారథాన్ 13వ ఎడిషన్‌పై బంజారాహిల్స్ హయత్ ప్లేస్ హోటల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం
- ది కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయి తెలంగాణ) కొండాపూర్‌లోని హెచ్‌ఐసీసీ నవోటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన స్టేట్‌కాన్-2024ను ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక తత్వవేత్త నారాయణగురు జయంతి సందర్భంగా 'నారాయణ గురు' పుస్తకావిష్కరణ

రాకపోకలు నరకప్రాయం..!



బసవతారకనగర్‌లో వరదకు కొట్టుకువచ్చిన మట్టి, రాళ్లు

ఫిలింనగర్‌లో వరద బీభత్సం ... రాకపోకలకు తీవ్ర అంతరాయం

ఫిలింనగర్: వరద బీభత్సంతో ఫిలింనగర్‌లోని బస్తీలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా ఫిలింనగర్‌లో బండారు బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్, అంబేడ్కర్, బీజేఆర్‌నగర్, మహాత్మాగాంధీనగర్, వినాయకనగర్ బస్తీల్లో వరద ధాటికి రోడ్లు కొట్టుకుపోవడంతో స్థానికులు నరకాన్ని చవిచూశారు. బండారు బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్ బస్తీల్లో వరదకు మట్టి, రాళ్లు, వ్యర్థాలు కొట్టుకురావడంతో రోడ్లలో నడవడానికి కూడా వీల్లేని పరిస్థితులు తలెత్తాయి. అసలే రోడ్లు గుంతలమయమై ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ వరద తెచ్చిన తంటా మరో సమస్యగా మారింది. రోడ్లు వేయాలని స్థానికులు గత కొన్ని నెలలుగా మొరపెట్టుకుంటున్నా అధికారులు పెడచెవిన పెడుతుండడంతో ఈ సమస్య తలెత్తింది. వీధులన్నీ వ్యర్థాలు, మట్టితో నిండిపోవడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.





బాల్‌రెడ్డినగర్ బస్తీలో..

ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

– గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

లక్డీకాపూల్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి కమిషనర్ ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా అధికారులు దృష్టి సారించాలన్నారు. జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 25 ఫిర్యాదులు రాగా టెలిఫోన్ ద్వారా 4 వచ్చాయి. టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ 6, అడ్మిన్ 2, ఎల్ డబ్ల్యూ ఎస్ 2, లేక్స్ 2, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 2 వినతిపత్రాలు వచ్చాయన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 30 ఫిర్యాదులు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 12, సికింద్రాబాద్ జోన్ లో 10, ఎల్బీనగర్ జోన్ లో 4, చార్మినార్ జోన్ లో 2, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్ లలో ఒక్కటి చొప్పున విజ్ఞప్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సత్యనారాయణ, యాదగిరి రావు నళిని పద్మావతి సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఆయా విభాగాల వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, చీఫ్ ఎంటమాలజి డాకర్ట్ రాంబాబు, యస్ ఈ హౌసింగ్ జాయింట్ కమిషనర్ ఎస్.బి.ఎం కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కూడా పెద్దలను గౌరవించడం అలవాటు అని గుర్తు చేశారు. శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయని భావించాము కానీ రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలైనా సమస్యలు తీరకపోగా కనీసం సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కూడా లేకుండా పోయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మార్పు మొదలైందన్నారు. సాఫ్ట్‌వేర్‌ను అడ్డం పెట్టుకొని ఒక కుటుంబం భూములను సంపాదించుకోవడంతో పాటు రాష్ట్రంలో భూ రికార్డులను ధ్వంసం చేశారని ఆరోపించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రెవెన్యూ వ్యవస్థను సైతం ధ్వంసం చేశారని మండిపడ్డారు. తెలంగాణలో అస్తవ్యస్తమైన రెవెన్యూ వ్యవస్థను గాడిన పెట్టాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, భూమి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవనార్ పాఠశాలలో రక్షా బంధన్ వేడుకలు



సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలలో జరిగిన రాఖీ వేడుకల్లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులతో పాటు అక్కడి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ విశిష్టతను ఆయన అక్కడి చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయిబాబాగౌడ్, కరెస్పాండెంట్ జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

- పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు
- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ఆర్థిక సాయం
- ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ వరకు ఏడాదికి రూ. 12 వేలు అందజేత
- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులే అర్హులు
- వచ్చే నెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణ



ఎంపికైతే ఏడాదికి రూ. 12 వేలు

సాక్షి, సిటీబ్యూరో: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. జాతీయ ప్రతిభ ఉపకార వేతనం పరీక్షను నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్, (గురుకులాలు కానివి) స్థానిక సంస్థల పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇందుకు అర్హులు. డైరెక్టర్ గవర్నమెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో పేద కుటుంబాల విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేస్తుంటారు. చదువుపై ఆసక్తి ఉన్నా.. ప్రోత్సాహం లేక డ్రాపవుట్లుగా మిగిలి పోతున్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసి వారిని ఉన్నత చదువుల వైపు మళ్లించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఏటా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులుగా నిర్ణయించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 375 ప్రాథమిక, 22 ప్రాథమికోన్నత, 108 ఉన్నత, 10 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 14 వేలకు పైగా ఉండగా, వారిని ఆయా పాఠశాలల ప్రధానోధ్యాయులు అవగాహన కల్పించి పరీక్ష రాసేలా ప్రోత్సహించాల్సి ఉంది.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయొచ్చు. ఇందులో అర్హత సాధించిన వారికి నెలకు రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ. 12 వేలు వారి వ్యక్తిగత ఖాతాలో జమవుతాయి. వీటిని 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్లో కూడా అందజేస్తారు.

పరీక్ష విధానం ఇలా...

రాత పరీక్ష ద్వారా ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో రెండు పేపర్లు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్టు, స్కాలాస్టిక్ టెస్టు ఉంటోంది. ఏడు, ఎనిమిది తరగతుల స్థాయి గణితం, సామాన్య. సాంఘిక శాస్త్రాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో పేపరుకు 90 ప్రశ్నలు, 90 మార్కులు 90 నిమిషాల సమయం ఉంటోంది.

దరఖాస్తు ఇలా చేయాలి...

ఏడో తరగతి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలు మించరాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, విద్యార్థులు అర్హులే. కులం, ఆదాయం ధ్రువపత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్, ఏడో తగరతి ఉత్తీర్ణులైనట్లు మెమో, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలతో రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ బోర్డు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీటి ప్రతుల్ని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి అందజేయాలి. బీసీ, ఓసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ. 50 పరీక్ష రుసుం చెల్లించాలి. వీటిని సంబంధిత ప్రధానోధ్యాయులు చలాన్ ద్వారా బ్యాంకులో కట్టాలి. దరఖాస్తులను సెప్టెంబర్ 11 వరకు అందజేయాల్సి ఉంటోంది.

ప్రత్యంగిరా దేవికి ప్రత్యేక అలంకరణ



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం అమ్మవారికి లక్ష గాజుల పూజ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లతో పాటు దేవాలయ ప్రాంగణాన్ని గాజులతో అలంకరించారు. ఎన్‌ఆర్‌ఐ భక్తులు తరుణ్ గాయత్రి అభినిక దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు, పుస్తెలతాడు సమర్పించారు. అనంతరం దేవాలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విటల్ శర్మ, హేమంత్, అరుణ, హేమ, సాయి కుమార్ పాల్గొన్నారు.





'మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్'

అక్టోబర్‌లో ప్రతిష్టాత్మక బ్యూటీ పేజెంట్ ఆడిషన్స్ ప్రారంభం

పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకురాలు కిరణ్మయి

సాక్షి, సిటీబ్యూరో: అందమైన వేడుకకు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. మగువలకు ఈ వేడుక 'స్ట్రాంగ్'మెసేజ్ ఇవ్వనుంది. మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ 2024– సీజన్ 1 జరగనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి నిర్వహించనున్న ఈ బ్యూటీ పేజెంట్ ఆడిషన్స్ అక్టోబర్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ కర్టెన్ రైజర్‌ను వ్యవస్థాపక నిర్వాహకులు కిరణ్మయి అలివేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔత్సాహిక వనితల నిత్యజీవితంలోని ఆలోచనలు, ఆశయాలకు పెళ్లి ముగింపు కాదు, మరో అద్భుత ఆరంభమని అన్నారు. మగువల సౌందర్యాన్ని మరింత గ్రాండ్‌గా ప్రదర్శించడానికి ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆడిషన్స్‌లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు www.sbtribe.org లేదా https://sbtribe.org/ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోడల్స్, యువతులతోపాటు ఔత్సాహిక వివాహితలతో నిర్వహించిన ఫ్యాషన్ వాక్ విశేషంగా అలరించింది.

డెలీషియస్ గోల్డ్ ఐస్‌క్రీం!



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంటేనే వైవిధ్యానికి ఆలవాలం. ఆహార్యంతోపాటు ఆహారంలోనూ విభిన్నతకు అది వేదిక. రకరకాల రుచులకు అడ్డా. ఫుడ్ లవర్స్‌కు స్వర్గధామం. ఇక్కడ హైదరాబాదీ బిర్యానీయే కాదు.. దక్షిణ, ఉత్తర భారత సంప్రదాయ వంటకాలు, వెస్టర్న్ ఫుడ్, చైనీస్, జపనీస్.. ఇలా ఎన్నో దేశాల ఫుడ్ ఇక్కడ దొరుకుతుంది. అలా వారాంతంలో కాస్త డిఫరెంట్ ఫుడ్ తినాలనుకోవాలే కానీ.. దానికి కొదువే ఉండదు. అట్లుంటది మన హైదరాబాద్‌తోని. ఇదంతా ఎందుకు చెప్తున్నామంటే... బంగారం ఏమైనా తింటామా.. ఏంటి? అని ఎవరైనా మాట వరుసకు అనేవారు ఒకప్పుడు. కానీ, ఇప్పుడు బంగారాన్ని కూడా తినేస్తున్నారండోయ్. గోల్డ్ దోశ, గోల్డ్ ఇడ్లీ, గోల్డెన్ స్వీట్స్.. ఇలా బంగారపు పూత ఉన్న ఫుడ్ ఐటెమ్స్‌ను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఈ వరుసలోకి ఐస్‌క్రీం కూడా వచ్చి చేరింది. హైదరాబాద్‌లో కూడా గోల్డ్ ఐస్‌క్రీం కూడా దొరుకుతోందా అని ఆశ్చర్యపోకండి. ఎందుకంటే మన నగరంలో అచ్చు 24 క్యారెట్ల గోల్డ్ ఐస్‌క్రీం లభిస్తోంది. అదెక్కడ అంటారా? మాదాపూర్‌లోని హూబర్, హోలీలో ఈ ఐస్‌క్రీంను అందుబాటులోకి తీసుకొచ్చారు. మైటీ మిడాస్ పేరుతో ఈ ఐస్‌క్రీంను అమ్ముతున్నారు. ఖరీదు జస్ట్.. రూ.1,179. సాధారణ కోన్‌లో డిఫరెంట్ ఫ్లేవర్స్‌లో సర్వ్ చేస్తుంటారు. ఐస్‌క్రీం పైన 24 క్యారెట్ల గోల్డ్ పేపర్‌తో అందంగా ముస్తాబు చేసి మనకు అందజేస్తారు. ఇంకేముంది.. ఇక మోస్ట్ డెలీషియస్ ఐస్‌క్రీంను ఆరగించేయడమే.



వర్క్‌లెస్.. మోర్ ఫిట్..

మార్కెట్‌లోకి ఎలక్ట్రికల్ మజిల్ స్టిమ్యులేటర్

ఉరుకులు, పరుగుల నగరజీవితంలో శరీరానికి శ్రమలేకుండా పోతోంది. దీంతో శరీరంలో భారీగా కొవ్వులు పేరుకుపోతున్నాయి. వీటిని కరిగించేందుకు రకరకాల ఉత్పత్తులూ మార్కెట్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ఓ వైపు సహజసిద్ధమైన వ్యాయామ పరికరాలు, రకరకాల ఫుడ్ అండ్ డైట్ ప్లాన్స్, న్యూట్రిషన్ సెంటర్లు, ఫిట్‌నెస్ సెంటర్‌లూ వెలసినా.. వాటిని అనుసరించడానికి తీరిక, ఆర్థిక స్థోమత లేక పక్కన పెట్టేస్తున్నారు. అలాంటి వారి కోసమే మార్కెట్‌లోకి ఎలక్ట్రికల్ మజిల్ స్టిమ్యులేటర్స్ వస్తున్నాయి.. వీటిని షార్ట్ కట్‌లో ఏఎంఎస్ అంటారు. వీటిని నగరంలోని అనేక జిమ్‌లు ప్రవేశపెట్టాయి. ఇంతకీ ఏఎంఎస్ అంటే ఏమిటి? ఇది నిజంగా శారీరక దృఢత్వాన్ని మెరుగుపరుస్తుందా? ఇది సురక్షితమేనా? దీని ద్వారా తక్కువ శ్రమతో కండలు తిరిగిన శరీరాన్ని పొందగలదా? మరి ఆ వివరాలేంటో తెలుసుకుందాం పదండి..

– సాక్షి, సిటీబ్యూరో

తక్కువ శ్రమతో ఎక్కువ పనితనం

అనేక చికిత్సలకూ ఉపయుక్తం

శిక్షకుడి పర్యవేక్షణ తప్పనిసరి

ఇది సైన్స్ – ఆధారిత వ్యాయామ పద్ధతి. సాధారణంగా పట్టించుకోని కండరాలను సైతం ఉత్తేజపరిచేందుకు తక్కువ–ఫ్రీక్వెన్సీ ఎలక్ట్రికల్ ఇంపల్స్‌ని ఉపయోగించడం ద్వారా పూర్తి స్థాయి శిక్షణా సెషన్‌కు ఇది సమానమైంది. స్ట్రోక్ నుంచి కోలుకుంటున్న వారు మల్టీపుల్ స్క్లెరోసిస్ ఉన్నవారు వారి చలనశీలతను తిరిగి పొందేందుకు అనేక రకాల వైద్యపరమైన రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు సహాయం చేయడానికి వైద్యులు చాలా కాలంగా దీనిని ఉపయోగిస్తున్నారు. అదే కొద్దిపాటి మార్పు చేర్పులతో ప్రస్తుతం జిమ్స్‌లో చేరింది.

పర్యవేక్షణ తప్పనిసరి..

వినియోగదారులు ఓ మెషీన్‌కు అనుసంధానించిన పూర్తి ఎలక్ట్రోడ్‌లను తప్పనిసరిగా ధరించాలి. ఆ మెషీన్ విద్యుత్ తరంగాలను వైర్లు ,ఎలక్ట్రోడ్ల ద్వారా శరీరంలోని కండరాల్లోకి పంపుతుంది. దీని కోసం ప్రత్యేకమైన సూట్‌లు, పొట్టి చేతుల టాప్ షార్ట్‌లు అవసరం అవుతాయి. పూర్తిగా సమర్థత కలిగిన శిక్షకుడి పర్యవేక్షణలో మాత్రమే ఈ సెషన్స్ నిర్వహించాల్సి ఉంటుంది.

లాభాలూ.. జాగ్రత్తలూ...

గతంలో ఫిజియోథెరపిస్టుల వద్ద మాత్రమే ఉండే ఈ పరికరాలు ఇప్పుడు వ్యాయామ ప్రియులకు అందుబాటులోకి వచ్చాయి. ఇవి కండర ఉద్దీపనలో సహాయపడే అనేక పోర్టబుల్ పరికరాలు. వర్కవుట్ తర్వాత విశ్రాంతి తీసుకోవడానికి, వ్యాయామాల కోసం వేడెక్కడానికి లేదా గాయమైతే పునరావాస దశలో సహాయపడతాయి. ఈ పరికరాలను జాగ్రత్తగా ఉపయోగించడం అవసరం. వీటితో అదనపు కండరాల పునరుద్ధరణ లభిస్తుంది. కానీ, అధిక వినియోగం తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. ఆరంభంలో నిపుణుల సలహా తీసుకోవడం అవసరం.

హాలీవుడ్ సెలబ్రిటీలు సైతం..



ఇది కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి గొప్ప మార్గం. హెడీ క్లమ్, ఎలిజబెత్ హర్లీ మడోన్నా వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ టెక్నిక్‌ను ఉపయోగించారు. ఇది చెమట పట్టకుండా కండరాలను నిర్మించడానికి సులభమైన మార్గం.

– ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా

ఐరోపా నుంచే...



ఫిట్‌నెస్ మార్కెట్‌లో ఎలక్ట్రో కండరాల ప్రేరణ అనే తాజా సాంకేతికత ఐరోపాలో బాగా ప్రాచుర్యం పొందింది. కండరాల సంకోచాలను ప్రేరేపించడానికి వివిధ రకాల విద్యుత్ ప్రవాహాలను ఇది ఉపయోగిస్తుంది. దీని ద్వారా శరీరం అంతటా రక్త ప్రసరణ పెరుగుతుంది, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి.

–సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ రామోనా బ్రాగంజా

20 నిమిషాల సూట్.. = 90 నిమిషాల వర్కవుట్

"ఫిట్‌నెస్ పరిశ్రమలో ఇదో ఉత్తేజకరమైన మార్పు. దీని సూట్లు ఫిట్‌నెస్ ఔత్సాహికుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ సూట్‌లో 20 నిమిషాల పాటు వర్కవుట్ 90 నిమిషాల సాంప్రదాయ వర్కవుట్‌కి సమానం. ఈ ఏఎమ్ఎస్ సూట్‌లు సెకనుకు 85 కండరాల సంకోచాలను ఉత్పత్తి చేస్తాయి. ప్రధాన కండరాల సమూహాల ద్వారా 98% కంటే ఎక్కువ కండరాలను కదిలేలా చేస్తాయి. కండరాల సడలింపు, పునరుద్ధరణ, చలనశీలతను పెంచడం, స్థిరత్వాన్ని మెరుగుపరచడం, బిగించడం, టోనింగ్ చేయడం, శక్తి స్థాయిలు, రక్త ప్రసరణను పెంచడంలో సహాయపడుతుంది. ఫిట్‌నెస్‌కు మాత్రమే కాకుండా ఇది ఆస్టియో ఆర్థరైటిస్, ఫైబ్రోమైయాల్జియా, స్నాయువు, నడుము నొప్పి, దీర్ఘకాలిక కటి నొప్పి, మధుమేహం సంబంధిత నరాల వ్యాధి, పరిధీయ ధమని వ్యాధి వంటి అనేక సమస్యల చికిత్సలో ఉపయోగించబడుతుంది.

– ఫిట్‌నెస్ నిపుణులు మీనాక్షి మొహంతి

హాయ్.. హ్యాండ్‌లూమ్!

చేనేతల కోసం చేతులు కలిపారు



'హ్యాండ్‌లూమ్ సోయిరీ' సంస్థ ఏర్పాటుకు శ్రీకారం

ఈవెంట్లు, ఫ్యాషన్ షోలతో నిధుల సేకరణ

వృత్తిదారులకు సహకారం అందించేలా ప్రణాళిక

జీవితాన్ని కాచివడబోసి మరెందరి జీవితాలనో తీర్చిదిద్దుతున్న లైఫ్ కోచ్ ఒకరు.. పల్లెటూరు నుంచి వచ్చినా ప్రముఖులకు సైతం డ్రెస్సింగ్ నేర్పుతున్న సెలబ్రిటీ డిజైనర్ మరొకరు... జెండర్ మార్చుకున్న వండర్ ఉమెన్ ఒకరైతే... ఆర్గానిక్ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారు మరొకరు... క్యాట్‌వాక్ చేసేవారిని మోడల్స్ అంటారు. కానీ, క్వీన్ వాక్ చేసేవారిని విజేతలు అంటారు.. చేనేత కళాకారుల కలల సాకారం కోసం ఇలా కాంతలంతా... విజయ కాంతులై కళకళలాడారు.. వీరి విజయాలెంత ఉన్నతమైనవో.. వీరి నడక వెనుక చేనేతలకు చేయూతనివ్వాలనే లక్ష్యం అంతే సమున్నతమైనది. 'హ్యాండ్‌లూమ్ సోయిరీ' ఈవెంట్ నగర శివార్లలోని కోకాపేట్‌లో ఉన్న కేసీయార్ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకుల తరఫున శాంతికృష్ణ తదితరులు 'సాక్షి'తో తమ ఆలోచనలను పంచుకున్నారు. అవి వారి మాటల్లో... – సాక్షి, సిటీబ్యూరో

గతంలో దేశవ్యాప్తంగా ఉన్న ఒక శారీ లవర్స్ గ్రూప్‌లో మేం సభ్యులుగా ఉండేవాళ్లం. ఆన్‌లైన్ వేదికగా నడిచే ఆ సంస్థ ద్వారా వైవిధ్యభరితమైన చీరకట్టుతో పాటు ఆలోచనలు కూడా పంచుకునేవాళ్లం. ఆ క్రమంలోనే నగరానికి చెందిన కొందరం కలిసి, చేనేత, హస్త కళాకారుల పరిస్థితులపై చర్చించాం. వారికి ఏదో విధంగా అండగా ఉండాలని, దీన్ని ఒక సొసైటీగా మార్చాలని అనుకున్నాం. 16 మంది కమిటీ మెంబర్స్, ముగ్గురు అపెక్స్ మెంబర్స్‌తో హ్యాండ్లూమ్‌కి సాయం అందించే సొసైటీగా ఏర్పడాలని భావించాం. ఈ కార్యక్రమాలను ప్రకటించడం కోసమే ఈ ఈవెంట్ నిర్వహించాం.



తరచూ మెంబర్స్ మీట్స్, గెట్ టు గెదర్స్ నిర్వహించడం కూడా ఈ సొసైటీ కార్యక్రమాల్లో భాగమే. అందులో పాల్గొన్నవారు చేనేత చీరలు ధరించి ర్యాంప్ వాక్ చేయడంతో పాటు రోజంతా ఆటపాటలు, నృత్యాలతో సందడి చేస్తారు. ఇది విభిన్న వృత్తులు, వ్యాపకాల్లో బిజీబిజీగా గడిపే


చేనేత.. చేయూత..

ఈ సొసైటీలోని సభ్యులు అంతా తలా కొంతడబ్బు వేసుకోవడంతో పాటు విభిన్న రకాల ఈవెంట్ల నిర్వహణ ద్వారా నిధి సేకరించాలని నిర్ణయించుకున్నాం. ఆ నిధితో చేనేత హస్తకళాకారుల మరమగ్గాలు, ఇతర పరికరాల మరమ్మతుకు చేయూత అందించడం , స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కోర్సులు తయారు చేయించడం, కార్పొరేట్ కంపెనీల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)తో నిర్వహించే కార్యక్రమాలకు వీటిని అనుసంధానించడం, చేనేత కళాకారుల పిల్లలు ఎవరైనా తమ కళలో శిక్షణ పొందాలంటే స్కాలర్‌షిప్‌లు అందించడం వంటివి చేపట్టాలని నిర్ణయించుకున్నాం.

నిధి.. సేవకు పెన్నిధి..

మహిళలకు ఆటవిడుపుగా ఉండటంతోపాటు దీని ద్వారా సేకరించిన నిధులను ఓ మంచి సేవా కార్యక్రమానికి వినియోగించాలనేదే మా ఆలోచన.







కళ.. కళకళలాడాలనే...

మా జీవితాలతో చేనేత చీరలు, దుస్తులది విడదీయలేని అనుబంధం. ఆయా రంగాల్లో మేం ముందడుగు వేసే క్రమంలో అవి హుందాతనాన్ని అందిస్తూ, సంప్రదాయ వైభవాన్ని పెంచాయి. అలాంటి చేనేత కళ భావితరాలకు సైతం అందాలనే ఆలోచనతోనే ఈ సొసైటీకి రూపకల్పన చేశాం. ఈ ఫస్ట్ ఈవెంట్ సక్సెస్ అవడం మాకు సంతోషాన్ని ఇచ్చింది. ఇకపై కూడా వీలున్నన్ని ఈవెంట్స్ నిర్వహించి చేనేత కళాకారులకు చేయూత అందిస్తాం. మాతో చేతులు కలపాలని అనుకునేవారిని ఆహ్వానిస్తున్నాం.

– శాంతికృష్ణ, నిర్వాహకురాలు



పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని లేబుల్స్ పాప్–అప్ స్పేస్ వేదికగా కొలువుదీరిన 'డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన'ను ప్రముఖ సామాజికవేత్త బినా మెహతా ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతోపాటు పటోలా ఆర్ట్ చీరలు, డిజైనర్ వేర్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని ఆమె అన్నారు. వస్త్ర ఉత్పత్తులను ఫ్యాషన్‌ప్రియులకు నేరుగా అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ ఎక్స్‌పో నిర్వాహకులు భవిన్ మక్వానా మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు మంచి మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ లక్ష్యమని వివరించారు. ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 2 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కిలిమంజారో పర్వతం.. అధిరోహించిన ప్రీతం

లక్డీకాపూల్: నగరం నుంచి కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించిన అతి పిన్న వయస్కులలో ఒకరిగా ప్రీతం గోలీ చరిత్ర సృష్టించాడు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న 16 ఏళ్ల ఎన్‌సీసీ క్యాడెట్ సాహస యాత్ర చేపట్టారు. 8 రోజుల ఈ యాత్రలో శిఖరాన్ని గత నెల 17న చేరుకున్నారు. ప్రముఖ పర్వతారోహకుడు సత్య రూమ్ సిద్ధాంత మార్గదర్శకంలో నలుగురు బృందంతో కూడిన ప్రీతం గత నెల 12న యాత్ర చేపట్టాడు. మరింత ఎత్తైన శిఖరాలను అధిరోహించాలన్నదే తన తపన అని ప్రీతం అన్నారు. 'కిలిమంజారో నిటారుగా, కంకర, ఇసుకలతో కూడిన జారే నేల కావడంతో కష్టమనిపించింది. శిఖరాగ్రం చేరుకున్న తర్వాత గర్వంగా భారత జాతీయ జెండా, ఎన్‌సీసీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జెండాను ఎగరవేశా'అని అన్నారు.



35 మంది కళాకారులు.. 70 చిత్రాలు

– ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభమైన చిత్రప్రదర్శన




మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని తెలంగాణ టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో సోమవారం ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. మున్ముందు చిత్రకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. 35 మంది కళాకారులు వేసిన 70 పెయింటింగ్ చిత్రాలు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 25వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలికేరి, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, టూరిజం డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ ఎం.డి. ప్రకాశ్‌రెడ్డి, టూరిజం డైరెక్టర్ ఇలా త్రిపాఠి, భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అంధ బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్దే తీసుకోండి

అత్యాచారం కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అత్యాచారానికి గురై తీవ్ర భయభ్రాంతుల్లో ఉన్న అంధ బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్దే తీసుకోవాలని.. ఆ మేరకు ఏర్పాటు చేయాలని సోమవారం హైకోర్టు పోలీసులను ఆదేశించింది. హైదరాబాద్ మలక్‌పేట్‌లోని అంధ బాలికల వసతి గృహంలో ఓ బాలికపై బాత్‌రూమ్‌లు కడిగేందుకు వచ్చిన నరేశ్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. తీవ్ర రక్తస్రావంతో బాలిక అస్వస్థతకు గురైంది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గత నెల 16న పోక్సో చట్టం కింద మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో మేజిస్ట్రేట్ ముందుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని బాలికపై దర్యాప్తు అధికారి ఒత్తిడి తెస్తున్నారంటూ ఆమె తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీవ్ర భయభ్రాంతులకు గురైన బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్దే తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వసుధ నాగరాజ్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం బాలిక తల్లిదండ్రుల వద్ద ఉందని, భయంతో ఉన్న ఆమెను హైదరాబాద్‌కు తరలించే పరిస్థితి లేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బాలికకు ఇబ్బంది కలగకుండా వాంగ్మూలం ఇంటి వద్దే తీసుకునేలా జడ్జిని కోరాలని మలక్‌పేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ని ఆదేశించారు.

రహదారుల నిర్మాణం వేగవంతంగా సాగాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో జాతీయ రహదారులపై ఆర్ అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. పలు జాతీయ రహదారుల నిర్మాణ స్థితిగతులపై ఆరా తీశారు అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎన్‌హెచ్–65 ని ఆరులేన్లుగా విస్తరించే ప్రక్రియ వీలున్నంత త్వరగా చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను తయారు చేసేందుకు కన్సల్టెంట్ల నియామకానికి టెండర్లు పిలిచామన్నారు.

ఎమ్మెల్సీగా బొత్స ఎన్నికపై గెజిట్ నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: విశాఖ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. సీహెచ్ శ్రీనివాసరావుపై అనర్హతవేటు వేయడంతో ఖాళీ అయిన స్థానానికి జరిగిన ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) రాష్ట్ర కన్వీనర్‌గా గ్యార



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి జితన్ రాం మాంఝీ స్థాపించిన హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా జాగీర్దార్ గ్యార ప్రతాప్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, బిహార్ మంత్రి డాక్టర్ సంతోష్ సుమన్ మాంఝీ ఆదేశాలు జారీ చేశారు.

చదువు సంతోషంగా సాగాలి

విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

సాక్షి, హైదరాబాద్: విజ్ఞానం, వికాసం, చదువు, అభివృద్ధి అనేవి విద్యార్థుల్లో సంతోషంగా జరగాల్సిన ప్రక్రియలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ–హైదరాబాద్ క్యాంపస్‌లో సోమవారం నుంచి బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థల్లో అనుసరిస్తున్న 'పంచసూత్రాల'విధానం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికి మాత్రమే ప్రిపేర్ అయి ఉంటారని, ఇక నుంచి జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బోయపాటి రుద్రమదేవి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ఆర్భాటం.. ప్రచార కండూతీ!

గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైన కంపెనీలను శ్రీ సిటీలో మళ్లీ ప్రారంభించిన సీఎం చంద్రబాబు

జీఐఎస్‌లో ఒప్పందం చేసుకున్న బెల్ ఫ్లేవర్స్, జెన్ లెనిన్ కంపెనీల ఉత్పత్తి ప్రారంభం

- విశాఖ నుంచి శ్రీసిటీకి తరలించిన ఎల్జీ పాలిమర్స్ వాణిజ్య కార్యకలాపాలు షురూ
- ఎన్జీసీ ట్రాన్స్‌మిషన్, టీఐఎల్ హెల్త్‌కేర్ రెండో దశలకు గత ప్రభుత్వ హయాంలోనే విస్తరణ ఒప్పందాలు





విశాఖ జీఐఎస్ సదస్సులో జెన్ లెనిన్ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న గత ప్రభుత్వ మంత్రులు.. ఆ తర్వాత ఉత్పత్తి కూడా ప్రారంభమైన జెన్ లెనిన్ సంస్థకు ఇప్పుడు మళ్లీ ప్రారంభోత్సవం చేస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి/శ్రీసిటీ (వరదయ్యపాళెం): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైన కంపెనీలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తిరుపతి జిల్లా శ్రీ సిటీలో మళ్లీ లాంఛనంగా ప్రారంభించారు. రూ.1,570 కోట్ల విలువైన ఈ 16 కంపెనీల్లో ఇప్పటికే చాలా సంస్థలు వాణిజ్యపరంగా ఎప్పుడో ఉత్పత్తిని మొదలుపెట్టేశాయి. మరికొన్ని నిర్మాణాలను పూర్తి చేసే స్థితిలో ఉన్నాయి. అయినప్పటికీ తన హయాంలోనే ఈ కంపెనీలు వచ్చినట్టు.. వీటి ద్వారా 8,480 మందికి ఉపాధి కల్పించినట్లు చంద్రబాబు చెప్పుకోవడం గమనార్హం. ఈప్యాక్ డ్యూరబుల్స్, ఓజీ ఇండియా, ఎల్జీ పాలిమర్స్ వంటి కంపెనీలుఎప్పుడో వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించాయి. కానీ సీఎం చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 16 కంపెనీలను ఏర్పాటు చేసి ఉత్పత్తిని కూడా ప్రారంభించామంటూ చెప్పుకున్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం ఏ విధంగా పరుగులు తీసిందో.. విశాఖలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో కుదిరిన ఒప్పందాలు ఎంత తొందరగా వాస్తవ రూపంలోకి వచ్చాయో పరోక్షంగా ప్రజలకు చాటిచెప్పారు.

వాస్తవంలోకి జీఐఎస్ ఒప్పందాలు

2023లో విశాఖ వేదికగా జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్)లో గత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నెన్సెస్ ఇండియా లిమిటెడ్, జెన్ లినెన్, డైకిన్, ఏజీపీ సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలు ఇప్పుడు వాస్తవరూపంలోకి వచ్చినట్లు చంద్రబాబు శ్రీసిటీ వేదికగా ఒప్పుకున్నారు. ఇందులో ఏజీపీ గ్యాస్ రూ.10,000 కోట్లతో పెట్టుబడులు పెట్టడానికి గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం కుదుర్చుకుంది. అదే విధంగా డైకిన్ రూ.3,000 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ఒప్పందం చేసుకోవడమే కాకుండా ఇప్పటికే రూ.500 కోట్లతో తొలి దశను పూర్తి చేసింది. వాస్తవం ఇదయితే చంద్రబాబు మాత్రం ఆ సంస్థ ఇప్పుడు రూ.1,000 కోట్లతో విస్తరణకు కొత్తగా ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారానికి దిగారు. రూ.1,213 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి కొత్తగా చేసుకున్న ఒప్పందాలు, అదే విధంగా రూ.900 కోట్లకు సంబంధించి చేపట్టిన శంకుస్థాపన ప్రాజెక్టుల్లో అత్యధికం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వచ్చి ఉత్పత్తిని ప్రారంభించి విస్తరణ కార్యక్రమాలు చేపట్టినవే. ఎన్జీసీ ట్రాన్స్‌మిషన్స్, టీఐఎల్ హెల్త్‌కేర్, డైకిన్, ఎక్సలెంట్ ఫార్మా ఇవన్నీ గత ప్రభుత్వ హయాంలో వచ్చినవే.

గత ప్రభుత్వ ఘనతలు బాబు ఖాతాలోకే..

2020లో విశాఖలో ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ దుర్ఘటన జరగడంతో అప్పటి ప్రభుత్వం హుటాహుటిన స్పందించింది. జనావాసాల మధ్య ఉన్న కంపెనీని మూసివేయించి శ్రీసిటీలోని రెడ్‌జోన్ పరిధిలోకి తరలించింది. గత ప్రభుత్వం అన్ని అనుమతులు ఇవ్వడంతో ఎల్జీ పాలిమర్స్ వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకొని వాణిజ్యపరంగా ఉత్పత్తిని కూడా ప్రారంభించింది. అలాగే కోవిడ్ తర్వాత చైనా నుంచి దిగుమతులు తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) పథకం కింద శ్రీసిటీలో బ్లూస్టార్, డైకిన్, ఈప్యాక్, హావెల్స్, పానాసోనిక్ వంటి అనేక ఏసీ తయారీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. అనేక ఏసీ తయారీ కంపెనీలు రావడంతో వీటికి అనుబంధంగా విడిభాగాలు తయారు చేసే సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు రూ.10 కోట్లు, రూ.20 కోట్లతో ఏర్పాటయ్యాయి. వాటిని కూడా చంద్రబాబు తన ఖాతాలోనే వేసుకోవడం పట్ల పరిశ్రమల వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

గతేడాది శ్రీసిటీలో రూ.9 వేల కోట్లు పెట్టుబడులు..

శ్రీసిటీ యాజమాన్యం ఏటా శ్రీసిటీకి వచ్చే పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తోంది. ఈ క్రమంలో 2023లో రూ.9 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటించింది. తద్వారా 21,500 ఉద్యోగాల కల్పన జరుగుతుందని పేర్కొంది. ఈ పెట్టుబడుల ద్వారా 18 కొత్త పరిశ్రమల స్థాపన, 7 పరిశ్రమల విస్తరణ జరిగినట్లు తెలిపింది. గతేడాది మార్చి 5న విశాఖ పెట్టుబడుల సదస్సులో బ్లూస్టార్ ఏసీ పరిశ్రమను సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. నేడు అదే బ్లూస్టార్ పరిశ్రమకు సీఎం చంద్రబాబు భూమిపూజ చేపట్టడం గమనార్హం. అలాగే గతేడాది నవంబర్ 23న డైకిన్ ఏసీ పరిశ్రమ ప్రతినిధులు ఆ సంస్థ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించారు. అదే పరిశ్రమకు సీఎం చంద్రబాబు తాజాగా ఎంఓయూ కుదుర్చుకున్నారు. అలాగే 2023లోనే ఉత్పత్తులు ప్రారంభమైన ఎక్సలెంట్ ఫార్మా పరిశ్రమ విషయంలోనూ ఇలాగే చేశారు. గతేడాదే ఉత్పత్తులు ప్రారంభించిన ఎన్జీసీ, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్ పరిశ్రమలకు సైతం చంద్రబాబు భూమిపూజ చేయడం పట్ల పరిశ్రమ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే కోవలో ఈప్యాక్ డ్యురబుల్స్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నెన్సెస్, జేజీఎల్ మెటల్ కన్వర్టర్స్, ఈఎస్ఎస్‌కే కాంపొనెంట్స్, జెన్‌లెనిన్ ఇంటర్నేషనల్ పరిశ్రమలకు కూడా ప్రారంభోత్సవాలు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెలిగొండ ప్రాజెక్టుపై ఎందుకంత నిర్లక్ష్యం?

- కరువుతో అల్లాడే ప్రకాశం జిల్లాకు సాగు, తాగునీటిని అందించండి
- 'ఎక్స్' వేదికగా చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: కరవుతో అల్లాడే ప్రకాశం జిల్లాకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు ఫలాలను అందించడంపై చంద్రబాబు ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని 'ఎక్స్' వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో రెండు టన్నెళ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. కోవిడ్ మహమ్మారి సహా ఎదురైన ఎన్నో సాంకేతిక అవరోధాలను అధిగమించి జనవరి 2021లో టన్నెల్–1, జనవరి 2024లో టన్నెల్–2 నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి జాతికి అంకితం చేశామని వివరించారు. తద్వారా 2005లో ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించిన దివంగత మహానేత వైఎస్సార్ కలలను సాకారం చేశామన్నారు. ఇంకా నిర్వాసితులకు పునరావాసం (ఆర్ అండ్ ఆర్) కల్పనను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సీజన్‌లోనే ఆర్ అండ్ ఆర్‌కు కావాల్సిన సుమారు రూ. 1,200 కోట్లు చెల్లిస్తే.. ప్రాజెక్టులో వెంటనే నీరు నిల్వ చేయవచ్చునన్నారు. ఆర్ అండ్ ఆర్ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేశామని గుర్తుచేశారు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం వచ్చి 3 నెలలు అవుతున్నా నిర్వాసితులకు పునరావాసం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైఎస్ జగన్ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

అంచనాలు పెంచడంపైనే యావ..

గతంలోనూ, 2014–19 మధ్య కూడా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు వైఖరి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని వైఎస్ జగన్ విమర్శించారు. అమాంతంగా పనుల (సివిల్ వర్క్స్) అంచనాలు పెంచి కాంట్రాక్టులు ఇవ్వడం మీద చంద్రబాబుకు ఉన్న యావ.. నిర్వాసితులను ఆదుకోవడంలో ఎప్పుడూ కనిపించలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ వచ్చాకే నిర్వాసితులకు చెల్లింపులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు సుమారు రూ. 1,000 కోట్లు చెల్లించి, పునరావాసం కల్పించి.. పూర్తిస్థాయిలో 27 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని గుర్తుచేశారు. అలాగే చిత్రావతి ప్రాజెక్టుకు సంబంధించి కూడా ఆర్ అండ్ ఆర్ కింద రూ. 250 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించి పూర్తిస్థాయిలో 10 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. బ్రహ్మంసాగర్‌కు కూడా రూ. 60 కోట్ల ఖర్చుతో దయాఫ్రం వాల్ పూర్తి చేసి, శ్రీశైలం నుంచి తెలుగుగంగ కెనాల్ లైనింగ్ కూడా పూర్తి చేసి, 17వేల క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లగలిగామని.. తద్వారా బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల పూర్తి స్థాయి నీటిని నిల్వ చేయగలిగామని గుర్తు చేశారు. ఎప్పుడో పూర్తయిన పులిచింతల ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్‌ను కూడా చంద్రబాబు అప్పట్లో పట్టించుకోలేదని.. దాని కోసం కూడా రూ. 140 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఖర్చు చేసి పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు 45.77 టీఎంసీలను నిల్వ చేసి, కృష్ణా డెల్టా రైతులకు ప్రయోజనం చేకూర్చామని వివరించారు.

ఈ సీజన్‌లోనే నల్లమల సాగర్‌ను నింపండి..

కరువు నేలకు అందాల్సిన కృష్ణా వరద జలాలన్నీ కడలి పాలు అవుతున్నాయని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగొండ ఆర్ అండ్ ఆర్ అంశంపై దృష్టి పెట్టాలని.. వెంటనే నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని.. ఈ సీజన్‌లోనే వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌ను కృష్ణా జలాలతో నింపి ప్రకాశం జిల్లాకు సాగు, తాగునీటిని అందించాలని చంద్రబాబును వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

కుండపోత.. ఉక్కపోత!

▶ మొదటి పేజీ తరువాయి

వాతావరణ మార్పులే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతోనే ఒక్కసారిగా అతివృష్టి. లేకుంటే తీవ్ర అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొంటున్నారు. ప్రణాళికలు లేని పట్టణీకరణ, పరిమితులు లేని వనరుల వినియోగం, సహజ వనరుల విధ్వంసం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని, జీవన ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్

ప్రపంచంలోని పర్యావరణ నిపుణులు గొంతెత్తి చెబుతున్న ఒకేఒక్క మాట 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్'. సీజన్‌కు అనుగుణంగా ఉష్ణోగ్రతలు, వర్షాలు నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పుడు పర్యావరణంలో నెలకొన్న భారీ మార్పులతో ఎండ, వానలు గతి తప్పాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. సీజన్‌లో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రత, సాధారణ వర్షపాతం గణాంకాల్లో భారీ వ్యత్యాసం నమోదవుతూ వస్తోంది. ఉదాహరణకు అదిలాబాద్‌లో ప్రస్తుత సీజన్‌లో సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 30.6 డిగ్రీ సెల్సియస్ నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం ఏకంగా 34.3 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది. అదేవిధంగా ఖమ్మంలో ఈ సీజన్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 31.5 డిగ్రీ సెల్సియస్ కాగా..సోమవారం 34.6 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. రామగుండంలో 31.1 డిగ్రీ సెల్సియస్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతకు గాను 34.2 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ సోమవారం నాడు సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. ఆగస్టు నెలలో సాధారణ ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగా నమోదు కావాల్సి ఉండగా, ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వాటికి తీవ్ర ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 49.62 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం నాటికి 56.07 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్ర సగటును పరిశీలిస్తే సాధారణం కంటే 13 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తున్నప్పటికీ.. చాలా జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది. అంటే కొన్ని జిల్లాల్లో కురిసిన అతి భారీ వర్షాలే గణాంకాలను గణనీయంగా పెంచేశాయన్న మాట. ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో ఈ అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. అంటే కొన్నిచోట్ల అతి తక్కువ వర్షాలు లేదా అసలు వర్షమే లేకపోగా కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు నమోదయ్యాయన్న మాట. వాతావరణంలోనూ ఇదే తరహా భిన్నమైన పరిస్థితులు నెలకొంటుండటం గమనార్హం.

పట్టణీకరణ పేరిట వనరుల విధ్వంసం

పట్టణీకరణ పేరిట ఇప్పుడు వనరుల విధ్వంసం విపరీతంగా పెరుగుతోంది. పట్టణీకరణ వల్ల నీటివనరులు పెద్దయెత్తున ఆక్రమణలకు గురవుతుండగా.. చెట్లు, పుట్టలను ఇష్టారాజ్యంగా తెగనరికేస్తున్నారు. మొదట్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ప్రారంభమై ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెంది అంతకంతకకూ విస్తరిస్తున్నా.. నగరీకరణపై సరైన వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వందలాది చెరువులతో కళకళలాడిన హైదరాబాద్, ఇప్పుడు నీటి సమస్యతో సతమతమవుతోందని, చెరువులు కబ్జాల పాలుకావడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటి వనరులు కబ్జాలపాలు కావడంతో నీటి ప్రవాహం దెబ్బతిని వరదలు పెరుగుతున్నాయని, చివరకు నిల్వ చేయాల్సిన నీరు సముద్రం పాలుకావడంతో నీటి సమతుల్యత దెబ్బతింటోందని వివరిస్తున్నారు. అదేవిధంగా ఓపెన్ స్పేస్ నిబంధనలు గాలికొదిలి అనేక అంతస్తులతో భారీ నిర్మాణాలు చేపట్టడం, విచ్చలవిడి లేఅవుట్‌లతో పచ్చదనం పూర్తిగా తగ్గిపోతోందని అంటున్నారు. దేశంలో అత్యంత తక్కువ ఓపెన్ స్పేస్ ఏరియా ఉన్న నగరంగా హైదరాబాద్ రికార్డుల్లోకి ఎక్కడాన్ని గుర్తు చేస్తున్నారు.

2023, 2024ల్లో ఆగస్టు 12 నుంచి 17 వరకు నమోదైన విద్యుత్ వినియోగం వివరాలు..

2024	మి.యూనిట్లు	2023	మి.యూనిట్లు
ఆగస్టు 17న	270.808	ఆగస్టు 17న	268.638
ఆగస్టు 16న	288.52	ఆగస్టు 16న	265.179
ఆగస్టు 15న	287.486	ఆగస్టు 15న	255.56
ఆగస్టు 14న	294.414	ఆగస్టు 14న	271.844
ఆగస్టు 13న	290.542	ఆగస్టు 13న	274.411
ఆగస్టు 12న	281.217	ఆగస్టు 12న	267.151

పెరగని సాగు విస్తీర్ణం

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోతతో కూడిన విభిన్న వాతావరణం నెలకొనడం పంటల సాగుపైనా ప్రభావం చూపించింది. వానాకాలం సీజన్ చివరి దశకు చేరుకున్నా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగలేదు. ఈ సీజన్‌లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా.. ఈ నెల 14వ తేదీ వరకు 1.03 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయాల్సి ఉంది. కానీ 94 లక్షల ఎకరాల మేర మాత్రమే పంటలు సాగవడం గమనార్హం.

నీటి వనరుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి

హైదరాబాద్ లాంటి నగరానికి అతి త్వరలో తీవ్ర నీటి సమస్య ఎదురు కానుంది. ఒకప్పుడు వేలల్లో ఉన్న చెరువులు ఇప్పుడు వందల్లోకి పడిపోయాయి. నీటి నిల్వలకు కేంద్రంగా ఉండే చెరువుల సంఖ్య తగ్గిపోతుండగా కాలువలన్నీ కబ్జాలపాలవుతున్నాయి. ఉదాహరణకు ఫిరంగినాలా అనే కాలువతో శివారు ప్రాంతాల్లోని 22 చెరువులు నీటితో నిండేవి. కానీ ఈ నాలా కబ్జాకు గురైంది. దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. కానీ ఫలితం లేదు. ఆ నాలాను పునరుద్ధరిస్తే దాని కింద ఉన్న గొలుసుకట్టు చెరువులు నీటితో కళకళలాడుతాయి. అదేవిధంగా నగరంలో ఉన్న చెరువులు, ప్రధాన కాలువలను పునరుద్ధరించి పరిరక్షిస్తే నీటి సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుంది.

– ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త

సమగ్ర ప్రణాళికతోనే సాధ్యం...

నగరీకరణలో అత్యంత కీలకం సమగ్ర ప్రణాళిక. కానీ ఇప్పుడు కేవలం కట్టడాలతోనే అభివృద్ధి జరుగుతుందనే ఆలోచన ఉంది. అడ్డగోలు కట్టడాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారడం తప్ప మెరుగైన జీవావరణం ఏవిధంగా సాధ్యమవుతుంది. అందుకే పక్కా ప్రణాళికను రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పుడు హైదనాబాద్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ గత కొన్ని రోజులుగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇదే చిత్తశుద్ధితో పూర్తిస్థాయిలో కట్టడాల తొలగింపుతో పాటు ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను వ్యూహాత్మకంగా అమలు చేయాలి.

– సుబ్బారావు, పర్యావరణ నిపుణులు



మనవడిని లాలిస్తున్న అమ్మమ్మ



పాపను చూపిస్తున్న కండక్టర్ భారతి, చిత్రంలో తల్లి సంధ్య

బస్సులో ఒకరు.. ఆటోలో మరొకరు ప్రసవం

వనపర్తి, భద్రాచలంలో ఘటనలు.. తల్లీబిడ్డలు క్షేమం

వనపర్తి /భద్రాచలంఅర్బన్ : బస్సులో ప్రయాణం చేస్తుండగా ఓ గర్భిణికి, ప్రసవానికి ఆస్పత్రికి తీసుకొస్తుండగా మరొకరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో బస్సు, ఆటోలోనే ఇద్దరికీ ప్రసవం చేశారు. బస్సులో స్టాఫ్ నర్సు, ఆటోలో డాక్టర్లు పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోదరులకు రాఖీ కట్టేందుకు జోగుళాంబ గద్వాల జిల్లా కొండుపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య భర్త రామంజితో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ శివారులోకి రాగానే, సంధ్య పురిటి నొప్పులు తట్టుకోలేనంటూ కండక్టర్ భారతికి చెప్పింది. దీంతో 108కు సమాచారం అందించి.. వెంటనే బస్సులోని ప్రయాణికులను కిందకు దింపారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న స్టాఫ్ నర్సు అలివేలు సాయంతో సాధారణ ప్రసవం చేయగా, ఆడశిశువు జన్మించింది. అనంతరం తల్లీబిడ్డను 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో పురుడు పోసుకున్న మహిళ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సమయస్ఫూర్తి, మానవత్వం చాటిన మహిళా కండక్టర్ భారతిని ప్రశంసించారు. కండక్టర్, స్టాఫ్‌నర్సును మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీభవన్‌కు రావాలని సూచించారు.ఈ ఘటనపై కండక్టర్ భారతి మాట్లాడుతూ జీవితంలో ఈ ఘటన గుర్తుండిపోతుందని చెప్పారు. స్టాఫ్‌నర్సు అలివేలు మాట్లాడుతూ సంధ్యది మాది ఒకే ఊరు అని, కాన్పు చేసేందుకు గ్లౌసులు లేకపోయినా వెనుకాడలేదన్నారు. పాప తల, మెడకు పేగు చుట్టుకొని ఉంది. దాన్ని జాగ్రత్తగా తీసి సుఖ ప్రసవం చేశామని చెప్పారు.

భద్రాచలంలో....

భద్రాచలం పట్టణంలోని రాజుపేటకు చెందిన సాయినిఖితకు సోమవారం వేకువజామున పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాజుపేట నుంచి ఆటోలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, ఆస్పత్రి ప్రాంగణంలోనికి రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో భర్త హరీశ్ మాతాశిశు విభాగం సిబ్బందికి చెప్పాడు. వెంటనే నర్సులు కృష్ణవేణి, నాగలక్ష్మి వచ్చి పరీక్షించగా, అప్పటికే శిశువు గర్భం నుంచి కిందకు జారి పేగులు మెడలో వేసుకొని బయటకు రావడాన్ని గమనించారు. వెంటనే ప్రసవం చేయగా, సాయినిఖిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను చికిత్స నిమిత్తం ప్రసవ వార్డుకు తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన న్యాయమూర్తి



బిడ్డతో జూనియర్ సివిల్ జడ్జి స్వప్న

సింగరేణి (కొత్తగూడెం): నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి టి.స్వప్న ఆదివారం రాత్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించారు. కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన న్యాయవాది శాంత కుమార్తె అయిన స్వప్నకు మిర్యాలగూడ మండలం నిడమనూరుకు చెందిన దాసరి కార్తీక్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న స్వప్న.. ప్రసవం కోసం కొత్తగూడెంలోని పుట్టింటికి వచ్చారు. ఉన్నత విద్యనభ్యసించి, న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆమె.. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే స్థోమత ఉన్నా సామాన్య ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేరగా ఆదివారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని, పూర్తి నమ్మకంతో వైద్యం పొందాలని సూచించారు. తనకు వైద్యసేవలందించిన డాక్టర్ సాగరిక, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ముందు బొట్టు పెట్టాలి కదా!



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న ఏపీఎం తదితరులు

తిరుమలాయపాలెం: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌ను పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంపై ఉద్యోగులకు సూచనలు చేశారు. రాఖీ పండుగ కావడంతో అక్కడి ఐకేపీ ఏపీఎం అలివేలు మంగ కలెక్టర్‌కు రాఖీ కట్టి హారతి ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారి కావడంతో.. తనలాంటి ఉద్యోగి రాఖీ కట్టడాన్ని ఎలా భావిస్తారోనన్న సంశయంతోనే ఆమె రాఖీ కట్టారు. అయితే, బొట్టు పెట్టకుండా రాఖీ కట్టడాన్ని గమనించిన ఆయన 'ముందు బొట్టు పెట్టాలి కదా..'అంటూ ఆమెకు సంప్రదాయాన్ని గుర్తు చేశారు.

'సుంకిశాల'పై లోతుగా విచారణ!

- బోర్డు అంతర్గత విచారణ నివేదికపై సర్కారు అసంతృప్తి
- ఇప్పటికే చర్యలకు ఉపక్రమించిన ఉన్నతస్థాయి కమిటీ
- రంగంలోకి దిగిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

సాక్షి, హైదరాబాద్: సుంకిశాల ఘటనపై ప్రభుత్వం లోతైన విచారణకు సిద్ధమైంది. జలమండలి అంతర్గత విచారణ నివేదికపై సంతృప్తి చెందని ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రంగంలోకి దింపింది. ఇప్పటికే కమిటీ ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టింది. అంతర్గత విచారణ కమిటీలోని ఇద్దరు సభ్యులపై సైతం వేటు వేసింది. మరోవైపు కేంద్ర జలవనరుల నిపుణుల కమిటీ సుంకిశాలకు రానున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌కు నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి తాగునీటిని తరలించేందుకు భారీ అంచనా వ్యయంతో చేపట్టిన సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా, పర్యవేక్షణ సంస్థ జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తలకు నడక సాగడం ఘటనకు ప్రధాన కారణమైనట్టు తెలుస్తోంది.

పరిస్థితులు కలిసి వచ్చినా..

సుదీర్ఘకాలం తర్వాత నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరి సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ పనులకు పరిస్థితులు కలిసివచ్చినా, పనులు వేగవంతంగా చేయించడంలో వాటర్‌బోర్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వర్షాకాలం కంటే ముందే ఇన్‌టేక్ టన్నెల్ పనులు పూర్తి కాకపోవడం, ఎగువ నుంచి వచ్చే వరద నీటిని అంచనా వేయకపోవడం వంటి కారణాలతో వరదనీరు చేరి టన్నెల్ గేటు, రక్షణ గోడ కుప్పకూలినట్టు విచారణలో బహిర్గతమైంది. వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మిడిల్ టన్నెల్ పూర్తి చేసేందుకు చేపట్టిన హడావుడి పనులే ఘటనకు దారితీసినట్టు కనిపిస్తోంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఇప్పటికే సుంకిశాలను సందర్శించి నిర్మాణ పనులపై పర్యవేక్షణలోపం, పనుల్లో నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలను గుర్తించింది. రెండురోజుల్లో నివేదిక సమర్పించనున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద సుంకిశాల ఘటన జలమండలిని కుదిపేస్తోంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 20-8-2024



మలయాళ పరిశ్రమలో కథలు ఎంత వినూత్నంగా ఉన్నా స్త్రీల విషయంలో వేధింపులు అంతే అమానవీయంగా ఉన్నాయి. బలం ఉన్నవాళ్లు, పలుకుబడి ఉన్నవాళ్లు కొత్తగా ఫీల్డ్‌లోకి వచ్చే మహిళా ఆర్టిస్టులను తాము చెప్పినట్టుగా వినాలని శాసిస్తున్నారు. 'ఎస్' అంటే మేకప్... 'నో' అంటే ప్యాకప్ అని బెదిరిస్తున్నారు. ఈ విషయం సాక్షాత్తూ సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో ఏర్పడిన కమిషనే తేల్చి చెప్పింది. మలయాళ పరిశ్రమ ఈ కమిషన్ రిపోర్టుతో కుదుపునకు లోనవుతోంది.

● కమిషన్ రిపోర్ట్

'తెర' వెనుక కన్నీటి చార

'వినీల ఆకాశంలో ఎన్నో రహస్యాలు... చంద మామ అందంగా ఉంటుందని.. నక్షత్రాలు మెరు స్తాయని అనుకుంటాం. కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉంటాయి. మీరు చూసేదంతా నిజమ నుకోకండి. ఒక్కోసారి ఉప్పు కూడా చక్కెరలాగే కనిపిస్తుంది. మలయాళ సినీ పరిశ్రమ కూడా అంతే. పైకి కనిపించే గ్లామర్ వెనుక ఎన్నో చీకటి కోణాలు. వాటిని వింటుంటే గుండె తరుక్కు పోతుంది. రంగుల ప్రపంచంలో జీవితాలను కోల్పోతున్న ఎంతోమంది మహిళల ఆవేదనను అక్షరబద్ధం చేశాం' అంటూ నివేదికను మొదలు పెట్టారు జస్టిస్ హేమ.

ఉత్తమ అభిరుచి, ప్రజాదరణ ఉన్న సినిమాలు తీస్తూ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న మలయాళ పరిశ్రమలో తెర వెనుక కన్నీటి చారను జస్టిస్ హేమ రిపోర్ట్ బట్టబయలు చేసింది. ఇండస్ట్రీ లోని 15 మంది పెద్దలు ఇండస్ట్రీని గుప్పెట్లో పెట్టుకుని స్త్రీల జీవితాలను శాసిస్తున్నారని ఈ కమిటీ పేర్కొనడం గమనార్హం.

ఇదీ నేపథ్యం

దాదాపు ఏడేళ్ల కిందట 2017లో మలయాళ నటి భావనా మీనన్‌పై కొంతమంది దుండగులు కొచ్చి శివార్లలో లైంగిక దాడి చేశారు. ఈ కేసులో సూత్రధారిగా మలయాళ సూపర్‌స్టార్ దిలీప్ పేరు రావడంతో గగ్గోలు రేగింది. ఆ సమయంలో అన్ని విధాలా వచ్చిన ఒత్తిడి మేరకు కేరళ ప్రభుత్వం మలయాళ చిత్ర పరిశ్రమలో స్త్రీల పరిస్థితిని అధ్య యనం చేయడానికి జస్టిస్ హేమా కమిషన్‌ను నియమించింది. మన సీనియర్ నటీమణి శారద కూడా ఈ కమిటీలో ఒక సభ్యురాలు. విచారణ ముగించిన కమిషన్ 2019లో ప్రభుత్వానికి నివేదిక అందించినా అనేక కారణాల వల్ల అది బయటకు రాలేదు. తాజాగా 'రైట్ టు ఇన్ఫర్మేషన్' యాక్ట్ కింద కోరిన వారికి ఆ కమిటీ రిపోర్టు ఇవ్వొచ్చని కేరళ హైకోర్టు తెలిపింది. దాంతో నిన్న (సోమవారం) మధ్యాహ్నం ఆ రిపోర్టు జర్నలిస్టులకు అందింది. 295 పేజీలతో కమిటీ నివేదికను రూపొందిస్తే.. చాలా సున్నితమైన అంశాలు, వ్యక్తిగత వివరాలు ఉన్న కారణంగా 63 పేజీలను మినహాయించి మిగతా నివేదికను బహిర్గతం చేశారు. ఈ నివేదికపై పినరయి విజయన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుం టుందా అని మాలీవుడ్ తో పాటు భారతీయ సినీ పరిశ్రమ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

కమిటీ సిఫార్సులు

- సినీ పరిశ్రమలో మహిళల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చట్టాలు చేయాలి.
- అవసరమైతే ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి మహిళలను న్యాయం చేయాలి.
- నేరచరిత్ర ఉన్న వాళ్లపై సినీ ఇండస్ట్రీ నిషేధం విధించాలి
- షూటింగ్ జరిగే ప్రాంతాల్లో మద్యం, మాదకద్రవ్యాలపై నిషేధం విధించాలి.
- ఫ్యాన్ క్లబ్స్ మహిళలను వేధించ కుండా చర్యలు తీసుకోవాలి.
- పరిశ్రమలో పనిచేసే మహిళలకు పురుషులతో సమానంగా వేతనాలు అందించాలి.

కమిటీ నివేదికలో సంచలన విషయాలు

'శరీరాలను అర్పించుకోవాలి.. ఎదురు ప్రశ్నించకుండా కోరికలు తీర్చాలి.. సహకరించిన వాళ్లకు అవకాశాలు. ఎదురు తిరిగిన వాళ్లకు వేధింపులు.. ఇదీ 233 పేజీలతో జస్టిస్ హేమా కమిటీ నివేదిక సారాంశం. 'ఆయన నన్ను చాలా సందర్భాల్లో లైంగికంగా వేధించే ప్రయత్నం చేశాడు. నేను లొంగలేదు. అందుకే ఓ సినిమాలో కౌగిలించుకునే పాత్రను సృష్టించి 17 సార్లు రీషూట్ చేశారు. ఆ విధంగా అతను నన్ను మరింత వేధించడం మొదలు పెట్టాడు' అని జస్టిస్ హేమా కమిటీ ముందు కన్నీళ్లు పెట్టుకుంటూ ఓ సీనియర్ నటి వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అడపాదడపా కాకుండా ఈ తరహా వేధింపు ఘటనలు పరిశ్రమలో సర్వసాధారణంగా జరుగుతున్నాయని కమిటీ ఆధారాలతో సహా బయటపెట్టింది. 'కొత్తగా వచ్చే నటీమణులకు గతంలో పేరు ప్రతిష్ఠలు సాధించిన నటీమణులంతా కోరిన విధంగా నడుచుకునే పైకి వచ్చారనే భావన కల్పించడంలో ఇండస్ట్రీ పెద్దలు సఫలం అయ్యారు' అని కమిటీ తెలిపింది. 'సినిమా వాళ్లు వేషం ఇస్తామని మహిళలకు ఫోన్ చేస్తే పర్లేదు. అదే మహిళలు తమంతట తాము ఫోన్ చేస్తే 'ఫేవర్ చేయాల్సిందే' అని కమిటీ తెలిపింది.



జస్టిస్ హేమ

ఆ 15 మంది

కొంతమంది హీరోలు... మరికొంతమంది దర్శకులు... ఇంకొందరు నిర్మాతలు... ఇలా 15 మంది మగ మహారాయుళ్లు సినీ ఇండస్ట్రీని చెప్పుచేతల్లో పెట్టుకున్నారని, వాళ్లు చెప్పినట్టే అందరూ నడుచుకుంటున్నారని నివేదిక తేల్చింది. ఈ 15 మందికి సహకరిస్తే ఇండస్ట్రీలో అపారంగా అవకాశాలు లభిస్తాయి. సహకరించని వాళ్ల జీవితాలు నాశనమైపోతాయని చెప్పింది. ఆ 15 మంది పేర్లు బయటకు రావాల్సి ఉంది.

ఇండస్ట్రీలో అడుగుపెట్టాలంటే

సర్దుకుపోండి... రాజీపడండి.. మలయాళ సినీ పరిశ్రమలో అవకాశాల కోసం వచ్చే మహిళలకు పరిశ్రమ పెద్దలు చెప్పే రెండు మాటలు ఇవే. వీటికి సిద్ధపడి జీవితాలను అర్పించుకుంటేనే భారీ పారితోషకాలతో మెండుగా అవకాశాలు కల్పిస్తారు. కాదు... కూడదని ఎదురు తిరిగితే మాత్రం వాళ్ల జీవితాలను నాశనం చేయడానికి కూడా వెనుకాడరు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా బాధితులు ముందుకు రారంటే వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

- ఫణికుమార్ అనంతోజు

బిలియనీర్ కూతురు అయిన పేటోంగ్ టార్న్ పదిహేడేళ్ల వయసులోనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. 37 ఏళ్ల వయసులోనే థాయ్‌లాండ్ నూతన ప్రధానిగా ఎంపికై చరిత్ర సృష్టించింది. తన ఇద్దరు పిల్లల నవ్వుల్లోంచి బలం తెచ్చుకొని రాజకీయ జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని, సమన్వయం చేసుకుంటూ విజయపథంలో పయనిస్తోంది...

● థాయ్‌లాండ్ ప్రధాని

నా నవ్వులు పిల్లలవి!



హాంకాంగ్ ఓషియన్ పార్క్‌లో పిల్లలతో పేటోంగ్ టార్న్

థాయ్‌లాండ్ మాజీ ప్రధాని తక్సిన్ షినవత్ర చిన్న కుమార్తె పేటోంగ్ టార్న్. తక్సిన్ మీద అవినీతి ఆరో పణలు రావడంతో ఆయన దేశం విడిచి విదేశాల్లో ఆశ్రయం పొందుతున్నాడు. దాంతో తండ్రి స్థాపించిన 'ఫ్యూ థాయ్' పార్టీకి పేటోంగ్ టార్న్ పెద్ద దిక్కుగా మారింది. బ్యాంకాక్‌లో పుట్టి పెరిగింది పేటోంగ్ టార్న్. పొలిటికల్ సైన్స్, ఆంత్రోపాలజీ, సోషియాలజీలో పట్టా పుచ్చుకున్న పేటోంగ్ టార్న్ ఇంగ్లాండ్‌లో ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేసింది. చదువులో రాణించిన పేటోంగ్ టార్న్ ఆ తరువాత వ్యాపారరంగంలో అడుగుపెట్టింది. 21 కంపెనీలతో తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా పేరు తెచ్చుకుంది.

'నేను ఎనిమిది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు నాన్న రాజకీయాల్లోకి వచ్చారు' అని చెబుతుంటుంది పేటోంగ్ టార్న్. పార్టీ నిర్వహణ, ఆ తరువాత ప్రధాన మంత్రిగా పనిచేసిన తండ్రి తక్సిన్ షినవత్రకు పిల్లలతో మాట్లాడే సమయం అతి తక్కువగా ఉండేది.'నాకు నాన్న అంటే చాలా ఇష్టం. అయితే నాకంటూ సొంత వ్యక్తిత్వం ఉంది' అంటున్న పేటోంగ్ టార్న్‌కు రాజకీయాల్లో చురుగ్గా ఉండడానికి కుటుంబ బలం అనేది ఎంత ముఖ్యమో తెలియనిది కాదు. రాజకీయ ప్రపంచం నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఇద్దరు పిల్లలే తన ప్రపంచం. పేటోంగ్ టార్న్ ముద్దు పేరు ఉంగ్-ఇంగ్. గ్రామీణ ప్రజలు పేటోంగ్ టార్న్‌ను ప్రేమగా ఉంగ్-ఇంగ్ అని పిలుచుకునేవారు. కమర్షియల్ పైలట్ పిటాక సూక్సావత్‌ను పేటోంగ్ వివాహం చేసుకుంది. వీరిది అన్యోన్య దాంపత్యంగా చెబుతుంటారు. భార్యకు ఉన్న సహనాన్ని, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రదర్శించే తెలివితేటలను పిటాక ప్రశంసిస్తుంటాడు.

'రాజకీయ నాయకురాలిగా మీకు ఎన్నో చికాకులు ఉంటాయి. అయినా సరే, ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తారు!' అని అడిగితే ఆమె సమాధానం నవ్వు. 'ఈ బలం నాకు నా పిల్లలు ఇచ్చారు' అంటుంది ఆ నవ్వు మరింత పెంచుతూ!

'సోషల్లీ-లిబరల్ క్యాపిటలిస్ట్'గా తనను తాను అభివర్ణించుకునే పేటోంగ్ ముందు రాజ్యాంగాన్ని పునర్‌లిఖించడంతో సహా ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. ఆ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కుటుంబ బలం ఉండనే ఉంది.



నేటి నుంచి 'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

నేటి 'సాక్షి' ఈపేపర్‌లో ప్రత్యేక 'హెల్త్' పేజీ

ప్రకృతి / సేంద్రియ సేద్యంపై 21 రోజుల ఉచిత శిక్షణా శిబిరం

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయంలో ఇమిడి ఉండే అన్ని అంశాలతో పాటు పిజిఎస్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ విషయాలపై పూర్తి స్థాయి శిక్షణ పొందాలనుకునే తెలుగు వారికి ఇదొక గొప్ప అవకాశం. సేంద్రియ/ప్రకృతి సేద్యంలో అన్ని విషయాలతో పాటు పిజిఎస్ సర్టిఫికేషన్‌పై లోతైన అవగాహన కల్పించేందుకు 21 రోజుల పాటు తెలుగులో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరం జరగనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్/నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌సిఓఎన్‌ఎఫ్) తోడ్పాటుతో సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ), కృష్ణ సుధ అకాడమీ ఆఫ్ ఆగ్రోఎకాలజీ (కెఎస్ఎ) సెప్టెంబర్ 5 నుంచి ఉమ్మడిగా ఈ శిబిరాన్ని నిర్వహించనున్నాయి. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, సిఎస్ఎ, కెఎస్ఎల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరం జరగనుండటం విశేషం.

విజయవాడకు 50 కిమీ దూరంలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సమీపంలో శ్రీపద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ నెలకొల్పిన కృష్ణ సుధ అకాడమీ ఆఫ్ అగ్రోఎకాలజీ ఆవరణలో ఈ శిబిరం జరగనుంది. 38 ఎకరాలలో అత్యాధునిక సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు చేస్తూ ఆచణాత్మక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన కెఎస్ఎకు సుస్థిర వ్యవసాయ కేంద్రం నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది.

ఈ 21 రోజుల శిబిరంలో బోధన పూర్తిగా తెలుగులో ఉంటుంది. శిక్షణ, భోజన వసతులు ఉచితం. అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ చదివి ఉండాలి. 30 మందికి అవకాశం.

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయంలోను, సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపారంలోను స్థానికంగా కీలక పాత్ర పోషించాలన్న ఆసక్తి, నిబద్ధత కలిగిన వారికి సంపూర్ణ అవగాహన కలిగించేందుకే ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు డా. రామాంజనేయులు వివరించారు. స్థానిక స్వయం సహాయక బృందాలు/ ఎఫ్‌పిఓలు / ఐసిఎస్/ ఆత్మ, పికెవివై, నామని గంగే లేదా ఏదైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సేంద్రియ వ్యవసాయ పథకాలలో నమోదైన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. గూగుల్ ఫామ్‌లో వివరాలు పొందుపరచటం ద్వారా ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు.. 85002 83300.

ksa@KrishnaSudhaAcademy.org

సాగుబడి
మఖ కార్తె: ఆగస్టు 17 నుంచి

- 15 ఏళ్ల క్రితం 2 ఎకరాల్లో 150 నేరేడు మొక్కలు నాటిన రైతు
- మార్కెటింగ్ సమస్యను అధిగమించే కృషిలో నేరేడు జ్యూస్ ఉత్పత్తిపై దృష్టి
- 8 ఏళ్లు పరిశోధించి నేరేడు జ్యూస్ టెక్నాలజీని రూపొందించుకున్న రైతు మారుతీప్రసాద్
- మధుమేహ వ్యాధిగ్రస్తుల ఆదరణతో పుంజుకున్న ఆన్‌లైన్ అమ్మకాలు

రైతు బ్రాండ్ నేరేడు జ్యూస్!

నేరేడు పండ్లు జూన్-జూలై మధ్య ఏడాదికి ఒక్క నెల రోజులు మాత్రమే వస్తాయి. చెట్లపై 90% పండిన నేరేడు కాయలను వ్యాపారులు కొని నగరాలు, పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తూ ఉంటారు. ఒక్క రోజు కోయకపోయినా పండ్లు 100% పండిపోతాయి. రవాణాకు పనికిరావు కాబట్టి వ్యాపారులు కొనరు. మరో రోజు కోయకపోతే రాలి మట్టిపాలవుతాయి. 100% పండిన పండ్లను వృథా కాకుండా ఇంటిపట్టునే జ్యూస్‌గా మార్చితే పండ్ల వృథాను అరికట్టినట్లవుతుంది. జ్యూస్ అమ్మకం ద్వారా మంచి ఆదాయం కూడా వస్తుందని ఆశించిన రైతు మారుతీ ప్రసాద్. 8 ఏళ్లు కష్టపడి నేరేడు జ్యూస్ తయారీకి అవసరమైన ప్రత్యేక టెక్నాలజీని విజయవంతంగా రూపొందించుకున్నారు.



● నేరేడు తోటలో మారుతీప్రసాద్, (ఇన్‌సెట్) ఆయన తయారు చేసిన నేరేడు జ్యూస్ సీసాలు

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ పి. మారుతీ ప్రసాద్ ఇంటర్ వరకు చదువుకున్నారు. దానిమ్మ, ద్రాక్ష తదితర పంటల సాగుతో నష్టాల పాలైన నేపథ్యంలో వ్రేదావతి ఒడ్డున 4 ఎకరాల చౌడు భూమిని 15 ఏళ్ల క్రితం కొన్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్‌డీటీ సహకారంతో రెండెకరాల్లో 150 అల్లనేరేడు మొక్కలు 2009లో నాటారు. కాలక్రమంలో నేరేడు తోటల విస్తీర్ణం ఆ ప్రాంతంలో 400 ఎకరాలకు పెరిగి, మార్కెటింగ్ సమస్య వచ్చిపడింది.



● నేరేడు గింజల పొడి

8 ఏళ్ల ప్రయోగాలు ఫలించిన వేళ..

జూన్-జూలై మధ్య కేవలం నెల రోజుల్లోనే నేరేడు పండ్లన్నీ మార్కెట్‌లోకి వస్తాయి. వీటిని నిల్వ చేసుకొని నెమ్మదిగా అమ్ముకునే మౌలిక సదుపాయాలు రైతులకు లేవు. పూర్తిగా పండిన నేరేడు పండ్లతో జ్యూస్ తయారు చేయటం ద్వారా మార్కెటింగ్ సమస్యను అధిగమించవచ్చని మారుతీప్రసాద్ భావించారు. మైసూర్‌లోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్‌ఐ) శాస్త్రవేత్తలను 8 ఏళ్ల క్రితం సంప్రదించారు. అయితే, వారు సూచించిన ప్రాసెసింగ్ పద్ధతి నేరేడుకు సరిపడలేదు. అయినా, ఆయన తన ప్రయత్నాలు మానలేదు.

'మామిడి నుంచి నేరేడు వరకు అన్ని రకాల పండ్ల రసాల తయారీకి వారి వద్ద ఒకటే ప్రాసెసింగ్ పద్ధతి ఉంది. సగం రసం, సగం పంచదార, ప్రిజర్వేటివ్‌లు తదితరాలు కలిపి జ్యూస్ తయారు చేయాలని వారు సూచించారు. అవేమీ కలపకుండా నేరేడు జ్యూస్ తయారు చేయాలన్నది నా ప్రయత్నం. ఈ క్రమంలో నేరేడు ప్రాసెసింగ్ పద్ధతి, నిల్వ పద్ధతి, బాట్లింగ్ పద్ధతితో పాటు యంత్రాలను నా అవసరాలకు తగినట్లు ఏయే మార్పులు చేసుకోవాలి అనేది స్వీయఅనుభవం ద్వారా తెలుసుకున్నాను. ఏవీ కలపకుండా కేవలం నేరేడు జ్యూస్ తయారు చేసి, ఏడాది పాటు నిల్వ ఉంచటంలో ఎట్టకేలకు విజయం సాధించాను..' అని మారుతీప్రసాద్ 'సాక్షి సాగుబడి'తో సంతోషంగా చెప్పారు.

2.5 కేజీలకు లీటరు జ్యూస్

తన ఇంటి దగ్గరే ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన ఏర్పాటు చేసుకున్నారు. తన రెండెకరాల్లో నేరేడు పండ్లతో పాటు మరో 10 ఎకరాల తోటలో పండ్లను కొని జ్యూస్ తయారు చేస్తున్నారు. రెండున్నర కేజీల నేరేడు పండ్లతో లీటరు జ్యూస్ తయారు చేస్తున్నారు. మొదట్లో గింజలు తీసేసి గుజ్జుతో మాత్రమే జ్యూస్ తయారు చేశారు. గత ఏడాది నుంచి ప్రత్యేకంగా గింజతో పాటు మొత్తం పండ్లతో కూడా రెండు రకాలుగా జ్యూస్ తయారు చేస్తున్నారు. 200 ఎం.ఎల్. బాటిల్స్ లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. గుజ్జు జ్యూస్ కన్నా ఇది కొంచెం వగరుగా ఉన్నా, మార్కెట్‌లో క్లిక్ అయ్యింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి దూరప్రాంతాల నుంచి కూడా చాలా మంది షుగర్ వ్యాధిగ్రస్తులు నేరుగా కొనుగోలు చేస్తూ, సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ జ్యూస్ తమకు బాగా ఉపయోగపడుతోందని షుగర్ పేషెంట్లు చెప్పటం మారుతీ ప్రసాద్‌కు కొండంత ధైర్యాన్నిచ్చింది. అందుకే ఈ ఏడాది ఎక్కువగా గింజలతో కూడిన జ్యూస్‌ను తయారు చేశారు. ఈ జ్యూస్‌ను నాణ్యతా పరీక్షల కోసం సిఎఫ్‌టిఆర్‌ఐకి పంపానన్నారు. గుజ్జుతో జ్యూస్ చేసిన తర్వాత మిగిలే గింజలను కూడా ఎండబెట్టి, పొడి చేసి అమ్ముతున్నారు. ఈ పొడిని గోరువెచ్చ నీటితో కలుపుకొని తాగొచ్చు. నీటితో మరిగించి టీ డికాక్షన్ చేసుకొని తాగొచ్చని ఆయన చెబుతున్నారు. ఒక ఉద్యాన యూనివర్సిటీ లేదా పరిశోధనా కేంద్రం చేయాల్సిన పరిశోధనను సడలని పట్టుదలతో కొనసాగించి విజయం సాధించినను రైతు మారుతీప్రసాద్ అసలు సిసలైన రైతు శాస్త్రవేత్త.

- కె. వంశీనాథ్‌రెడ్డి, సాక్షి, బొమ్మనహాళ్, అనంతపురం జిల్లా

8 ఏళ్ల స్వయంకృషి ఫలితమిది

గత ఏడాది సీజన్‌లో 5 టన్నుల నేరేడు జ్యూస్ తయారు చేసి విక్రయించాను. ఈ ఏడాది పదెకరాల తోటలో పండ్లను అదనంగా కొనుగోలు చేసి, 22 టన్నుల జ్యూస్ తయారు చేశా. జ్యూస్‌ను అన్నివిధాలా సంతృప్తికరమైన రీతిలో ఆరోగ్యదాయకంగా ఉత్పత్తి చేస్తున్నా. సిఎఫ్‌టిఆర్‌ఐ తోడ్పాటు తీసుకున్నా. వ్యయ ప్రయాసలకోర్చి 8 ఏళ్లుగా ఎన్నో ప్రయోగాలు చేసి ఎట్టకేలకు విజయం సాధించా. నాకు అవసరమైన విధంగా తగిన మార్పులు చేర్పులతో ప్రత్యేక ప్రాసెసింగ్ పద్ధతిని, ప్రత్యేక యంత్రాలను రూపొందించుకున్నా. పంచదార, రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు ఇతరత్రా ఏమీ కలపకుండా స్వచ్ఛమైన నేరేడు రసాన్ని ప్రజలకు అందిస్తున్నా. గర్భవతులు మాత్రం నేరేడు జ్యూస్ తాగకూడదు. ఇతరులు నీటిలో కలిపి తాగితే మంచిది. ఎందుకైనా మంచిది వైద్యుల సలహా మేరకు వాడమని కొనే వారికి సూచిస్తున్నా.

- పి. మారుతీ ప్రసాద్ (97018 66028), ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం, అనంతపురం జిల్లా

ముచ్చింతల్‌లో 'సిరిధాన్యాలతో జీవన సిరి' శిబిరం

రైతునేస్తం ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో.. కర్షక సేవా కేంద్రం నిర్వహణలో హైదరాబాద్ సమీపంలో ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో సిరిధాన్యాలతో జీవన సిరి అనే అంశంపై ఆహార ఆరోగ్య నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. ఖాదర్‌వలి, డా. సరళా ఖాదర్‌లచే ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. 3 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇతర వివరాలకు.. 97053 83666, 70939 73999.

నల్లతామరకు విరుగుడు

కుంకుడు ద్రావణం

నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి వాస్తవ్యులు లోకసాని పద్మారెడ్డి అనే మెట్ట ప్రాంత రైతు సాగు చేస్తున్న 12 ఎకరాల కుంకుడు తోట కొత్త ఆవిష్కరణలకు పురుడుపోసింది. మొదటిది... చెట్టుకు ఏడాదికి 400 కిలోల వరకు కుంకుడు కాయల దిగుబడినిచ్చే సరికొత్త రైతు వంగడం ఆవిష్కారమైంది. కుంకుడు ద్రావణం రెండోది.

కుంకుడు కాయల పొడికి రెండు రకాల ఔషధ మొక్కల పొడిని చేర్చి.. ఆ పొడితో తయారు చేసిన ద్రావణం సేంద్రియ వ్యవసాయంలో సస్యరక్షణ కోసం వినియోగిస్తూ పద్మారెడ్డి, ఆయన మిత్రులైన కొందరు రైతులు చక్కటి ఫలితాలు సాధిస్తుండటం విశేషం. సేంద్రియ పురుగు మందుగా, శిలీంధ్రనాశినిగానే కాక పంట పెరుగుదలకు కూడా కుంకుడు ద్రావణం దోహదం చేస్తోందని ఆయన చెబుతున్నారు. పండ్ల తోటలు, వరి, కూరగాయలు తదిరత పంటల సేంద్రియ సాగులో ఉపయోడపడుతోందన్నారు.



● కుంకుడు ద్రావణం తయారు చేస్తున్న పద్మారెడ్డి

200 లీ. డ్రమ్ముకు 2 కిలోలు... 2 కిలోల కుంకుడు పొడిని 200 లీటర్ల డ్రమ్ములో 2 గంటలు నానబెట్టి, పిసికి, వడకడితే సిద్ధమయ్యే ద్రావణాన్ని పంటలకు పిచికారీ చేసుకోవచ్చు. మళ్లీ నీరు కలపాల్సిన అవసరం లేదు. రెండేళ్లుగా తాము ప్రయోగాత్మకంగా ఈ ద్రావణాన్ని వాడుతున్నామని చెబుతూ.. ఎన్ని రోజులైనా నిల్వ ఉంచి వాడుకోవచ్చు అన్నారు.

ఇంటిపంటలకు... లీటరు నీటికి 10 గ్రాముల కుంకుడు పొడిని కలిపిన ద్రావణం ఇంటిపంటలు/మిద్దె తోటల రైతులకూ కుంకుడు పొడి ఎంతో ఉపయోగకరంగా ఉందని పద్మారెడ్డి తెలిపారు.

వరిలో తెగుళ్లకు... కుంకుడు ద్రావణాన్ని ఆకుకూరలకు ఒక్కసారి చాలు. పంటలు ఏపుగా పెరగడానికి కూడా ఈ ద్రావణం దోహదపడుతుందని పద్మారెడ్డి తెలిపారు. బత్తాయి తదితర పండ్ల తోటలకు 30 రోజుల వ్యవధిలో వాడుకోవచ్చు. కూరగాయల సాగులో 15 రోజులకోసారి పిచికారీ చేయొచ్చు. వరి పంట కాలంలో 3 దఫాలు.. నాటేసిన 15-25 రోజులకు, 60 రోజులకు, 90 రోజులకు చల్లాలి. ఊస తెగులు/కాండం తొలిచే పురుగును ఈ ద్రావణం పూర్తిగా నివారిస్తుందని పద్మారెడ్డి స్వానుభవంగా చెప్పారు.

మిరపలో నల్లతామరకు... మిరప రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న బ్లాక్ త్రిప్స్ (నల్లతామర)ను కూడా కుంకుడు ద్రావణం 70-80% నియంత్రిస్తున్నట్లు సేంద్రియ మిరప తోటలో రుజువైందని పద్మారెడ్డి చెబుతున్నారు. రసాయనిక పురుగు మందులు అసలు వాడకుండా కుంకుడు ద్రావణాన్ని ప్రతి 15 రోజులకోసారి పిచికారీ చేస్తే సేంద్రియ మిరప రైతులకు మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. గ్రోత్ ప్రమోటర్‌గా, ఫంగిసైడ్‌గా ఇది పనిచేస్తుందని, మిరపకాయలపై మచ్చలు కూడా రావని పద్మారెడ్డి(99481 11931) చెబుతున్నారు.



ఐదో టైటిల్‌పై సినెర్ గురి

ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ ఐదో సింగిల్స్ టైటిల్‌కు విజయం దూరంలో ఉన్నాడు. సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్–1000 టోర్నీలో 23 ఏళ్ల సినెర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో 3 గంటల 7 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సినెర్ 7–6 (11/9), 5–7, 7–6 (7/4)తో గెలిచాడు. ఫైనల్లో ఫ్రాన్సెస్కో టియాఫో (అమెరికా)తో సినెర్ తలపడతాడు.



కాంస్య పతకం రేసులో రోనక్ దహియా

ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత రెజ్లర్ రోనక్ దహియా కాంస్య పతకం రేసులో నిలిచాడు. జోర్డాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో రోనక్ 110 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. ఢిల్లీలోని విఖ్యాత ఛత్రశాల్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న రోనక్ తొలి రౌండ్‌లో 8–1తో ఆర్తుర్ మాన్వెలియన్‌పై గెలిచాడు. క్వార్టర్ ఫైనల్లో 10–1తో డానిల్ మస్లాకును ఓడించిన రోనక్ సెమీఫైనల్లో మాత్రం జోల్టాన్ జాకో (హంగేరి) చేతిలో ఓడిపోయాడు. కప్కాన్ (టర్కీ), లుకా పవద్జే (జార్జియా) మధ్య విజేతతో కాంస్యం కోసం రోనక్ తలపడతాడు.

ప్రపంచ రికార్డు... పసిడి పతకం

రెండు లక్ష్యాలతో పారాలింపిక్స్ బరిలో సుమిత్ అంటిల్



న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని భారత పారాథ్లెట్ సుమిత్ అంటిల్ పేర్కొన్నాడు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు పారాలింపిక్స్ జరగనుండగా... ఆరంభ వేడుకల్లో జావెలిన్ త్రోయర్ సుమిత్ భారత బృందం పతాకధారిగా వ్యవహరించనున్నాడు. మూడేళ్ల క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన సుమిత్.. ఎఫ్64 విభాగంలో పోటీపడనున్నాడు. తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును ఇటీవల మూడుసార్లు బద్దలు కొట్టిన సుమిత్... గత ఏడాది పారా ఆసియా క్రీడల్లో జావెలిన్‌ను 73.29 మీటర్ల దూరం విసిరి బంగారు పతకం గెలుచుకున్నాడు. పారా ప్రపంచ చాంపియన్‌సిప్‌లోనూ సుమిత్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. డిఫెండింగ్ పారాలింపిక్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న సుమిత్ టైటిల్ నిలబెట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. 'మరోసారి ప్రపంచ రికార్డు బద్దలు కొట్టి పసిడి పతకం గెలవాలనుకుంటున్నా. ప్రాక్టీస్‌లో నిలకడగా మంచి ప్రదర్శన చేస్తున్నా. నైపుణ్యాలు పెంచుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నా. 80 మీటర్ల మార్క్ అందుకోవడం నా లక్ష్యం. డిఫెండింగ్ చాంపియన్ అనే ఒత్తిడి ఏం లేదు. అత్యుత్తమ ప్రదర్శన చేయడంపైనే దృష్టి పెడతా. 2019 నుంచి టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్‌లో భాగంగా ఉన్నా. ప్రభుత్వ సహకారం వల్లే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించగలుగుతున్నా. పారాలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే ఉద్దేశంతో ఇతర టోర్నీల్లో ఎక్కువ పాల్గొనలేదు' అని సుమిత్ అన్నాడు. పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 12 క్రీడాంశాల్లో 84 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు.




ఒక్క గ్రాము ఎక్కువున్నా అనర్హతే

రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తీర్పుపై సీఏఎస్ వివరణ • క్రీడాకారులు నిబంధనలు తెలుసుకోవాలని సూచన

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే క్రీడాకారులు నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్) సూచించింది. పారిస్ ఒలింపిక్స్‌లో 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంగా భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు వేయగా... కేవలం వంద గ్రాములే కదా దీన్ని మినహాయించండి అని భారత అథ్లెట్ సీఏఎస్‌ను ఆశ్రయించింది. వాదనలు విన్న అనంతరం తీర్పును పలుమార్లు వాయిదా వేసిన సీఏఎస్ ఈనెల 14న వినేశ్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు ఏకవాక్యంలో తీర్పు ఇచ్చింది. ఇప్పుడు తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. 'క్రీడాకారులకు నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి. బరిలోకి దిగే బరువు కేటగిరీ కంటే ఎక్కువ ఉంటే అనుమతించరు. అది అందరికీ వర్తిస్తుంది. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. నిర్ణీత బరువు కంటే ఒక్క గ్రాము ఎక్కువ ఉన్న అనర్హత వేటు ఎదుర్కోవాల్సిందే. అందుకే పోటీపడే కేటగిరీ కంటే కాస్త తక్కువే ఉండాలి తప్ప ఎక్కువ ఉండకూడదు. దరఖాస్తు చేసుకున్న అథ్లెట్ (వినేశ్ ఫొగాట్‌ను ఉద్దేశించి) తాను అధిక బరువు ఉన్నానని స్పష్టంగా పేర్కొంది. ఇందులో ఎలాంటి వివాదం లేదు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా పొందుపరిచింది. దరఖాస్తుదారు అనుభవమున్న రెజ్లర్. గతంలో ఇలాంటి నిబంధనల నడుమ పోటీపడింది. రూల్స్ అర్థం చేసుకోలేకపోయిందనే సమస్యే తలెత్తదు. అయితే ఆమె అభ్యర్థన ఏంటంటే.. 100 గ్రాములు బరువు ఎక్కువ కాదని.. రుతుస్రావానికి ముందు దశలో అధికంగా నీరు తాగడం వల్లే ఇలా జరిగిందని.. తగిన సమయం లేనందు వల్లే బరువు తగ్గించలేకపోయానని.. మినహాయింపు ఇవ్వాలని కోరింది' అని సీఏఎస్ సోమవారం వివరణ ఇచ్చింది. కాగా మహిళల 50 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో వరుస విజయాలతో ఫైనల్ చేరిన వినేశ్.. తుది పోరుకు ముందు 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హతకు గురై ఒలింపిక్ పతకానికి దూరమైంది. తొలి రోజు పోటీల్లో నిర్ణీత బరువుతోనే పోటీపడి విజయాలు సాధించినందుకుగానూ... క్యూబా రెజ్లర్ గుజ్‌మన్ లోపెజ్‌తో కలిపి తనకూ రజతం ఇవ్వాలని వినేశ్ న్యాయపోరాటం చేసింది. పలు అంతర్జాతీయ టోర్నీల్లో రెండు కేజీల అధిక బరువు ఉన్నా యూడబ్ల్యూడబ్ల్యూ వారిని అనుమతిస్తోందని.. దీంతో వంద గ్రాములే కాబట్టి మినహాయించాలని సీఏఎస్‌లో అప్పీలు చేసింది. దీనికి భారత ఒలింపిక్ కమిటీ మద్దతిచ్చి నిష్ణాతులైన న్యాయ నిపుణులను నియమించింది. అయినా నిబంధనలు అందరికీ ఒక్కటే అని స్పష్టం చేసిన సీఏఎస్.. వినేశ్ అప్పీల్‌ను కొట్టేసింది. దీంతో దిగ్గజ రెజ్లర్ యూ సుసాకీపై విజయంతో సంచలనం సృష్టించడంతో పాటు.. ఒలింపిక్స్ ఫైనల్‌కు చేరిన తొలి మహిళా రెజ్లర్‌గా రికార్డుల్లోకెక్కిన వినేశ్‌కు నిరాశే ఎదురైంది.

రెండో ర్యాంక్‌లో అమన్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. సోమవారం విడుదల చేసిన పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగం ర్యాంకింగ్స్‌లో అమన్ రెండో స్థానంలో నిలిచాడు. అమన్ ఖాతాలో 51,600 పాయింట్లున్నాయి. ఈ ఏడాది అమన్ ఐదు టోర్నీల్లో పాల్గొని ఐదు పతకాలు సాధించడం విశేషం. ఓవరాల్‌గా 17 బౌట్‌లలో పోటీపడ్డ అమన్ 14 విజయాలు సాధించి, మూడు పరాజయాలు చవిచూశాడు. మొత్తం 163 పాయింట్లు స్కోరు చేసి, 54 పాయింట్లను ప్రత్యర్థులకు సమర్పించుకున్నాడు. జపాన్ రెజ్లర్, పారిస్ ఒలింపిక్స్‌లో 57 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచిన రె హిగుచి నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు.

పంకజ్ 'డబుల్'



ముంబై: భారత దిగ్గజ క్రీడాకారుడు పంకజ్ అద్వానీ మరోసారి సత్తా చాటుకున్నాడు. వెస్టర్న్ ఇండియా జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఇప్పటికే వివిధ విభాగాల్లో 27 ప్రపంచ టైటిల్స్‌ను గెలిచిన పంకజ్ ఈ చాంపియన్‌షిప్‌లో ముందు స్నూకర్ ఈవెంట్‌లో, ఆ తర్వాత బిలియర్డ్స్ ఈవెంట్‌లో టైటిల్స్‌ను సొంతం చేసుకున్నాడు. ఓఎన్‌జీసీ తరఫున బరిలోకి దిగిన పంకజ్ ఏడు గంటలపాటు సాగిన స్నూకర్ ఫైనల్లో 6–4 ఫ్రేమ్‌ల తేడాతో (11–72, 31–58, 95–40, 52–42, 69–43, 43–74, 25–59, 75–62, 84–58, 58–10) ఇండియన్ రైల్వేస్‌కు చెందిన కమల్ చావ్లాపై విజయం సాధించాడు. అంతకుముందు జరిగిన బిలియర్డ్స్ ఫైనల్లో పంకజ్ 822–520 పాయింట్ల తేడాతో శ్రీకృష్ణ (తమిళనాడు)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన పంకజ్‌కు రూ. 2 లక్షలు... రన్నరప్ శ్రీకృష్ణకు రూ. ఒక లక్షా 20 వేలు ప్రైజ్‌మనీగా లభించాయి. సెమీఫైనల్లో ఓడిన ధ్వజ్ హారియా, షాయన్ రజ్మీలకు రూ. 60 వేలు చొప్పున ప్రైజ్‌మనీ దక్కింది.

తొలి రౌండ్‌లోనే సుమిత్ పరాజయం



నార్త్ కరోలినా: విన్‌స్టన్–సాలెమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించలేకపోయాడు. ప్రపంచ 87వ ర్యాంకర్ బోర్నా చోరిచ్ (క్రొయేషియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 72వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 4–6, 2–6తో ఓడిపోయాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి మాత్రమే బ్రేక్ చేశాడు. 13 అనవసర తప్పిదాలు చేసిన భారత ప్లేయర్ ఏడు విన్నర్స్ మాత్రమే కొట్టాడు. మరోవైపు చోరిచ్ ఏకంగా 22 విన్నర్స్ కొట్టాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 4,160 డాలర్ల (రూ. 3 లక్షల 48 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఇదే టోర్నీ క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డ మరో భారత ప్లేయర్ దక్షిణేశ్వర్ సురేశ్ రెండో రౌండ్‌లో ఓటమి చవిచూశాడు. సురేశ్ 3–6, 4–6తో నాలుగో సీడ్ లెర్నర్ టియెన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.

సినిమా


• బ్రహ్మానందం

నవ్వులే నవ్వులు

'పద్మశ్రీ' బ్రహ్మానందం కీలక పాత్రలో ఆయన తనయుడు రాజా గౌతమ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సావిత్రి, ఉమేష్ యాదవ్ సమర్పణలో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. సోమవారం రక్షా బంధన్ సందర్భంగా ఈ సినిమాని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ''బ్రహ్మానందం, రాజా గౌతమ్ నటిస్తున్న ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్ 'బ్రహ్మ ఆనందం'. ఈ మూవీలో తాత, మనవడుగా వారు అలరించబోతున్నారు. రాజా గౌతమ్ స్నేహితుని పాత్రలో 'వెన్నెల' కిశోర్ ఫుల్ లెంగ్త్ రోల్‌లో కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆ విషయాన్ని మరచిపోయాను - చిరంజీవి


• నిహారిక, చిరంజీవి, యదు వంశీ

''మా నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా చక్కగా ఉంది. అందరూ కొత్త కుర్రాళ్లే అయినా చాలా బాగా నటించారు. సినిమా చూస్తున్నప్పుడు కొత్తవాళ్లు నటించారనే విషయాన్ని మరచిపోయాను. ఈ చిత్రంలో భావోద్వేగ సన్నివేశాలు చక్కగా పండాయి'' అని హీరో చిరంజీవి అన్నారు. నూతన నటీనటులతో (నలుగురు హీరోయిన్లు, 11 మంది హీరోలు) యదు వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలైంది. తాజాగా 'కమిటీ కుర్రోళ్ళు' వీక్షించిన చిరంజీవి యూనిట్‌ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ–''ఈ చిత్రాన్ని సహజంగా చిత్రీకరించటం కోసం టీమ్ పడ్డ కష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే. రీజనబుల్ బడ్జెట్‌లో తెరకెక్కించిన యదువంశీకి అభినందనలు. ఇటీవల విడుదలైన సినిమాల్లో 'కమిటీ కుర్రోళ్ళు' ముందంజలో ఉంటూ మంచి వసూళ్లు రాబడుతుండటం సంతోషంగా ఉంది'' అన్నారు. చిరంజీవిని కలిసిన వారిలో నిహారిక, యదు వంశీతో పాటు చిత్ర నటీనటులున్నారు.


• రజనీకాంత్

దసరాకి ఫిక్స్

దసరా పండక్కి థియేటర్స్‌లోకి రానున్నాడు 'వేట్టైయాన్'. రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై ఈ మూవీ నిర్మించారు సుభాస్కరన్ . ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, రోహిణి, అభిరామి, రితికా సింగ్, దుషారా విజయన్ ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమాను అక్టోబరు 10న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించి, రజనీకాంత్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. రిలీజ్ డేట్‌ని బట్టి చూస్తే దసరా సెలవులను ఈ సినిమా టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీకాంత్, లాయర్ పాత్రలో అమితాబ్ బచ్చన్ కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.

తల్వార్ ప్రారంభం


• విజయేంద్ర ప్రసాద్, ఆకాష్ జగన్నాథ్

ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ జగన్నాథ్ హీరోగా 'తల్వార్' సినిమా ప్రారంభమైంది. కాశీ పరశురామ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ వార్నిక్ స్టూడియోస్‌పై భాస్కర్ ఈఎల్‌వీ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ క్లాప్ కొట్టారు. తొలి సీన్‌కి దర్శకుడు బుచ్చిబాబు సాన గౌరవ దర్శకత్వం వహించారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అతి త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: కేశవ కిరణ్, కెమెరా: త్రిలోక్ సిద్ధు.

ఇప్పుడే మొదలైంది!

రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన చిత్రం 'భలే ఉన్నాడే!'. జె. శివ సాయి వర్ధన్ దర్శకత్వంలో మారుతీ టీమ్ సమర్పణలో ఎన్‌వీ కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 7న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ఆస్తిపాస్తులు లేకపోతే సంపాదించుకుంటాడులే అనుకోవచ్చు... అసలు.. భర్తగా పనికిరానివాడి కోసం ఏం మాట్లాడుకుంటావ్... ఏం సర్దుకుంటావ్', 'గుర్తుపెట్టుకో..


• మనీషా కంద్కూర్
• రాజ్ తరుణ్

ఇక్కడితో అయిపోలేదు.. ఇప్పుడే మొదలైంది..', 'ప్రేమించాను నాన్న.. వదిలేయలేను కదా..', వంటి డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. సింగీతం శ్రీనివాస్, అభిరామి కీలక పాత్రల్లో నటించిన ఈ మూవీకి శేఖర్ చంద్ర సంగీతం అందించారు.

ఓ మంచి సినిమా చూడబోతున్నారు - 'దిల్' రాజు


• 'దిల్' రాజు, సందీప్ రెడ్డి, సుహాస్, సంగీర్తన

''డైరెక్టర్ సందీప్ తన నిజ జీవిత ఘటనల ఆధారంగా 'జనక అయితే గనక' కథను తయారు చేశాడు. నేను ఈ మూవీ చూశాను. చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమాను ప్రేక్షకులు చూడబోతున్నారనే నమ్మకంతో ఉన్నాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సుహాస్, సంగీర్తన జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ మూవీ సెప్టెంబర్ 7న రిలీజ్ కానుంది. సోమవారం సుహాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి 'నా ఫేవరెట్ నా పెళ్లాం..' సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఇటీవల విడుదలైన 'కమిటీ కుర్రోళ్ళు, ఆయ్' సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఫ్రెష్‌గా ఫీలయ్యారో 'జనక అయితే గనక' ని కూడా అలాగే ఫీల్ అవుతారు'' అని తెలిపారు. ''నన్ను నమ్మి దర్శకునిగా అవకాశం ఇచ్చిన 'దిల్' రాజుగారికి ధన్యవాదాలు'' అని సందీప్ రెడ్డి పేర్కొన్నారు. ''యూనిక్ పాయింట్‌తో ఆసక్తికరమైన కథతో రూపొందిన చిత్రం ఇది'' అని హర్షిత్ రెడ్డి చెప్పారు. ''జీవితంలో మరచిపోలేని సినిమాని నాకు ఇచ్చినందుకు మా డైరెక్టర్ సందీప్‌గారికి థ్యాంక్స్'' అని సుహాస్ తెలిపారు. ఈ సాంగ్ లాంచ్‌లో సంగీర్తన, సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్, పాటల రచయిత కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ప్రేక్షకులను నవ్విస్తాను - రమ్య



''మారుతీనగర్ సుబ్రమణ్యం' చిత్రంలో సంప్రదాయకంగా, మోడ్రన్‌గా ఉంటాను. నవ్వించడం కష్టం. కానీ, ఈ చిత్రంలో నా పాత్ర ప్రేక్షకులను నవ్విస్తుంది. ఎమోషనల్‌గా కనెక్ట్ చేస్తుంది'' అని హీరోయిన్ రమ్య పసుపులేటి అన్నారు. రావు రమేష్, ఇంద్రజ, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి ప్రధాన తారలుగా లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రమణ్యం'. తబితా సుకుమార్ సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ– ''నా చిన్నతనం నుంచే నటి కావాలనుకున్నాను. అనుష్కగారి 'పంచాక్షరి'లో బాలనటిగా, మహేశ్‌బాబు గారి 'స్పైడర్'లో ఓ చిన్న రోల్ చేశాను. 'హుషారు' (2018) సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాను. అయితే చదువు పూర్తి చేయాలని నటనకు కాస్త దూరంగా ఉన్నాను. ఇక 'మారుతీనగర్ సుబ్రమణ్యం'లో రావు రమేష్, ఇంద్రజగార్లతో నటించడం మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్. అంకిత్ మంచి కో యాక్టర్. ప్రస్తుతం చిరంజీవిగారి 'విశ్వంభర', నార్నే నితిన్ 'మ్యాడ్ 2' చిత్రాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్!


• కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'క'. దర్శక ద్వయం సుజీత్, సందీప్ ఈ మూవీ తెరకెక్కించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కేఏ ప్రొడక్షన్స్‌పై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడలో రిలీజ్ కానుంది. కాగా సామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..' అంటూ సాగే తొలి పాటను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు సనాపతి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ అందించగా, కపిల్ కపిలన్ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం, సంగీతం: సామ్ సీఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చవాన్.

గ్యాంగ్ వస్తోంది


• జాకీష్రాఫ్

జాకీష్రాఫ్, ప్రియమణి, సన్నీలియోన్, సారా అర్జున్ లీడ్ రోల్స్‌లో నటించిన హిందీ చిత్రం 'క్యూ జీ: క్వటేషన్ గ్యాంగ్'. వివేక్ కుమార్ కన్నన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. గాయత్రీ సురేష్ మరో నిర్మాతగా వ్యవహరించారు. కాగా ఈ సినిమా తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ హక్కులను ఎం. వేణుగోపాల్ దక్కించుకున్నారు. రుషికేశ్వర్ ఫిలింస్ పతాకంపై ఆయన ఈ మూవీని రిలీజ్ చేయనున్నారు. 'క్యూ జీ' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఎం. వేణుగోపాల్.

ఎనిమిది వసంతాలు


• అనంతిక

'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం '8 వసంతాలు'. ఊటీ, హైదరాబాద్, కన్యాకుమారి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. కశ్మీర్, ఆగ్రా, వారణాసిలో తర్వాతి షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. మరోవైపు ఎడిటింగ్ వర్క్ కూడా జరుగుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమెరా: విశ్వనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబా సాయికుమార్ మామిడిపల్లి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
12	32
80,425	24,573

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,739	△ 108
డోజోన్స్	40,825	△ 166
ఎఫ్‌టీఎస్ఈ 100	8,357	△ 46
డాక్స్	18,422	△ 99
షాంఘై	2,893	△ 14
నికాయ్	37,389	▽ 674

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,108
బంగారం (99.5 స్వచ్ఛత)	70,823
వెండి (కిలో)	83,291

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసీఐ	83.49	84.51
£	బ్రిటన్ పౌండ్	ఎసీఐ	107.56	110.15
€	యూరో	ఎసీఐ	91.52	93.91
¥	జపాన్ ఎన్ (100)	ఎసీఐ	56.55	57.83
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.76	66.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.95	23.73
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.88	12.70

ఎయిర్‌లైన్స్‌కు పండుగే!

- ఓనమ్, దీపావళి బుకింగ్‌లకు ఆసక్తి
- డిమాండ్‌తో ధరలకు రెక్కలు
- 10–25 శాతం అధికం
- కొన్ని మార్గాల్లో తగ్గిన టికెట్ చార్జీలు

న్యూఢిల్లీ: రానున్న పండుగల సందర్భంగా విమాన ప్రయాణాల బుకింగ్‌లకు ఇప్పటి నుంచే డిమాండ్ ఊపందుకుంది. దీంతో ఎయిర్‌లైన్స్ సంస్థలు పలు మార్గాల్లో 10 శాతం నుంచి 25 శాతం మధ్య టికెట్ ధరలను పెంచేశాయి. దీపావళి సమయంలో ప్రయాణ టికెట్ల ధరలు 10–15 శాతం పెరగ్గా.. ఓనమ్ సమయంలో (సెప్టెంబర్ 6–15 మధ్య) కేరళలోని పలు పట్టణాలకు వెళ్లే విమాన సర్వీసుల్లో టికెట్ ధరలు గతేడాదితో పోల్చి చూస్తే 20–25 శాతం మేర పెరిగినట్టు ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో డేటా తెలియజేస్తోంది. దీపావళి సమయంలో ప్రయాణాలకు డిమాండ్ పెరుగుతోందని, దీంతో విమానయాన టికెట్ల ధరలు గతేడాదితో పోలిస్తే అధికమైనట్టు ఇక్సిగో గ్రూప్ సహ సీఈవో రజనీష్ కుమార్ తెలిపారు.

- అక్టోబర్ 30–నవంబర్ 5 మధ్య ఢిల్లీ–చెన్నై మార్గంలో ఒకవైపు ప్రయాణానికి ఎకానమీ తరగతి నాన్ స్టాప్ ఫ్లయిట్ టికెట్ ధర రూ.7,618గా ఉంది. క్రితం ఏడాది నవంబర్ 10–16తో పోల్చి చూస్తే 25 శాతం ఎక్కువ.
- ఇదే కాలంలో ముంబై–హైదరాబాద్ మార్గంలో ఫ్లయిట్ టికెట్ ధరలు 21 శాతం పెరిగి రూ.5,162కు చేరాయి.
- ఢిల్లీ–గోవా సర్వీసుల్లో టికెట్ ధరలు 19 శాతం పెరిగి రూ.5,999కు, ఢిల్లీ–అహ్మదాబాద్ మార్గంలో ఇంతే మేర పెరిగి రూ.4,980గా ఉన్నాయి.
- హైదరాబాద్–తిరువనంతపురం మార్గంలో టికెట్ ధరలు 30 శాతం ఎగసి రూ.4,102కు చేరాయి.
- కానీ, పండుగల సీజన్‌లోనే కొన్ని మార్గాల్లో టికెట్ చార్జీలు 1–27 శాతం మధ్య తగ్గడం గమనార్హం. ఉదాహరణకు బెంగళూరు–హైదరాబాద్ మార్గాల్లో టికెట్ ధరలు 23 శాతం తగ్గి రూ.3,383గా ఉంటే, ముంబై–జమ్మూ ఫ్లయిట్‌లలో 21 శాతం తక్కువగా రూ.7,826కే లభిస్తున్నాయి.
- ముంబై–అహ్మదాబాద్ విమాన సర్వీసుల్లో 27 శాతం తక్కువకే రూ.2,508 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ముంబై–ఉదయ్‌పూర్ మధ్య టికెట్ ధర 25 శాతం తగ్గి రూ.4,890గా ఉంది.




విమాన ప్రయాణికుల జోరు

దేశీయంగా జూలైలో 1.29 కోట్ల మందికి పైగా విమాన ప్రయాణాలు సాగించారు. 2023 జూలైతో పోలిస్తే ఇది 7.3 శాతం అధికం. అయితే 2024 జూన్‌తో పోలిస్తే గత నెల ప్రయాణికుల సంఖ్య 2.27 శాతం తక్కువగా ఉంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకారం.. దేశీయ విమాన ప్రయాణికుల విషయంలో ఇండిగో తన హవాను కొనసాగిస్తూ మార్కెట్ వాటాను జూలైలో 62 శాతానికి పెంచుకుంది. ఎయిర్ ఇండియా వాటా 14.3 శాతానికి వచ్చి చేరింది. విస్తారా వాటా 10 శాతానికి, ఆకాశ ఎయిర్ వాటా 4.7 శాతానికి పెరిగాయి.

ఏఎండీ చేతికి జెడ్‌టీ సిస్టమ్స్

డీల్ విలువ రూ. 41,000 కోట్లు



న్యూయార్క్: చిప్ తయారీ దిగ్గజం ఏఎండీ సర్వర్ల తయారీ కంపెనీ జెడ్‌టీ సిస్టమ్స్‌ను కొనుగోలు చేస్తోంది. ఇందుకు 4.9 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 41,000 కోట్లు) వెచ్చించనుంది. నగదు చెల్లింపు, షేర్ల జారీ ద్వారా జెడ్‌టీను సొంతం చేసుకోనున్నట్లు ఏఎండీ పేర్కొంది. దీంతో ఏఎండీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సామర్థ్యాలు మరింత మెరుగుపడనున్నాయి. వెరసి చిప్ తయారీలో ప్రత్యర్థి కంపెనీ ఎన్‌విడియాతో పోటీపడేందుకు తాజా కొనుగోలు ఉపయోగపడనుంది. న్యూజెర్సీ కంపెనీ జెడ్‌టీ సిస్టమ్స్ ప్రయివేట్ కంపెనీకాగా.. క్లౌడ్ కంపెనీలకు డేటా సెంటర్లు, స్టోరేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్‌ను డిజైన్ చేసి అందిస్తోంది. **డీల్ పూర్తయ్యాక ఏఎండీ డేటా సెంటర్ సొల్యూషన్స్ బిజినెస్ గ్రూప్‌లో జెడ్‌టీ సిస్టమ్స్ చేరనుంది.**


క్విక్ కామర్స్.. ఫ్యాషన్ షో!

కిరాణా సరుకులు.. కూరగాయలు.. మిల్క్ ప్రొడక్టులు.. ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులను 15 నిమిషాల్లో గుమ్మంలోకి చేరుస్తూ... శరవేగంగా దూసుకుపోతున్న క్విక్ కామర్స్ మరిన్ని ఉత్పత్తులను కార్ట్‌లోకి చేరుస్తోంది. నగరాల్లో సూపర్ సక్సెస్ నేపథ్యంలో అపారెల్, ఫుట్‌వేర్ కంపెనీలు దీనిపై ఫోకస్ చేస్తున్నాయి. ఫాస్ట్ సెల్లింగ్ జాబితాలో ముందున్న దుస్తులు, షూస్ ఇతరత్రా ఫ్యాషన్ ప్రొడక్టులను సైతం క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించేందుకు సై అంటున్నాయి.

జొమాటో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో.. ఈ క్విక్ కామర్స్ స్టార్టప్‌లు ఫుల్ స్వింగ్‌లో ఉన్నాయి. తమ ప్లాట్‌ఫామ్‌లలో ఇటీవలే ఫ్యాషన్ ప్రొడక్టుల అమ్మకాలు మొదలు పెట్టడంతో కస్టమర్లకు మరిన్ని రకాలు ప్రొడక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. జాకీ, అడిడాస్ బ్రాండ్స్‌కు చెందిన బేసిక్ కలర్ టీ–షర్టులు, ఇన్నర్‌వేర్ వంటి ఉత్పత్తులను ఇన్‌స్టామార్ట్ సేల్ చేస్తోంది. ఇక బ్లింకిట్ జాకీ, పెపే, అడిడాస్ టీ–షర్ట్స్, కొన్ని రకాల ఫుట్‌వేర్, ట్రాక్ ప్యాంట్లతో పాటు లోదుస్తులను ఆఫర్ చేస్తోంది. జెప్టో కూడా నేను సైతం అంటూ రంగంలోకి దూకింది. దీంతో మరిన్ని ఆపారెల్, ఫుట్‌వేర్ బ్రాండ్స్ క్విక్ కామర్స్ అండతో అమ్మకాలు పెంచుకునేందుకు ప్లాన్ చేస్తున్నాయి. అరవింద్ ఫ్యాషన్స్, ఫ్యాబ్ ఇండియా, ఉడ్‌ల్యాండ్‌తో పాటు ప్యూమా తదితర దిగ్గజాలు క్విక్ కామర్స్ కంపెనీలతో జరుపుతున్న చర్చలు కొలిక్కి వచ్చినట్లు పరిశ్రమ వర్గాల సమాచారం. దేశంలోని 15 టాప్ నగరాల్లో కస్టమర్లు తమ **నిత్యావసరాల కోసం క్విక్ కామర్స్ బాట పడుతున్నారు. దీంతో మరింత మందిని బుట్టలో వేసుకోవాలని** చూస్తున్న ఈ ప్లాట్‌ఫామ్‌లు గ్రాసరీలు, ఎఫ్‌ఎంసీజీకి మించి తమ పరిధిని విస్తరించడంపై ఫోకస్ చేస్తున్నాయి.

ఆ రెండు విభాగాలపై గురి...

ప్రస్తుతం భారత ఈ–కామర్స్‌లో మార్కెట్లో ఎలక్ట్రానిక్స్–స్మార్ట్ ఫోన్స్ తర్వాత అత్యధికంగా అమ్ముడవుతున్నది ఫ్యాషన్ ఉత్పత్తులే. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 20–25 శాతంగా అంచనా. దీంతో ఫ్యాషన్ ప్రొడక్టుల అమ్మకం అటు బ్రాండ్‌లతో, ఇటు క్విక్ కామర్స్ సంస్థలకు ఉభయతారకంగా నిలుస్తుందని విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఎలక్ట్రానిక్స్–స్మార్ట్ ఫోన్స్ విభాగంలోకి కూడా దూకేందుకు ఈ స్టార్టప్‌లు ఉవ్విళ్లూరుతున్నాయి. యారో, కాల్విన్ క్లీన్, టామీ హిల్ఫిగర్, యూఎస్ పోలో వంటి టాప్ బ్రాండ్‌లను విక్రయించే అరవింద్ ఫ్యాషన్స్.. క్విక్ కామర్స్ ద్వారా ముందుగా టీ–షర్టులు, ఇన్నర్‌వేర్‌తో పాటు బెల్టులు, సాక్స్‌ల వంటి యాక్సెసరీలను క్విక్ కామర్స్‌లో విక్రయించనుంది. ఐపీఎల్ సీజన్‌లో టీమ్ జెర్సీలను ఈ ప్లాట్‌ఫామ్‌లలో జోరుగా విక్రయించిన ప్యూమా... ఇతర ప్రొడక్టులకు సైతం తమ భాగస్వామ్యాన్ని విస్తరించే సన్నాహాల్లో ఉంది. 'ఇన్‌స్టంట్ డెలివరీని ఎంచుకుంటున్న వినియోగదారుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఫ్యాషన్ రంగంలో కూడా క్విక్ కామర్స్ సూపర్ హిట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ–కామర్స్‌లో మా కంపెనీ సేల్స్ 30 శాతానికి చేరుకున్నాయి' అని ఉడ్‌ల్యాండ్ ఇండియా సీఈఓ హర్కీరత్ సింగ్ చెప్పారు. రిటర్న్‌లు చాలా తక్కువగా ఉండే బేసిక్ ప్రొడక్టులను తాము ఈ ప్లాట్‌ఫామ్‌లో విక్రయించనున్నట్లు ఫుట్‌వేర్ సంస్థ లిబర్టీ వెల్లడించింది. బాటా కూడా క్విక్ కామర్స్ రూట్లో వెళ్తోంది. '10–15 నిమిషాల్లో డెలివరీ చేసేలా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే దీన్ని అమల్లోకి తీసుకొస్తాం' అని బాటా ఇండియా సీఈఓ, ఎండీ గుంజన్ షా వెల్లడించారు.



దుస్తులు, షూస్ వంటి ఫ్యాషన్ ప్రొడక్టుల డెలివరీకి సై...

- ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్, జెప్టోతో కంపెనీల జట్టు
- జాబితాలో అడిడాస్, ప్యూమా, మాన్యవర్...
- త్వరలో అరవింద్, ఫ్యాబ్ ఇండియా, ఉడ్‌ల్యాండ్, బాటా కూడా

నో రిటర్న్ పాలసీ...

ఈ–కామర్స్ మాదిరిగా క్విక్ కామర్స్‌లో ప్రొడక్టులు నచ్చకపోతే వెనక్కి తిరిగిచ్చేందుకు రిటర్న్ పాలసీ లేదు. తయారీపరమైన లోపాలకు మాత్రమే నగదును రీఫండ్ చేస్తున్నాయి. ఫ్యాషన్ రంగంలో సైజ్, రంగులు ఇతరత్రా కారణాలతో రిటర్న్ చేసే కస్టమర్లు ఎక్కువ. దీంతో ఉడ్‌ల్యాండ్ వంటి బ్రాండ్‌లు తమ స్టోర్స్ ద్వారా రిటర్న్ పాలసీని అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నాయి. కాగా, వివిధ ప్రదేశాల్లోని రిటైల్ స్టోర్లలో స్టాక్‌ను తమ ప్లాట్‌ఫామ్‌లకు లింక్ చేసి, ఎక్కువ ప్రొడక్టులను కస్టమర్లకు అందించాలనేది క్విక్ కామర్స్ సంస్థల వ్యూహం. ఎందుకంటే ఫ్యాషన్ ఉత్పత్తులను తమ డార్క్ స్టోర్లలో (వేగంగా డెలివరీ చేసేందుకు ఏర్పాటు చేసే భారీ గోదాములు) నిల్వ చేసేందుకు తగినంత స్థలం లేకపోవడం వాటికి పెద్ద సమస్య అవుతుందనేది పరిశ్రమ వర్గాల అభిప్రాయం. అయితే, ఫాస్ట్ సెల్లింగ్ ఉత్పత్తులైన ఇన్నర్‌వేర్, సాక్సులు, వైట్, సాలిడ్ కలర్ టీ–షర్టులు, బ్లాక్ ట్రౌజర్లు, బ్లూజీన్స్, కుర్తాలు, ఫార్మల్ బ్లాక్ షూస్, స్కూల్ షూస్, ఇంట్లో వాడే స్లిప్పర్స్, వాకింగ్ స్నీకర్స్ వంటివి తమ డార్క్ స్టోర్లలో నిల్వ చేయడం ద్వారా 15 నిమిషాల్లోనే డెలివరీ చేయొచ్చనేది క్విక్ కామర్స్ కంపెనీల యోచన.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సెన్సెక్స్ మైనస్.. నిఫ్టీ ప్లస్

పరిమిత శ్రేణిలో ట్రేడింగ్



ముంబై: ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలక కాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు సోమవారం ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ 12 పాయింట్లు నష్టపోయి 80,425 వద్ద, నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 24,573 వద్ద స్థిరపడ్డాయి. ప్రారంభంలో మెటల్, ఆయిల్అండ్‌గ్యాస్, ఇంధన, యుటిలిటీ, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రథమార్ధంలో సెన్సెక్స్ 287 పాయింట్లు పెరిగి 80,724 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు బలపడి 24,639 వద్ద గరిష్టాన్ని తాకాయి. అయితే, అంతర్జాతీయ మార్కెట్ల మద్దతు లేకపోవడంతో పాటు ఆటో, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో నెలకొన్న భారీ అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అధిక వాల్యుయేషన్ ఆందోళనలతో లార్జ్ క్యాప్ షేర్లలో లాభాల స్వీకరణ చేసుకుంది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1.33%, 0.53% చొప్పున లాభపడ్డాయి.

- ఓలా షేరు లాభాల జోరు తగ్గడం లేదు. బీఎస్ఈలో 10% ర్యాలీ చేసి రూ.146 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ హెచ్ఎస్‌బీసీ ఈ షేరుకు 'బై' రేటింగ్ ఇవ్వడం కలిసొచ్చింది. ఇష్యూ ధర (రూ.76)తో పోలిస్తే లిస్టింగ్ నుంచి ఈ షేరు 92% ర్యాలీ చేసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 64,411 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
డిపాజిట్ల పెంపుపై దృష్టి పెట్టండి: సీతారామన్
అమ్మకాల వృద్ధిపై ఎఫ్‌ఎంసీజీ ఆశలు!

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 300 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు



చెన్నైలోని ఇండియన్ బ్యాంక్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ రాష్ట్రాల్లోని బ్యాంక్ శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 300.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** తమిళనాడు/పుదుచ్చేరి–160, కర్ణాటక–35, ఆంధ్రప్రదేశ్ /తెలంగాణ–50, మహారాష్ట్ర–40,గుజరాత్–15.
- **అర్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి 85,920
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొత్తం 200 మార్కులకు 155 ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(45 ప్రశ్నలు–60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు–40 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(35 ప్రశ్నలు–40 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ (35 ప్రశ్నలు– 60 మార్కులు). పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభతేది:** 13.08.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.09.2024.
- **వెబ్‌సైట్:** https://www.indianbank.in

ఫ్రెషర్స్‌కు మంచి రోజులు!

అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితులతో గతేడాది ఐటీ నియామకాల్లో మందగమనం కొనసాగింది! ప్రముఖ కంపెనీలు టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌కే పరిమితమయ్యాయి. దీంతో.. ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉంటుంది.. ఫ్రెషర్స్ నియామకాలు ఉంటాయా అనే సందేహాలు!! ఈ ఆందోళనలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా పలు దిగ్గజ సంస్థలు ఫ్రెషర్స్ నియామకాలకు సిద్ధమని స్పష్టం చేస్తున్నాయి!! ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది ఐటీలో రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, నియామక విధానాలు, సంస్థలు ఆశిస్తున్న నైపుణ్యాలు, ఎంపిక ప్రక్రియలో విజయానికి మార్గాలు తదితర వివరాలు..



- ఈ ఏడాది ఐటీలో పెరగనున్న ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్
- ఇప్పటికే నియామక ప్రణాళికలు ప్రకటించిన దిగ్గజ సంస్థలు
- ఆన్ క్యాంపస్, ఆఫ్-క్యాంపస్ విధానాల్లో ఎంపిక ప్రక్రియ

లక్షకు పైగా ఉద్యోగాలు

- ఇటీవల తొలి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసిన పలు ఐటీ సంస్థలు ప్రకటించిన నియామక ప్రణాళికలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ఏడాది ఫ్రెషర్స్‌కు దాదాపు లక్షకుపైగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఇన్ఫోసిస్ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 15 వేల నుంచి 20 వేల మంది ఫ్రెషర్స్‌ను నియమించుకుంటామని స్పష్టం చేసింది.
- టీసీఎస్ సైతం ఈ ఏడాది దాదాపు 40 వేల నియామకాలకు శ్రీకారం చుడుతోంది. దీంతో పాటు.. టీసీఎస్ ఎన్‌క్యూటీ ద్వారా దాదాపు లక్ష మందిని ఎంపిక చేసే దిశగా గతేడాదే ప్రణాళిక రూపొందించుకుంది.
- విప్రో సంస్థ కూడా ఈ ఏడాది 12 వేల నియామకాలు చేపడతాయని పేర్కొంది.
- మరో ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ పది వేల మంది ఫ్రెషర్స్‌కు అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతోంది.
- మొత్తంగా చూస్తే..2024–25లో ఫ్రెషర్స్ నియామకాలు 1.2 లక్షలుగా ఉంటాయని తాజా అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 60 వేలు మాత్రమే ఉంది. అంటే గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం అవకాశాలు రెట్టింపు కానున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్యాంపస్ నియామకాలు షురూ

ఐటీ కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ చేపట్టేందుకు తాజా పరిస్థితులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ఐఐటీల్లో ఇప్పటికే సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ 90 శాతం మందికి లభించాయి. త్వరలో జరగనున్న ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలోనూ ఇదే తరహా పరిస్థితులు పునరావృతమవుతాయని.. తాజా గ్రాడ్యుయేట్లందరికీ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు.

టాప్ సెక్టార్లు ఇవే

ప్రస్తుతం తాజా గ్రాడ్యుయేట్లు, టెక్ జాబ్స్ నియామకాల పరంగా ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్, హెచ్‌ఆర్ టెక్, ఫిన్–టెక్, ఈ–కామర్స్, ఈ–లెర్నింగ్, హెల్త్‌కేర్ రంగాలు టాప్ సెక్టార్లుగా నిలవనున్నాయి. ఇప్పుడు ఈ రంగాల్లో కార్యకలాపాలన్నీ సాంకేతిక విధానాల ద్వారా సాగించాలని సంస్థలు భావిస్తుండటమే దీనికి కారణం. దీంతో తాజా గ్రాడ్యుయేట్లు అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అకడమిక్ అర్హతలతో పాటు కంపెనీలు కోరుకునే లేటెస్ట్ స్కిల్స్ సైతం సొంతం చేసుకోవాల్సిన ఆవశ్యకత నెలకొంది.

ఎంపిక ప్రక్రియ

- ఐటీ రంగంలో ఒక్కో సంస్థ ఒక్కో తీరులో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది.
- టీసీఎస్.. టెక్నికల్ స్కిల్స్ మొదలు వ్యక్తిగత దృక్పథం వరకూ.. అన్ని కోణాల్లో పరిశీలించేలా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. నాలుగు రౌండ్లలో ఈ ప్రక్రియ చేపడుతోంది. అవి..ఆప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, మేనేజీరియల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ. టీసీఎస్ సంస్థ ఆఫ్ క్యాంపస్ విధానంలోనూ నియామకాలు చేపడుతోంది.

ఇన్ఫోసిస్.. ఇలా

ఇన్ఫోసిస్ ఫ్రెషర్స్ కోసం మూడంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. అవి.. అప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ. అప్టిట్యూడ్ టెస్ట్‌లో.. లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలో ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, కోడింగ్, లేటెస్ట్ టెక్నాలజీస్‌పై అవగాహనను పరిశీలిస్తారు. హెచ్‌ఆర్ రౌండ్ ఇంటర్వ్యూలో వ్యక్తిగత సామర్థ్యాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి ప్రశ్నలు అడుగుతారు.

నాలుగు రౌండ్లలో హెచ్‌సీఎల్

హెచ్‌సీఎల్ ఎంపిక ప్రక్రియ నాలుగు రౌండ్లలో జరుగుతుంది. అవి.. అప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ. అప్టిట్యూడ్ టెస్ట్‌లో అభ్యర్థుల్లోని మ్యాథమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రెండో రౌండ్‌లో గ్రూప్ డిస్కషన్(జీడీ) నిర్వహిస్తారు. జీడీలో చూపిన ప్రతిభ ఆధారంగా టెక్నికల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. టెక్నికల్ ఇంటర్వ్యూలో కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఇందులో విజయం సాధిస్తే.. చివరగా హెచ్‌ఆర్ ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది.

విప్రో.. మూడు దశలుగా


విప్రో సంస్థ ఫ్రెషర్స్ నియామకాల్లో మూడంచెల ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. అప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. అప్టిట్యూడ్ టెస్ట్‌లో.. అనలిటికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, టెక్నికల్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. టెక్నికల్ ఇంటర్వ్యూలో.. ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, కోడింగ్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో భవిష్యత్తు లక్ష్యాలు, అకడమిక్ విజయాలు తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ఈ నైపుణ్యాలకే పెద్ద పీట

ప్రస్తుతం ఐటీ సంస్థల ఎంపిక ప్రక్రియలో ఏఐ నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ అనాలిసిస్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, బిగ్ డేటా టెక్నాలజీస్, మెషీన్ లెర్నింగ్, కాగ్నిటివ్ లెర్నింగ్, ఏపీఐ ఇంటర్‌ఫేస్ నైపుణ్యాలపై సంస్థలు ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. టెక్నికల్ స్కిల్స్‌లో ప్రధానంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తున్నాయి.

ప్రతిభావంతులకు ఓఎన్‌జీసీ ఉపకారం

» యూజీ, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ చమురు, సహజ వాయువు విభాగానికి సంబంధించి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఈ సంస్థ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందించేందుకు 2024-25 విద్యాసంవత్సరానికి స్కాలర్‌షిప్ ప్రకటన విడుదల చేసింది. ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న పేద విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.అర్హత,ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 18లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

మొత్తం స్కాలర్‌షిప్పుల సంఖ్య 2000

ఓఎన్‌జీసీ ఏటా అందించే మొత్తం రెండు వేల స్కాలర్‌షిప్‌ల్లో ఎస్సీ, ఎస్టీలకు 1000, ఓబీసీలకు 500, జనరల్ అభ్యర్థులకు 500 చొప్పున కేటాయించారు. వీటికి దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులు చదువుతున్న వారు అర్హులు. అన్ని విభాగాల్లోనూ 50శాతం స్కాలర్‌షిప్పులను మహిళలకు కేటాయిస్తారు.ఎంపికైన వారికి నెలకు రూ.4000 చొప్పున ఏడాదికి రూ.48 వేల స్కాలర్‌షిప్పు అందుతుంది. కోర్సు పూర్తయ్యేంతవరకు ఈ స్కాలర్‌షిప్పులను అందిస్తారు.

కోర్సుల వారీగా స్కాలర్‌షిప్స్

ఇంజనీరింగ్ విద్యార్థులకు 1100 స్కాలర్‌షిప్‌లు, ఎంబీబీఎస్ విద్యార్థులకు 190, ఎంబీఏలకు 240, జియాలజీ/జియోఫిజిక్స్ 470 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జనరల్ కేటగిరీల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పులకు అర్హులు. వీరు ఏదైనా విద్యాసంస్థలో ఫుల్‌టైమ్ కోర్సు రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఇంజనీరింగ్ (బీఈ/బీటెక్), ఎంబీబీఎస్, పీజీ స్థాయిలో మేనేజ్‌మెంట్/జియాలజీ /జియోఫిజిక్స్‌ల్లో 2024-2025 విద్యా సంవత్సరంలో చేరిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. అలాగే పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులైతే డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు పొందాలి. తల్లిదండ్రుల వార్షికదాయం ఓబీసీ, జనరల్–ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.2 లక్షలకు మించరాదు. అదేవిధంగా ఎస్సీ,ఎస్టీలకు రూ.4.5 లక్షలలోపు ఉండాలి.

- **వయసు:** ఆగస్టు 01,2024 నాటికి విద్యార్థుల వయసు 30 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక ఇలా

ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులకు ఇంటర్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా; ఎంబీఏ, జియాలజీ, జియోఫిజిక్స్ కోర్సులకు డిగ్రీలో చూపిన ప్రతిభ ఆధారిత స్కాలర్‌షిప్పులకు ఎంపిక చేస్తారు.

స్కాలర్‌షిప్పు వ్యవధి

ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరినవారికి నాలుగేళ్లు;ఎంబీఏ,జియాలజీ,జియోఫిజిక్స్ కోర్సుల్లో చేరినవాళ్లకు రెండేళ్లపాటు నెలకు రూ.4000 చొప్పున చెల్లిస్తారు.

5 జోన్లుగా స్కాలర్‌షిప్పులు

దేశంలోని మొత్తం ప్రాంతాలను 5 జోన్లుగా విభజించారు. ఇందులో ఏపీ, తెలంగాణ జోన్ 5 పరిధిలో ఉన్నాయి. అభ్యర్థులు చదువుతున్న కాలేజీ ఉన్న రాష్ట్ర ప్రకారం జోన్ నిర్ణయిస్తారు. ఒక్కో జోన్ నుంచి ఎస్సీ, ఎస్టీలకు 200, ఓబీసీలకు 100, జనరల్ అభ్యర్థులకు 100 చొప్పున వీటిని ఇస్తారు.

నిబంధనలు

కేవలం పైన తెలిపిన కోర్సుల్లో భారత్‌లో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. స్కాలర్‌షిప్పు కొనసాగాలంటే ప్రతి ఏడాది వార్షిక పరీక్షల్లో కనీసం 60శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. అంతకంటే తక్కువ మార్కులు పొందితే ఆ తర్వాత విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్పు అందదు. ఎంపికైన వారి వివరాలను ఓఎన్‌జీసీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

దరఖాస్తు ఇలా

- ఓఎన్‌జీసీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుచేయాలి. కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి మార్కుల పత్రం, ఇంటర్ లేదా గ్రాడ్యుయేషన్ మార్కుల షీట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు వివరాలు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలను అందించాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 18
- **వెబ్‌సైట్:** https://ongcscholar.org

క్లుప్తంగా...

జీపీలు, ఏజీపీల తొలగింపు సబబే


ప్రభుత్వ జీవోను సమర్థించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జిల్లా కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదులను తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో సబబేనంటూ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు 21 మంది దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేసింది. జిల్లా కోర్టుల్లో గత ప్రభుత్వ హయాంలో కొందరు జీపీలు, ఏజీపీ, ఏపీపీ, ప్రత్యేక న్యాయవాదులుగా నియామకమయ్యారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వీరందరినీ తొలగిస్తూ జూన్ 26న న్యాయ శాఖ జీవో నంబర్ 354ను విడుదల చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ భువనగిరికి చెందిన జీపీ నాగారం అంజయ్య సహా 21 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ గడువు ముగియకున్నా ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయించేందుకే జీవో తెచ్చారని..ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రభుత్వ జీవోను సమర్థిస్తూ తీర్పునిచ్చారు.

'న్యాయవాదిపై దాడి వివరాలివ్వండి'

సాక్షి, హైదరాబాద్: న్యాయవాది పి.సంతోష్‌పై పోలీసుల దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆదేశించారు. బెల్టుషాప్ నడిపిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఆగస్టు 16న పోలీసులు సంతోశ్ నివసిస్తున్న అద్దె ఇంటికి వచ్చారని హెచ్‌సీఏఏ తరఫున అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి.. హైకోర్టులో సీజే దృష్టికి తీసుకొచ్చారు. అకారణంగా సంతోశ్‌పై పోలీసులు దాడి చేయడంతో అతని చేయి విరిగిందని..స్టేషన్‌కు తరలించార న్నా రు. చట్టవిరుద్ధంగా తలుపు పగులగొట్టే ప్ర యత్నం చేయడాన్ని సంతోష్ తప్పుబట్టారు. ఈ సందర్భంగా బాధితుడితో పాటు హెచ్‌సీఏఏ విజ్ఞప్తిని పరిశీలించిన సీజే.. వివరాలు తెలుసుకుని చెప్పాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

ఏటా కోట్లు ఖర్చు.. అయినా దోమలు హెచ్చు



నేడు ప్రపంచ మస్కిటో డే

- నివారణ చర్యలు తూతూమంత్రం.. నిధుల వ్యయం నిజం
- చెరువులు, నాలాలు, నిర్మాణ ప్రదేశాల్లో దోమల వృద్ధి
- నగరంలో పెరుగుతున్న డెంగీ కేసులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఏటా కనిష్టంగా 6 లక్షల మంది దోమకాట్లతో మృత్యువాత పడుతున్నారు. ఐదేళ్లక్రితం 7 లక్షలకు పైగా ఉన్న ఈ మరణాలు ప్రస్తుతం 6–7 లక్షల మధ్య ఉంటున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ సహా అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోనూ దోమల ప్రభావం తక్కువేం లేదు. దోమల వల్ల వచ్చే వ్యాధుల్లో ప్రాణాంతకమైన డెంగీ కేసులు నగరంలోని ఒక్క ఫీవర్ ఆస్పత్రిలోనే గత నెలాఖరు వరకు 193 నమోదయ్యాయి. అంటే ఇక మిగతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వెరసి ఎన్ని కేసులుంటాయో అంచనా వేసుకోవచ్చు. గ్రేటర్‌లో జనాభాతో పాటు దోమలూ పెరుగుతున్నాయి.

జీహెచ్‌ఎంసీ ఏటా మలేరియా, డెంగీ జ్వరాల నిరోధానికి దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు, మందుల స్ప్రే, ఫాగింగ్ మెషీన్లు, పవర్‌స్ప్రేయర్లు, చెరువుల్లో వేసే ఆయిల్‌బాల్స్ తదితరమైన వాటి పేరిట రూ.22 కోట్లు ఖర్చు చేస్తోంది. చెరువుల్లో గుర్రపు డెక్క నివారణకు ప్రత్యేక యంత్రాలు, చెరువుల మధ్యలో మందులు స్ప్రే పేరిట డ్రోన్ల వినియోగం వంటి ఖర్చులు అదనం. సిబ్బంది జీతభత్యాలు, వాహనాల ఖర్చు తదితరమైనవి పరిగణనలోకి తీసుకుంటే ఏటా దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేస్తోంది. అయినా నగరంలో దోమలు తగ్గడం లేవు. జీహెచ్‌ఎంసీ ప్రకటనల్లో కనిపించే దోమల నివారణ, అవగాహన కార్యక్రమాలు తూతూమంత్రమే. అందుకే కాబోలు ఎన్ని మలేరియా, డెంగీ కేసులున్నాయో తెలిపేందుకు జీహెచ్‌ఎంసీ వెనుకాడుతోంది. ఎంటమాలజీ విభాగంలోని సీనియర్ అధికారులు ఎన్ని పర్యాయాలు బదిలీలు జరిగినా, పదోన్నతులు సైతం వదులుకొని బల్దియాలోనే తిష్ట వేస్తున్నారంటే దోమల పేరిట దండుకునే నిధులేననే విమర్శలున్నాయి. మరోవైపు నగర ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు రిపెల్లెంట్ లిక్విడ్స్, కాయిల్స్, బ్యాట్స్, దోమ తెరలు తదితరమైన వాటికి ఏటా దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా.

దోమల పేరిట ఏటా వంద కోట్లు..

ఫలితమివ్వని 'మస్క్యూట్'

నగరంలో ఏ తెగకు చెందిన దోమలెక్కువగా ఉన్నాయో గుర్తించేందుకు జీహెచ్‌ఎంసీ 'మస్క్యూట్' అనే దోమల ట్రాప్ మెషీన్లను జోన్‌కొకటి చొప్పున ఐదారేళ్ల క్రితం ఏర్పాటు చేసింది. వాటిల్లో ఉండే లిక్విడ్, సెన్సర్లతో ప్రత్యేక వాసనలతో దోమలు ఆకర్షితమై వాటిల్లోకి చేరుతాయని, సంబంధిత డ్యాష్‌బోర్డు ద్వారా ఏ తెగవి ఎక్కువో తెలుసుకొని తగిన నివారణ చర్యలు చేపడతామన్నారు. కానీ మెషీన్లు పనిచేయక ప్రయోజనం లేకుండా పోయింది.

అవగాహన కార్యక్రమాలేవీ ?

దోమలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ దాదాపు ఏడేళ్ల క్రితం 'మస్కిటోయాప్'ను అందుబాటులోకి తెచ్చింది. దోమలకు సంబంధించిన అంశాలపై సరైన సమాధానాలు చెప్పిన పదిమందికి రూ.10వేల వంతున నెలకు లక్షరూపాయల బహుమతులందజేసింది. ఇప్పుడలాంటి కార్యక్రమాల్లేవు.

ఇవాంకాను మాత్రం కుట్టకుండా..

నగరంలో 2017లో గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు గోల్కొండకోటలో విందుకు హాజరైన అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్‌ను కుట్టకుండా ఉండేందుకు దోమలను పూర్తిగా నివారించగలిగిన బల్దియా.. ఆ తర్వాత ఎందుకు నివారించలేకపోతోందో అధికారులే చెప్పాలి!

సర్ రోనాల్డ్ రాస్ అనాఫిలిస్ ఆడదోమ కారణంగా మనుషులకు మలేరియా సోకుతుందని 1897 ఆగస్టు 20న కనిపెట్టారు. దీంతో ఏటా ఆగస్టు 20న ప్రపంచ మస్కిటో దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజలు దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నిల్వనీరు లేకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి. వర్షాకాలంలో కాచి, చల్లార్చి వడపోసిన నీటిని తాగడం, ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినడం మంచిది. సీజనల్ వ్యాధులకు వాడే అన్ని మందులు ఫీవర్ ఆస్పత్రిలో ఉన్నాయి. ఏ జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

-డా. జయలక్ష్మి, ఆర్ఎంఓ, ఫీవర్ హాస్పిటల్

దోమల హాట్‌స్పాట్స్..

నగరంలో దోమల వ్యాప్తి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను(హాట్‌స్పాట్స్) 5 భాగాలుగా విభజించి జీహెచ్‌ఎంసీ ఈ సీజన్‌లో సర్వే చేసింది. తాళాలు వేసిఉన్న ఇళ్లతోపాటు నిర్మాణ ప్రదేశాల్లో ఎక్కువగా దోమలు న్నాయని ఆ సర్వేలో తేలింది.

ప్రదేశాలు	హాట్‌స్పాట్స్
నిర్మాణ ప్రాంతాలు	6,370
ఫంక్షన్‌హాళ్లు	767
సెల్లార్లు	4,634
ఓపెన్‌ప్లాట్లు	6,157
తాళాలు వేసిన ఇళ్లు	9,680

- వీటిల్లో నిర్మాణ ప్రాంతాల్లోని హాట్‌స్పాట్స్‌లో అధికంగా కూకట్‌పల్లి జోన్‌లో 1,957, శేరిలింగంపల్లి జోన్‌లో 1,141ఉన్నాయి.
- ఫంక్షన్‌హాళ్లలో చార్మినార్ జోన్‌లో అధికంగా 286 హాట్‌స్పాట్స్ ఉన్నాయి. సెల్లార్లలో ఖైరతాబాద్ జోన్‌లో అధికంగా 1,103 హాట్‌స్పాట్స్ ఉన్నాయి.
- ఓపెన్‌ప్లాట్స్‌లో కూకట్‌పల్లి జోన్‌లో అధికంగా 1,577 హాట్‌స్పాట్స్ ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్ల కేటగిరీలోనూ ఈ జోన్‌లోనే అధికంగా 2,312 హాట్‌స్పాట్స్ ఉన్నాయి.



ఢిల్లీలో.. 'మస్కిటో టెర్మినేటర్ ఆన్ వీల్స్' రైలు

జాతీయ రాజధాని ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) ప్రాంతంలో దోమల నివారణకు ప్రత్యేకంగా ఒక రైలునే నడుపుతున్నారు. 'మస్కిటో టెర్మినేటర్ ఆన్ వీల్స్' పేరిట గత శుక్రవారమే ప్రారంభించిన ఈ రైలులో ఇంజన్, దాని వెనుక ఒక గూడ్స్ వ్యాగన్ ఉన్నాయి. దీనిపై దోమల మందును వెదజల్లే స్పెషల్ ట్రక్కును అమర్చారు. దీనితో ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలో 75 కిలోమీటర్ల పొడవునా.. ట్రాక్‌కు ఇరువైపులా 50–60 మీటర్ల వరకు దోమల మందును వెదజల్లుతున్నారు. సెప్టెంబర్ 21 వరకు ఈ ట్రిప్‌ను నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు.

ముంబైలో 'భాగ్ మచ్చర్ భాగ్'

ముంబై మహా నగరంలో దోమల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కోసం అక్కడి 'బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)' చర్యలు చేపట్టింది. గత నెల 18న 'భాగ్ మచ్చర్ భాగ్ (పారిపో దోమ పారిపో)' అంటూ ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. నగరవ్యాప్తంగా పారిశుధ్య చర్యలను విస్తృతం చేసింది. కాలనీలు, బస్తీల్లో వృధా నీరు నిల్వ ఉండకుండా చూసింది. మరాఠీ, హిందీ సినిమా ప్రముఖులతో దోమల నివారణ, నియంత్రణపై ప్రత్యేక అవగాహన కల్పించేలా షార్ట్ మూవీస్ నిర్మించి ప్రచారం చేసింది.

చెన్నైలో.. 'డ్రోన్ల'తో దోమల వేట!

దోమల నియంత్రణ కోసం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత నెల 8న ఆరు డ్రోన్లను రంగంలోకి దింపింది. ఆ డ్రోన్ల సాయంతో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల్లో దోమల లార్వాలను చంపేసే మందును చల్లడం ప్రారంభించింది. అదే సమయంలో నగరవ్యాప్తంగా దోమల నివారణ చర్యల కోసం 3,200 సిబ్బందితో ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది.



ఫీవర్ ఆస్పత్రిలో ఈ ఏడాది డెంగీ నిర్ధారణనైన వారు ఇలా...

నెల	కేసులు
జనవరి	35
ఫిబ్రవరి	25
మార్చి	12
ఏప్రిల్	32
మే	29
జూన్	19
జూలై	41
మొత్తం	193

గ్రాట్యుటీ దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదు

- అది ఉద్యోగి హక్కు.. సింగిల్ జడ్జి తీర్పును సమర్థించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ పొందిన తర్వాత ఇచ్చే గ్రాట్యుటీ.. దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదని, అది ఉద్యోగి హక్కు అని సింగిల్ జడ్జి ఇచ్చిన ఓ తీర్పును హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకో లేమంటూ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)కు తేల్చిచెప్పింది. ఈసీఐఎల్ అప్పీల్‌ను కొట్టివేసింది. ఓ కేసులో వాద నలు పూర్తికావడంతో ఆగస్టు 5న తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం.. ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. పెంచిన గ్రాట్యుటీకి ఉద్యో గులు అర్హులంటూ ప్రావిడెంట్ ఫండ్ అప్పీలేట్ అథారిటీ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈసీఐఎల్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2007–10 వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.3.5 లక్షలు కాకుండా రూ.10 లక్షలు చెల్లించాలన్న అథారిటీ తీర్పును కొట్టివేయాలని కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ఉద్యోగుల సేవలను గుర్తించి చెల్లించేది గ్రాట్యుటీ అని, ఒకరి దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదని తేల్చిచెప్పారు. కేంద్రం 2008, నవంబర్‌లోనే ఆఫీస్ మెమోరాండం జారీ చేసినందున ఈ ఉద్యోగులు గరిష్ట పరిమితికి అర్హులేనని స్పష్టం చేశారు. ఒకవేళ ఉద్యోగి మరణిస్తే అతని వారసులకు అది చెందుతుందన్నారు. ఈసీఐఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. కాగా, సింగిల్ జడ్జి తీర్పును కూడా సవాల్ చేస్తూ ఈసీఐఎల్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టి.. సోమవారం తీర్పు వెలువరించింది. కంపెనీ నిబంధనల మేరకే చెల్లింపులు ఉంటాయని ఈసీఐఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. గ్రాట్యుటీని పెంచుతూ కేంద్రం సవరించిన చట్టం 2010, మే 24 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ ఉద్యోగులు 2010 కంటే ముందే పదవీ విరమణ పొందినందున వారికి కొత్త చట్టం వర్తించదన్నారు. ఉద్యోగుల తరఫున న్యాయ వాది వాదనలు వినిపిస్తూ.. గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ 2007నే బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తీర్మానం చేశారన్నారు. గతంలో ఇలాంటి అంశంలో ఉద్యోగులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువరించిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

పదాల కంటే ఫొటోల ప్రభావమే ఎక్కువ...

- భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఫొటోలకు ఉంది..
- ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న యాకయ్య, శివప్రసాద్, బాలస్వామి. చిత్రంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు

అమీర్‌పేట/కాచిగూడ: ఒక వార్తలో సారాంశం మొత్తాన్ని ఒకే ఒక చిత్రంలో చూపించగలిగే ప్రతిభా నైపుణ్యాలు కేవలం ఫొటో జర్నలిస్టులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ ఆధ్వర్యంలో అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్‌లో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అదేవిధంగా బషీర్‌బాగ్, దేశోద్ధారక భవన్ (ప్రెస్‌క్లబ్)లో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా ప్రారంభించారు. ఔత్సాహిక ఫొటోజర్నలిస్టులు తీసిన చిత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ...తనకు పత్రికలు చదివే అలవాటుందని, పత్రికల్లో వచ్చిన వార్తలన్నింటినీ చదవలేము కానీ అన్ని ఫొటోలను మాత్రం చూస్తానన్నారు. ఫొటోలకు బలమైన భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఉంటుందని, అవి పదాల కంటే వేగంగా ప్రజలను ప్రభావితం చేస్తాయని చెప్పారు.

కళ్లకు కట్టినట్లు చూపించారు: పొంగులేటి

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చాక ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎనిమిది నెలలుగా పడ్డ కష్టాలు, చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని 15 నిమిషాల్లో ఫొటోల ద్వారా కళ్లకు కట్టినట్లుగా చూపించారని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇలాంటి చిత్రాలు తీసిన ఫొటో జర్నలిస్టులను ప్రభుత్వం తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. ఫొటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీనిచ్చారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఫొటోగ్రాఫర్లు ధైర్య సాహసాలు కలిగి ఉంటారని, ఫొటో లేకుండా పత్రికలే ఉండవన్నారు. ప్రతి ఫొటో ఓ కథ చెప్తుతుంది, నేటి చిత్రం రేపటికి మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు తెలిపారు. అనంతరం ఫొటో కాంటెస్ట్‌లో గెలుపొందిన ఫొటో జర్నలిస్టులకు బహుమతి కింద రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, మహాలక్ష్మి పథకాలపై తీసిన చిత్రాల ఫొటోగ్రాఫర్లకు సైతం ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహకాలు ఇవ్వడంతోపాటు మరో 25 మందికి కన్సోలేషన్ బహుమతులను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కె.విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి, పి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

'రైతు భరోసా'థీమ్‌పై తీసిన ఫొటోకు అనమాల యాకయ్య (సూర్యాపేట)కు ద్వితీయ బహుమతి, 'గృహజ్యోతి'పై తీసిన ఫొటోకు కన్సోలేషన్ బహుమతి లభించాయి. బగిలి శివప్రసాద్ (సంగారెడ్డి)కు 'చేయూత'పథకంపై తీసిన ఫొటోకు ద్వితీయ బహుమతి లభించింది. అలాగే, 'మహాలక్ష్మి'థీమ్‌పై తీసిన ఫొటోకు గాను గడిగె బాలస్వామి (హైదరాబాద్) కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 20-8-2024

హెల్త్

అడినాయిడ్స్ అంటే...?

చాలామంది అడినాయిడ్స్, టాన్సిల్స్... ఈ రెండింటినీ ఒకటే అనుకుని పొరబడుతుంటారు. అడినాయిడ్స్‌లో సమస్య వస్తే టాన్సిల్స్ వాచాయని అనుకుంటుంటారు. కానీ అవి రెండూ వేర్వేరు. అసలు అడినాయిడ్స్ అంటే ఏమిటి, ఎక్కడ ఉంటాయి... అనే అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



అడినాయిడ్స్ ముక్కు లోపలి భాగానికి ఒకింత వెనకగా, నోటిలోపల అంగిటి పైభాగాన ఉంటాయి. అవి స్పాంజి కణజాలంతో తయారై మెత్తగా, గుంపులుగా అంటే ద్రాక్షగుత్తిలా ఉంటాయి. నోరు తెరవగానే టాన్సిల్స్ కనిపిస్తాయిగానీ, అడినాయిడ్స్ కనిపించవు. వీటిని చూడటానికి ఎండోస్కోప్ అనే పరికరాన్ని ఉపయోగిస్తారు. అదేగాకుండా తల ఎక్స్-రే తీసినప్పుడు కూడా వాటి పరిమాణం వంటివి తెలుస్తాయి.

అడినాయిడ్స్ పనేంటి?

ఇవి పిల్లలను ఇన్ఫెక్షన్ నుంచి కాపాడుతుంటాయి. టాన్సిల్స్ లాగానే అడినాయిడ్స్ కూడా మనం గాలి పీల్చేటప్పుడు, తినేటప్పుడు ఎలాంటి హానికరమైన బ్యాక్టీరియాగాని, వైరస్‌గాని లోపలికి ప్రవేశించకుండా కాపాడతాయి. హానికరమైన బ్యాక్టీరియా తాలూకు యాంటీబాడీస్‌తో అడినాయిడ్స్‌లో ఉండే యాంటీబాడీస్ మనలోనికి శత్రుకణాలు ప్రవేశించినప్పుడు వాటితో పోరాడి మనల్ని ఇన్ఫెక్షన్‌ల నుంచి కాపాడతాయి. అంటే... రక్షకభటుల్లా పనిచేసే ఇవి చిన్నపిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. చిన్నపిల్లల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉండి, వయసు పెరుగుతున్న కొద్దీ ఇమ్యూనిటీ పెరుగుతూ ఉంటుంది. అందుకే పిల్లలు పెద్దవుతున్న కొద్దీ అడినాయిడ్స్ సైజ్ తగ్గుతూ, అవి క్రమంగా కృశించిపోతూ ఉంటాయి. ఐదేళ్ల వయసులో అడినాయిడ్స్ కృశించిపోతాయి. యుక్తవయసుకు రాగానే అడినాయిడ్స్ ఉండవు.

కొందరు పిల్లల్లో అడినాయిడ్స్ వాపు ఎందుకు?

బ్యాక్టీరియాగాని, వైరస్‌గాని లోనికి ప్రవేశించినప్పుడు అడినాయిడ్స్ కణజాలంలో వాపు వస్తుంది. కణజాలంలో వాపు రావడం వల్ల అవి ఇన్ఫెక్షన్ నుంచి కాపాడలేవు. అవి క్రమంగా బ్యాక్టీరియా, వైరస్‌లతో నిండిపోతున్న కొద్దీ వాటిలో వాపు పెరుగుతూ పోతుంది. అలాంటి సమయాల్లో కొన్నిసార్లు టాన్సిల్స్ కూడా ఇన్ఫెక్షన్‌కూ, వాపునకు గురవుతాయి. ఇలా వాపు పెరగడంతో గాలి పీల్చుకోవడమూ కష్టమవుతుంది. దాంతో కొన్ని ఇబ్బందులూ వస్తాయి అవి... ● చిన్నపిల్లల్లో ముక్కురంధ్రాలు మూసుకుని పోయి గాలి పీల్చడం కష్టమై, నోటితో గాలి పీల్చుకుంటారు ● కొంతమంది పిల్లలకు నిద్ర చక్కగా పట్టకపోవడం, తరచూ నిద్రాభంగం కావడం జరుగుతుంటుంది ● నిద్రపోయేటప్పుడు పిల్లలో గురక వస్తుంది ● గొంతునొప్పిగా ఉండి, మింగడం కష్టమవుతుంది ● మెడప్రాంతంలో ఉన్న గ్రంథులు

చికిత్స

అడినాయిడ్స్ వాపు ఉన్న పిల్లలు తరచూ జ్వరాలతో, అస్వస్థతతో బాధపడుతుంటారు. అడినాయిడ్స్‌లో వాపు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేస్తారు. అడినాయిడ్స్‌కు వచ్చిన వాపు వంటి సమస్యలకు సకాలంలో చికిత్స పొందకపోతే వ్యాధి తీవ్రత పెరిగి మందులకు నయం కాకపోవచ్చు. దాని వల్ల అడినాయిడ్స్ తొలగించాల్సి పరిస్థితి రావచ్చు. వాటిని తొలగించాల్సిన ప్రక్రియను అడినాయిడెక్టమీ అంటారు.

ఊపిరాడదు

• క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజ్

దగ్గు, ఆయాసంతో కనిపించే క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజన్ అనే ఈ సమస్య చాలావరకు పెద్దవారి (అడల్ట్స్)నే ఇబ్బంది పెడుతుంది. కొన్నిసార్లు కొన్ని జన్యుపరమైన కారణాలతో కాస్త చిన్నవయసువారిలో కూడా సీవోపీడీ కనిపించవచ్చు. కాలుష్యం వల్ల వచ్చే ఈ వ్యాధి ప్రధానంగా పొగకు ఎక్స్‌పోజ్ అయ్యేవారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. అంటే... పొగతాగే అలవాటుతో పురుషుల్లో, ఇంకా ఇప్పటికీ కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తూ ఉండే మహిళల్లో ఈ జబ్బు ఎక్కువగా కనిపిస్తుంది. దగ్గుతో ఊపిరి సలపనివ్వని ఈ సమస్య, చలికాలంలోని చల్లటి వాతావరణానికి మరింత విజృంభిస్తుంది. సంక్షిప్తంగా సీఓపీడీ అని పిలిచే ఈ క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజ్‌ను గురించి తెలుసుకుందాం.

సీవోపీడీ సమస్య సాధారణంగా 40 ఏళ్ల పైబడినవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. పురుషులు సిగరెట్లూ, బీడీలూ, చుట్టలూ, హుక్కా కాలుస్తూ ఉంటే మరింత ఎక్కువ. కొన్నాళ్లు పొగతాగే అలవాటు ఉండి, ప్రస్తుతం మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశాలుంటాయి.

కాలుష్యంతో ఏం జరుగుతుంది?

పొగతాగేవారిలో, అలాగే వాతావరణ కాలుష్యాలను వెదజల్లే పరిశ్రమల్లో పనిచేస్తుండేవారిలో కాలుష్యంతో నిండిన గాలి వల్ల శ్వాసనాళాలు వాపునకు గురవుతాయి. అలా వాపునకు గురికావడంతో సన్నబారి... గాలి సాఫీగా లోపలికి వెళ్లడం, లోపలి నుంచి బయటకు రావడంలో అవరోధం ఏర్పడుతుంది. దాంతో ఊపిరి సరిగా అందదు. లంగ్స్ నిండుగా, బరువుగానూ ఉన్నట్లు అనిపిస్తుంటుంది. ఛాతీ పట్టేసినట్లుగా ఉంటుంది. ఇక ఆస్తమా ఉన్న వ్యక్తులు దాన్ని అదుపు (కంట్రోల్)లో ఉంచుకోకపోయినా... దీర్ఘకాలిక దుష్ప్రభావంగా సీవోపీడీ రావచ్చు.


లంగ్స్ సమస్య మాత్రమే కాదు...

సీవోపీడీ అనగానే కేవలం ఊపిరితిత్తుల సమస్యగా అనుకోవడం మామూలే. కానీ బాధితులలో వివిధ అవయవాలకు సంబంధించిన ఇతర సమస్యలు ఎక్కువే ఉంటాయి. ఉదాహరణకు... ఆస్టియోపోరోసిస్, హార్ట్ ఫెయిల్యూర్, డయాబెటిస్, కిడ్నీ ఫెయిల్యూర్, కార్పెల్ పల్మోనాలె... మొదలైన సమస్యలతో ఇది కలిసి ఉంటుంది. అందువల్ల ఈ లక్షణాలను గుర్తిస్తూ, చికిత్స అందించాలి. దీనినే సిండమిక్ అప్రోచ్ అంటారు.

నిర్ధారణ...

స్పైరోమీటర్ అనే పరికరం సహాయంతో సీవోపీడీని నిర్ధారణ చేస్తారు. దీనితో కొన్ని శ్వాస పరీక్షలు చేసి, సమస్య తీవ్రత ఎంతో తెలుసుకుంటారు. అంటే మైల్డ్, మోడరేట్ లేదా సివియర్‌గా ఉందా అని తెలుసుకుంటారు. ఈ పరీక్షకు ముందరే... బాధితులను వ్యక్తిగతంగా / క్లినికల్‌గా పరీక్షించడంతో డాక్టర్లకు కొంత ప్రాథమిక అవగాహన వస్తుంది. ఇలా చేసే క్లినికల్ పరీక్షల్లో బాధితుల ప్రొఫెషనల్ హజార్డ్స్‌ను బట్టి, వారు పనిచేసే చోటు, వారుండే చోట్లలో కాలుష్య ప్రభావం, పొగతాగడం లాంటి వారి అలవాట్లు... ఇవన్నీ వ్యాధి నిర్ధారణకు తోడ్పడతాయి.

● ఐఓఎస్ అనే పరికరం తొలిదశలో ఉన్న సీవోపీడీని గుర్తించడానికి ఉపయోగపడుతుంది.



కారణాలు

కేవలం సిగరెట్ పొగ మాత్రమే కాకుండా... వాతావరణ కాలుష్యాల్లో ఉండే దుమ్మూ, ధూళితో పాటు బొగ్గుగనులు, సిమెంట్, టెక్స్‌టైల్స్, రసాయనాల కాలుష్యం వెలువడే పరిశ్రమల దగ్గర ఉండేవారిలోనూ, ఆభరణాలకు పూత పూసే ఎలక్ట్రోప్లేటింగ్ వంటి కార్ఖానాల్లో పనిచేసేవారిలో కూడా ఇది ఎక్కువ. ఇలాంటి కాలుష్య వాతావరణంలో పనిచేయడం సీవోపీడీ వ్యాధికి ఒక ట్రిగరింగ్ ఎఫెక్ట్‌గా పనిచేయడం వల్ల... పైన పేర్కొన్నవారిలో కనిపించేందుకు అవకాశాలెక్కువ. శ్వాసక్రియ అంతా ఊపిరితిత్తులతో జరుగుతుందన్న విషయం తెలిసిందే.

లక్షణాలు

సీఓపీడీలో దగ్గు, ఆయాసాలు ప్రధాన లక్షణాలు. అయితే సీవోపీడీ తీవ్రతను బట్టి ఇతరత్రా లక్షణాలు కూడా కనిపిస్తాయి. వ్యాధిని తీవ్రతను బట్టి నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి... గోల్డ్ ఒన్ (మైల్డ్), గోల్డ్ 2 (మోడరేట్), గోల్డ్ 3 (సివియర్), గోల్డ్ 4 (వెరీ సివియర్)... ఇక్కడ గోల్డ్ అనేది 'గ్లోబల్ అబ్‌స్ట్రక్టివ్ లంగ్ డిసీజ్' అనే సంస్థకు సంక్షిప్తరూపం. గోల్డ్ సంస్థ అనేది సీవోపీడీ మీద పరిశోధనలు చేస్తూ పల్మనాలజిస్టులకు ఎప్పటికప్పుడు సూచనలు అందజేస్తుంది.

అపోహ-వాస్తవం

అపోహ: ఈ వ్యాధి ఉన్నవారు ఎడతెరిపి లేకుండా దగ్గుతూ ఉండటం వల్ల... ఇదో అంటువ్యాధిలా అనిపిస్తుంది గానీ నిజానికి ఇది అంటువ్యాధి కాదు.



నివారణ

పొగతాగే అలవాటునుంచి దూరంగా ఉండటం / ఇప్పటికే పొగతాగే అలవాటుంటే దాన్ని పూర్తిగా మానేయాలి. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్తున్నకొద్దీ అది వాయునాళాలను మరింతగా మూసుకుపోయేలా చేస్తుంది. దాంతో శ్లేష్మం (కళ్లె) మరింత ఎక్కువగా పెరుగుతూ పోతుంది. ఫలితంగా ఊపిరితిత్తుల్లో ఆక్సిజన్ మోతాదు బాగా తగ్గి, పనిచేసే శక్తి, సామర్థ్యం తగ్గిపోతుంది.

చికిత్స

ఈ వ్యాధికి దీర్ఘకాలిక చికిత్స అవసరం. సీవోపీడీ లక్షణాలు కనిపించినప్పుడ దగ్గు కొద్దిగా ఉన్నప్పుడే డాక్టర్‌ను సంప్రదించాలి. లక్షణాలు పెరిగేదాకా ఆగడం లాంటి నిర్లక్ష్యం చేయకూడదు. చికిత్స ఎంత త్వరగా జరిగితే ఫలితాలు అంత బాగుంటాయి, సీవోపీడీని అంత తేలిగ్గా/సమర్థంగా అదుపు చేయవచ్చు.

పీల్చగానే వాయునాళాలను వెడల్పు చేసి, శ్వాసను సాఫీగా జరిగేలా చేసే 'బ్రాంకోడయలేటర్స్' (ఇన్‌హేలర్స్ లేదా నెబ్యులైజర్స్)ను ఉపయోగిస్తారు.

మొదట చెప్పినట్టు ఇది కాస్త దీర్ఘకాలం చేయాల్సిన చికిత్స. కాబట్టి దగ్గు వంటి లక్షణాలు కాస్త తగ్గుముఖం పట్టగానే వ్యాధి పూర్తిగా తగ్గినట్లుగా అనుకోకూడదు. లక్షణాలు తగ్గినట్లు కనిపిస్తున్నప్పటికీ డాక్టర్లు సూచించిన విధంగా ఫాలో‌అప్‌కు వెళ్తూ చికిత్స కొనసాగించాలి.

నాన్ ఫార్మలాజికల్ థెరపీ: సీవోపీడీతో బాధపడేవారిలో ఊపిరితిత్తుల్లోపల కఫం పేరుకుపోతుంది. కాబట్టి దానిని క్లియర్ చేసే ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని డాక్టర్లు సూచించిన విధంగా వాడాల్సి ఉంటుంది.

హోమ్ ఆక్సిజన్ థెరపీ : ఇది చికిత్సలో మరో ప్రక్రియ. తీవ్రతను బట్టి అవసరం ఉన్న వారికి 19 గంటల పాటు ఇంటి దగ్గరే ఆక్సిజన్‌ను కూడా వాడాల్సి ఉంటుంది.

పల్మునరీ రీ-హ్యాబిలిటేషన్ : ఇది చికిత్సలో ఇంకో ప్రక్రియ. తేలిక నుంచి ఓ మోస్తరు వరకు అవసరమున్న వ్యాయామాలు (పర్స్ లిప్ బ్రీతింగ్), అబ్డామినల్ బ్రీతింగ్‌తో పాటు చిన్న బరువులతో కండరాలను బలంగా చేసే (మజిల్ స్ట్రెంథెనింగ్) వ్యాయామాలు చేయాలి.

ఇది వినండి!



వినికిడి లోపం ఉన్న పిల్లల్లో భవిష్యత్తులో మాట్లాడటమూ రాకపోవచ్చు. అందుకే పుట్టీపుట్టగానే చిన్నారుల్లో వినికిడి లోపాలున్నాయని గుర్తిస్తే తగిన వైద్యం చేసి, వాటిని సరిదిద్దవచ్చు. వయసు పెరుగుతున్న కొద్దీ వినికిడి శక్తి తగ్గడం కొందరు పెద్దవారిలోనూ కనిపిస్తుంది. వాళ్లు మళ్లీ చెప్పమన్నట్టుగా మాటిమాటికీ ఆ... ఆ... అంటూ రెట్టిస్తూ ఉంటారు. వినికిడి శక్తిని కాపాడుకోవాలి. అందుకు అనుసరించాల్సిన కొన్ని జాగ్రత్తలు...

▸ **ఇయర్‌బడ్స్ వద్దు :** కొందరు ఇయర్ బడ్స్‌తో తమ చెవులను తరచూ శుభ్రపరుస్తుంటారు. నిజానికి చెవులు తమంతట తామే శుభ్రపరచుకుంటాయి. ప్రకృతి వాటినిలా డిజైన్ చేసింది. వాస్తవానికి ఇయర్ బడ్స్ వాడినప్పుడు కొన్నిసార్లు గువిలి చెవి లోపలికి ఇంకా లోతుగా వెళ్తుంది. చెవిలోకి ఏదైనా బయటి వస్తువు / పురుగు ప్రవేశించినప్పుడు అడ్డుకుని, చెవిని రక్షించడం కోసమే ఈ గువిలి స్రవిస్తుంటుంది. ఇయర్‌బడ్స్‌తో లేదా అగ్గిపుల్లలూ, పిన్నీసులతో శుభ్రం చేయడం మొదలుపెట్టగానే చెవిలోని గ్రంథులు మరింత ఎక్కువగా గువిలిని స్రవిస్తాయి. దాంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందుకే ఇయర్ బడ్స్, అగ్గిపుల్లలు, పుల్లలు, పెన్నులు, పిన్నీసులతో చెవులను శుభ్రం చేసుకోకూడదు.

▸ **పిల్లలూ... గుచ్చుకుపోయేలా ఉండే వస్తువులు :** కొంతమంది పిల్లలు తమ తెలిసీ తెలియనిదనంతో గుచ్చుకుపోయేలా ఉండే వాడియైన / పదునైన వస్తువులు చెవుల్లో పెట్టుకుంటారు. ఉదాహరణకు పెన్సిళ్లు, పుల్లలు, పెన్నులు, పిన్నులు వంటివి. ఫలితంగా వాళ్ల కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చెవికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు వచ్చే ముప్పు కూడా ఉంటుంది. దాంతో భవిష్యత్తులో వినికిడి సమస్యలు రావచ్చు. అందుకే అలాంటి వస్తువుల నుంచి చిన్నారులను దూరగా ఉంచాలి. ▸ **నూనె పోయ కూడదు :** చెవులను శుభ్రం చేయడానికి కొందరు కొబ్బరి నూనె, ఆముదం లాంటివి చెవుల్లో పోస్తుంటారు. అలా ఎంత మాత్రమూ చేయకూడదు. అలా చేయడం వల్ల చెవి ఇన్ఫెక్షన్‌తో పాటు మరెన్నో సమస్యలు రావచ్చు. ▸ **పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ వద్దు :** గట్టి శబ్దాలతో, పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ పెట్టడం వల్ల పిల్లల్లోనే కాకుండా పెద్ద వాళ్లలో కూడా వినికిడి సమస్యలు వచ్చేందుకు అవకాశం ఉంది. కాబట్టి పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండాలి.

▸ **తరచూ జలుబుతో జాగ్రత్త :** తరచూ జలుబు చేసే చిన్నారుల్లో ముక్కు దిబ్బడ వల్ల చెవి మధ్యభాగంలో గాలి ప్రసరణ జరగకపోవచ్చు. దాంతో ఇలాంటి పిల్లల్లో చెవికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు తరచూ వస్తుంటాయి. అందువల్ల తరచూ జలుబు చేసే పిల్లల్లో దానికి కారణాలు కనుక్కొని ఎప్పటికప్పుడు తగిన చికిత్స ఇప్పించాలి. ▸ **అలర్జీల నుంచి దూరం అవసరం :** కొందరు చిన్నారుల్లో తరచూ అలర్జీలు కనిపిస్తుంటాయి. దానివల్ల కూడా పిల్లల్లో తరచూ జలుబు కనిపిస్తుంటుంది. పిల్లలను శ్రద్ధగా గమనిస్తూ... ఏది తినడం వల్ల వాళ్లలో ఈ సమస్య వస్తోందో గుర్తించాలి. ఆ పదార్థం నుంచి వారిని దూరంగా ఉంచాలి. కొన్నిసార్లు కొన్ని పరిసరాలూ, వాతావరణాలూ పిల్లలకు సరిపడకపోవచ్చు. అలాంటి చోట్లకు వారిని తీసుకెళ్లకూడదు. ▸ **చెవిలోంచి చీము వస్తుంటే...:** కొందరు పిల్లల చెవుల్లోంచి చీము వస్తుంటుంది. ఇలాంటివారు వెంటనే ఈఎన్‌టీ వైద్యులకు కలిసి సరైన చికిత్స, మందులు తీసుకోవాలి. ▸ అపరిశుభ్రమైన నీళ్లు, ఆహారం వల్ల, అలాంటి నీటితో తయారైన ఐస్‌క్రీములతో, అలాగే నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినడంతో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. ఆ ఇన్ఫెక్షన్ల చెవులకూ సోకే ప్రమాదం ఉంది. చెవి, ముక్కు, గొంతు... ఈ మూడు కీలక అవయవాల్లో ఏ భాగంలో ఆరోగ్య సమస్య తలెత్తినా అది ఇతర భాగాలకు వ్యాపించే అవకాశాలెక్కువ. అవి వినికిడి సామర్థ్యాన్ని ప్రభావితం చేయవచ్చు. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... ఈ కీలక అవయవాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయడం సరికాదు. ముఖ్యంగా పిల్లల్లో ఇలాంటి ఇన్ఫెక్షన్లను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. **ఇక చివరగా...** చెవిలో ఎక్కువ గువిలి వస్తున్నా, చీము కారుతున్నా, నొప్పి వస్తున్నా, చెవిలో గుయ్‌మనే శబ్దం వినిపిస్తున్నా, గొంతు ఇన్ఫెక్షన్లు ఉన్నా, పిల్లలైనా లేదా పెద్దలైనా ఎదుటివారి మాటల్ని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నా... ఈ లక్షణాలలో ఏది కనిపించినా ఈఎన్‌టీ వైద్యనిపుణులను వెంటనే సంప్రదించాలి.

నిలువెత్తు సమస్యలు

సేల్స్ పర్సన్స్, పోలీస్ మెన్, మెషిన్ ఆపరేటర్లు, పెద్ద షోరూమ్స్‌లో కస్టమర్లకు చీరలు చూపుతుండేవారు... ఇలా చాలాసేపు నిలబడే ఉండాల్సిన వృత్తుల్లో ఉన్న వారిలో కండరాలకు సంబంధించిన కొన్ని సమస్యలు వస్తుంటాయి. శరీరాన్ని చాలాసేపు నిటారుగా ఉంచడంతో పాటు కొన్ని అవయవాలు కదిలేందుకు అవకాశం లేకపోవడం వల్ల దేహంలోని కొన్ని శరీర భాగాలకు సరైన రక్తప్రసరణ తగ్గిపోతుంది. దాంతో అవి తీవ్రమైన అలసటకు గురవుతాయి. ఇలా అదేపనిగా నిలబడేవారికి కాళ్లు, వెన్ను, మెడ సమస్యలు వస్తాయి.

సుదీర్ఘకాలం నిలబడే వృత్తుల్లో ఉన్నవారికి కండరాలకు సంబంధించిన సమస్యలేగాక కొన్ని ఇతర ఇబ్బందులూ ఉంటాయి. సుదీర్ఘంగా నిలబడి ఉండేవారిలో రక్తనాళాల్లో ఇన్‌ఫ్లమేషన్ రావచ్చు వేరికోస్ వెయిన్స్ సమస్య కూడా రావచ్చు. అంతేకాదు... వెన్ను, తుంటి, మోకాళ్ల, పాదాల సమస్యలు కూడా వచ్చే అవకాశముంది. కొన్నిసార్లు కీళ్ల బిగుసుకుపోయి, కదల్లేకపోవచ్చు. ఇలా మాటిమాటికీ కీళ్ల బిగుసుకుపోవడం వల్ల కణాలు క్షీణించడం, టెండన్లు, లిగమెంట్ల నిర్మాణాలలో మార్పుల వంటి సమస్యలు రావచ్చు.



కొన్ని సూచనలు...

➤ ఎవరి ఎత్తుకు తగినట్లుగా వారు నిలబడి ఉండే బల్లల ఎత్తును సరిచేసుకోవాలి. శరీరాకృతిని మరీ నిటారుగా ఉంచకుండా, అలాగే మరీ ఒంగిపోకుండా సమతాల్యంతో ఉండేలా చూసుకోవాలి.

➤ ఉన్నచోటే నిలబడిపోకుండా అక్కడికక్కడే కాస్త అటు-ఇటు నడుస్తుండాలి. ఇందువల్ల కాళ్లకు, పాదాలకు రక్తప్రసరణ పెరిగి, కాస్త ఉపశమనం కలుగుతుంది.

➤ అవకాశముంటే కాసేపు కూర్చోవాలి. అయితే ఆ కూర్చునే ప్రదేశం తమ ఎత్తుకు తగినట్లుగా ఉండాలి.

➤ చాలాసేపు నిలబడే ఉండేవారు తమ పొజిషన్స్‌ను కొద్ది కొద్ది సేపటికి మార్పులు చేసుకుంటూ ఉంటే మరింత ఎక్కువ సేపు పనిచేయడం సాధ్యమవుతుంది.

➤ మరీ ఎక్కువగా ఒంగడం, మరీ ఎక్కువగా సాగడం, అకస్మాత్తుగా పక్కలకు తిరగడం చేయవద్దు.

➤ కండరాలు అలసిపోయి, బిగుతుగా అయినప్పుడు శరీరానికి తగినంత విశ్రాంతి ఇస్తూ కాసేపు రిలాక్స్ అవ్వాలి. చాలా సేపు ఒకే పోశ్చర్‌లో ఉండకుండా తరచూ పోశ్చర్‌ను మార్చుకుంటూ ఉండాలి.

➤ పాదాలకు అనువైన పాదరక్షలను ధరించాలి. మరీ ఎక్కువగా ఎత్తు ఉండే హైహీల్స్ వద్దు. సౌకర్యంగా ఉండే పాదరక్షలనే తొడుక్కోవాలి. కాలివేళ్లన్నింటినీ దగ్గరకు ఒత్తుకునేలా చేసే పాదరక్షలు ధరించకూడదు. పాదరక్షలోని కింది భాగానికి (సోల్‌కు) కాస్తంత సాగేగుణం ఉంటే బాగుంటుంది.

ఈ జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా ఇబ్బందిగా ఉంటే, ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.

గర్భవతులూ... హైబీపీ!



గర్భధారణ సమయంలో హైబీపీతో తల్లికి సమస్యలు...

- ప్రీ-అక్లాంప్సియా సమస్య వల్ల కాబోయే తల్లికి పక్షవాతం వచ్చే అవకాశం.
- మూత్రపిండాలకు, కాలేయానికి హాని జరిగే ముప్పు.
- రక్తం గడ్డకట్టే అవకాశాలు.
- ప్లాసెంటా నుంచి రక్తస్రావం.

కారణాలు...

గర్భవతుల్లో హైబీపీకి లేదా ప్రీ-అక్లాంప్సియాకు సరైన కారణాలు ఇంకా తెలియదు. నిజానికి గర్భధారణకూ, బీపీ పెరగడానికి ఏదో సంబంధం ఉన్నట్లు వైద్య నిపుణుల పరిశీలనలో తెలిసింది. ప్లాసెంటా పెరుగుదలతో ఏర్పడే కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందడంతోనే సమస్య వస్తుందని కొందరు నిపుణుల అభిప్రాయం. అయితే ప్రీ-అక్లాంప్సియా సమస్య ఉన్నప్పుడే గుర్తించి, తగిన చికిత్స తీసుకోవాలి. లేకపోతే అది పిండానికి ఆక్సిజన్, పోషకాలు అందడంపై దుష్ప్రభావం చూపవచ్చు.

గర్భం దాల్చకముందే కొంతమంది మహిళలకు హైబీపీ ఉండవచ్చు. మరికొందరిలో గర్భం దాల్చాక కనిపించవచ్చు. కొంతమందిలో గర్భం దాల్చిన 20వ వారంలో బీపీ కనిపించవచ్చు. ఒకవేళ 20వ వారం కంటే ముందే హైబీపీ ఉందని గుర్తిస్తే... ఆ మహిళలో అంతకు ముందే హైబీపీ ఉందనీ, అప్పటివరకు దాన్ని గుర్తించలేదనీ, అయితే 20 వారానికి ముందే రక్తపోటు ఉన్నప్పటికీ తాను గర్భందాల్చాక చేసిన పరీక్షల్లో అది బయటపడిందని అనుకోవచ్చు.

గర్భవతుల్లో వచ్చేది జెస్టేషనల్ హైబీపీ:

గర్భవతుల్లో వచ్చే హైబీపీని జెస్టేషనల్ హైబీపీ అంటారు. అంతకు ముందు వారికి హైబీపీ లేకుండా ఉండి... గర్భం దాల్చిన 20వ వారంలో అది కనిపిస్తే దాన్ని 'ప్రీ అక్లాంప్సియా' అంటారు. దీని వల్ల మూత్రంలో అధిక ప్రోటీన్లు కనిపించవచ్చు. ప్రీ-అక్లాంప్సియా ఉన్న మహిళలకు ప్రసవం అయిన ఆరు వారాల తర్వాత హైబీపీ తగ్గి మళ్లీ వాళ్లలో రక్తపోటు సాధారణానికి రావచ్చు.

అక్లాంప్సియా: ఇది ప్రీ-అక్లాంప్సియా కండిషన్ తర్వాత వచ్చే సమస్య. అక్లాంప్సియా సమస్య ఉన్నవారిలో అది ఫిట్స్‌కు దారితీయవచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. అందుకోసమే సమస్య ప్రీ-అక్లాంప్సియా దశలో ఉన్నప్పుడే చికిత్స తీసుకొని అది అక్లాంప్సియా వరకు పోకుండా జాగ్రత్త పడాలి.

తల్లి హైబీపీ వల్ల కడుపులోని బిడ్డకు...

● బిడ్డ ఎదుగుదలలో సమస్య ● నెలలు నిండకముందే ప్రసవం ● మృతశిశువు పుట్టే అవకాశం.

గర్భిణిలో బీపీ ఉన్నట్లు తెలియడం ఎలా?

▸ భరించలేనంత తలనొప్పి
▸ కళ్లు సరిగా కనిపించకపోవడం
▸ మసకబారినట్లుగా ఉండటం
▸ పొట్టనొప్పి (ముఖ్యంగా పొట్ట పైభాగంలో ఎదురొమ్ము ఎముకల కింద, కుడివైపున నొప్పిగా ఉంటుంది.
▸ వేవిళ్లు కాకుండా ఆ తర్వాత కూడా వాంతులు
▸ కడుపులోని బిడ్డ కదలికలు సరిగా లేకపోవడం. గర్భందాల్చిన కొంతమందిలో ముఖం ఉబ్బడం, కాళ్లు-చేతుల వాపు చాలా సాధారణం. అయితే ప్రీ-అక్లాంప్సియా ఉంటే అది పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. అలాంటి సమయంలో డాక్టరును తప్పక సంప్రదించాలి. ఈ రక్తపోటు తీవ్రత ఎంత, అది గర్భంపై చూపే ప్రభావం ఎంత అనే విషయాలను పరిగణనలోకి తీసుకొని డాక్టర్లు తగిన చికిత్స చేస్తారు.

గర్భవతులకు ముప్పు ఉంటే అది మరెన్నో వైద్యసమస్యలకు కారణం కావచ్చు. ఒకవేళ అప్పటికే హైబీపీ ఉన్న మహిళలు గర్భం దాల్చాలని అనుకున్నప్పుడు వాళ్లు వాడే మందుల గురించి డాక్టర్‌ను సంప్రదించి, ప్రెగ్నెన్సీ ప్లానింగ్ విషయంలో డాక్టర్ దగ్గరి నుంచి తగిన సలహాలు తీసుకున్న తర్వాతే ప్రెగ్నెన్సీలో ముందుకెళ్లాలి. కొన్ని మందులను గర్భం ధరించిన సమయంలో అస్సలు తీసుకోకూడదు. ఉదాహరణకు ఆంజియోటెన్సిన్ రిసెప్టార్ బ్లాకర్స్ (ఏఆర్‌బీ), మూత్రం ఎక్కువగా వచ్చేలా చేసే డైయూరెటిక్స్ వంటివి. అవి గర్భంలో ఉన్న పిండానికి హాని చేకూర్చే ముప్పు ఉంటుంది.

ఎకానమీ పటిష్టం..



దేశ ఆర్థిక వ్యవస్థసహా పలు అంశాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిశోధనా నివేదికలు, ఆర్టికల్స్ సానుకూల అంశాలను వెలువరించాయి. అయితే ఈ నివేదికలు, ఆర్టికల్స్ ఆర్‌బీఐ బులెటిన్‌లో విడుదలవుతాయి తప్ప, వీటిలో వ్యక్తమయిన అభిప్రాయాలతో సెంట్రల్ బ్యాంకు ఏకీభవించాల్సిన అవసరం లేదు. తాజా ఆవిష్కరణలను చూస్తే... – ముంబై

ధరల్లో స్థిరత్వం..

'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' శీర్షికన విడుదలైన ఆర్టికల్ ప్రకారం ఆగస్టులో తృణధాన్యాలు, పప్పులు, వంట నూనెల ధరల్లో నియంత్రణ కనబడింది. అయా అంశాలు ఆగస్టు వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణంపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది. జూన్ 2024లో 5.1 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం, జూలైలో ఐదేళ్ల కనిష్ట స్థాయి 3.5 శాతానికి దిగివచ్చిన సంగతి తెలిసిందే. డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని టీమ్ రూపొందించిన ఈ ఆర్టికల్, గ్రామీణ వినియోగం ఊపందుకుందని, ఇది డిమాండ్, పెట్టుబడులకు దోహదపడుతుందని తెలిపింది.

విధాన నిర్ణయాల వల్లే ద్రవ్యోల్బణం కిందకు..

ఆర్‌బీఐ అనుసరిస్తున్న ద్రవ్య పరపతి విధానం వల్ల తయారీ రంగంలో 2022–23లో ద్రవ్యోల్బణం కట్టడి సాధ్యమైందని ఆర్థికవేత్తలు పాత్రా, జాయిస్ జాన్, ఆసిష్ థామస్ జార్జ్‌లు రాసిన మరో ఆర్టికల్ పేర్కొంది. అయితే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రత మొత్తం సూచీపై ప్రభావం చూపిస్తోందని 'ఆర్ ఫుడ్ ప్రైసెస్ స్పిల్లింగ్ ఓవర్? (మొత్తం సూచీ ద్రవ్యోల్బణానికి ఆహార ధరలే కారణమా?) అన్న శీర్షికన రాసిన బులెటిన్‌లో ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. ఆహార ధరల ఒత్తిళ్లు కొనసాగితే జాగరూకతతో కూడిన ద్రవ్య పరపతి విధాన విధానం అవసరమని ఈ ఆర్టికల్ పేర్కొంది.

నిధులకోసం బ్యాంకింగ్ ప్రత్యామ్నాయాలు..

డిపాజిట్ వృద్ధిలో వెనుకబడి ఉన్నందున కమర్షియల్ పేపర్, డిపాజిట్ సర్టిఫికేట్ వంటి ప్రత్యామ్నాయ వనరుల వైపు బ్యాంకింగ్ చూస్తోందని బులెటిన్ ప్రచురితమైన మరో ఆర్టికల్ పేర్కొంది. 2024–25లో ఆగస్టు 9 వరకూ చూస్తే, ప్రైమరీ మార్కెట్లో రూ.3.49 లోల కోట్ల సర్టిఫికేట్స్ ఆఫ్ డిపాజిట్ (సీడీ) జారీ జరిగిందని ఆర్టికల్ పేర్కొంటూ, 2023–24లో ఇదే కాలంలో ఈ విలువ రూ.1.89 లక్షల కోట్లని వివరించింది. ఇక 2024 జూలై 31 నాటికి కమర్షియల్ పేపర్ల జారీ విలువ రూ.4.86 లక్షల కోట్లయితే, 2023 ఇదే కాలానికి ఈ విలువ రూ.4.72 లక్షల కోట్లని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-8-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	659.5	4
SHRIRAMFIN	3,085.00	3.47
BPCL	343.55	3.32
TATASTEEL	154.09	3.06
LTIM	5,675.00	2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,767.00	-2.59
BAJAJ-AUTO	9,772.00	-1.17
INDUSINDBK	1,349.60	-1.07
AXISBANK	1,155.00	-1.02
SBILIFE	1,672.75	-0.96

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,244
ఎన్ఎస్ఈ	1,08,403
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,84,534
ఎఫ్ఐఐ	- 2,667
డీఐఐ	+ 1,803

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.48	$ 75.84
బ్రెంట్	77.55	$ 79.68

డిపాజిట్ల పెంపుపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వ బ్యాంకుల చీఫ్‌లకు ఆర్థికమంత్రి దిశానిర్దేశం
- బ్యాంకింగ్ పనితీరుపై కీలక సమీక్షా సమావేశం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) డిపాజిట్ వృద్ధిని మెరుగుపరచాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఆర్థిక మంత్రి ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో బ్యాంకింగ్ పనితీరు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గత కొన్ని నెలల్లో రుణ వృద్ధి కంటే డిపాజిట్ల పరుగు 300–400 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) వెనుకబడి ఉంది. ఇలాంటి పరిస్థితి బ్యాంకులకు అసెట్–లయబిలిటీ (రుణాలు–డిపాజిట్లు) అసమతుల్యతను సృష్టిస్తోంది.

ప్రత్యామ్నాయ పెట్టుబడులపై ఆసక్తి వల్లే...

ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల వైపు గృహ పొదుపులు మారడంవల్లే బ్యాంకుల్లో డిపాజిట్ల వృద్ధి రేటు పడిపోతోందన్న ఆందోళనలు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ కూడా ఇటీవలే స్వయంగా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు తమ విస్తారమైన బ్రాంచ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం, అలాగే వినూత్న ఉత్పత్తులు, సేవల ద్వారా డిపాజిట్లను సమీకరించాలని ఆయన కోరారు. "పెరుగుతున్న క్రెడిట్ డిమాండ్‌ను తీర్చడానికి బ్యాంకులు స్వల్పకాలిక నాన్–రిటైల్ డిపాజిట్లు, ఇతర సాధనాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. డిపాజిట్లు పెరక్కపోవడం బ్యాంకింగ్ వ్యవస్థను నిర్మాణాత్మక లిక్విడిటీ సమస్యలకు గురిచేసే అవకాశం ఉంది' అని ఆయన చెప్పారు. రిటైల్ కస్టమర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలు మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయని పేర్కొన్న ఆయన, ఫలితంగా బ్యాంకులు రుణ వృద్ధికి వెనుకంజలో ఉన్న డిపాజిట్లతో నిధుల విషయంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ బ్యాంకుల చీఫ్‌లతో ఆర్థికమంత్రి డిపాజిట్లపైనే ప్రత్యేకించి దిశా నిర్దేశం చేయడం గమనార్హం. ఈ సమావేశంలో చర్చనీయాంశాలను ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

సమీక్షా సమావేశ ముఖ్యాంశాలు..

- 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత జరిగిన మొదటి సమీక్ష సమావేశం ఇది.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం సూర్య ఘర్, పీఎం విశ్వకర్మ యోజనతోసహా ప్రభుత్వం వివిధ ప్రధాన పథకాల అమలులో బ్యాంకుల ఆర్థిక పనితీరు, పురోగతిని ఆర్థిక మంత్రి సమీక్షించారు.
- కోర్ బ్యాంకింగ్ వ్యాపారంపై దృష్టి సారించాలని, వినూత్న ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ద్వారా డిపాజిట్ వృద్ధి వేగాన్ని పెంచాలని బ్యాంకుల చీఫ్‌ను ఆర్థిక మంత్రి కోరారు.
- సమర్థవంతమైన కస్టమర్ సేవల డెలివరీ కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ కస్టమర్‌లతో మెరుగైన సంబంధాలను కలిగి ఉండాలని సీతారామన్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాలలో ఉద్యోగులు తమ కస్టమర్లతో కనెక్ట్ అయ్యేలా చూడాలని ఆమె బ్యాంకులను కోరారు.
- వడ్డీ రేటు విషయంలో ఆర్‌బీఐ బ్యాంకింగ్‌కు స్వేచ్ఛనిచ్చిందని, ఆ స్వేచ్ఛను ఉపయోగించి బ్యాంకులు డిపాజిట్లను మరింత ఆకర్షణీయంగా మార్చుకోవాలని ఆమె సూచించారు.
- సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ఆందోళనలు, ఆర్థిక రంగానికి ఎదురయ్యే నష్టాలపై కూడా ఈ సమీక్షా సమావేశం చర్చించింది.
- మోసం, ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు సంబంధించిన సమస్యలు అలాగే మొండిబకాయిల సమస్యల పరిష్కారానికి సంబంధించి నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఆర్‌సీఎల్) పురోగతికి వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

ప్రభుత్వ బ్యాంకుల పనితీరుపై హర్షం

2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం రూ. 1.4 లక్షల కోట్లను దాటింది. దాదాపు రూ. 1 లక్ష కోట్ల అధిక బేస్‌పై గత ఏడాదితో పోలిస్తే 35 శాతం వృద్ధిని నమోదు చేసింది. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) కలిసి 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,04,649 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి. ఎక్స్ఛేంజీలలో ప్రచురితమైన సంఖ్యల ప్రకారం... 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 141,203 కోట్ల మొత్తం లాభంలో మార్కెట్ లీడర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వాటానే 40 శాతానికి పైగా ఉంది. ఎస్‌బీఐ ఆర్జిత లాభం రూ.61,077 కోట్లయితే, వార్షిక వృద్ధి 22 శాతం. 2022–23లో ఈ వృద్ధి రూ.50,232 కోట్లు.

2023–24 ఆర్థిక సంవత్సరం అన్ని వ్యాపార అంశాల్లో బ్యాంకింగ్ మెరుగైన పనితీరును ప్రదర్శించడం పట్ల తాజా సమీక్షా సమావేశంలో హర్షం వ్యక్తం అయ్యింది. నికర మొండిబకాయిలు 0.76 శాతానికి తగ్గడం, మూలధన నిష్పత్తి తగిన స్థాయిలో 15.15 శాతంగా నమోదుకావడం, నికర వడ్డీ మార్జిన్లు (ఎన్ఐఎం) 3.22 శాతంగా నమోదుకావడం, షేర్ హోల్డర్లకు రూ.27,830 కోట్ల డివిడెండ్లు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. ఈ సానుకూల అంశాలు మార్కెట్ల నుండి మూలధనాన్ని సేకరించే విషయంలో ప్రభుత్వ బ్యాంకుల సామర్థ్యాన్ని కూడా మెరుగుపరిచాయని సమీక్షా సమావేశం అభిప్రాయపడింది. ఈ సమావేశంలో డీఎఫ్ఎస్ సెక్రటరీ వివేక్ జోషి, సెక్రటరీ డిజిగ్నేటెడ్ ఎం నాగరాజు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ మార్గాలపై యువత దృష్టి: ఎస్‌బీఐ

దేశంలోని యువ జనాభా బ్యాంకింగ్ డిపాజిట్లపై కాకుండా అధిక వడ్డీరేటు లభించే ఇతర మార్గాలను అన్వేషిస్తోందని బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థికవేత్తల నివేదిక తాజాగా పేర్కొంది. బ్యాంకింగ్ వ్యవస్థలోని దాదాపు సగం టర్మ్ డిపాజిట్లు సీనియర్ సిటిజన్‌లవేనని పేర్కొన్న నివేదిక, రుణ వృద్ధి రేటుతో పోటీగా డిపాజిట్ల వృద్ధి రేటుకు దోహదపడ్డానికి డిపాజిట్లపై పన్ను విధానంలో మార్పులు అవసరమని స్పష్టం చేసింది. కాగా,2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే, డిపాజిట్ల వృద్ధి రూ.61 లక్షల కోట్లయితే, రుణ వృద్ధి 59 లక్షల కోట్లుగా ఉందని పేర్కొనడం గమనార్హం. గడచిన 26 నెలల్లో డిపాజిట్ల స్పీడ్ మందగమనం ఉందని ఆర్‌బీఐ 2024 జూన్‌లో విడుదల చేసిన నివేదికను ఉటంకిస్తూ, గడచిన కాలం చూస్తే మూడు నుంచి నాలుగేళ్ల డిపాజిట్ల వృద్ధి రేటుకన్నా, రుణ వృద్ధి స్పీడ్‌గా ఉన్న చరిత్ర ఉందని నివేదిక పేర్కొంది. ఈ లెక్కన తాజా పరిస్థితి (డిపాజిట్ల మందగమనం) 2025 జూన్-అక్టోబర్ మధ్య ముగిసే అవకాశం ఉందని అంచనావేసింది.

తాజా డిపాజిట్-రుణ పరిస్థితి ఇదీ

ఈ ఏడాది జూలై 12 నాటికి వార్షికంగా చూస్తే, బ్యాంకుల డిపాజిట్ల వృద్ధి 11 శాతానికి పరిమితమైంది. అయితే, రుణ వృద్ధి మాత్రం 14 పైగా శాతంగా నమోదైంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ, డిపాజిట్ వృద్ధిలో ఇంత తేడా రావడం గడిచిన 20 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రస్తుత తక్కువ వడ్డీ రేట్లతో రిటైల్ డిపాజిట్ల సమీకరణ బ్యాంకులకు కష్టతరంగా మారిందన్నది ప్రధాన విశ్లేషణ.

ఆర్ఆర్‌బీల సేవలు పెరగాలి

సూక్ష్మ, లఘు, మధ్య, చిన్న తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రొడక్టులను రూపొందించాలని ప్రాంతీయ గ్రామీ ణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీ), వాటి స్పాన్సర్డ్ బ్యాంకుల సీఈఓలకు ఆర్థిక మంత్రి ఈ సమీక్షా సమావేశంలో విజ్ఞప్తి చేశారు. వాటికి రుణ లభ్యత సకాలంలో లభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రుణ పోర్ట్‌ఫోలియోను పెంచడానికి అపారమైన అవకాశాలు ఉన్న వస్త్ర, చెక్క ఫర్నిచర్, తోలు, ఆహార ప్రాసెసింగ్ వంటి చిన్న సూక్ష్మ పరిశ్రమలకు రుణాలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. అలాగే సాంకేతిక రంగంలో పురోగమించడానికి తగిన చర్యలు తీసుకోవాలనీ ఆమె విజ్ఞప్తి చేశారు.

క్యూ1లో అదానీ గ్రూప్ జోరు

- 33 శాతం జంప్ చేసిన ఇబిటా
- నికర లాభం 50 శాతం జూమ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) 33 శాతం ఎగసి రూ. 22,570 కోట్లను తాకింది. ఇందుకు కీలకమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌సహా.. వర్ధమాన బిజినెస్‌లు సోలార్, విండ్ పవర్, ఎయిర్‌పోర్టులు సహకరించాయి. దీంతో బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ ఇబిటా గత 12 నెలల్లో 45 శాతంపైగా జంప్‌చేసి రూ. 79,180 కోట్లకు చేరింది. ఇక క్యూ1లో అదానీ గ్రూప్ నికర లాభం మరింత అధికంగా 50 శాతం దూసుకెళ్లి రూ. 10,279 కోట్లను తాకింది. మొత్తం ఇబిటాలో 80 శాతం వాటాను ఆక్రమిస్తూ గ్రూప్‌లో అత్యంత కీలక విభాగంగా నిలిచే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇబిటా క్యూ1లో 42 శాతం జంప్‌చేసింది. వీటిలో అదానీ పోర్ట్స్‌తోపాటు.. అదానీ గ్రీన్ ఎనర్జీ, పవర్, ఎనర్జీ సొల్యూషన్స్, టోటల్ గ్యాస్ ఉన్నాయి.

ఎంటర్‌ప్రైజెస్ సైతం

గ్రూప్ ఇన్‌క్యుబేటర్.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఇబిటా 46 శాతం ఎగసి రూ. 4,487 కోట్లయ్యింది. నికర లాభం రెట్టింపై రూ. 1,776 కోట్లను తాకింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 30 శాతం అధికంగా రూ. 2,866 కోట్ల ఇబిటాను సాధించింది. నికర లాభం రెట్టింపై రూ. 629 కోట్లకు చేరింది. అదానీ పవర్ లాభం 54 శాతం దూసుకెళ్లి రూ. 3,490 కోట్లను తాకగా.. అదానీ పోర్ట్స్ లాభం 47 శాతం వృద్ధితో రూ. 3,107 కోట్లకు చేరింది. అదానీ టోటల్ గ్యాస్ లాభం 14 శాతం పుంజుకుని రూ. 172 కోట్లయ్యింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లోని అదానీ న్యూ ఇండస్ట్రీస్, ఎయిర్‌పోర్ట్స్, రోడ్లు బిజినెస్ ఇబిటా సైతం 70 శాతం పురోగమించి రూ. 2,991 కోట్లుగా నమోదైంది. కాగా.. జూన్ చివరికల్లా నగదు బ్యాలన్స్ స్థూల రుణ భారం రూ. 2.41 లక్షల కోట్లలో 24.8 శాతానికి బలపడినట్లు అదానీ గ్రూప్ ఇప్పటికే వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 17.7 శాతంగా నమోదైంది. తాజా నగదు బ్యాలన్స్‌తో 30 నెలలపాటు రుణ చెల్లింపులకు అవసరమైన లిక్విడిటీ కవరేజీని కలిగి ఉన్నట్లు తెలియజేసింది.

లైసెన్స్ పరిధిలోకి కాల్, మెసేజింగ్ యాప్‌లు!

ట్రాయ్‌ని కోరిన టెలికం ఆపరేటర్లు



న్యూఢిల్లీ: కొత్త టెలికమ్యూనికేషన్ చట్టం ప్రకారం వాట్సాప్, సిగ్నల్, టెలిగ్రామ్ వంటి ఓవర్–ది–టాప్ కాల్, మెసేజింగ్ యాప్‌లను లైసెన్సింగ్ పాలన పరిధిలోకి తీసుకురావాలని టెలికం ఆపరేటర్లు ఏకగ్రీవంగా టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్‌ను కోరాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ప్రకారం మంజూరు చేయవలసిన సేవా అధికారాల ఫ్రేమ్‌వర్క్‌పై అభిప్రాయాలను కోరుతూ ట్రాయ్ జారీ చేసిన కన్సల్టేషన్ పేపర్‌పై రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తోపాటు ఇండస్ట్రీ బాడీ సీవోఏఐ స్పందించాయి. కాలింగ్, మెసేజింగ్ యాప్‌లను ఆథరైజేషన్ ద్వారా అందించే సేవల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశాయి. ఓటీటీ కమ్యూనికేషన్ సేవలు కొత్త టెలికం చట్టం కింద ఒక యాక్సెస్ సర్వీస్‌గా ఉంటాయని టెలికం కంపెనీలు స్పష్టం చేశాయి. ఒకే విధమైన లేదా సారూప్య సేవలకు ఒకే నిబంధనలను నిర్ధారించడానికి, అటువంటి ఓవర్ ది టాప్ కమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లను యాక్సెస్ సర్వీసెస్ ఆథరైజేషన్ కిందకు తీసుకురావడం చాలా ముఖ్యం అని రిలయన్స్ జియో తెలిపింది.

వాటి విషయంలో విరుద్ధంగా ఉంది..

టెలికం చట్టంలో టెలికమ్యూనికేషన్స్ అనే విస్తృత నిర్వచనం ఉందని భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. ఇందులో ఏదైనా సైన్, సిగ్నల్, రైటింగ్, టెక్స్ట్, ఇమేజ్, సౌండ్, వీడియో, డేటా స్ట్రీమ్, ఇంటెలిజెన్స్ లేదా టెలికమ్యూనికేషన్ ద్వారా పంపబడిన సమాచారం ఉంటాయని తెలిపింది. 'సంప్రదాయ టెలికం సేవల ద్వారా మార్పిడి చేయబడిన కమ్యూనికేషన్‌లను చట్టం అమలు చేసే ఏజెన్సీలు పర్యవేక్షించవచ్చని లైసెన్స్ షరతులు నిర్ధారిస్తున్నప్పటికీ.. ఓటీటీ కమ్యూనికేషన్ సేవల విషయంలో ఇది విరుద్ధంగా ఉంది. అవి పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్నాయి. ఇలా అయితే చట్టం అమలు, నేరాల నివారణ ప్రక్రియలకు ఆటంకం కలిగిస్తుంది' అని ఎయిర్‌టెల్ తెలిపింది. ఓటీటీ కమ్యూనికేషన్ సేవల కంపెనీల సర్వర్లు చాలా వరకు భారతదేశం వెలుపల ఉన్నందున ఈ ప్రమాదం మరింత తీవ్రమవుతుందని వెల్లడించింది. ఓటీటీ సేవలను నియంత్రణ పరిధిలోకి తీసుకురావడం ద్వారా డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం, ఫిర్యాదుల పరిష్కారానికి స్పష్టమైన యంత్రాంగాన్ని అందించడం ద్వారా వినియోగదారులను రక్షించవచ్చని వొడాఫోన్ ఐడియా తెలిపింది.

హైదరాబాద్ రియల్టీ మార్కెట్ స్పీడ్

- రూ.2,656 కోట్ల పెట్టుబడులు
- జనవరి–జూన్ మధ్య రాక



న్యూఢిల్లీ: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఈ ఏడాది జనవరి–జూన్ మధ్య కాలంలో 320 మిలియన్ డాలర్ల (రూ.2,656 కోట్లు) ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులను ఆకర్షించింది. దేశంలో అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లోకి ఈ కాలంలో 633 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. దేశవ్యాప్తంగా ఆరు పట్టణాల పరిధిలో జనవరి–జూన్ మధ్య 3.9 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్‌లో ఆఫీస్ వసతులకు డిమాండ్ బలంగా ఉంది. మొత్తం 633 మిలియన్ డాలర్లలో.. 484 మిలియన్ డాలర్లు ఆఫీస్ ప్రాజెక్టులు ఆకర్షించ గా, 149 మిలియన్ డాలర్లు నివాస గృహాల ప్రాజెక్టుల్లోకి వెళ్లాయి. ప్రముఖ ఫండ్ సంస్థలు ప్రైవేటు ఈక్విటీ డీల్స్‌కు మద్దతుగా నిలిచాయి. బెంగళూరు రియల్ ఎస్టేట్ మార్కెట్ 510 మిలియన్ డాలర్లు, చెన్నై మార్కెట్ 235 మిలియన్ డాలర్లు, పుణె మార్కె ట్ 152 మిలియన్ డాలర్లు, ముంబై మార్కెట్ 147 మిలియన్ డాలర్ల చొప్పున ఇదే కాలంలో పీఈ పెట్టుబడులను ఆకర్షించాయి.

ఇన్వెస్టర్లలో విశ్వాసం..

"ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 3.9 బిలియన్ డాలర్ల ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు రావడం.. 2023 మొత్తం ఈక్విటీ పెట్టుబడులతో పోల్చి చూసినా 70 శాతం ఎక్కువ. భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనం. ముఖ్యంగా ఇన్‌ఫ్రా, లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ రంగాలు ఈ డిమాండ్‌ను నడిపిస్తున్నాయి. అదనంగా ఆఫీస్, ఇళ్లకు డిమాండ్ ఈ మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులకు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుంది. ముందు వేసిన అంచనాలకు మించి పెట్టుబడులు రావచ్చు"అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎండీ (క్యాపిటల్ మార్కెట్స్) సోమీ థామస్ తెలిపారు.

మురుగప్ప గ్రూప్ లాభం అప్

2023-24లో రూ. 7,885 కోట్లు

- రూ. 77,881 కోట్లకు టర్నోవర్



చెన్నై: డైవర్సిఫైడ్ గ్రూప్ మురుగప్ప.. గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం ఎగసి రూ. 7,885 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) రూ. 6,846 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం టర్నోవర్ సైతం రూ. 74,220 కోట్ల నుంచి రూ. 77,881 కోట్లకు బలపడింది. ఇది 5 శాతం వృద్ధికాగా.. నిర్వహణ లాభం(ఇబిటా) 11 శాతం అధికమై రూ. 11,554 కోట్లకు చేరింది. ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్ ఆర్‌వోఈ 19.2 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. ఆర్‌వోఈసీ మాత్రం 27.9 శాతం నుంచి 21.3 శాతానికి క్షీణించింది. గ్రూప్‌లోని తయారీ రంగ సంస్థల ఫ్రీ క్యాష్‌ఫ్లో రూ. 1,229 కోట్లుగా నమోదైంది. లాభాల్లో ఇది 31 శాతానికి సమానం. విస్తరణ, మౌలిక సదుపాయాలు తదితర మొత్తం పెట్టుబడి వ్యయాలు రూ. 1,592 కోట్ల నుంచి రూ. 3,129 కోట్లకు పెరిగాయి.

సంస్థల తీరిలా

మురుగప్ప గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ. 400 కోట్లతో విశాఖపట్టణంలో ఏర్పాటు చేసిన ఆధునిక సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్‌ను ప్రారంభించింది. తద్వారా ముడిసరుకులు తదితర సొంత సరఫరాల సామర్థ్యాలు(బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్) మెరుగుపడనున్నాయి. దీంతో సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీ సామర్థ్యం ప్రస్తుత 6 లక్షల టన్నుల నుంచి వార్షికంగా 11 లక్షల టన్నులకు జంప్‌చేయనుంది. ఇక చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డీఎల్ఎఫ్ ఆఫీసెస్ చెన్నై నుంచి 4.67 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 735 కోట్లు వెచ్చించింది. కర్ణాటకలోని హలియాల్ ప్లాంటులో ఈఐడీ ప్యారీ (ఇండియా) రోజుకి 120 కిలోలీటర్ల డిస్టిలరీ యూనిట్‌ను వాణిజ్య ప్రాతిపదికన మే నెలలో ప్రారంభించింది. సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ రూ. 318 కోట్ల పెట్టుబడులతో లోటెన్షన్ మోటార్లు, స్విచ్ గేర్లు, భారీ ఇండస్ట్రియల్ మెషీన్లు తదితరాల విస్తరణను చేపట్టింది. టీఐ క్లీన్ మొబిలిటీ ఎలక్ట్రిక్ 3వీలర్స్, ఎలక్ట్రిక్ ట్రాక్టర్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు రూ. 44 కోట్లు వెచ్చించింది. ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియాకు అనుబంధ సంస్థలివి. టీఐ క్లీన్ మొబిలిటీకి అనుబంధ సంస్థ ఐపీఎల్ టెక్ ఎలక్ట్రిక్ ఎలక్ట్రిక్ భారీ వాణిజ్య వాహన తయారీ యూనిట్‌పై రూ. 67 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. కాగా.. 2024 మార్చికల్లా గ్రూప్‌లోని 9 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 3,44,626 కోట్లకు ఎగసింది. 2022–23లో మార్కెట్ విలువ రూ. 2,25,320 కోట్లుగా నమోదైంది.

అమ్మకాల వృద్ధిపై ఎఫ్ఎంసీజీ ఆశలు!

రానున్న త్రైమాసికాల్లోనూ కొనసాగొచ్చని అంచనా

గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాల పురోగతి ● ఈ–కామర్స్ ద్వారా మెరుగైన వృద్ధి



న్యూఢిల్లీ: గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ కోలుకోవడం, మంచి వర్షాలతో రానున్న త్రైమాసికాల్లోనూ అమ్మకాల వృద్ధి (పరిమాణం) కొనసాగుతుందని ఎఫ్ఎంసీజీ పరిశ్రమ భావిస్తోంది. జూన్ త్రైమాసికం ఫలితాల అనంతరం దిగ్గజ కంపెనీలైన హిందుస్తాన్ యూనిలీవర్, ఐటీసీ, డాబర్, బ్రిటానియా, నెస్లే, ఇమామీ.. అన్నీ కూడా గ్రామీణ మార్కెట్లలో వృద్ధి రికవరీ సంకేతాలు కనిపిస్తున్నట్టు ప్రకటించాయి. ఈ–కామర్స్ చానల్స్ (ముఖ్యంగా క్విక్ కామర్స్) ద్వారా బలమైన వృద్ధి నెలకొన్నట్టు తెలిపాయి. ప్రస్తుత ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ పరిశ్రమలో 6.6 శాతం మేర అమ్మకాల వృద్ధి నమోదైంది. అయితే ద్రవ్యోల్బణం, కాఫీ, కొకోవా ధరలు అసాధారణ రీతిలో పెరగడం పట్ల కంపెనీల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. పప్పులు, ధాన్యాల ధరలు ఇదే మాదిరి ఎగువ స్థాయిలో కొనసాగితే ఉత్పత్తుల ధరలను పెంచక తప్పదని కొన్ని కంపెనీలు ఇప్పటికే సంకేతాలు ఇచ్చాయి. "గ్రామీణ మార్కెట్ల మద్దతుతో రానున్న రోజుల్లో అమ్మకాలు పెరుగుతాయి. ప్రస్తుత త్రైమాసికం కంటే రానున్న త్రైమాసికాల్లో మెరుగైన వృద్ధి నమోదు అవుతుంది. మరీ ముఖ్యంగా ఇంతకంటే బలహీనం కాబోదు" అని డాబర్ ఇండియా సీఈవో మోహిత్ మల్హోత్రా పేర్కొన్నారు. ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం చాలా గరిష్ట స్థాయిలో ఉందంటూ.. ధరల పెరుగుదలపై నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి రావచ్చన్నారు. ధరల గమనంపైనే ఇది ఆధారపడి ఉంటుందని చెప్పారు.

డిమాండ్‌లో పురోగతి

జూన్ త్రైమాసికంలో డిమాండ్ క్రమంగా పెరగడం కనిపించినట్టు మారికో ఎండీ, సీఈవో సౌగత గుప్తా తెలిపారు. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలే వృద్ధి పరంగా మెరుగ్గా ఉన్నట్టు చెప్పారు. అమ్మకాల పరిమాణం ఇక ముందూ పెరగొచ్చన్నారు. మంచి వర్షాలు, ద్రవ్యోల్బణం దిగొస్తుండడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు ఇందుకు సాయపడతాయన్నారు. "కాఫీ, కొకోవా ధరల పరంగా అసాధారణ పరిస్థితులు ఉన్నాయి. వీటి ధరలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరాయి. కనీస మద్దతు ధరల సాయంతో ఆహార ధాన్యాల ధరల పెరుగుదల కూడా ఉంది. అదే సమయంలో పాలు, ప్యాకేజింగ్, వంట నూనెల ధరల్లో స్థిరత్వం ఉంది" అని నెస్లే జూన్ త్రైమాసికం ఫలితాల తర్వాత వెల్లడించింది.

భిన్న పరిస్థితులు

జూన్ త్రైమాసికంలో ఈ–కామర్స్, క్విక్ కామర్స్ చానళ్ల ద్వారా బలమైన వృద్ధి కనిపించినట్టు కంపెనీలు చెబుతున్నాయి. కొన్ని కంపెనీలు అయితే సంప్రదాయ కిరాణా స్టోర్లు తదితర మార్గాల్లో ఎఫ్ఎంసీజీ అమ్మకాలు నెమ్మదించినట్టు వెల్లడించాయి. ఆధునిక ట్రేడ్ చానళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు జోరుగా సాగినట్టు గోద్రేజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఎండీ, సీఈవో సుధీర్ సీతాపతి తెలిపారు. ఈ కామర్స్, ఆధునిక ట్రేడ్‌మార్గాల్లో బలమైన రెండంకెల అమ్మకాల వృద్ధి నమోదైనట్టు డాబర్ ఇండియా సైతం ప్రకటించింది. "ఈ కామర్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జూన్ త్రైమాసికంలో 30 శాతం వృద్ధి నమోదైంది. క్విక్‌కామర్స్‌లో అయితే ఈ వృద్ధి 70 శాతంగా ఉంది"అని డాబర్ ఇండియా సీఈవో మల్హోత్రా వెల్లడించారు. ఈ కామర్స్ విభాగం తమకు ఇక ముందూ తమకు అమ్మకాల పరంగా బలమైన వృద్ధికి మద్దతుగా నిలుస్తుందని హెచ్‌యూఎల్ సైతం తెలిపింది.

వెల్‌డన్ ‘ఓవల్’

- పురుషుల హండ్రెడ్ టోర్నీ టైటిల్ నిలబెట్టుకున్న ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టు
- ఫైనల్లో సదరన్ బ్రేవ్‌పై విజయం



లండన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టు పురుషుల హండ్రెడ్ టోర్నీ చరిత్రలో వరుసగా రెండేళ్లు విజేతగా నిలిచిన తొలి జట్టుగా గుర్తింపు పొందింది. సదరన్ బ్రేవ్ జట్టుతో జరిగిన ఫైనల్లో ఓవల్ జట్టు 17 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. స్యామ్ బిల్లింగ్స్ కెప్టెన్సీలో ఓవల్ జట్టు గత ఏడాది కూడా టైటిల్ సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో హండ్రెడ్ టోర్నీ (ఇన్నింగ్స్‌కు 100 బంతులు చొప్పున) 2021లో ప్రారంభమైంది. సదరన్ బ్రేవ్‌తో జరిగిన టైటిల్ పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన 100 బంతుల్లో 9 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. విల్ జాక్స్ (22 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (20 బంతుల్లో 25; 3 ఫోర్లు), జోర్డాన్ కాక్స్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు), టామ్ కరన్ (11 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ లామోన్‌బై (9 బంతుల్లో 16; 2 ఫోర్లు) రాణించారు. సదరన్ బ్రేవ్ బౌలర్లలో అకీల్ హొసెన్, టైమల్ మిల్స్ మూడు వికెట్ల చొప్పున పడగొట్టగా... జోఫ్రా ఆర్చర్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం 148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సదరన్ బ్రేవ్ జట్టు 100 బంతుల్లో 7 వికెట్లు కోల్పోయి 130 పరుగులకే పరిమితమైంది. అలెక్స్ డేవిస్ (23 బంతుల్లో 35; 6 ఫోర్లు), క్రెయిగ్ ఓవర్టన్ (11 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. ఓవల్ జట్టు బౌలర్లలో సాకిబ్ మహమూద్ మూడు వికెట్లు, ఆడమ్ జంపా రెండు వికెట్లు తీశారు.

24, 25 తేదీల్లో తెలంగాణ అండర్-19 చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీల్లో రాష్ట్ర అండర్-19 జూనియర్ చాంపియన్‌షిప్ జరగనుంది. కూకట్‌పల్లి ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. జనవరి 1, 2005న లేదా ఆ తర్వాత పుట్టిన వారు మాత్రమే ఈ టోర్నీలో పాల్గొనేందుకు అర్హులు. బాలబాలికల విభాగాల్లో వేర్వేరుగా గేమ్‌లు నిర్వహిస్తారు. బాలికల విభాగంలో టాప్-4లో నిలిచిన ప్లేయర్లు... బాలుర విభాగంలో టాప్-7లో నిలిచిన ప్లేయర్లు జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నీలో ఆడాలనుకునే వారు తమ పేర్లను 7337578899, 7337399299 నంబర్లలో నమోదు చేసుకోవాలి.

మాతృదేశంపై మమకారంతో...

ఆస్ట్రేలియా నుంచి బ్రిటన్‌కు మారనున్న స్టార్ సైక్లిస్ట్

పారిస్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాకు మూడు పతకాలు అందించిన మాథ్యూ రిచర్డ్‌సన్



మాథ్యూ రిచర్డ్‌సన్

మెల్‌బోర్న్: విశ్వక్రీడల్లో మూడు పతకాలు సాధించిన ఓ అథ్లెట్... వారం రోజుల వ్యవధిలో దేశం మారాలని నిర్ణయించుకొని అభిమానులకు షాక్ ఇచ్చాడు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియా తరఫున బరిలోకి దిగి అద్వితీయ ప్రదర్శనతో మూడు పతకాలు సాధించిన ట్రాక్ సైక్లిస్ట్ మాథ్యూ రిచర్డ్‌సన్.. అనూహ్య నిర్ణయంతో అభిమానులను విస్మయ పరిచాడు. ఇకపై ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించబోనని తాను పుట్టి పెరిగిన బ్రిటన్ తరఫున బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నాడు. ‘పారిస్’ క్రీడల్లో రిచర్డ్‌సన్ రెండు వ్యక్తిగత రజతాలు, ఒక టీమ్ కాంస్యం గెలుచుకున్నాడు. 25 ఏళ్ల రిచర్డ్‌సన్ తొమ్మిదేళ్ల ప్రాయంలోనే ఆస్ట్రేలియాకు వలస వచ్చాడు. ‘మాథ్యూ నిర్ణయం అనూహ్యం. చాలా వేదనకు గురయ్యాం. అయితే అతడు మాతృదేశానికి ప్రాతినిధ్యం వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం’ అని ఆస్ట్రేలియా సైక్లింగ్ సమాఖ్య మేనేజర్ జెస్ కోర్ఫ్ తెలిపాడు.



ఇదేదో ఒక్క రోజులో తీసుకున్న నిర్ణయం కాదని.. బాగా ఆలోచించి తీసుకున్నదని రిచర్డ్‌సన్ పేర్కొన్నాడు. ‘ఆస్ట్రేలియాపై గౌరవం ఉంది. అయినా ఇది అనాలోచిత నిర్ణయం కాదు. ఇకపై బ్రిటన్ తరఫున పోటీ పడాలనుకుంటున్నా’ అని రిచర్డ్‌సన్ పేర్కొన్నాడు. మరోవైపు బ్రిటన్ సైక్లింగ్ సమాఖ్య సోషల్ మీడియా వేదికగా రిచర్డ్‌సన్‌కు స్వాగతం పలికింది.

భారత్‌ను గెలిపించిన మునీరుల్

లలిత్‌పూర్ (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-20 చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. గ్రూప్ ‘బి’లో భాగంగా సోమవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-0 గోల్ తేడాతో భూటాన్‌ను ఓడించింది. భారత్ తరఫున మునీరుల్ మౌలా (37వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి అర్ధభాగంలోనే గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్ చివరి వరకు దాన్ని కాపాడుకుంది. అయితే ఒత్తిడికి గురైన భూటాన్ ఆటగాళ్లు పదే పదే భారత ప్లేయర్లతో వాగ్వాదానికి దిగగా... మనవాళ్లు కూడా దీటుగా బదులిచ్చారు. దీంతో ఇద్దరు భారత ఆటగాళ్లు, ఓ భూటాన్ ప్లేయర్‌కి రిఫరీ ‘రెడ్ కార్డు’ చూపి మైదానం నుంచి బయటకు పంపాడు. ఫలితంగా ఆట 67వ నిమిషం తర్వాత భారత్ కేవలం తొమ్మిది మంది ప్లేయర్లతోనే ఆధిక్యాన్ని కాపాడుకోవం విశేషం. శుక్రవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో మాల్దీవులుతో భారత్ ఆడుతుంది. గ్రూప్ ‘ఎ’లో బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక జట్లున్నాయి.


మునీరుల్

బంగ్లాదేశ్‌లో ఆడటం సరికాదు

- ఆస్ట్రేలియా టి20 జట్టు కెప్టెన్ అలీసా హీలీ వ్యాఖ్య
- అక్టోబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా టి20 ప్రపంచకప్
- వేదిక మార్పుపై నేడు ఐసీసీ నిర్ణయం!




సిడ్నీ: బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో... మహిళల టి20 ప్రపంచకప్ కోసం అక్కడికి వెళ్లడం సరికాదని ఆస్ట్రేలియా మహిళల జట్టు కెప్టెన్ అలీసా హీలీ అభిప్రాయపడింది. ఇప్పుడిప్పుడే తిరిగి కోలుకుంటున్న దేశంపై ఇది మరింత ఒత్తిడి కలిగిస్తుందని హీలీ వ్యాఖ్యానించింది. బంగ్లాదేశ్‌లో ఏర్పడిన రాజకీయ అస్థిరత హింసకు దారితీయగా... వందలాది మంది మృత్యువాత పడ్డారు. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశం వీడగా... మొహమ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రధానిగా ఎన్నికయ్యారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3 నుంచి 19 వరకు బంగ్లాదేశ్ వేదికగా మహిళల టి20 ప్రపంచకప్ జరగాల్సి ఉంది. మొత్తం 10 జట్లు పాల్గొననున్న ఈ టోర్నీలో ఆస్ట్రేలియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఈ నేపథ్యంలో హీలీ మాట్లాడుతూ... ‘ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఆడటం కష్టంగా ఉంది. నైతికంగా ఇది సరైంది కాదనిపిస్తోంది. టోర్నీ అక్కడే నిర్వహించాలా వద్దా అనే విషయం ఐసీసీ పరిధిలోకి వస్తుంది. మా వరకైతే టి20 వరల్డ్‌కప్ కోసం మెరుగ్గా సిద్ధమవుతున్నాం. టోర్నీ ఎక్కడ జరిగినా సత్తా చాటగలమనే నమ్మకం ఉంది’ అని పేర్కొంది. 2014 టి20 ప్రపంచకప్ తర్వాత.. ఇటీవలే ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించింది. పరిమిత ఓవర్ల సిరీస్‌లలో భాగంగా ఆడిన 3 వన్డేలు, మూడు టి20ల్లోనూ విజయం సాధించింది. మరోవైపు షెడ్యూల్ ప్రకారమే బంగ్లాదేశ్‌లో టి20 వరల్డ్‌కప్ నిర్వహించాలా వద్దా అనే విషయంపై ఈరోజు ఐసీసీ నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఒకవేళ వేదిక మార్చాలనుకుంటే మాత్రం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆతిథ్య రేసులో ముందుంది.

25, 26 తేదీల్లో తెలంగాణ యూత్ బాస్కెట్‌బాల్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం, మహబూబ్‌నగర్ జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యూత్ అంతర్ జిల్లా చాంపియన్‌షిప్ పోటీలకు రంగం సిద్ధమైంది. ఈనెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలో ఈ టోర్నీని నిర్వహిస్తారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో మొత్తం 17 జిల్లా జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో రాణించిన క్రీడాకారులను జాతీయ యూత్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ బాస్కెట్‌బాల్ జట్టులోకి ఎంపిక చేస్తామని తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం జనరల్ సెక్రటరీ నార్మన్ ఐజాక్ తెలిపారు. జాతీయ యూత్ చాంపియన్‌షిప్ పశ్చిమ బెంగాల్‌లో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతుంది. గత ఏడాది సూర్యాపేటలో జరిగిన తెలంగాణ యూత్ అంతర్ జిల్లా చాంపియన్‌షిప్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జట్లు బాలబాలికల విభాగాల్లో విజేతగా నిలిచాయి.

పేస్ ఆల్‌రౌండర్లు కీలకం: కమిన్స్



మెల్‌బోర్న్: ఈ ఏడాది చివర్లో భారత్‌తో స్వదేశంలో జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పేస్ ఆల్‌రౌండర్లు కామెరూన్ గ్రీన్, మిషెల్ మార్ష్ కీలకమవుతారని ఆస్ట్రేలియా టెస్టు జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. వీరిద్దరూ అందుబాటులో ఉంటే ప్రధాన పేసర్లపై భారం తగ్గడంతో పాటు... బ్యాటింగ్ లైనప్ బలం పెరుగుతుందని అభిప్రాయపడ్డాడు. ‘పేస్ ఆల్‌రౌండర్లు ఉండటం వల్ల అదనపు ప్రయోజనమే. వేసవిలో భారత్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో గ్రీన్, మార్ష్ కీలకం అవుతారు. గతంలో వారిని పెద్దగా వినియోగించుకోలేదు. కానీ ఈసారి పరిస్థితి భిన్నం. ఎక్కువ ఓవర్లపాటు బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. గ్రీన్ బౌలర్‌గానే కెరీర్ ప్రారంభించాడు. ఇప్పుడు తగినంత అనుభవం కూడా సాధించాడు. వీరిద్దరి వల్ల జట్టు సమతుల్యం పెరుగుతుంది. బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్టమవుతుంది. నాథన్ లయన్ వంటి సీనియర్ స్పిన్నర్ ఉండటం మా అదృష్టం’ అని కమిన్స్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన గత రెండు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీల్లో పరాజయం పాలైన ఆసీస్... ఈసారి సిరీస్ ఎలాగైనా సిరీస్ చేజిక్కించుకోవాలని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది.

డబ్ల్యూబీబీఎల్ బరిలో హర్మన్, జెమీమా, దీప్తి!



సిడ్నీ: ఈ ఏడాది మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) టి20 టోర్నీలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఆడటం దాదాపు ఖరారైంది. డబ్ల్యూబీబీఎల్ డ్రాఫ్టింగ్ జాబితాలో ఈ ముగ్గురి పేర్లు ఉండటమే దీనికి కారణం. మెల్‌బోర్న్ రెనిగేడ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న హర్మన్‌ప్రీత్‌ను ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోనుంది. ఈ మేరకు ఫ్రాంచైజీలు సోమవారం అట్టిపెట్టుకోవాలనుకుంటున్న ప్లేయర్ల జాబితా విడుదల చేశాయి. అడిలైడ్ స్ట్రయికర్స్ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మను ఆ జట్టు రిటైన్ చేసుకోనుంది. సూజీ బేట్స్ (సిడ్నీ సిక్సర్స్), అలీస్ కాప్సీ (మెల్‌బోర్న్ స్టార్స్), సోఫియా ఎకెల్‌స్టోన్ (సిడ్నీ సిక్సర్స్), షబ్నిమ్ ఇస్మాయిల్ (హోబర్ట్ హరికేన్స్), హీథర్ నైట్ (సిడ్నీ థండర్), డానీ వ్యాట్ (పెర్త్ స్కార్చర్స్) రిటెన్షన్ జాబితాలో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు డబ్ల్యూబీబీఎల్ సీజన్ జరగనుంది.

టీటీ టోర్నీ విజేతలు అనీశ్, సాన్వి

సాక్షి, హైదరాబాద్: పద్మావతి, రాజారావు స్మారక తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ లీగ్ చాంపియన్‌షిప్‌లో అనీశ్, సాన్వి రాణించారు. వీరిద్దరు అండర్-15 బాలబాలికల సింగిల్స్ విభాగాల్లో చాంపియన్స్‌గా అవతరించారు. బాలుర ఈవెంట్‌లో ఐదు రౌండ్ల తర్వాత అనీశ్ విజేతగా నిలిచాడు. ధర్మతేజ సాయి రెండో స్థానంలో, ధ్రువ్ సాధ్వాని మూడో స్థానంలో, మనోహర్ వేలూరి నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల ఈవెంట్‌లో సాన్వి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. శ్రీవిద్య రెండో స్థానంలో, మహిమా కృష్ణ మూడో స్థానంలో, గాయత్రి నాలుగో స్థానంలో నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి పద్మావతి, రాజారావు కుటుంబసభ్యులు హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం (టీఎస్‌టీటీఏ) అధ్యక్షుడు కేకే మహేశ్వరి, జనరల్ సెక్రటరీ నాగేందర్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్స్ వృత్తి, సుహాస్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల విభాగంలో అంతర్జాతీయ స్విమ్మర్ వృత్తి అగర్వాల్, పురుషుల విభాగంలో సుహాస్ ప్రీతమ్ చాంపియన్స్‌గా నిలిచారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన ఈ టోర్నీలో వృత్తి నాలుగు ఈవెంట్లలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన వృత్తి 200, 400, 800, 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్స్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన మైలారి సుహాస్ ప్రీతమ్ 50, 100, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్స్‌తోపాటు 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ ఈవెంట్స్‌లో విజేతగా నిలిచాడు. తెలంగాణ స్విమ్మింగ్ సంఘం సెక్రటరీ జి.ఉమేశ్, జీహెచ్ఎంసీ ఏడీఏస్ శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.



కరాటే కుర్రాళ్ల కిక్ అదిరింది

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి ఆల్ స్టయిల్స్ మార్షల్ ఆర్ట్స్ కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ కుర్రాళ్లు అదరగొట్టారు. టైగర్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఈ టోర్నీని నిర్వహించారు. వివిధ విభాగాల పతక విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

స్వర్ణ పతకాలు: ఈథన్ రాజ్ (అండర్-12 కటా), దక్ష్ (అండర్-8 కటా). **రజత పతకాలు:** అంకిత (అండర్-10 కటా), సాయాంశ్ (అండర్-12 కటా), కావ్యాంశ్ (అండర్-8 కటా). **కాంస్య పతకాలు:** అమైర్ (అండర్-8 కటా), కిరణ్య (అండర్-8 కటా), అహ్మద్ (అండర్-6 కటా), శ్రవణ్ (అండర్-12 కటా), నిగ్నేశ్ (అండర్-6 కటా), మాన్విత (అండర్-6 కటా), సాధ్విత (అండర్-12 కటా), కరణ్ నాథ్ (అండర్-13 కటా).


రక్షా బంధన్ సందర్భంగా సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ముకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా కోల్‌కతాలో 'వుయ్ వాంట్ జస్టిస్' అని ఉన్న రాఖీలతో జూనియర్ డాక్టర్లు


పట్నాలో తన సోదరీమణులతో రాఖీలు కట్టించుకుంటున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్


ఢిల్లీలో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు రాఖీ కడుతున్న మంత్రి అతిశీ


ఇండోర్‌లోని ఖజ్రానా గణేశ్ ఆలయంలో 13 అడుగుల వెడల్పు, ఎత్తున్న భారీ రాఖీతో పూజారులు

సగం అమెరికా... హారిస్‌కే జై!



ఆమెకు 48 శాతానికి పెరిగిన ఆమోదం

- నల్లజాతీయుల్లోనైతే మూడింట రెండొంతులు!
- 41 శాతానికి తగ్గిన ట్రంప్ ఆమోదనీయత
- ఏపీ–ఎన్‌ఓఆర్‌సీ తాజా పోల్‌లో వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ భారత మూలాలున్న డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు బాగా పెరుగుతోంది. తాజా ఒపీనియన్ పోల్‌లో ఏకంగా 48 శాతం మంది అమెరికన్లు ఆమె పట్ల సానుకూలత వ్యక్తం చేశారు. నల్లజాతీయుల్లోనైతే మూడింట రెండొంతులు హారిస్‌కే జైకొట్టారు. శ్వేత జాతి మహిళలు కూడా నానాటికీ ఆమె పట్ల మరింతగా ఆకర్షితులవుతున్నారు. హారిస్ గురించి పెద్దగా తెలియదని చెప్పేవారి సంఖ్య కూడా గణనీయంగా పడిపోయింది.

నెల రోజుల్లోనే...

48 శాతం మంది అమెరికన్లు హారిస్ పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నట్టు అసోసియేటెడ్ ప్రెస్–నార్క్ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్ నిర్వహించిన తాజా పోల్‌లో తేలింది. రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు 41 శాతం మందే మద్దతు పలికారు. అధ్యక్షుడు జో బైడెన్ రేసు నుంచి తప్పుకోకముందు ఆయనతో ట్రంప్ బిగ్ డిబేట్‌కు ముందు చేసిన పోల్స్‌లో కమలకు 39 శాతం మద్దతు లభించింది. నెల రోజుల్లోనే అది 48 శాతానికి పెరిగింది! ఆమె గురించి అంత అవగాహన లేదని జూన్‌లో 12 శాతం అమెరికన్లు చెప్పగా ఇప్పుడది 6 శాతానికి పడిపోయింది.

జాతి, లైంగికతే కారణం కాదు!

అమెరికన్లలో శ్వేతజాతీయుల కంటే నల్లజాతీయులే హారిస్‌కు ఎక్కువగా అనుకూలంగా ఉన్నారు. వారిలో మూడింట రెండొంతుల మంది హారిస్ పట్ల సానుకూలత ప్రదర్శించారు. శ్వేతజాతీయేతర పురుషులు, మహిళల్లో ప్రతి 10 మందిలో ఆరుగురు హారిస్‌కే ఓటేశారు. అయితే ఆమె ప్రచారం నిజాయితీగా, వాస్తవికంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. అమలు సాధ్యం కానీ హామీలేవీ హారిస్ ఇవ్వడం లేదని, ఆమె అద్భుతంగా పని చేస్తారన్న నమ్మకం తమకుందని వారు చెబుతున్నారు. ''జాతి, లైంగికత కారణంగా ఆమె చరిత్రాత్మక అభ్యర్థే. కానీ ఆమెకు మేం మద్దతివ్వడానికి అదొక్కటే కారణం కాదు. ప్రజలకు ఆమె ఏ మేరకు మంచి చేయగలరనేదే మాకు ప్రధానం'' అని వారు స్పష్టం చేశారు.

వృద్ధులు, యువతలోనూ...

డెమొక్రాట్లు, ఇండిపెండెంట్లు, మహిళలతో పాటు 30 ఏళ్ల లోపు యువతలో కూడా హారిస్‌కు ఆదరణ పెరిగింది. 30 ఏళ్ల లోపు యువతలో సగం మంది ఆమె పట్ల తాజా సర్వేలో సానుకూల దృక్పథం వెలిబుచ్చారు. ఇక 60 ఏళ్ల పైబడిన వారిలో వారిలో సగం మందికి హారిస్ పట్ల సానుకూల దృక్పథముంది. ఒకప్పుడు రిపబ్లికన్ పార్టీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నవారూ ఈ ఎన్నికల్లో హారిస్‌కే ఓటేయాలని భావిస్తున్నారు. బైడెన్ వైదొలగడం, డెమొక్రాట్లు హారిస్‌ను ఎంచుకోవడం గొప్ప విషయమన్నది వారి అభిప్రాయం. ట్రంప్ మళ్లీ గెలిస్తే సుప్రీంకోర్టుకు సంప్రదాయవాదులైన న్యాయమూర్తులను నామినేట్ చేస్తారని, మహిళల అబార్షన్ హక్కుల వంటి వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తారని అమెరికన్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే ఇది డెమొక్రాట్లకు మద్దతివ్వాల్సిన సమయమని వారంటున్నారు.

శ్వేతజాతీయుల్లో భిన్నాభిప్రాయాలు...

శ్వేతజాతీయుల్లో మాత్రం పురుషుల మద్దతు ఎప్పట్లాగే ట్రంప్‌కే ఉందని పోల్ తేల్చింది. వారిలో ప్రతి 10 మందిలో ఆరుగురు హారిస్ పట్ల వ్యతిరేకత వెలిబుచ్చారు. దాంతో వాళ్లను ఆకట్టుకునేందుకు హారిస్ బృందం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ట్రంప్ సంప్రదాయ ఓటర్లతో పాటు డిగ్రీ కంటే తక్కువ విద్యార్హతలున్న శ్వేతజాతి పురుషులు హారిస్‌ను బాగా వ్యతిరేకిస్తున్నారు. శ్వేత జాతి మహిళల్లో మాత్రం 49 శాతం మంది హారిస్ పట్ల సానుకూలంగా ఉన్నారు. డిగ్రీ, ఆపై చదువులున్న శ్వేత జాతి మహిళల్లోనూ ప్రతి 10 మందిలో ఆరుగురిది ఇదే అభిప్రాయం.

బర్గర్ కింగ్ వర్సెస్ బర్గర్ కింగ్..!

బహుళజాతి సంస్థపై కేసు గెలిచిన పుణె రెస్టారెంట్



పుణె: అంతర్జాతీయ ఫాస్ట్–ఫుడ్ చెయిన్ బర్గర్ కింగ్ కార్పొరేషన్‌పై పుణెలో బర్గర్ కింగ్ పేరుతో ఉన్న రెస్టారెంట్ 13 ఏళ్లపాటు సాగిన న్యాయ పోరాటంలో విజయం సాధించింది. 'బర్గర్ కింగ్'పేరును వాడుకుంటూ ప్రపంచవ్యాప్తంగా 13 వేలకుపైగా ఔట్‌లెట్లు కలిగిన తమ పేరును దెబ్బతీస్తున్నారని అమెరికాకు చెందిన బహుళజాతి సంస్థ బర్గర్ కింగ్ కార్పొరేషన్ 2011లో పుణె కోర్టులో కేసు వేసింది. ఆ పేరును వాడకుండా సంబంధిత రెస్టారెంట్‌ను ఆదేశించాలని, తమ బ్రాండ్‌కు పూడ్చలేని నష్టాన్ని కలుగజేసినందుకు రూ.20 లక్షలు చెల్లించాలని కూడా అందులో కోరింది. దీనిపై పుణె బర్గర్ కింగ్ యజమానులైన అనహిత, షాపూర్ ఇరానీలు న్యాయపోరాటం జరిపారు. ఒక్క పేరు తప్ప, బర్గర్ కింగ్ కార్పొరేషన్‌తో ఎలాంటి సారూప్యతలు తమ రెస్టారెంట్‌కు లేవన్నారు. తమ వంటి చిన్న వ్యాపారాలను దెబ్బకొట్టే దురుద్దేశంతోనే ఆ సంస్థ ఈ కేసు ఏళ్లపాటు కొనసాగించిందని ఇరానీ ఆరోపించారు. దీని కారణంగా తాము తీవ్ర వేదనకు, మానసిక ఒత్తిడికి గురయ్యామని చెప్పారు. విచారించిన జడ్జి సునీల్ వేద్ పాఠక్..'ఇరానీ 1992లోనే బర్గర్ కింగ్ పేరుతో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. కానీ, అమెరికా కంపెనీ 2014 తర్వాతే దేశంలోకి అడుగుపెట్టింది. ఆ కంపెనీ వాదన చాలా బలహీనంగా ఉంది. పుణెలోని రెస్టారెంట్ బర్గర్ కింగ్ పేరుతో వినియోగదారులను తికమకపెట్టినట్లు గానీ, తప్పుదోవ పట్టించినట్లు గానీ నిరూపించలేకపోయింది'అని స్పష్టం చేశారు. అంతేకాదు, పుణె బర్గర్ కింగ్ రెస్టారెంట్‌తో తమ బ్రాండ్‌కు వాటిల్లిన నష్టంపై సరైన ఆధారాలను సైతం అమెరికా కంపెనీ చూపలేదన్నారు. అందుకే పరిహారం పొందే అర్హత కూడా ఆ సంస్థకు లేదన్నారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పుణె రెస్టారెంట్ అదే పేరుతో తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.



భావసారూప్య పార్టీలతో కూటమికి సిద్ధం

జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ నూతన చీఫ్ తారిక్ హమీద్ కర్రా



శ్రీనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమతో కలిసి పోటీ చేసేందుకు నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ)సంసిద్ధత వ్యక్తం చేశాయని జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా వెల్లడించారు. ఎన్‌సీ ఇప్పటికే కేంద్ర నాయకత్వంతో ఈ విషయమై ఇప్పటికే చర్చించినట్లు తనకు తెలిసిందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం గత వారం పార్టీ జమ్మూకశ్మీర్ చీఫ్‌గా కర్రాను నియమించింది. సోమవారం న్యూఢిల్లీ నుంచి శ్రీనగర్ చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఎన్నికల్లో కలిసి పోటీ చేసే విషయంలో ఎన్‌సీ, పీడీపీలు ఇప్పటికే కాంగ్రెస్‌కు పచ్చజెండా ఊపాయన్న తారిక్ అహ్మద్..భావ సారూప్యం కలిగిన ప్రాంతీయ పార్టీలతో చర్చలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అధిష్టానం ఇప్పటికే ఇందుకోసం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందని వివరించారు. కాంగ్రెస్‌ను దెబ్బకొట్టే ఉద్దేశంతో కాంగ్రెస్‌ను వీడిన గులాం నబీ ఆజాద్‌తో, ఆయన సొంతపార్టీ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీతో మాత్రం చర్చల ప్రశ్నే లేదన్నారు.

రాష్ట్ర హోదా పునరుద్ధరించకుంటే సుప్రీంకు: ఒమర్

కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి పునరుద్ధరించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఎన్‌సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఈ విషయంలో తమదే విజయమని, రాష్ట్ర హోదా సాధించుకుంటామని అన్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని ఒమర్ చెప్పారు. అదే సమయంలో, ఇతర పార్టీల ఓటు బ్యాంకు చీలిపోయిందని చెప్పారు. ఈ విషయం ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో తేలిపో యిందన్నారు. ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థులతోనే అసలైన ప్రమాదం పొంచి ఉందని చెప్పారు.

ఆర్టికల్ 370, రాష్ట్ర హోదా పునరుద్ధరణ

నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టో విడుదల చేసిన ఒమర్



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) వేగంగా సిద్ధమవుతోంది. సోమవారం మేనిఫెస్టోను విడుదల చేసింది. ఆర్టికల్ 370, జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ హామీలిచ్చింది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1వ తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. జమ్మూ కశ్మీర్‌కు 1953కు ముందున్న స్వయం ప్రతిపత్తిని కోరతామని ఎన్‌సీ మేనిఫెస్టో పేర్కొంది. ఈ మేరకు 2000 జూన్‌లో ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయగా.. అప్పటి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి సారథ్యంలో కేంద్ర కేబినెట్ దీన్ని తిరస్కరించింది. 2019లో నరేంద్ర మోదీ సర్కారు ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే రాష్ట్ర హోదా తొలగించి జమ్మూకశ్మీర్, లదాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష కోరతామని, కశ్మీరి పండిట్లు గౌరవప్రదంగా తిరిగి వచ్చేలా చూస్తామని మేనిఫెస్టోలో ఎన్‌సీ హామీ ఇచ్చింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కరెంటు, నీటి కష్టాల నుంచి ఉపశమనం కలిగిస్తామని పేర్కొంది. పేదలకు ఏడాదికి 12 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చింది. అమలు చేయగలిగిన హామీలను మాత్రమే ఇచ్చామని ఎన్‌సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మేనిఫెస్టోను విడుదల చేస్తూ అన్నారు. అధికారంలోకి వస్తే జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి, రాష్ట్ర హోదాలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అసెంబ్లీ తొలి సమావేశాల్లో తీర్మానం చేస్తామని ఒమర్ వెల్లడించారు. పేద కుటుంబాలకు చెందిన ప్రతి గృహిణికి నెలకు రూ.5,000 ఆర్థికసాయం అందజేస్తామని, యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తామని మేనిఫెస్టో హామీ ఇచ్చింది.

కొండ అంచుపై బెదరకుండా!

- ప్రమాదకర సాహసాన్ని సునాయసంగా చేసిన సైక్లిస్టు
- ఆన్‌లైన్‌లో 16 కోట్లు దాటిన వీక్షణలు



రోమ్: గతుకుల రోడ్లపై సైకిల్ సవారీ అంటే చాలా మంది భయపడిపోతారు. పడితే మోకాలి చిప్పలు పగలడం ఖాయమని అందరికీ తెలుసు. అలాంటిది అంతెత్తునుంచి పడితే భూమ్మీద నూకలు చెల్లిపోవడం ఖాయమని తెల్సి కూడా కొండ అంచుపై సైకిల్ తొక్కి ఈ సైక్లిస్ట్ తనకు భయం లేదని, సాహసమే తన ఊపిరి అని చాటాడు. ఇంత ఎత్తులో సైకిల్ తొక్కుతుంటే తొక్కే వారికే చెమటలు పడతాయిగానీ ఈ వీడియో చూసిన వారికి ముచ్చెమటలు పట్టడం ఖాయమని చాలా మంది నెటిజన్లు వ్యాఖ్యానాలుచేశారు. ధైర్యంగా, దిలాసాగా శిఖరాగ్రంపై సైకిల్ మీద దూసుకెళ్తున్న ఈ పర్వతారోహణ సైక్లిస్ట్ పేరు మాక్రో బసాట్. ఇటలీలోని ప్రఖ్యాత డోలమైట్ పర్వతాలపై తాను చేసిన సైకిల్ సవారీని ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్‌చేశాడు. ''తప్పులకు తావు లేదు. ఆనందంతో నా హృదయం జ్వలిస్తోంది. ఆనంద అడ్రినలిన్ హార్మోన్‌తో మైమరిచిపోయా. ఇలా చేయడం నాకెంతో ఇష్టం' అంటూ వీడియోకు క్యాప్షన్‌ను జతచేశాడు. వీడియో చూస్తున్నంతసేపు ''అరెరే.. పట్టుతప్పి పడిపోతాడేమో''అని మనసులో అనుకోవడం ఖాయం. ఈ వీడియోను ఆన్‌లైన్‌లో ఏకంగా 16.8 కోట్ల మంది వీక్షించడం విశేషం. ఈయనను పొగుడుతూ చాలా మంది కామెంట్లు పెట్టారు. ''వీడియో చూసిన ఐదు సార్లూ షాక్‌కు గురయ్యా', 'చావంటే ఇతనికి భయం లేదనుకుంటా. చావుకు కూడా ఇతనంటే భయమేమో. అందుకే అది ఇతని దరి చేరట్లేదు', 'ఇదైతే కృత్రిమ మేధతో సృష్టించిన వీడియో కాదుకదా!', 'వీడియో చూస్తున్నంతసేపు నా బీపీ పోటెత్తింది', '51 కోట్ల చదరపు కిలోమీటర్ల భూమిని వదిలేసి తమ్ముడు స్వర్గంలో విహారానికి బయల్దేరాడు', 'మాటల్లేవ్'అంటూ ఎవరికి నచ్చినట్లు వాళ్లు కామెంట్లు చేశారు.

ఉబర్ క్యాబ్‌లో రాహుల్ ప్రయాణం

గిగ్ వర్కర్ల వెతలను పరిష్కరిస్తామని హామీ

న్యూఢిల్లీ: గిగ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు వీరి సమస్యల పరిష్కారానికి మంచి విధానాలను తీసుకువస్తాయని, తమ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో ఉత్తమ విధానాన్ని అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇటీవల ఢిల్లీలో ఉబర్ క్యాబ్‌లో ప్రయాణించిన సమయంలో డ్రైవర్ సునీల్‌తో జరిపిన సంభాషణ వీడియోను సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'సునీల్ వంటి ఎందరో క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ ఏజెంట్లు గిగ్ వర్కర్లు చాలీచాలని సంపాదనతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ఆర్థిక భరోసా కూడా వీరికి ఉండటం లేదు. వీరి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ విధానాలను తీసుకొస్తాయి'అని రాహుల్ తెలిపారు. దాదాపు 11 నిమిషాల ఆ వీడియోలో యూపీలోని ఎటాహ్‌కు చెందిన డ్రైవర్ సునీల్ తన సమస్యలను చెప్పుకున్నారు. అధిక ధరలతో కుటుంబపోషణకు సంపాదన చాలకపోవడంతో తిరిగి సొంతూరుకే వెళ్లిపోవాలనుకుంటున్నట్లు చెప్పాడు. రైడ్ అనంతరం రాహుల్ క్యాబ్ డ్రైవర్ సునీల్ పిల్లలకు బహుమతులు అందజేశారు. ఆ మర్నాడు ఓ హోటల్‌లో సునీల్ కుటుంబంతో కలిసి భోజనం చేశారు.


ఉబర్ డ్రైవర్ సునీల్ కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న రాహుల్

'ఆరెంజ్' ఆరోరా అదుర్స్!



ధృవ కాంతులు. విద్యుత్ శక్తి కలిగిన సూర్యకాంతి రేణువులు భూ అయస్కాంత క్షేత్రంలో ఢీకొన్నప్పుడు ధృవకాంతులు(అరోరాలు) ఏర్పడుతుంటాయి. ఇవి సాధారణంగా ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగుల్లో కనిపిస్తాయి. అయితే ఎప్పుడూలేనిది కొత్తగా నారింజ రంగు అరోరాలు ప్రత్యక్షమవడంతో శాస్త్రవేత్తలు సైతం ఒకింత ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఆక్సిజన్ పాళ్లు ఎక్కువైతే పచ్చరంగులో, నైట్రోజన్ అధికంగా ఉంటే పింక్ రంగులో అరోరాలు కనిపిస్తాయి. అయితే ఇటీవల అమెరికాలోని పెన్సిల్వేనియా గగనతలంపై కనువిందుచేసిన అరోరాలో అత్యంత ప్రకాశవంతమైన ఆరెంజ్ అరోరా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. తరచూ ఆకాశాన్ని పరిశీలించే స్కైవాచర్ టోనీ బెండలే తీసిన ఒక ఫొటో ఇప్పుడు ఖగోళ అధ్యయనకారుల్లో ఆసక్తిని మరింత పెంచింది. భూవాతావరణంలోని భిన్న అణువులతో తాడనాన్ని బట్టి ఆకుపచ్చ, ఎరుపు, గులాబి ఇలా విభిన్న రంగుల అరోరాలు సంభవిస్తాయి. ఆరెంజ్ స్థాయి తరంగదైర్ఘ్యాల వద్ద నైట్రోజన్, ఆక్సిజన్‌లు కాంతిని వెదజల్లుతాయి. అయితే చాలా బలహీనంగా ఉండటంతో మన కంటికి కనబడవు. అందుకే సాధారణ పరిస్థితుల్లో నారింజ రంగు ధృవ కాంతి మనం చూడలేం. అయితే ఈనెల 12న సంభవించిన భారీ భూఅయస్కాంత క్షేత్రంపై సూర్యకాంతి రేణువులు భారీగా ఢీకొన్నపుడు ఎరుపు, ఆకుపచ్చ అరోరాలు ఒకదానిపై మరొకటి కలిసిపోయి మధ్యలో నారింజ రంగు కనపడవచ్చు. సాధారణంగా ఎరుపు అరోరాలు అత్యంత ఎత్తులో, ఆకుపచ్చ అరోరాలు తక్కువ ఎత్తులో ఏర్పడతాయి. భూమి నుంచి 150 కి.మీ.ల నుంచి 200 కి.మీ.ల ఎత్తు శ్రేణిలో ఇవి రెండు సమ్మిళితమై కొత్త రంగును సృష్టిస్తాయని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. తాజా నారింజ అరోరాకు అదే కారణమని భావిస్తున్నారు. సూర్యుని ఉపరితలం నుంచి సంభవించే భారీ విస్ఫోటాలను కరోనా మాస్ ఎజెక్షన్(సీఎంఈ)గా పిలుస్తారు. వీటి నుంచి వెలువడే సూర్యకిరణాలు బలంగా భూ అయస్కాంత క్షేత్రాన్ని తాకినపుడు అరోరాల్లో ఇలాంటి కొత్త కాంతులు ఏర్పడొచ్చని భావిస్తున్నారు. ఇలాంటివి సంభవించినపుడు అంతరిక్ష వాతావరణం భూవాతావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న దానిపైనా ఖగోళవేత్తలు అధ్యయనం చేస్తుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

సాక్షి, న్యూఢిల్లీ: ప్రఖ్యాత అమర్‌నాథ్ యాత్ర ముగిసింది. ఈ ఏడాది జూన్ 29న ప్రారంభమైన ఈ యాత్ర సోమవారంతో పూర్తయింది. సుమారు 52 రోజుల పాటు జరిగిన యాత్రలో 5.10 లక్షల మందికి పైగా భక్తులు మంచు స్ఫటిక లింగాన్ని దర్శించుకున్నారు. గత ఏడాది నాలుగున్నర లక్షల మంది యాత్రలో పాల్గొన్నారు. 13 మౌంటెయిన్ రెస్క్యూ టీమ్స్(ఎంఆర్‌టీలు)ఈ ఏడాది యాత్ర సవ్యంగా సాగడంలో ఎనలేని సేవలందించాయని అదనపు డీజీపీ విజయ్ కుమార్ చెప్పారు. వీరిని యాత్ర ప్రారంభానికి వారం ముందుగానే నిర్దేశిత ప్రాంతాల్లో మోహరించినట్లు చెప్పారు. ఈ బృందాలు అత్యవసర పరిస్థితుల్లో 1,300 మంది యాత్రికులను రక్షించడంతోపాటు 2 వేల మందికి ఆక్సిజన్‌ను అందజేశాయన్నారు.

కత్తిపోట్లకు గురైన టీనేజర్ మృతి

ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్తతలు

జైపూర్: రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మతఘర్షణలకు కారణమైన కత్తిపోట్ల ఘటనలో బాధిత బాలుడు నాలుగురోజులు మృత్యువుతో పోరాడి చివరకు తనువు చాలించాడు. కత్తిపోట్లకు గురైన 15 ఏళ్ల దేవరాజ్ సోమవారం తుదిశ్వాస విడవడానికి ముందు అతని సోదరి రాఖీ కట్టిందని ఉదయ్‌పూర్ కలెక్టర్ అరవింద్ పోస్వాల్ వెల్లడించారు. శుక్రవారం దేవరాజ్‌ను స్కూలు బయటే మరో విద్యార్థి కత్తితో పొడిచాడు. అతను వేరే మతస్థుడు కావడంతో హిందూ సంస్థలు విధ్వంసానికి దిగాయి. కొన్ని కార్లను తగులబెట్టి, ఒక దుకాణాన్ని ధ్వంసం చేశాయి. మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తడంలో అన్ని స్కూళ్లను నిరవధికంగా మూసివేశారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

ఇటలీలో పడవ మునక..

- టెక్ దిగ్గజం మైక్ లించ్ సహా ఆరుగురు గల్లంతు

రోమ్: సిసిలీ సముద్ర జలాల్లో అనూహ్యంగా సంభవించిన తుపాను కారణంగా విలాసవంతమైన పడవ మునిగి బ్రిటిష్ టెక్ దిగ్గజం మైక్ లించ్ సహా ఆరుగురు గల్లంతైనట్లు ఇటలీ పోలీసులు తెలిపారు. ప్రమాదం నుంచి లించ్ భార్య, మరో 14 మంది బయటపడినట్లు వెల్లడించారు. సమీపంలోని మరో పడవలో ఉన్న వారే లించ్ భార్య ఎంజెలా బకారెస్‌ను రక్షించారని తెలిపారు. లించ్.. వారానికి రూ.1.80 కోట్ల అద్దెకు ఈ భారీ పడవను అద్దెకు తీసుకున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇందులో 12 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బంది ఉన్నారు.

యూపీలో నర్సుపై డాక్టర్ అత్యాచారం

ముగ్గురి అరెస్టు

మొరాదాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో దళిత నర్సుపై డాక్టర్ అత్యాచారం చేశాడు. డాక్టర్‌తో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం విధుల నిమిత్తం నర్స్ హాస్పిటల్‌కు వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో మరో నర్సు మెహనాజ్ వచ్చి డాక్టర్ పిలుస్తున్నారని, అతని గదికి వెళ్లాలని చెప్పింది. అందుకు నర్సు నిరాకరించడంతో, వార్డ్ బాయ్‌తో కలిసి బలవంతంగా ఆమెను పై అంతస్తులో ఉన్న గదిలోకి తీసుకెళ్లి, లోపలికి నెట్టి తాళం వేశారు. తరువాత గదికి వెళ్లిన డాక్టర్ షానవాజ్ నర్సుపై అత్యాచారానికి పాల్పడ్డారు.

మాల్స్‌కు బాంబు బెదిరింపులు.. ఖాళీ చేయించిన పోలీసులు..

గౌహతి/సూరత్/చండీగఢ్: అసోంలోని గౌహతి నడిబొడ్డున ఉన్న సిటీ సెంటర్ మాల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. రాష్ట్ర సచివాలయానికి సమీపంలో ఉన్న మాల్‌కు బెదిరింపులు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మాల్‌ను ఖాళీ చేయించారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, స్నిఫర్ డాగ్స్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఏమీ దొరకలేదని పోలీసులు తెలిపారు. అదే ఈ మెయిల్‌ను దేశంలోని 75 ప్రాంతాలకు పంపించారని, అడ్రస్ బార్‌లో మొత్తం 75 మంది గ్రహీతలు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నిషేధిత ఉల్ఫా(ఐ) గౌహతిలోని పలు ప్రాంతాలతో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 24 బాంబులను ఉంచినట్లు ప్రకటించిన నాలుగు రోజుల తర్వాత ఈ సంఘటన జరగడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

సాక్షి ప్లస్
మంగళవారం । 20-8-2024



కొండలరాయుడికి తేళ్ల నైవేద్యం

ఎక్కడైనా భక్తులు దేవుళ్లకు పాలు, పండ్లు, ఫలహారాలను నైవేద్యంగా పెట్టి పూజిస్తారు. కర్నూలు జిల్లా కోడుమూరు కొండపై వెలసిన శ్రీకొండల రాయుడికి మాత్రం భక్తులు తేళ్లను చేతులతో పట్టుకొని స్వామివారిపై వదిలి మొక్కులు తీర్చుకుంటారు. శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని వేలాదిమంది భక్తులు కాలినడకన కొండపైకి చేరుకొని శ్రీకొండలరాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– కోడుమూరు రూరల్

● 'పచ్చ' బడ్డీలా.. అయితే ఓకే..!



రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు, దివ్యాంగులు విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో చిన్న చిన్న బడ్డీలు పెట్టుకుని ఏడెనిమిదేళ్లుగా బతుకు బండిని నడుపుతుంటే...కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు ట్రాఫిక్ సమస్య సాకుగా చూపి తొలగించేశారు. అయితే వారం గడిచేసరికి తొలగించిన ఆ బడ్డీల స్థానంలో సోమవారం పసుపు రంగుతో కొత్త బడ్డీలు వెలిశాయి.

– మధురానగర్ (విజయవాడ సెంట్రల్)

● సచివాలయ ప్రహరీకి పచ్చ రంగు



ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం తూమాడు గ్రామ సచివాలయం ప్రహరీకి గ్రామ టీడీపీ నాయకుడు పచ్చరంగు వేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– జరుగుమల్లి (సింగరాయకొండ)

కాకినాడ పోర్టుపై కక్ష

బియ్యం ఎగుమతులకు సర్కారు మోకాలడ్డు

- ఎగుమతిదారుల్లో వైఎస్సార్‌సీపీ వారున్నారంటూ కుట్రలు
- గద్దెనెక్కగానే కూటమి ప్రభుత్వం వేధింపుల పర్వం
- కాండ్లా పోర్టు వైపు ఎగుమతిదారుల చూపు
- ఉపాధి కోల్పోనున్న దాదాపు 20 వేల మంది

బియ్యం ఎగుమతుల్లో కాకినాడ పోర్టు దేశంలోనే రికార్డులు తిరగరాసింది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వ వేధింపులతో కుదేలవుతోంది. విదేశాలకు బియ్యం ఎగుమతి చేసేందుకు కేంద్రం నుంచి అన్ని అనుమతులున్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మోకాలడ్డుతోంది. ఎగుమతిదారుల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులున్నారన్న ఏకైక సాకుతో ఈ పోర్టుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ దాదాపు 20 వేల మంది పొట్టుకొట్టి వారిని రోడ్డున పడేస్తోంది. ఈ నేపథ్యంలో బియ్యం ఎగుమతిదారులు ఈ పోర్టులో కార్యకలాపాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. ప్రత్యామ్నాయంగా కాండ్లా పోర్టు వైపు అడుగులేస్తున్నారు.

మంత్రి నాదెండ్ల హడావుడి

ఎగుమతిదారుల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులున్నారన్న ఏకైక కారణంతో కాకినాడ పోర్టులో ఎగుమతులను దెబ్బతీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. సార్వత్రిక ఎన్నికల ముందు నుంచే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఈ పోర్టుపై విషం కక్కుతూ వచ్చారు. ఈ పోర్టు ద్వారా విదేశాలకు పీడీఎస్ బియ్యం దొడ్డిదారిన ఎగుమతి చేస్తున్నారంటూ నిందలు వేశారు. రెండు తరాలుగా రైస్ ఇండస్ట్రీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఎగుమతిదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కుట్రలు చేసింది. గత నెలలో కాకినాడ పోర్టు ఆధారిత ఎగుమతిదారుల గోడౌన్‌లపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో అధికారులు దాడులు చేసి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు నూకలను సీజ్ చేసి ఎగుమతిదారుల్లో భయానక వాతావరణాన్ని సృష్టించారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా సీజ్ చేసిన సరుకులో 28 వేల మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ ఎత్తేసి ఇటీవలే విడుదల చేశారు. ఆ తర్వాత ఎగుమతులకు పలు విధాలుగా ప్రతిబంధకాలు సృష్టిస్తున్నారు. చెక్‌పోస్టుల ద్వారా రోజుల తరబడి ఎగుమతులు నిలిచిపోయేలా చేస్తున్నారు. కావాలనే పనిగట్టుకుని జరుగుతున్న ఈ వేధింపుల కారణంగా ఎగుమతిదారులు కాకినాడ పోర్టులో కార్యకలాపాలను నిలిపివేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కాండ్లా పోర్టు వైపు తరలిపోవాలనే నిర్ణయంతో సెప్టెంబర్ నుంచి ఇక్కడ ఎగుమతులు పూర్తిగా నిలిచిపోనున్నాయి.



కాకినాడ పోర్టులో బార్జీల నుంచి ఓడలకు బియ్యం ఎగుమతి చేస్తున్న దృశ్యం

కుట్రలతో కుదేలు

గడచిన ఐదేళ్లలో కోటీ 47 లక్షల 55 వేల 837 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు ఒక్క కాకినాడ పోర్టు నుంచే జరిగాయి. ఈ స్థాయిలో మరే పోర్టు నుంచి ఎగుమతి జరిగిన దాఖలాల్లేకపోవడం గమనార్హం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కాకినాడ పోర్టుకు చంద్రగ్రహణం పట్టుకుంది. గద్దెనెక్కిన దగ్గర నుంచి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు ఈ పోర్టు కార్యకలాపాలను దెబ్బతీస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ దేశంలోనే రికార్డు స్థాయిలో బియ్యం ఎగుమతులు జరిపిన కాకినాడ పోర్టు భవితవ్యం కూటమి ప్రభుత్వ వేధింపులతో ప్రశ్నార్థకంగా మారింది. దీని ప్రభావంతో కాకినాడ పోర్టుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ సుమారు 20 వేల మంది రోడ్డున పడే పరిస్థితి ఖాయంగా కనిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ : బియ్యం ధరలను నియంత్రించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ముడి బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. అత్యవసర అవసరాల దృష్ట్యా ఆఫ్రికా దేశాల విజ్ఞప్తితో కేంద్రం మానవతా దృక్పథంతో ప్రభుత్వ రంగ సంస్థల పర్యవేక్షణలో బియ్యం, నూకలు కలిపి 1.5 మెట్రిక్ టన్నుల ఎగుమతికి అనుమతించింది. ఇవి కాకుండా ఆఫ్రికా దేశం సెనగల్‌కు 5 లక్షల టన్నుల నూకల ఎగుమతికి అనుమతి వచ్చింది. గత జూలై నెలాంతానికి 2.5 లక్షల టన్నుల ఎగుమతి పూర్తి చేశారు. ఇవన్నీ డైరెక్టర్ జనరల్ ఫారెన్ ట్రేడ్ పర్యవేక్షణలో జరుగుతాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, ఎన్‌సీఈఎల్(నేషనల్ కోపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్), ఎన్‌సీసీఎఫ్(నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్), క్రిబ్‌కో నిర్వహించిన వేలంలో ఎక్స్‌పోర్టు కంపెనీలు ఎగుమతి హక్కులు దక్కించుకున్నాయి. దుబాయ్, స్విట్జర్లాండ్ లిమిటెడ్ కంపెనీలతో పాటు సింగపూర్ కేంద్రంగా నిర్వహించే ఓలం ఆగ్రో, అంతర్జాతీయంగా పేరున్న లూయిస్ డ్రూఫిన్, ఢిల్లీ, రాయ్‌పూర్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన డీఆర్ కమోడిటీస్, బాలాజీ రైస్ ఇండస్ట్రీస్, శ్రీరామ్‌ఫుడ్స్, పట్టాభి ఇంటర్నేషనల్, సరళ ఫుడ్స్ వంటి కంపెనీలు కాకినాడ పోర్టు నుంచి నూకలు, బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడానికి సిద్ధమయ్యాయి. దాదాపు 150 ఎగుమతి కంపెనీలు ది రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ సభ్యత్వంతో కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతి చేయడంలో క్రియాశీలకంగా ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ.. కేంద్రం బియ్యం ఎగుమతులపై నిషేధం విధించక మునుపు లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌సీ)లు ఉన్నవే కావడం గమనార్హం. కేంద్రం అనుమతించినా రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డడాన్ని ఎగుమతిదారులు ఆక్షేపిస్తున్నారు. అంతర్జాతీయంగా బియ్యం ఎగుమతిలో ట్రాక్ రికార్డు ఉన్న కాకినాడ పోర్టు ప్రతిష్టను దెబ్బతీస్తే వేలాది మంది రోడ్డున పడతారు.

పులిచింతలకు వరద నీరు విడుదల

సత్రశాల (రెంటచింతల): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి మూడు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా మొత్తం 24,081 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏడీ ఎస్.జయశంకర్, ఏఈ జయపాల్ సోమవారం తెలిపారు.

వేడుకగా రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు



రాఘవేంద్రుల బృందావన సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: తుంగభద్ర పరవళ్లు.. వేదభూమి ఆధ్యాత్మిక వెలుగుల మధ్య కర్నూలు జిల్లా మంత్రాలయంలో రాఘవేంద్రుడి ఆరాధన వేడుకలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శాకోత్సవం, రజతమంటపోత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఉదయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో రాఘవేంద్రుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, పుష్పార్చన, పంచామృతాభిషేకం విశేష అలంకరణ చేపట్టారు. పీఠాధిపతి మూల బృందావనానికి అర్చనలు చేసి హారతులు పట్టారు.

'మాస్టర్ క్లాక్'తో రైలు ప్రమాదాలకు చెక్!

- రైళ్ల గమనం, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల అనుసంధానం
- కొత్త పరిజ్ఞానాన్ని రూపొందించిన ఆర్‌డీఎస్‌వో
- అన్నీ అనుకూలిస్తే అక్టోబరు 2 నుంచి అమలు

సాక్షి, అమరావతి: రైలు ప్రమాదాలను నివారించేందుకు.. దేశంలోని అన్ని రైల్వే జోన్లను అనుసరించేందుకు మాస్టర్ క్లాక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రమాదాలకు సరైన కారణాలను గుర్తించడంలో విఫలమవుతుండటం రైల్వే శాఖను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ సమస్యకు పరిష్కారంగానే మాస్టర్ క్లాక్ వ్యవస్థను రూపొందించింది. తద్వారా రైళ్ల గమనం, వివిధ రైల్వే జోన్లు అనుసరిస్తున్న సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ మధ్య మరింత మెరుగైన అనుసంధానం సాధించవచ్చన్నది రైల్వే శాఖ ఉద్దేశం. అందుకోసం రైల్వే శాఖకు చెందిన రీసెర్చ్ డిజైన్స్ – స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌వో) ఈ సరికొత్త మాస్టర్ క్లాక్ పరిజ్ఞానాన్ని రూపొందించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2 నుంచి ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



మాస్టర్ క్లాక్ విధానం..

రైల్వే కోసం ఆర్‌డీఎస్‌వో మాస్టర్ క్లాక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించింది. ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించిన నావిగేషన్ వ్యవస్థ ×నావిక్₹ పరిజ్ఞానంతో ఈ మాస్టర్ క్లాక్ వ్యవస్థను రూపొందించారు. రైల్వే శాఖకు చెందిన అత్యున్నత సాంకేతిక నిపుణుల బృందం ఈ మాస్టర్ క్లాక్ విధానాన్ని పరిశీలించనుంది. దేశంలోని అన్ని రైల్వే జోన్లు, ప్రొడక్షన్ యూనిట్లు, రైల్వే వర్క్ షాపులు, డేటా సెంటర్లలోని సాఫ్ట్‌వేర్‌తో ఈ మాస్టర్ క్లాక్ వ్యవస్థను అనుసంధానించి పరిశీలిస్తుంది. ఈ విధానం సంతృప్తికరంగా ఉందని నిపుణుల కమిటీ నిర్ధారిస్తే అక్టోబరు 2 నుంచి ప్రవేశపెడతారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ నేతల బరితెగింపు



రామలక్ష్మీ కొట్టాలలో అంగన్‌వాడీ భవనం కూల్చి కబ్జా చేసిన స్థలం



కూల్చకముందు అంగన్‌వాడీ భవనం

- రూ.కోటికి పైగా విలువైన ప్రభుత్వ స్థలం దురాక్రమణ
- జేసీబీతో అంగన్‌వాడీ భవనం కూల్చివేత
- అడ్డరోడ్లను ఆక్రమించుకుని అమ్ముకుంటున్న తెలుగు తమ్ముళ్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ అధికారంలోకి వచ్చాక 'తమ్ముళ్ల' దురాక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఒకరు వాగులూ వంకలు మింగితే.. మరొకరు చెరువును కొల్లగొడుతున్నారు. ఇంకొకరు ప్రభుత్వ, పోరంబోకు, గ్రామనెత్తం.. ఇలా స్థలం ఏదైనా ఖాళీగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. తమ్ముళ్ల ఆగడాలకు అధికారులు 'పచ్చ' జెండా ఊపుతూ రిజిస్ట్రేషన్‌కు అనువుగా మారుస్తుండటంతో అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండగా ఉండడంతో యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోతోంది. ఆళ్లగడ్డలోని ఓ అంగన్‌వాడీ భవనానిది ఇప్పుడు ఇదే పరిస్థితి. వివరాలు ఏమిటంటే..

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని రామలక్ష్మీ కొట్టాల కాలనీలో సుమారు పాతికేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం కోసమని అప్పటి పంచాయతీ కార్యాలయం 6 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. అందులో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించి ఇచ్చింది. కాలక్రమేణా భవనం పాతపడటంతో ఈ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చారు. అప్పట్లో గ్రామ శివారులో ఉన్న ఈ స్థలం ఇప్పుడు మంచి ధర పలుకుతోంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉండడంతో ఈ స్థలంపై ఓ టీడీపీ నేత కన్నుపడింది. అంతే.. జేసీబీతో ఆ భవనాన్ని కూల్చి దాని ఆనవాళ్లు లేకుండా చదును చేసేశాడు. అందరూ అంగన్‌వాడీ కేంద్రాన్ని మళ్లీ నిర్మిస్తున్నారని భావించారు. కానీ, అసలు విషయం తెలుసుకుని సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో స్థలం అభివృద్ధి పనులను టీడీపీ నేత వేగవంతం చేశాడు.

ఐదు నెలల క్రితం నాడు–నేడుకు ఎంపిక

ఐదు నెలల క్రితం గత ప్రభుత్వం అక్కడ కొత్త భవనం నిర్మించాలని నిధులు విడుదల చేసింది. విశాలమైన స్థలం ఉండటంతో నాడు–నేడు కింద మోడల్ అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని తీర్మానించారు. అధికారులు పరిశీలించడంతో చుట్టుపక్కల కాలనీల వారు సంబరపడ్డారు. అయితే, ఇంతలో ప్రభుత్వం మారడంతో విలువైన స్థలం కబ్జాకు గురైంది.,భవనం కూలిపోయింది. మాకు సంబంధం లేదంటే మాకు సంబంధంలేదని ఆయా శాఖలు తప్పించుకుంటున్నాయి.

అడ్డదారులనూ ఆక్రమించేశారు..

ఇదిలా ఉంటే.. సుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఈ కాలనీలో ప్రధాన రోడ్లకు సమాంతరంగా అడ్డదారులు ఏర్పాటుచేశారు. ఈ దారులపైనా కన్నేసిన తమ్ముళ్లు ఖాళీగా ఉన్న స్థలాలతోపాటు అడ్డరోడ్లను ఆక్రమించుకుని అమ్మేసుకుంటున్నారు. దీంతో ఒక వీధిలో నుంచి మరో వీధిలోకి పోవాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎవరో అంగన్‌వాడీ భవనం కూల్చి స్థలం ఆక్రమించుకుంటున్నారనే విషయం తెలిసింది. ఈ విషయం వెంటనే పీడీ మేడంకు తెలియబరిచా. ఆమె స్థలాన్ని ఆక్రమించుకుంటున్న వారితో మాట్లాడారు. అక్కడ అపరిశుభ్రంగా ఉంటే క్లీన్ చేశామని చెప్పారంట.

– తేజేశ్వరి, సీడీపీఓ

మీ ఆస్తిని మీరు కాపాడుకోవాలి..

అంగన్‌వాడీ భవనం కూల్చి స్థలాన్ని ఆక్రమించుకున్నారని అక్కడి సిబ్బంది వచ్చి చెప్పారు. అది మీ స్థలం, అందులో భవనం కూడా ఉంది.. దాన్ని మీరు కాపాడుకోవాలి అని చెప్పా. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారిస్తామని చెప్పా. అయినా వారు ఇంతవరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు కూడా చేయలేదు.

– రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్

'ఆయుష్' వినియోగదారుల్లో మహిళలే ఎక్కువ

పట్టణాల్లో 52.9, గ్రామీణంలో 46.3 శాతం మహిళలు దానికే మొగ్గు

పట్టణాల్లో పురుషులు 50.5, గ్రామాల్లో 43.9 శాతం మంది వినియోగం

గ్రామాల్లో 94.8, పట్టణాల్లో 96 శాతం మందికి అవగాహన

కేంద్ర స్టాటిస్టిక్స్ విభాగం సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి:

వ్యాధులు నివారణ, చికిత్సల కోసం ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్) విధానాలను దేశంలో ఉపయోగిస్తున్న వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. ఆయుష్‌పై కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ నిర్వహించిన సర్వేలో ఇది వెల్లడైంది. 2022 జూలై నుంచి 2023 జూన్ మధ్య దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 1.81 లక్షల గృహాల్లో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లోని 1,998, గ్రామాల్లోని 3,120 గృహాల్లో ఇది చేపట్టారు. సర్వే నిర్వహించిన నాటికి దేశంలో వ్యాధుల నివారణ, చికిత్స కోసం పట్టణ ప్రాంతాల్లో 52.9 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 46.3 శాతం మంది ఏడాది కాలంలో ఆయుష్‌ను ఉపయోగించారు. అలాగే, అత్యధికంగా పట్టణాల్లో 55.4 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 48.8 శాతం మంది మహిళలు వినియోగించారు. అదే పురుషుల్లో గ్రామీణంలో అయితే 43.9 శాతం, పట్టణాల్లో 50.5 శాతంగా ఉంది.






ఇదిలా ఉంటే.. 15 ఏళ్లు పైబడిన వారిలో గ్రామీణ ప్రాంతాల్లో 94.8 శాతం, పట్టణాల్లో 96 శాతం మందికి ఆయుష్‌పై అవగాహన ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. అలాగే, పట్టణాల్లో 80 శాతం, గ్రామాల్లో 79 శాతం గృహాల్లో కనీసం ఒక వ్యక్తికి ఔషధ మొక్కలు, ఇంటి మందులపై అవగాహన ఉంది.

గ్రామాల్లో 94.8 శాతం మందికి అవగాహన..

అంతేకాక.. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాదాపు 24 శాతం కుటుంబాల్లోని కనీసం ఒక సభ్యునికి నాటు వైద్యం, సంప్రదాయ స్థానిక వైద్యం గురించి గుర్తెరిగి ఉన్నారు. ఇక దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 95 శాతం మందికి పైగా వ్యక్తులకు ఆయుష్‌పట్ల అవగాహన కలిగి ఉండగా.. ఏపీ, యూపీ, బిహార్ సహా ఎనిమిది రాష్ట్రాల్లో 90 నుంచి 95 శాతం, మరో ఆరు రాష్ట్రాల్లో 90 శాతంలోపు ఆయుష్ గురించి తెలిసిన వారున్నారు.

వర్గాల వారీగా ఆయుష్‌పై అవగాహన ఇలా..

విభాగం	గ్రామీణ	పట్టణ
పురుషులు	94.7	95.8
మహిళలు	94.8	96.1



క్లుప్తంగా...

గుమ్మితం తండాలో పురాతన శాసనం



ఓర్వకల్లు: గుమ్మితం తండా సమీపంలోని మల్లికార్జున స్వామి ఆలయం బయట పురాతన శిలాశాసనం బయటపడింది. ఆలయాల పరిశీలనలో భాగంగా ఇటీవల జిల్లా పురావస్తు శాస్త్రవేత్తల ఆలయాన్ని సందర్శించినప్పుడు ఈ శిలా శాసనాన్ని గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. క్రీస్తు శకం 12, 13వ శతాబ్ద కాలంలో కన్నడం, సంస్కృతం, తెలుగు భాషల్లో ఓ శిలపై అక్షరాలను గుర్తించారు. పూర్వం మల్లికార్జున దేవదేవునికి మహా మండలేశ్వరుని కుమార్తె గంగాదేవి ఏదో బహుమతిని ప్రదానం చేసినట్లు ఈ శాసనం ద్వారా తెలుస్తుందని పురావస్తుశాఖ అధికారులు సమాచారం. ఈ శాసనాన్ని బట్టి ఆ ఆలయానికి విశిష్టమైన చరిత్రవుందని, పురావస్తు శాస్త్రవేత్తలు మరింత నిశితంగా పరిశీలన చేయనున్నట్లు తెలిసింది.

చీనీ టన్ను రూ.21 వేలు



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.21 వేలు ప్రకారం అమ్మకాలు జరిగినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 246 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి. వాటిని ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. అందులో టన్ను గరిష్ఠం రూ.21 వేలు, కనిష్ఠం రూ.7 వేలు, సరాసరి రూ.15 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయని సెక్రటరీ తెలిపారు.

జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్‌కు ముఖేష్ ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): పెరూ దేశంలోని లిమాలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ ఎంపికయ్యాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎన్.సుబ్రమణ్యేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ముఖేష్ సుదీర్ఘ కాలంగా ఇండియన్ రైఫిల్ షూటింగ్ క్యాంప్‌లో కొనసాగుతున్నాడన్నారు.

గుంటూరు యార్డుకు 36,162 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 36,162 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,928 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ. 4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది.

క్రికెట్ ఫ్రమ్ గ్రౌండ్ టు 'బాక్స్'



మనది క్రికెట్ దేశం.. కొంచెం ఖాళీ సమయం దొరకాలే కానీ చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ గల్లీ క్రికెటర్స్ అయిపోతుంటారు. కాకపోతే.. నేటి నగరాల్లో క్రికెట్ ఆడటానికి కావాల్సినంత ఖాళీ ప్రదేశం దొరకడమే గగనం అయిపోతుంది. దీంతో ఒకే గ్రౌండ్‌లో రెండు మూడు టీంలు అలా సర్దుకుపోతూ క్రికెట్ అడుతూ తమ సరదాను కాస్త ఇబ్బంది పడుతూనే తీర్చుకుంటున్నారు.
ఈ సమస్యకు పరిష్కారమే 'బాక్స్ క్రికెట్'. ఇందులో బాల్ ఎదురుగా ఉన్న నెట్‌ను నేరుగా వెళ్లి తాకితే ఆరు పరుగులు.. స్టెప్పులు పడుతూ వెళితే ఫోర్ రన్స్.. పైకప్పుకి తగిలితే ఔట్.. సింగిల్స్, డబుల్స్, రనౌట్లు, క్యాచ్‌లు అన్నీ సేమ్ టూ సేమ్‌గానే ఉంటాయి.

శరవేగంగా పట్టణాలు, పల్లెలకు విస్తరిస్తున్న నగర సంస్కృతి	అనుబంధంగా ఫుడ్ కోర్టులు	పశ్చిమ గోదావరి జిల్లాలో 15కు పైగానే ఇండో టర్ఫ్‌లు
రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలతో ఏర్పాటు	గంటకు రూ.1,000 వరకు ఫీజు	ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆడుకునే సౌలభ్యం

సాక్షి, భీమవరం: గల్లీ క్రికెట్ ఇప్పుడు బాక్స్ క్రికెట్‌గా మారుతోంది. నిన్నమొన్నటి వరకు నగరాల్లో కనిపించిన ఇండో టర్ఫ్‌లు పట్టణాలకు వచ్చేశాయి. ఫ్లడ్ లైట్లు, ఫుడ్ కోర్టు సదుపాయాలతో అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఔత్సాహికుల ఇంటి టెర్రాస్‌లపైనా మినీ టర్ఫ్‌లు వెలుస్తున్నాయి. విదేశాల్లో ఎప్పుడో మొదలైన ఈ బాక్స్ క్రికెట్ పదేళ్ల క్రితం భారత దేశంలోకి వచ్చింది. మొదట ముంబైలో ఎక్కువగా దీన్ని ఆడేవారు. ఆ తర్వాత హైదరాబాద్, తిరుపతి, విశాఖ తదితర నగరాలకు ఇది వేగంగా విస్తరించింది.

పకడ్బందీ ఏర్పాట్లు

బాక్స్ క్రికెట్‌కు ఆదరణ బాగుండటంతో ఔత్సాహికులు వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఖాళీ స్థలాన్ని బట్టి 30–40 మీటర్ల వరకు పొడవు, 25–30 మీటర్ల వరకు వెడల్పు విస్తీర్ణం, 15 మీటర్ల వరకు ఎత్తులో చుట్టూ పకడ్బందీగా పోల్స్ ఏర్పాటు చేసి వాటికి చుట్టూ, పైన నెట్ అమర్చుతున్నారు. రాత్రి వేళల్లో ఆడేందుకు వీలుగా పై ఎత్తులో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోర్టు నిర్మాణానికి రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వర్షం వచ్చినా వెంటనే నీరు లాగేసే విధంగా డ్రైనేజీ వ్యవస్థ నెలకొల్పుతున్నారు. ఈ ఇండో టర్ఫ్‌లు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో 4, తణుకు, నరసాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో 15 వరకు ఉన్నాయి. ఏలూరు హైవే సమీపంలో కొత్తగా బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేసేందుకు భీమవరానికి చెందిన కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.



కళాశాలల్లో విద్యార్థుల కోసం వీటిని ఏర్పాటు చేస్తుండగా కుటుంబ సభ్యులంతా కలిసి ఆడుకునేందుకు వీలుగా కొందరు ఔత్సాహికులు తమ ఇంటి టెర్రాస్‌లపైనా మినీ బాక్స్ క్రికెట్ కోర్టులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

వసతులను బట్టి చార్జీలు

బాక్స్ క్రికెట్ కోర్టులోని వసతులను బట్టి గంటకు రూ.700–1,000 వరకు చార్జ్ చేస్తున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో ఈ ధర మరింత పెరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా ముందుగానే ఆడే సమయాన్ని బుక్ చేసుకోవచ్చు. కొన్నిచోట్ల యాప్‌ల ద్వారాను స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. క్రికెట్ కిట్‌ను నిర్వాహకులే అందజేస్తారు. ఎక్కువ మంది కలిసి ఆడటం వలన అందరూ తలాకొంత వేసుకుని చెల్లించడంతో ఆడేవారికి పెద్దగా భారం అనిపించదు.

పెరుగుతున్న ఆదరణ

ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిళ్లు ఆడే సౌలభ్యంతో పాటు శారీరకంగా పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేని రీతిలోనే నిబంధనలు ఉన్నాయి. చిన్న గ్రౌండ్ కావడంతో బంతి కోసం ఎక్కువ దూరం పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. టీముల్లోను ఆరుగురు ఆటగాళ్లే ఉంటారు. గరిష్ఠంగా పది ఓవర్లే ఆడటంతో గంట లోపే మ్యాచ్ అయిపోతుంది. పరుగెత్తి బౌలింగే చేయాలని లేదు. నిలబడి అలా విసిరినా చాలు. టెన్నిస్ బంతినే వాడతారు కాబట్టి గాయాల సమస్యా ఉండదు. నెట్ లోపల పూర్తిగా కృత్రిమ గడ్డి మ్యాట్‌ను ఉపయోగిస్తుండటంతో దుమ్ము కూడా రాదు. పరిగెడుతూ కిందపడినా దెబ్బలు తగలే అవకాశం తక్కువ. వాష్ రూమ్స్, డ్రెస్ చేంజింగ్ రూమ్స్ కూడా ఇందులోనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఫుడ్ కోర్టులు, డ్రింక్స్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని సౌలభ్యాలు ఉండటంతో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది. పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు బాక్స్ క్రికెట్‌కు ఆకర్షితులవుతున్నారు. బాక్స్ క్రికెట్‌లో ఫోర్లు, సిక్సర్ల మోత మోగిస్తున్నారు.

వీకెండ్స్‌లో ఎక్కువగా..



భీమవరంలో ఎలైట్ స్పోర్ట్స్ ఎరీనా ఇండో టర్ఫ్ ప్రారంభించి ఏడాదిన్నర కావస్తోంది. ఆదరణ బాగుంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వచ్చి ఆడేందుకు ఇష్టపడుతున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తుంటారు.
– జి.సునీల్ వర్మ, ఎలైట్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకుడు, భీమవరం

బాబోయ్.. ఎండలు

- వేసవిని తలపిస్తున్నాయ్
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉక్కపోత
- బెంబేలెత్తుతున్న జనం
- పెరిగిన విద్యుత్ వినియోగం
- ఆగస్టు నెలలో మోగనున్న కరెంటు బిల్లుల మోత



ఎండల తీవ్రతతో ముఖాలకు వస్త్రాలతో మహిళలు

కడప అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నాలుగైదు రోజుల నుంచి ప్రజలను ఉక్కపోత ఊపిరాడకుండా చేస్తోంది. శనివారం నాటికి పగటి ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు చేరుకుంది. గతేడాది ఈ నెలలో 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఉక్కపోత ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం వరకు ఉంటుంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఎండలు చూడలేదని పలువురు అంటున్నారు. ఈ ఎండలు చూస్తోంటే వేసవి గుర్తుకొస్తుందని చెబుతున్నారు.

నాటేసేందుకు జంకుతున్న కూలీలు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరదనీరు వచ్చి శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. అలాగే పెన్నానది నీటితో కళకళలాడుతోంది దీంతో నదీపరివాహక ప్రాంతంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపట్టారు. ఈ సంవత్సరం ముందస్తుగా కురిసిన వర్షాలకు నీటి ఆధారం ఉన్న రైతులు వరినారును సిద్ధం చేసుకున్నారు.కొన్నిచోట్ల వరినాట్లు వేస్తున్నారు.వరినాటేందుకు వచ్చే కూలీలు ఎండలకు బెదిరిపోతున్నారని రైతులు తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో గత వారం రోజుల నుంచి క్రమేపీ ఎండలు పెరుగుతూ వస్తున్నాయి. సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 36.2 డిగ్రీలు నమోదు కాగా మంగళవారం 39.2, బుధవారం 38 డిగ్రీలకు చేరింది. గురువారం నాడు కాసింత తగ్గి 37.6 డిగ్రీలకు చేరింది. ఉక్కపోతతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులు అల్లాడిపోతున్నారు.

పెరిగిన ఫ్యాన్లు, ఏసీల వినియోగం

ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్తు వినియోగం కూడా పెరిగింది. ముఖ్యంగా ఫ్యాన్లు, ఏసీల నిరంతరంగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టు నెలలో ప్రతి ఒక్కరికి కరెంటు బిల్లు మోతమోగనుంది.

గతేడాది.. ఈఏడాది ఆగస్టు నెలలో ఉష్ణోగ్రతల వివరాలు ఇలా...

గతేడాది	తేదీ	కనిష్ఠం	గరిష్ఠ	ఈఏడాది	తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
2023	11	23.8	31.5	2024	11	27.4	35.2
2023	12	26.2	33.1	2024	12	25.8	36.2
2023	13	24.9	33.1	2024	13	26.2	39.2
2023	14	25.8	34.2	2024	14	27.8	38.0
2023	15	25.6	33.4	2024	15	27.2	37.6
2023	16	26.8	35.8	2024	16	27.4	38.0



గతంలో ఎన్నడూ చూడలేదు




ప్రస్తుతం కాస్తున్న ఎండలు, ఉక్కపోత గతంలో ఎన్నడూ లేదు. ఉదయం 10 గంటల నుంచే పొలం పనులు చేసుకోలేకపోతున్నాం. పొలంలో నీరంతా వేడెక్కుతోంది. పరి స్థితి ఇలాగే ఉంటే వ్యవసాయ పునులు మానుకోవాల్సిందే.
– నాగేశ్వరరెడ్డి, రైతు, పాత కడప.

ఎండలకు బెంబేలెత్తుతున్నాం



నాలుగైదు రోజుల నుంచి ఎండలు అదర కొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎండ వేడిమి తట్టుకోలేక మధ్యాహ్నానికంతా ఇళ్లు చేరుకోవాల్సి వస్తుంది. – వీరభద్రారెడ్డి, ఏటూరు, ఖాజీపేట మండలం

మన్యంలో జలహొయలు



ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం

ఏజెన్సీ పచ్చదనం అందరినీ ఆకర్షిస్తోంది. వరుసగా వర్షాలు పడడం వల్ల వనం మొత్తం పచ్చ దుప్పటి కప్పుకున్నట్టుగా ఉంది. ముఖ్యంగా జలపాతాలు ఆకర్షిస్తున్నాయి. ఏలూరు జిల్లాలోని ముంజులూరు, గడ్డపల్లి, దారావాడ, చిలకలూరు, గుబ్బల మంగమ్మతల్లి గుడి సమీపంలోని అటవీ ప్రాంతాల్లోని ప్రకృతి సోయగం పర్యావరణ ప్రేమికులను మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. ముఖ్యంగా గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారి, ముంజులూరు నుంచి గోగుమిల్లి వెళ్లే రహదారిపై పయనిస్తుంటే ఇరువైపుల నుంచి పచ్చదనంతో ఎత్తయిన చెట్లతో సహజసిద్ధమైన ప్రకృతి స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తోంది. ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం ప్రస్తుతం పర్యాటకులతో సందడిగా మారింది. అలాగే గుబ్బల మంగమ్మ గుడిపై నుంచి వచ్చే జలపాతం కూడా ప్రవహిస్తూ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులను కనువిందు చేస్తోంది.
– బుట్టాయగూడెం



గుబ్బల మంగమ్మతల్లి గుడి పైనుంచి ప్రవహిస్తున్న జలపాతం



వర్షాలకు పచ్చగా ఉన్న ముంజులూరు అటవీప్రాంతం



అలివేరు సమీపంలో కొండలను తాకుతున్న మేఘాలు

ఆధ్యాత్మిక సమాచారం

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశస్థాపన పూజ చేశారు. అనంతరం చందనం, నారికేళ జలం, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకాలు చేశారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సత్యదేవుని దర్శించిన 50 వేలమంది



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరి సత్యదేవుడిని సోమవారం శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సుమారు 50 వేలమంది దర్శించుకున్నారు. దేవస్థానంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున వంద వరకు వివాహాలు కూడా జరిగాయి. ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు కూడా ఆలయానికి వచ్చి స్వామి వ్రతాన్ని ఆచరించి దర్శనం చేసుకున్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు ఐదు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

వైభవంగా శ్రీవారి నక్షత్ర కల్యాణం



రాయవరం: కోనసీమ జిల్లా రాయవరంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి సోమవారం నక్షత్ర కల్యాణం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణను పురస్కరించుకుని ఈ కల్యాణం చేశారు.

మరిడమ్మ ఆలయంలో వైభవంగా చండీహోమం



పెద్దాపురం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా 700 శ్లోకాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలకు సకల శుభాలు కలగాలని చండీహోమం నిర్వహించామని పండితులు పేర్కొన్నారు. హోమం అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన చేశారు.

ఘనంగా ఉపకర్మ ఉత్సవం

తిరుపతి సిటీ: శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వేదభాష్యం విభాగం ఆధ్వర్యంలో వర్సిటీలోని నైమిశారణ్యంలో ఉపకర్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి శ్రావణ పూర్ణిమ విశిష్టతను, మానవులు చేయాల్సిన కర్తవ్యాలను విద్యార్థులకు వివరించారు. వేదభాష్యం విభాగం అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ మిశ్రా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైఖానస జయంతి వేడుకలు

మండపేట: కోనసీమ జిల్లా మండపేట మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం వైఖానస జయంతి వేడుకలు జరిగాయి. ద్వారపూడిలోని గోపాలస్వామి, జెడ్.మేడపాడులోని కేశవస్వామి, ఏడిదలోని జనార్దనస్వామి, కోదండరామాలయ, అర్తమూరులోని వేణుగోపాలస్వామి, వెలగతోడులోని రామాలయాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వైఖానస స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

భారతీయ సంస్కృతి పరిరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతి పరిరక్షణ, సంస్కృత భాషాభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి పిలుపునిచ్చారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో వారం రోజులు జరిగిన సంస్కృత వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సంస్కృతి అభ్యున్నతి కోసం శ్రావణ పౌర్ణమిరోజు సంస్కృత దినోత్సవాన్ని జరుపుకొంటామని తెలిపారు. సరళ సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రయత్నాలు జరగాలన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాషను సామాన్య ప్రజలకు చేరువ చేసేందుకు వర్సిటీ ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా బాలవికాస కేంద్రాలతో పాటు, జ్యోతిషం, వాస్తు, యోగా, కర్మకాండ, ఆలయ సంస్కృతి తదితర శాస్త్రాలపై ప్రజల సందేహాల నివృత్తి చేసేందుకు కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరానికి చెందిన ఎస్.సి.ఎస్.చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నారాయణం నాగేశ్వరరావు, బెంగళూరు ఎడ్యుయాక్ట్ ఇన్నోవేషన్ ల్యాబ్ అధినేత శ్రీరామచక్రధర్, డీన్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ సీహెచ్ నాగరాజు, ఉదయాన హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమాచారం

21 నుంచి తరగతులు

ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం డైరెక్టర్ బాలాజీ



ఎస్ఎంపురం క్యాంపస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది తరగతులు ఈ నెల 21నుంచి ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు. రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తికావడంతో విద్యార్థులు షెడ్యూల్ మేరకు సోమ, మంగళవారాల్లో చేరాల్సి ఉంది. దీంతో సోమవారం పలువురు విద్యార్థులు చేరారు. బాలికలకు ఎస్ఎంపురంలోను, బాలురుకు చిలకపాలెంలోను వసతి కల్పిస్తున్నారు. జనరల్ కేటగిరీలో 1,035 సీట్లకు రెండు విడతల కౌన్సెలింగ్‌లో 986 మందికి సీట్లు కేటాయించారు. ప్రత్యేక కేటగిరీ సీట్లు 75 ఇంకా ప్రకటించాల్సి ఉంది. అనంతరం మిగిలిన 49 సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

పండుగల సీజన్‌కు క్విక్-కామర్స్ కిక్కు!

- త్వరలో మొదలై ఏడాది సంక్రాంతి వరకూ సాగనున్న సీజన్
- పెరుగుతున్న ఆన్‌లైన్ ఆర్డర్లకు తగినట్లు వేగంగా డెలివరీ చేసేందుకు ఆయా సంస్థల ఏర్పాట్లు
- క్విక్-కామర్స్ రాకతో తీవ్ర పోటీని ఎదుర్కొంటున్న సంప్రదాయ ఈ-కామర్స్
- దేశంలో ఈ-కామర్స్‌తో 35 శాతం అమ్మకాలు పెరగొచ్చని అంచనా

సాక్షి, హైదరాబాద్

రాబోయే పండుగల సీజన్‌కు క్విక్-కామర్స్ కిక్కు ఇవ్వనుంది. త్వరలోనే మొదలై ఈ ఏడాది చివరి వరకు తెలుగు రాష్ట్రాలతో సహా మరికొన్ని రాష్ట్రాల్లో సంక్రాంతి ముగిసేదాకా ఈ ఫెస్టివల్ సీజన్ సుదీర్ఘ కాలం కొనసాగనుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆయా వస్తువులు, ఉత్పత్తులను వేగంగా కస్టమర్లకు చేరవేయడం కీలకమైంది. దేశంలోని సంప్రదాయ ఎలక్ట్రానిక్ (ఈ)-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ఇప్పటికే వివిధ వర్గాల వినియోగదారులపై తమ ముద్రను బలంగానే చూపాయి. దీంతో రిటైల్ రంగంలోని వ్యాపార సంస్థలు, వ్యాపారులను ఈ-కామర్స్ దిగ్గజాలు కొంతమేరకు దెబ్బకొట్టాయి. అయితే మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఈ-కామర్స్‌ను తలదన్నేలా క్విక్ (క్యూ)-కామర్స్ తెరపైకి వచ్చింది. అమెరికాతో సహా వివిధ దేశాల్లో నిత్యావసరాలు మొదలు వివిధ రకాల వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాక మరుసటి రోజుకు చేరవేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి అవసరమైన వస్తువులను తెచ్చుకున్నంత సులువుగా ఆయా వస్తువులను 10 నిమిషాల్లోనే కస్టమర్లకు డెలివరీ మోడళ్లు దేశంలో హైదరాబాద్‌తో సహా పలు ప్రముఖ నగరాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. దీంతో సంప్రదాయ ఈ-కామర్స్ సంస్థలకు పోటీగా క్యూ-కామర్స్ ఎదుగుతోంది. ప్రస్తుత పండుగల సీజన్‌లో దేశవ్యాప్తంగా ఈ-కామర్స్ ద్వారా 35 శాతం అమ్మకాలు పెరగొచ్చని 'టీమ్ లీజ్' తాజా నివేదిక వెల్లడించింది. డిమాండ్‌ను తట్టుకుని ఆన్‌టైమ్ డెలివరీ చేసేందుకు ఆయా సంస్థలు ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యాయి.



డార్క్ స్టోర్ల ఏర్పాటులో నిమగ్నం

క్విక్-కామర్స్ సెగ్మెంట్‌లో.. వచ్చే అక్టోబర్‌లో నిర్వహించనున్న 'బిగ్ బిలియన్ డేస్- 2024'కోసం ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో వంద దాకా 'డార్క్ స్టోర్స్'ను తెరవనుంది.

blinkit

ప్రస్తుతమున్న 639 డార్క్ స్టోర్ల నుంచి 2026 ఆఖరుకల్లా రెండువేల స్టోర్లను ఏర్పాటుచేసేందుకు బ్లింకిట్ ప్రణాళికలు సిద్ధం చేసింది.

వచ్చే మార్చికల్లా దేశవ్యాప్తంగా 700 డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయాలని (ఇప్పుడున్న 350 స్టోర్ల నుంచి) జెప్టో నిర్ణయించింది.

zepto

హైదరాబాద్‌తో సహా ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి, పుణె వంటి నగరాల్లో షిప్ రాకెట్ ఇప్పటికే 'షిప్ రాకెట్‌క్విక్'లను ప్రారంభించింది. పలు నగరాల్లో మరో నెల రోజుల్లో ఈ సర్వీసులు మొదలుకానున్నాయి.

షిప్ రాకెట్ కంపెనీ వేగంగా డెలివరీ చేసేందుకు పోర్టర్, ఓలా, బోర్జె, ర్యాపిడో, షాడో ఫాక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే దేశంలోని పది మెట్రోనగరాల్లో ఈకామ్ ఎక్స్‌ప్రెస్ అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది.

'డెల్హివరీ'సంస్థ ఈ-కామర్స్ కంపెనీలకు డార్క్ స్టోర్స్ నెట్‌వర్క్‌ను అందించేందుకు 'సేమ్ డే డెలివరీ'అనే కొత్త సర్వీస్‌ను ప్రకటించింది.

డెలివరీ పార్ట్‌నర్స్, లాజిస్టిక్స్ సపోర్ట్‌ను అందించే షిప్ రాకెట్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్‌బీస్ వంటివి కస్టమర్లకు వేగంగా డెలివరీ చేసేందుకు తమ మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకుంటున్నాయి.

'డార్క్ స్టోర్స్'అంటే...

ఇలాంటి స్టోర్స్ కస్టమర్లు ప్రత్యక్షంగా వెళ్లి షాపింగ్ చేసుకునేందుకు ఉద్దేశించినవి కాదు. వినియోగదారుల నుంచి వచ్చే ఆన్‌లైన్ ఆర్డర్లను వీలైనంత వేగంగా వారి ఇళ్లకు డెలివరీ చేసేందుకు భిన్నరకాల వస్తువులను స్టోర్ చేసుకునేందుకు నగరంలోని బిజీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే స్టోర్లు. ఇవి డిస్ట్రిబ్యూషన్ ఔట్‌లెట్లుగా పనిచేస్తాయి.





సింగపూర్ కాదు..

బీబీనగర్ ఎయిమ్స్

శరవేగంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లో మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపట్టిన బహుళ అంతస్తుల భవనాలు సింగపూర్ సిటీని తలపిస్తున్నాయి. నిర్మాణాలు తుదిదశకు చేరడంతో రంగులు వేస్తున్నారు. ఒక్కో టవర్‌ను 20 అంతస్తులకు పైగా నిర్మిస్తున్నారు. 201 ఎకరాల విస్తీర్ణంలో పలు విభాగాల భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి. మాస్టర్‌ప్లాన్ అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.1,366 కోట్లు కేటాయించగా ఇందులో రూ.776.13 కోట్లతో భవనాలు నిర్మిస్తున్నారు. 2022 జూలైలో పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులను ఎన్‌సీసీ కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. 2025 జనవరి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలనే ఆదేశాలున్నాయి.

నిర్మితమవుతున్న భవనాలివీ..

వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 250 బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో న్యూ హాస్పిటల్ బ్లాక్, అకడమిక్ బ్లాక్, ఆడిటోరియం, డైరెక్టర్ రెసిడెన్సీ, విశ్రాంతి భవనం, గెస్ట్‌హౌస్, క్లబ్, ఫ్యాకల్టీ క్వార్టర్స్, విద్యార్థుల వసతి గృహాలు, నర్సుల హాస్టల్, డైనింగ్ బ్లాక్, కమ్యూనిటీ భవనం తదితర వాటిని నిర్మిస్తున్నారు. కాగా జాతీయ రహదారి పక్కనే రూపుదిద్దుకుంటున్న ఈ భారీ టవర్లు సింగపూర్‌ను తలపిస్తూ ఆకట్టుకుంటున్నాయి.

సురేఖకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆమె నివాసానికి పుష్పగుచ్ఛంతో పాటు జన్మదిన శుభాకాంక్షల సందేశాన్ని ఆయన పంపించారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన సీఎంకు మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు సురేఖ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రాజీవ్ సద్భావన యాత్ర

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం సద్భావన యాత్ర నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా సోమాజీగూడలోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ జయంతి వేడుకలకు హాజరు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు లేఖలు రాశానని తెలిపారు. ప్రతి నెలా పేద విద్యార్థులిద్దరికి రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేసే కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభిస్తానని వీహెచ్ వెల్లడించారు.

బీజేపీ కార్యాలయంలో రక్షాబంధన్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ కార్యాలయంలో సోమవారం వేడుకగా రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, నేతలు చంద్రశేఖర్ తివారి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావులకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి, మహిళా నేతలు రాఖీలు కట్టారు. కెనడాలో, తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదులుగా ఉన్న వెన్న జి.సాయి వెంకట్, శ్రీధర్ నాయక్, సీవీ రమణ, పలువురు మహిళా న్యాయవాదులు బీజేపీలో చేరారు.


22న ఈడీ కార్యాలయం ఎదుట నిరసన

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ పిలుపు మేరకు ఈనెల 22వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. అమరవీరుల స్తూపం నుంచి ఈడీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అదానీ షేర్ల కృత్రిమ పెంపు ప్రయత్నం, సెబీ చైర్మన్‌తో ఆర్థిక సంబంధాలపై జేపీసీ వేసేందుకు కేంద్రం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ఇందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో సహా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని మహేశ్‌గౌడ్ వెల్లడించారు.

ఆర్డీవో భూ హక్కులు తేల్చలేరు

- సివిల్ కోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం
- మెదక్ జిల్లా మామిడ్గి చెరువుపై ధర్మాసనం తీర్పు

సాక్షి, హైదరాబాద్: భూ రికార్డులను సవరించడానికి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి సుమోటోగా అధికారం లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ మళ్లీ ప్రక్రియను ప్రారంభించ వచ్చని స్పష్టం చేసింది. చట్టప్రకారం భూమిపై తమకు హక్కులు ఉన్నాయని రిట్ పిటిషనర్ల వద్ద ఆధారాలుంటే సివిల్ కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. మెదక్ జిల్లా నాల్కల్ మండలం మామిడ్గిలో 50 ఎకరాల చెరువు పరిధిలోని భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ అనిత, మరికొందరి వాదన. అయితే వీరికి ఉన్న హక్కులను రద్దు చేసి, అవి చెరువు శిఖం భూములంటూ జహీరాబాద్ ఆర్డీవో 2015లో ఉత్తర్వులు జారీ చేశారు. 'ఎలాంటి ప్రొసీడింగ్స్ లేకుండా అనధికారిక ప్రతివాదులు తమ పేర్లపై రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేసి 1954–55లో ఖాస్రా పహాణీ పొందారు. దీని ద్వారా మెదక్ జిల్లా నాల్కల్ మండలం మామిడ్గి చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైంది. రికార్డుల నుంచి ఆ ఎంట్రీలను తొలగించాలి. ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను పాటిస్తూ, భూమిని స్వాధీనం చేసుకునేలా నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ పథకాలతో చెరువును పునరుద్ధరించాలి'అని కోరుతూ నాల్కల్‌కు చెందిన గఫార్ అలీ హైకోర్టులో 2016లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. భూ హక్కులపై ప్రొసీడింగ్స్‌ను జారీ చేసే అధికారం కలెక్టర్‌కే ఉందని, ఆర్డీవోకు లేదంటూ 2015లో అనిత సహా మరికొందరు మరో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు విచారణ చేపట్టి.. సోమవారం తీర్పు వెలువరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. అలాగే రిట్ పిటిషనర్లు హక్కుల కోసం సివిల్ కోర్టును ఆశ్రయించి పరిష్కారం పొందవచ్చని సూచించింది.



తెలంగాణపై మళ్లీ పిడుగుల వర్షం

అప్రమత్తం చేయటంలో అదే నిర్లక్ష్యం

అధునాతన అరెస్టర్లు, కండక్టర్లు, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా పట్టించుకోని వైనం

ప్రాణాలు కోల్పోతున్న రైతు కూలీలు, పేదలు

ప్రభుత్వాల తరఫున అందని ఆర్థిక సహాయం

చస్తున్నా.. చలించరేం!

తెలంగాణలో పిడుగుపాటు మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. వేర్వేరు ఘటనల్లో సోమవారం ఒక్కరోజే ఆరుగురు మృత్యువాతపడ్డారు. మేఘాల నుండి ఒక్కసారిగా విడుదలయ్యే 15-30 కోట్ల వోల్టుల విద్యుత్ ప్రవాహం భూమ్మీదకు దూసుకువస్తూ వెలువరించే శక్తినే 'పిడుగు' అని పిలుస్తున్నారు. అయితే మూడు రకాలుగా వర్గీకరణ జరిగిన ఈ పిడుగుల్లో.. ఒక మేఘం నుండి మరో మేఘంపై పడే పిడుగుల వల్ల ఆకాశంలో ఎగిరే విమానాలకు ముప్పు ఉంటే, మేఘం నుండి భూమిని తాకే (క్లౌడ్ టూ గ్రౌండ్) పిడుగులతో మనుషులు, ఇతర జీవజాలానికి అత్యంత ముప్పు ఉంటోంది. తెలంగాణాలో ఏటా సగటున లక్షన్నర పిడుగులు భూమ్మీద పడుతుండగా, గడిచిన మూడేళ్లలో పిడుగుల సంఖ్యతో పాటు మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సరైన హెచ్చరిక వ్యవస్థ లేకపోవడమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాక్షి, హైదరాబాద్

జూలై నాటికే 33 మంది..

పిడుగులు 96 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే పడుతుండగా 98 శాతం రైతులు, కూలీలే బాధితులుగా ఉంటున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది జూలై నాటికి 33 మంది నిరుపేదలు, వ్యవసాయ కూలీలు పిడుగుపాటుతో పంట పొల్లాల్లోనే ప్రాణాలు వదలగా, గడిచిన పదేళ్లలో 694 మంది ప్రాణాలు కోల్పోయారు. రైతులు, కూలీలు పంట పొలాల్లో ఎక్కువ సమయం గడిపే ఆగస్టు – అక్టోబర్ మధ్యకాలంలోనే అత్యధిక పిడుగుపాట్లు నమోదవుతుండటంతో వారు ప్రాణాలు కోల్పోతున్నారు. ఊహించని విపత్తుతో మరణించిన మెజారిటీ కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున కనీస ఆర్థిక సహాయాలు అందటం లేదు. భూమి ఉన్న రైతులు మరణిస్తే రైతు బీమా వర్తిస్తుండగా, భూమి లేని నిరుపేదలు ఏళ్ల తరబడి సర్కారు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రమాదకర జోన్‌లో 13 జిల్లాలు

తెలంగాణ 1,49,336 పిడుగులతో దేశంలో 14వ స్థానంలో ఉండగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, యాదాద్రి, కొత్తగూడెం, మెదక్, సిద్దిపేట జిల్లాలు అత్యధిక పిడుగు పీడిత ప్రాంతాల జాబితాలో ఉన్నాయి. గడిచిన ఆరేళ్లలో అత్యధిక పిడుగుపాటు మరణాలు మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఈ జిల్లాల్లో 98 మంది, వరంగల్ జిల్లాలో 59, ఆదిలాబాద్ జిల్లాలో 52 ,మెదక్ జిల్లాలో 27 మంది మరణించారు.

నివారించే అవకాశం ఉన్నా..

వ్యవసాయం, ఇతర కూలీ పనులు చేసుకుంటున్న వారి కుటుంబాల్లో చీకట్లకు కారణమవుతున్న పిడుగుపాటు మరణాలను నివారించే అవకాశం ఉన్నా.. ఈ విషయంలో ముందుచూపు, చిత్తశుద్ధి లేమి స్పష్టంగా కనిపిస్తోంది. పిడుగుపాట్ల నష్టాన్ని నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా అధునాతన అరెస్టర్లు, కండక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. పుణె ఐఐటీ 'దామిని' అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది 20 నుండి 40 కి.మీల పరిధిలో పిడుగుపాటు ప్రమాదంపై ముందే అప్రమత్తం చేస్తుంది. దీనికి తోడు ఎర్త్ నెట్‌వర్క్ అనే అమెరికా సంస్థ సంస్థ సైతం అధునాతన పరికాలను మార్కెట్‌లోకి తెచ్చింది. వీటిద్వారా పలు రాష్ట్రాల్లో గ్రామ, మండల యంత్రాంగాలు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. కానీ తెలంగాణ విపత్తుల నిర్వహణ శాఖ అధునాతన టెక్నాలజీకి ఇంకా దూరంగానే ఉంది.

నివారించదగ్గ విపత్తే



పిడుగు అనేది వంద శాతం నివారించతగ్గ విపత్తు. కానీ తెలంగాణలో పిడుగులతో మరణించే వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే వస్తోంది. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన అరెస్టర్లు, కండక్టర్లతో పిడుగుపాటు మరణాలను అరికట్టవచ్చు. అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీతో పిడుగుపాటు సమయాలను ముందే తెలుసుకుని, పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

- కల్నల్ సంజయ్ శ్రీవాస్తవ, చైర్మన్, క్లైమెట్ ప్రమోషన్ కౌన్సిల్, న్యూఢిల్లీ



ముందుకు సాగని 'ఆయిల్ పామ్'

రాష్ట్రంలో పంట సాగు లక్ష్యం లక్ష ఎకరాలు..

అయింది 12,448 ఎకరాల్లోనే సాగు

పంట బాధ్యతలు తీసుకున్న కంపెనీలపై మంత్రి తుమ్మల అసహనం

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రాష్ట్రంలో లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకున్నా, ఇప్పటి వరకు కేవలం 12,448 ఎకరాలలో మాత్రమే సాగు కావడంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సచివాలయంలో ఆయిల్ పామ్ సాగు పథకం అమలుపై రాష్ట్రంలో పనిచేస్తున్న 14 ఆయిల్ పామ్ కంపెనీల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాల వారీగా ఆయిల్ పామ్ సాగు పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటి వరకు లక్ష్యాలను చేరుకోలేని, ఏ మాత్రం పురోగతి చూపని కంపెనీల నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పురోగతి చూపని కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో ఉత్పత్తి చేస్తూ, వేరే రాష్ట్రాలకు ఆయిల్ పామ్ గెలలను తరలించడం వంటి చర్యలను తమ ప్రభుత్వం అనుమతించదని, ఆయా కంపెనీలు వెంటనే స్థానికంగానే ఫ్యాక్టరీలు నిర్మించి ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ మొదలుపెట్టే విధంగా కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కంపెనీలు వ్యవహరిస్తే సహించమని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగు, బిందుసేద్య పరికరాల ఏర్పాటు కోసం ఎకరానికి మొదటి 4 సంవత్సరాల కాలంలో మొత్తం రూ.50,918 రాయితీ ఇస్తుందన్నారు. కాగా, ముడి పామాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సుంకాన్ని ఎత్తివేసిందని, మళ్లీ సుంకం విధించి ఆయిల్ పామ్ గెలల ధరల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్‌కు సంబంధించిన సబ్సిడీలను వెంటనే చెల్లిస్తామని, కాబట్టి అన్ని కంపెనీలు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి స్థలాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేనాటికి దాని పరిధిలో కనీసం 10 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ గెలలు వచ్చేలా సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు.

మరో 4 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు..: రాష్ట్రంలో మరో నాలుగు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటితో కలిపి మొత్తం 31 వ్యవసాయ కమిటీలకు నూతన పాలకవర్గాలు ఏర్పాటయ్యాయని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా పాలకవర్గాలను నియమిస్తామని చెప్పారు.

రాఖీ.. రద్దీ

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ నెలకొంది. వరుస సెలవులు ముగియడంతోపాటు రాఖీ పండుగకు సొంతూళ్లకు వచ్చిన ప్రజానీకం తిరుగు ప్రయాణం కావడంతో రద్దీ ఏర్పడింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణ పరిధిలో వాహనాలు పెద్దసంఖ్యలో బారులుతీరాయి. కూడళ్లు కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం ప్రారంభమైన రద్దీ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. టోల్‌ప్లాజాలో హైదరాబాద్ మార్గంలో 10, విజయవాడ వైపు 10 కౌంటర్లను తెరిచి వాహనాలను పంపించారు.

- చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



పంతంగి టోల్‌ప్లాజా వద్ద..

అడ్మిషన్స్

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాల్లో అగ్రి బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో వనపర్తి,కరీంనగర్‌లోని అగ్రికల్చర్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు బాలికల నుంచి మాత్రమే దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
» **అగ్రికల్చర్ కాలేజ్, సీట్ల వివరాలు:** అగ్రికల్చర్ కాలజ్, వనపర్తి–120 సీట్లు, అగ్రికల్చర్ కాలేజ్, కరీంనగర్–120 సీట్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(బైపీసీ)ఉత్తీర్ణులైన బాలికలు అర్హులు. టీజీ ఈఏపీసెట్–2024 ర్యాంకు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ. 1,50,000(గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
» **వయసు:** 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** టీజీ ఈఏపీసెట్–2024 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.09.2024 నుంచి 02.09.2024 వరకు
» **వెబ్‌సైట్:** http://https//mjptbcwreis.telangana.gov.in

ఉద్యోగాలు

ఎయిమ్స్ ఝజ్జర్‌లో 34 పోస్టులు

ఝజ్జర్(హర్యానా)లోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో.. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 34.
» **పోస్టుల వివరాలు:** డేటా ఎంట్రీ ఆపరేటర్–07, ల్యాబ్ టెక్నీషియన్–07, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–06, టెక్నాలజిస్ట్(ఓటీ)–05, పేషెంట్ కేర్ మేనేజ్‌మెంట్–02, రేడియోగ్రాఫర్–07.
» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్/అనెస్తీషియా/ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్ట్/రేడియోగ్రఫీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 40 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రాజెక్ట్ మేనేజర్(హెచ్‌ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్),బీఈసీఐఎల్ భవన్,సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.08.2024.
» **వెబ్‌సైట్:** https://www.becil.com

ఆర్ఆర్‌సీ-వెస్టర్న్ రైల్వేలో 64 స్పోర్ట్స్ కోటా పోస్టులు

ముంబైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–వెస్ట్రన్ రైల్వే 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో గ్రూప్–సి/గ్రూప్–డి పోస్టుల భర్తీకి అర్హులైన పురుషులు, మహిళా క్రీడాకారులు నుంచి దరఖాస్తులు కోరుతోంది.



» **మొత్తం పోస్టుల సంఖ్య:** 64
» **పోస్టుల వివరాలు:** లెవల్–4/5–05, లెవల్–2/3–16, లెవల్–1–43.
» **అర్హత:** లెవల్–4/5 పోస్టులకు ఏదైనా డిగ్రీ, లెవల్–2/3 పోస్టులకు ఐటీఐ, పన్నెండో తరగతి, లెవల్–1 పోస్టులకు పదో తరగతి, ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు క్రీడల్లో వివిధ స్థాయిల్లో విజయాలు సాధించి ఉండాలి.
» **క్రీడలు:** బాస్కెట్‌బాల్, క్రికెట్, రెజ్లింగ్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాడీ బిల్డింగ్, సైక్లింగ్, హాకీ, ఖో–ఖో, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్.
» **వయసు:** 01.01.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, క్రీడా విజయాలు, గేమ్ స్కిల్, ఫిజికల్ ఫిట్‌నెస్, ట్రయల్స్ సమయంలో కోచ్ పరిశీలించే అంశాలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.09.2024
» **వెబ్‌సైట్:** www.rrc-wr.com

కరెంట్ అఫైర్స్



గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం

అంతర్జాతీయం

గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా మంకీపాక్స్.. ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో

ఆఫ్రికా దేశాల్లో 'మంకీపాక్స్' వైరస్ వ్యాప్తి అత్యంత ఆందోళనకర స్థాయికి చేరుకుందని, ఇక్కడి పరిస్థితి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విధంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. గ్లోబల్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని విధిస్తున్నట్టు తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఈ నేపథ్యంలో భారత్ సహా 196 సభ్య దేశాలు అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో సభ్య దేశాలకు అత్యున్నత స్థాయి ప్రమాద హెచ్చరికను జారీచేసింది. డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అధనోమ్ మాట్లాడుతూ, 'ఎమర్జెన్సీ కమిటీ సూచన మేరకు గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటిస్తున్నాం'అని అన్నారు. వ్యాధి సోకితే తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం వస్తాయి.

వియత్నాంతో భారత్ కీలక ఒప్పందాలు

వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్ ఇటీవల భారత్ తో 9 కీలక ఒప్పందాలు చేసుకున్నారు. వ్యవసాయం, పర్యాటకం, రేడియో, టీవీ, సైబర్, ఐటీ భద్రత, సైనిక వైద్యం వంటి రంగాల్లో సహకారంతో పాటు 2030నాటికి రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. ఇటీవల కృపాణ్ అనే క్షిపణి నౌకను వియత్నాంకు భారత్ కానుకగా ఇచ్చింది. వియత్నాం సాగర భద్రతకు 30కోట్ల డాలర్ల రుణ సదుపాయం అందించాలని నిర్ణయించింది.

అంగారకుడిపై నీరు

అంగారక గ్రహంపై నివాసయోగ్యతను గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జీవుల మనుగడకు కీలకమైన నీటిజాడలను అంగారకగర్భంలో పరిశోధకులు గుర్తించారు. ఈ గ్రహం ఉపరితలానికి 20 కిలోమీటర్ల లోతులో నీటి జాడలు ఉన్నట్టు నాసాకు చెందిన మార్స్ ఇన్‌సైట్ ల్యాండర్ డాటాలో వెల్లడైంది. ఈ ల్యాండర్‌ను 2018లో అంగారక గ్రహంపైకి పంపారు. నాలుగేళ్లుగా ఇది అక్కడి సిస్మిక్ డాటాను నమోదు చేస్తున్నది. ఈ డాటాను పరిశీలించిన పరిశోధకులు.. అంగారక ఉపరితలం నుంచి 11.5 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల లోతు వరకు నీటి జాడలు ఉన్నట్టు భావిస్తున్నారు. ఉపరితలం నుంచి లోపలికి నీరు వెళ్లి ఇంకిపోయి ఉండొచ్చని పరిశోధకులు తెలిపారు.

తుర్కియేలో బయటపడిన 13,000 ఏళ్ల నాటి రాతి క్యాలెండర్

ప్రపంచంలోనే అతి పురాతనమైన క్యాలెండర్ దక్షిణ తుర్కియేలో లభ్యమైంది. తుర్కియేలోని గోబెక్లి టేపే వద్ద పురావస్తు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్న సమయంలో ఒక భారీ రాతి స్తంభం బయటపడింది. దానిపై సూర్యచంద్రులకు సంబంధించిన గుర్తులు, మరికొన్ని ఇతర చిహ్నాలను గుర్తించారు. కాగా ఆ ఆలయం 13,000 ఏళ్ల నాటిదని, రాతి స్తంభంపై ఉన్న గుర్తులు అప్పటి సూర్యచంద్రుల కాలాలకు సంబంధించినవని పేర్కొన్నారు. ఇటువంటి చిహ్నాలను సుమారు 10,850 బీ.సి.లో చెక్కి ఉంటారని భావిస్తున్నారు. అప్పట్లో దీనిని ఓ క్యాలెండర్ గా ఉపయోగించి ఉండొచ్చన్నారు.

జాతీయం

దేశంలో 3 కొత్త రామ్సర్ సైట్లు

కేంద్ర పర్యావరణ మంత్రి శ్రీ భూపేంద్ర యాదవ్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశంలో మూడు కొత్త రామ్సర్ సైట్లను గుర్తించినట్లుగా చెప్పారు. దీంతో దేశంలో రామ్సర్ సైట్ల సంఖ్య 85కు చేరింది, ఇది దేశంలో 1,358,068 హెక్టార్ల విస్తీర్ణాన్ని కవర్ చేస్తుంది. కొత్తగా చేర్చిన మూడు సైట్లు తమిళనాడులోని నంజరాయన్ పక్షి ఆవాసం, కజువెలి పక్షి ఆవాసం, మధ్యప్రదేశ్‌లోని తవా రిజర్వాయర్.

ఐఐటీ-మద్రాసులో జల విజ్ఞాన కేంద్రం

ఐఐటీ మద్రాసులో సరికొత్త జల విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి భారత్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. శుభ్రమైన తాగు నీటి సరఫరాకు ఉద్దేశించిన సంయుక్త ఒప్పందమిది. ముఖ్యంగా పట్టణాల్లో నీటి సరఫరాకు సుస్థిర పరిష్కారాలను కనుగొనడానికి ఈ కేంద్రం కృషి చేస్తుంది. జల విజ్ఞానంలో నూతన పరిశోధనలు, నవీకరణలు సాధిస్తుంది.

ఎస్ఎస్ఎల్వీ -డీ 3 ప్రయోగం విజయవంతం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన మరో ప్రయోగం విజయవంతమైంది. ఆగస్టు 16న ఉదయం తిరుపతి జిల్లా శ్రీహరికోట (షార్) కేంద్రం నుంచి ఎస్ఎస్ఎల్వీ –డీ 3 రాకెట్‌ను నింగిలోకి పంపింది. షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా ఈవోఎస్–08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇది ఒక భూ పరిశీలక ఉపగ్రహం. ఒక మైక్రోశాటిలైట్ ను రూపొందించడం, దానిలో ఇమిడిపోయే పరిశోధన పరికరాలను అభివృద్ధి చేయడం ఈవోఎస్–8 మిషన్ ఉద్దేశమని ఇస్రో తెలిపింది. ఈ ఉపగ్రహంలో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్ ఫ్రారెడ్ పేలోడ్ (ఈవోఐఆర్), గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్–రిఫ్లెక్టోమెట్రీ పేలోడ్ (జీఎన్ఎస్ఎస్–ఆర్), ఎస్ఐసీ యూవీ డోసీమీటర్ అనే మూడు పరికరాలు ఉంటాయి. వీటి ద్వారా విపత్తులు, పర్యావరణం, అగ్ని పర్వతాలపై పర్యవేక్షణ వంటివి చేపట్టవచ్చు.

2036 నాటికి భారత జనాభా 152 కోట్లు

భారత దేశ జనాభా 2036 నాటికి 152.2 కోట్లకు చేరనుంది. ఇందులో మహిళల నిష్పత్తి కొంత పెరగనుంది. కేంద్ర గణాంకాలశాఖ ఆధ్వర్యంలోని సామాజిక గణాంక విభాగం విడుదల చేసిన 'ఉమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2023' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 48.5% మహిళలతో 121.1 కోట్లున్న దేశ జనాభా 2036 నాటికి 48.8% మహిళలతో 152.2కోట్లకు చేరనుంది. ఇదే సమయంలో 15 ఏళ్ల లోపు వయసున్నవారి సంఖ్య కొంత తగ్గనుంది. సంతాన సాఫల్యం తగ్గిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఇదే సమయంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య భారీగా పెరగనుంది. దానివల్ల జనాభా పిరమిడ్‌లో 2036 కల్లా అనూహ్య మార్పులు రానున్నాయి. ఆ పిరమిడ్ లో ప్రాథమిక భాగం తగ్గిపోయి, మధ్య స్థాయి భాగం విస్తృతం కానుంది.

గ్లైడ్ బాంబ్ 'గౌరవ్' తొలి ప్రయోగం సక్సెస్

సుఖోయ్–30 యుద్ధ విమానం నుంచి భారత్ మొట్టమొదటిసారిగా ప్రయోగించిన లాంగ్‌రేంజ్ గ్లైడ్ బాంబ్(ఎల్ఆర్‌జీబీ) 'గౌరవ్' పరీక్ష విజయవంతమైంది. సుదూరంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యం కలిగిన ఈ బాంబును డీఆర్‌డీవో తొలిసారి ఓ యుద్ధ విమానం నుంచి ఆగస్టు 14వ తేదీ ప్రయోగించింది. ఒడిశా తీరంలోని లాంగ్ వీలర్ ద్వీపంపైన ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని గ్లైడ్ బాంబ్ అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని రక్షణ శాఖ తెలిపింది. బాంబ్‌ను విడిచిపెట్టాక అది హైబ్రిడ్ నేవిగేషన్ వ్యవస్థ ద్వారా లక్ష్యం వైపుగా సాగిందని వివరించింది. సుమారు 1,000 కిలోల బరువుండే గౌరవ్‌కు దూర ప్రాంతంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని పేర్కొంది. దీనిని హైదరాబాద్‌లోని ఆర్‌సీఐ(రీసెర్చ్ సెంటర్ ఇమారత్)లో రూపొందించి, అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన వైమానిక దళం, డీఆర్‌డీవో, ఇతర పరిశ్రమల అధికారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

వార్తల్లో వ్యక్తులు

ఎరక్రోటపై జాతీయ జెండాను ఎగురవేసిన ప్రధాని మోదీ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎరక్రోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. వరుసగా 11వ సారి ఎరక్రోటపై ప్రధాని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక ఈ సారి వికసిత భారత్ థీమ్‌తో పంద్రాగస్టు వేడుకలను కేంద్రం నిర్వహించింది.

'అగ్ని'తొలి డైరెక్టర్ రామ్ నారాయణ్ కన్నుమూత

ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త, 'అగ్ని' క్షిపణి మిషన్ తొలి ప్రోగ్రామ్ డైరెక్టర్ రామ్ నారాయణ్ అగర్వాల్ (84) కన్నుమూశారు. ఆగస్టు 15వ తేదీ ఆయన హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. భూతల క్షిపణి.. భారత క్షిపణుల్లో మణిహారంగా పేర్కొనే 'అగ్ని'ని రూపొందించడంలో ఈయనదే ప్రముఖ పాత్ర. అందుకే ఆర్ఎన్ అగర్వాల్‌ను ఫాదర్ ఆఫ్ ది అగ్ని సిరీస్ ఆఫ్ మిస్సైల్స్‌గా పిలుస్తుంటారు. రామ్ నారాయణ్ అగర్వాల్ రాజస్థాన్ లోని జైపూర్‌లో వ్యాపారుల కుటుంబంలో జన్మించారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరేటరీ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఈడీ కొత్త చీఫ్‌గా రాహుల్ నవీన్

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాత్కాలిక చీఫ్‌గా ఉన్న రాహుల్ నవీన్ పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆగస్టు 14న ఉత్తర్వులు జారీ చేసింది. 1993 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన నవీన్ ఈడీ డైరెక్టర్‌గా రెండేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందైతే అప్పటివరకు పదవిలో కొనసాగుతారు. 57 ఏళ్ల నవీన్ ఈడీలో 2019 నవంబర్‌లో ప్రత్యేక డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 15న నవీన్‌తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

జేపీసీ చీఫ్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ద వక్ఫ్(వరణ) బిల్లు–2024పై పార్లమెంట్ సంయుక్త కమిటీ(జేపీసీ) ఖరారైంది. ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా బీజేపీ నేత జగదాంబికా పాల్‌ను స్పీకర్ ఓం బిర్లా నియమించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల సందర్భంగా వక్ఫ్ సవరణ బిల్లు–2024పై చర్చ జరిగింది. ఈ క్రమంలో ప్రతిపక్ష నేతల డిమాండ్ మేరకు కేంద్రం జేపీసీని ఏర్పాటు చేసింది. అనంతరం బిల్లుపై అధ్యయనానికి 31 మంది సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా జగదాంబికా పాల్ వ్యవహరించనున్నారు. కమిటీలోని 31 మందిలో 21 మంది లోక్‌సభ సభ్యులుకాగా, 10 మంది రాజ్యసభ ఎంపీలని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

థాయ్‌లాండ్ ప్రధానిగా పెటోంగ్టార్న్ షినవత్ర

థాయ్‌లాండ్ నూతన ప్రధానిగా పెటోంగ్టార్న్ షినవత్ర (37)ను పార్లమెంటు ఆగస్టు 16న ఎన్నుకుంది. ఆమె మాజీ ప్రధాని తక్సిన్ షినవత్ర కుమార్తె. షినవత్ర కుటుంబంలో ఈ పదవిని చేపట్టినవారిలో పెటోంగ్టార్న్ మూడో వ్యక్తి. ప్రధాని పదవిని చేపట్టడానికి దిగువ సభలో కనీసం 247 మంది సభ్యుల మద్దతు అవసరం. ఫ్యూ థాయ్ పార్టీ నేతృత్వంలోని 11 పార్టీల కూటమికి 314 మంది సభ్యుల మద్దతు ఉంది. వీరు పెటోంగ్టార్న్‌కు మద్దతు తెలిపారు. ప్రధాని పదవి నుంచి స్రేట్టా తవిసిన్ ను ఆగస్టు 14న కోర్టు తొలగించడంతో ఈ ఎన్నిక అవసరమైంది. ఆయన నైతిక నియమాల ఉల్లంఘనకు పాల్పడినట్లు కోర్టు తీర్పు చెప్పింది.

క్రీడలు

పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ

ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 దాకా పారిస్ వేదికగా జరుగబోయే పారాలింపిక్స్‌లో ప్రారంభ వేడుకలకు భారత్ నుంచి పతాకధారులుగా సుమిత్ అంతిల్, భాగ్యశ్రీ జాదవ్ ఎంపికయ్యారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ ఇద్దరూ ఆరంభోత్సవ వేడుకల్లో పతాకధారులుగా వ్యవహరిస్తారని పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) చీఫ్ దేవేంద్ర ఝఝారియా ఓ ప్రకటనలో తెలిపారు. హర్యానాకు చెందిన సుమిత్ టోక్యో పారాలింపిక్స్‌లో ఎఫ్64 జావెలిన్ త్రో ఈవెంట్‌లో స్వర్ణం గెలిచాడు. మహారాష్ట్రకు చెందిన షాట్‌పుటర్ భాగ్యశ్రీ ఎఫ్34 కేటగిరీలో ఆసియా పారా గేమ్స్‌లో రజతం నెగ్గింది. ఈ క్రీడలకు భారత్ 84 మంది అథ్లెట్లతో బరిలోకి దిగుతోంది.

సింధూ ప్రజలు ఎవరితో వ్యాపారం చేశారు?

భారతదేశ చరిత్ర క్రీ.పూ. 34 వేల ఏళ్ల కిందట హోమోసెఫియన్ల కాలం నుంచి ప్రారంభమైనట్లు చరిత్రకారుల అభిప్రాయం. భారతదేశ చరిత్ర అంటే భారత్‌తో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్‌తో కూడిన సమస్త భారత ఉపఖండ చరిత్ర. వేదాల్లో భారత దేశాన్ని జంబూ ద్వీపంగా పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నేరేడు పళ్లు ఎక్కువగా లభించడం వల్ల ఈ పేరు వచ్చిందని భావిస్తున్నారు. భరతుడు అనే రాజు పేరు మీదుగా భారతదేశం లేదా భరతవర్షం అనే పేర్లు స్థిరపడ్డాయి. సింధూ నదికి ఆవల ఉన్న నాటి పర్షియన్లు, గ్రీకులు ఈ ప్రాంతాన్ని హిందూ దేశమని పిలిచారు. బ్రిటిషర్ల మూలంగా ఇండియా అనే పేరు వచ్చింది. సింధూ నదిని ఇండస్ అని పిలిచేవారు.



గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం
ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్ర

ఒక దేశ ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవనం వారి భౌగోళిక పరిస్థితులతో ప్రత్యక్షంగా ప్రభావితమవుతుంది. అధికంగా సారవంతమవడం వల్ల భారతదేశ దక్షిణ ప్రాంతం కంటే గంగా, సింధూ మైదాన ప్రాంతం అన్ని రంగాల్లో బాగా అభివృద్ధి చెందింది. గంగా – సింధూ మైదానాలు, కృష్ణా, గోదావరి, తుంగభద్ర, కావేరి నదీ ప్రాంతాలు సాంస్కృతికంగా ముందు వరుసలో నిలిచాయి. జైన, బౌద్ధ, హిందూ మతాలు, లలిత కళలు ఈ ప్రాంతాల్లో విశేషంగా విలసిల్లాయి. అందువల్లే ఈ ప్రాంతాలపై ఆధిపత్యం కోసం నిరంతరం యుద్ధాలు జరిగాయి. భారతదేశ పశ్చిమ – మధ్య ప్రాంతాలకు (రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) భౌగోళికంగా సరైన రవాణా సౌకర్యాలు లేవు. ఇవి ఇతర నాగరిక ప్రాంతాల నుంచి వేరవడం వల్ల ఇక్కడి ప్రజలు సాంఘిక దురాచారాలకు లోనయ్యారు.

నాగరికత పరిణామ క్రమంలో లిపి వాడుకలోకి రాని పూర్వయుగాన్ని 'చరిత్ర పూర్వయుగం'గా పేర్కొంటారు. లిపి ఉండి మనం చదవడానికి వీలు కాని యుగాన్ని 'ప్రాటో హిస్టరీ యుగం'గా, లిపి సృష్టి జరిగి రాత ఆరంభమైనప్పటి నుంచి 'చారిత్రక యుగం'గా వ్యవహరిస్తారు. మన దేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన సింధూ నాగరికత ప్రాటో హిస్టరీకి సంబంధించింది. ఎందుకంటే అప్పటి ప్రజలు వాడిన లిపిని మనం అర్థం చేసుకోలేకపోయాం. చరిత్రలో కాలాన్ని క్రీస్తు పూర్వయుగంగా, క్రీస్తు శకంగా విభజించారు.

పాతరాతి యుగం (క్రీ.పూ. 35000-10000)

- ఈ యుగంలో మానవులు ఎక్కువగా అడవుల్లో నివసించేవారు.
- క్వార్జైట్ అనే కఠిన శిలతో కత్తి, సుత్తి, గొడ్డలి, బల్లెం, బొరిగ మొదలైన ఆయుధాలను తయారుచేసుకున్నారు.
- జంతువులను వేటాడి పచ్చిమాంసం తినేవారు.
- చెట్ల తొర్రలు, కొండ గుహల్లో నివసించేవారు.
- ఆకులు, చర్మాన్ని దుస్తులుగా కప్పుకునేవారు.
- వీరికి పంటలు పండించడం తెలియదు.
- వీరు నివసించిన గుహలు కర్నూలులో ఉన్నాయి.
- అండమాన్ దీవుల్లోని ఆదిమవాసులు, ఆంధ్రాలోని యానాదులు, తమిళనాడులోని కురుంబులు, ఇరుళులు, కదిరులు ఈ యుగ సంతతికి చెందినవారని చరిత్రకారుల అభిప్రాయం.

మధ్యరాతి యుగం (క్రీ.పూ. 8000-4000)

- మధ్యరాతి యుగంలో ప్రజలు సంచార జీవితానికి స్వస్తి పలికారు. స్థిర నివాసం ఏర్పరచుకోవడం ప్రారంభమైంది.
- జంతువులను మచ్చిక చేసుకున్నారు.
- ఈ కాలానికి చెందిన ప్రజలు జెస్పర్, చెర్ట్ అనే ఇసుక రాళ్లతో చేసిన పరికరాలు, ఆయుధాలను ఉపయోగించేవారు. ఇవి పరిమాణంలో చిన్నవిగా ఉండేవి. అందువల్ల ఈ యుగాన్ని 'సూక్ష్మ శిలాయుగం'గా పేర్కొంటారు.
- మరణించిన వారిని ఆహారం, వారు వాడిన పనిముట్లతో పాటు ఖననం చేసేవారు.

నూతన శిలా యుగం (క్రీ.పూ. 4000-2500)

- నూతన శిలా యుగంలో మానవ జీవన సరళిలో స్థిరత్వం చోటుచేసుకుంది.
- పంటలు పండించడాన్ని విస్తృతపరిచారు.
- నూలు, ఉన్ని వస్త్రాలను నేయడం నేర్చుకున్నారు.
- 'వ్యవసాయం, పశుపోషణ' ముఖ్య వృత్తులుగా మారాయి.
- ఇళ్ల నిర్మాణం జరిగి పల్లెలు ఏర్పడ్డాయి.
- సరకుల రవాణా కోసం బండ్లను వినియోగించారు.
- మట్టి పాత్రలను ఎక్కువగా తయారు చేశారు.
- పదునైన, నునుపైన, అందమైన రాతి పనిముట్లు, ఆయుధాలను రకరకాల ఆకృతుల్లో తయారుచేసి ఉపయోగించేవారు.
- విగ్రహారాధన, లింగపూజ, చంద్రుని వృద్ధి, క్షయ దశల ఆధారంగా రోజులను లెక్కవేయడం వీరి నుంచే ప్రారంభమైంది.
- వీరు జంతువులు, శిలలు, పితృదేవతలు, భూతాలను ఆరాధించారు.
- మరణించినవారిని సమాధి చేసేవారు.
- ఎముకలు, గవ్వలతో రూపొందించిన ఆభరణాలు ధరించేవారు.
- ఈ యుగానికి చెందిన ప్రజలు ఆస్ట్రిక్ జాతివారని కొందరు చరిత్రకారుల భావన.

సింధూ నాగరికత (క్రీ.పూ. 2500-1750)

రాగి లోహం వాడుకతో ఈ యుగం ప్రారంభమైనందువల్ల దీన్ని 'తామ్ర శిలాయుగం'గా పేర్కొంటారు. దీన్ని 'హరప్పా సంస్కృతి' అని కూడా అంటారు. 1921లో సింధూ మైదాన ప్రాంతంలో చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో హరప్పా ప్రదేశం బయల్పడింది. అందువల్ల దీన్ని 'సింధూ నాగరికత' లేదా 'హరప్పా నాగరికత'గా వ్యవహరించారు.

హరప్పా, మొహంజోదారో ప్రదేశాలు ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాయి. హరప్పా నగరంలో ధాన్యాగార భవనం ఒక విశిష్ట నిర్మాణం. మొహంజోదారోలో బయల్పడిన స్నానవాటిక ప్రసిద్ధి చెందింది. చాన్హుదారో కోటలకు ఖ్యాతి చెందింది. గుజరాత్‌లోని లోథాల్ ప్రసిద్ధ రేవు పట్టణం. దేశ, విదేశీ (మెసపటోమియా ప్రజలతో) వాణిజ్యం చేశారు. రాజస్థాన్‌లోని కాళీభంగన్, హరియాణాలోని బన్వాలి కూడా ఈ నాగరికతకు చెందిన ముఖ్యమైన ప్రదేశాలు. సింధూ స్థావరాల్లో రాఖీగర్హిని అతి పెద్ద నగరంగా 2014లో పురావస్తు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంతకుముందు వరకు మొహంజోదారోను పెద్ద నగరంగా పరిగణించేవారు.

నాటి మెసపటోమియా, ఈజిప్టు నాగరికత కంటే సింధూ నాగరికత పరిధి చాలా విస్తృతమైంది. ఈ నాగరికతకు చెందిన ప్రజలు గ్రిడ్ పద్ధతిలో పట్టణాలను నిర్మించారు. మెలుహా ప్రాంతంవారికి సుమేరియన్లతో ఉన్న సంబంధాల గురించి కొన్ని సుమేరియన్ గ్రంథాల ద్వారా తెలుస్తోంది. సింధూ ప్రాంతాన్ని అత్యంత ప్రాచీన కాలంలో 'మెలుహా'గా వ్యవహరించేవారు.

హరప్పా నాగరితను పట్టణ నాగరికతగా పేర్కొనవచ్చు. వీధులు ఉత్తర, దక్షిణాలుగా, ఉప వీధులు తూర్పు, పడమరలుగా చక్కని దీర్ఘచతురస్ర ఆకారంలో నిర్మించారు. నిర్మాణాలకు కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. భూగర్భ మురుగు పారుదల సౌకర్యం నాటి సాంకేతిక ప్రతిభకు నిదర్శనం. నగర ప్రజల సమష్టి ప్రయోజనాల కోసం సభా మందిరాన్ని కూడా నిర్మించారు. గోధుమ, బార్లీ వీరి ప్రధానమైన పంటలు.

లోథాల్ నగరంలో పత్తి, వరి పండించినట్లుగా ఆధారాలు లభించాయి. వీరు పాలు, కూరగాయలు, గోధుమ, బార్లీతో పాటు మంసాహారాన్ని కూడా తీసుకునేవారు. ఎద్దు, మహిషం, గొర్రె, పంది, ఒంటె, కుక్క, ఆవు లాంటి పెంపుడు జంతువులు, ఖడ్గమృగం, పెద్దపులి, ఎలుగుబంటి, వానరం తదితర వన్యమృగాలు వీరికి తెలుసు. వీరు యుద్ధాల్లో రాగితో చేసిన గొడ్డలి, కత్తి, బల్లెం, విల్లంబులు, బాడిశ తదితర పరికరాలను ఉపయోగించారు. కానీ రక్షణ కవచాలు తెలియదు. గృహ సామగ్రి కోసం రాగి, వెండి, పింగాణీతో పాటు శిలలు, దంతాలతో చేసిన వస్తువులను వినియోగించారు. వీరు దశాంశ పద్ధతిలో తూనికలు ఉపయోగించారు.

సింధూ ప్రజల మట్టి ముద్రికలు, శిలా విగ్రహాలు, లోహ ప్రతిమల ఆధారంగా వీరు ప్రధానంగా మాతృదేవత లేదా అమ్మతల్లిని ఆరాధించినట్లుగా తెలుస్తోంది. మూడు ముఖాలతో పద్మాసీనుడై ఉన్న శివుని చుట్టూ వన్యమృగాలున్న ఒక ముద్రిక లభించింది. దీని ఆధారంగా వీరు పశుపతిగా, మహాయోగిగా శివుణ్ని ఆరాధించేవారని, వృక్షాలు, సర్పాలను కూడా పూజించేవారని తెలుస్తోంది.'స్వస్తిక్' అనేది సూర్య దేవతారాదనకు చిహ్నం. మృతదేహాన్ని పూడ్చి పెట్టేవారు. సింధూ ప్రజల లిపి బొమ్మల లిపి. దీన్ని కుడి నుంచి ఎడమ దిశకు రాసినట్లుగా తెలుస్తోంది.

మొహంజోదారో నగరం ఏడుసార్లు ధ్వంసమైనా మళ్లీ నిర్మించారు. ఇక్కడ 4.5 అడుగుల నాట్యం చేస్తున్న స్త్రీ విగ్రహాన్ని కనుగొన్నారు. వీరికి గుర్రం తెలియదు. అందువల్ల గుర్రాన్ని ఉపయోగించిన ఆర్యులు వీరిని సులభంగా ఓడించారని చరిత్రకారుల అభిప్రాయం. కొంత వరకు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ నాగరికత నాశనం చెందడానికి కారణమై ఉంటాయని భావిస్తున్నారు.

సింధూ నాగరికత ప్రజలకు సమకాలీకులైన సుమేరియన్లు ఇనుమును ఉపయోగించినా వీరు దీన్ని వాడలేదు. ఎన్నిసార్లు వరదలు వచ్చినా అదే ప్రాంతంలో నివసించారు. ఈ కారణాల వల్ల వీరికి ఆధునిక పద్ధతులను త్వరగా స్వీకరించే మనస్తత్వం లేదని భావిస్తున్నారు.

సింధూ నాగరికతకు చెందిన నగరాలు

నగరం	కనుగొన్న సం.	కనుగొన్నవారు
హరప్పా	1921	దయారాం సహాని
మొహంజోదారో	1922	ఆర్.డి. బెనర్జీ
చాన్హుదారో	1935	ఎం.జి.మజుందార్
కాళీభంగన్	1953	ఎ.కె. ఘోష్
రూపర్	1953	వై.డి. శర్మ
లోథాల్	1954	ఎస్.ఆర్. రావ్
రాఖీగర్హి	1963	-
బన్వాలీ	1973	ఆర్.ఎస్. బిస్త్
దోలవీర	1991	ఘోష్

సింధూ నాగరికత ప్రజల ప్రత్యేకతలు

- వరి, పత్తి పండించడంలో సిద్ధహస్తులు.
- తూనికలు, కొలతలను ప్రామాణికబద్ధం చేశారు.
- స్త్రీ శక్తిని పూజించడం వీరి నుంచే ప్రారంభమైంది. లింగ పూజ, అగ్ని పూజ, కోనేటి స్నానం వీరే ప్రారంభించారు.
- దువ్వెనలు వాడటం, గాజులు ధరించడం వీరి నుంచి వచ్చినవే.

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం



భారత రాజ్యాంగ వికాసానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రస్తుతం అమలవుతున్న రాజ్యాంగం ఈ రూపం సంతరించుకోవడానికి అనేక చట్టాలు, ఉద్యమాలు, సంస్కరణలు దోహదం చేశాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు భారత రాజ్యాంగ పరిణామ క్రమం, రాజ్యాంగ చరిత్రలోని ముఖ్య ఘట్టాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.

భారతదేశంలో 1773-1857 మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపారం, ఇతర వ్యవహారాలను నిర్వహించింది. వీటిని నియంత్రిచడానికి బ్రిటిష్ పార్లమెంటు కొన్ని చట్టాలను రూపొందించింది. వీటినే 'చార్టర్ చట్టాలు' అంటారు. వీటి గురించి పరిశీలిద్దాం..

రెగ్యులేటింగ్ చట్టం-1773

రెగ్యులేటింగ్ చట్టానికి రాజ్యాంగ వికాసపరంగా చాలా ప్రాముఖ్యం ఉంది. ఇంగ్లండ్ నుంచి భారతదేశానికి వ్యాపార రీత్యా వచ్చిన ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం ఇదే. అందువల్ల దీన్ని భారతదేశానికి సంబంధించి 'మొట్టమొదటి లిఖిత చట్టం'(First Written Charter)గా పేర్కొంటారు. అంతకుముందు వరకు వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈస్టిండియా కంపెనీకి ఈ చట్టం ద్వారా మొదటిసారిగా రాజకీయ పరిపాలన, అధికారాలు సంక్రమించాయి. దీంతో భారతదేశంలో 'కేంద్రీకృత పాలన'కు బీజం పడిందని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- ఈ చట్టాన్ని 1773 మే 18న నాటి బ్రిటన్ ప్రధాని లార్డ్ నార్త్ ఆ దేశ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కంపెనీ వ్యవహారాలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించడం వల్ల దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు.
- బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతడికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. 'వారన్ హేస్టింగ్స్'ను తొలి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా నియమించారు.
- బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల గవర్నర్లను బెంగాల్ గవర్నర్ జనరల్‌కు ఆధీనులుగా చేశారు.
- కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటుకు ప్రతిపాదించారు. 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో కలకత్తాలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి 'ఎలిజా ఇంఫే'.
- ఈస్టిండియా కంపెనీపై బ్రిటిష్ ఆధిపత్యాన్ని మరింతగా పెంచడానికి తమ రెవెన్యూ, పౌర, సైనిక వ్యవహారాల్లో కంపెనీ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ నేరుగా ప్రభుత్వానికి బాధ్యత వహించేలా మార్పులు చేశారు.
- కంపెనీ అధికారుల వ్యాపార లావాదేవీలను నిషేధించారు. వారు ప్రజల నుంచి లంచాలు, బహుమతులను స్వీకరించకుండా కట్టడి చేశారు.
- ఇరవై ఏళ్ల వరకు ఈస్టిండియా కంపెనీకి వ్యాపార అనుమతి ఇచ్చారు.

రెగ్యులేటింగ్ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీని ఆశించినంతగా నియంత్రించలేకపోయారు. కేంద్రీకృత పాలనను నిరోధించడం, అధికార సమతౌల్యం లాంటి ప్రయోజనాలు నెరవేరలేదు. అదేవిధంగా గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక పరిధిపై స్పష్టత ఏర్పడలేదు.

పిట్-ఇండియా చట్టం-1784

రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంటు ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. నాటి బ్రిటన్ ప్రధాని 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించారు. అందువల్ల దీన్ని 'పిట్ ఇండియా చట్టం'గా వ్యవహరిస్తారు.

ముఖ్యాంశాలు

- ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను వాణిజ్య, రాజకీయ విధులుగా విభజించారు.
- 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అనే నూతన విభాగాన్ని ఏర్పాటు చేసి కంపెనీ రాజకీయ వ్యవహారాలను దీనికి అప్పగించారు. అప్పటికే ఉన్న కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను వాణిజ్య వ్యవహారాలకే పరిమితం చేశారు.
- గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని ఇచ్చారు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలోనూ కొన్ని మార్పులు చేశారు.
- కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.

ఈ చట్టం వల్ల కంపెనీ పాలనపై ఒక విధమైన అదుపు ఏర్పడింది. కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అనే రెండు స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేయడం వల్ల పిట్ ఇండియా చట్టాన్ని ద్వంద్వ పాలనకు నాంది పలికిన చట్టంగా చెప్పవచ్చు. 'పార్లమెంటేతర నియంత్రణకు తొలి అడుగు'గా ఈ చట్టాన్ని ప్రస్తావిస్తారు. భారతదేశంలో కొల్లగొట్టిన ధనాన్ని పంచుకోవడానికి చేసిన చట్టంగా మార్క్స్, ఎంగిల్స్ అభివర్ణించారు.

చార్టర్ చట్టం-1793

- ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారాలను విస్తృతం చేశారు.
- కంపెనీ వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏళ్లకు పొడిగించారు.
- బోర్డు కార్యదర్శిని పార్లమెంటులో కూర్చోవడానికి అనుమతించారు.

చార్టర్ చట్టం-1813

- ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో ఇరవై ఏళ్లు పొడిగించారు.
- భారతదేశ వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యాన్ని తొలగించి కేవలం పాలనాపరమైన సంస్థగా మార్చారు.
- పన్నులు విధించడం, అవి చెల్లించని వారిపై చర్యలను తీసుకునే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఇచ్చారు.
- భారతీయులకు మత, విద్యాపరమైన అధ్యయనం కోసం లక్ష రూపాయలతో నిధి ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణ సదుపాయాన్ని కల్పించారు.

ఈ చట్టం ద్వారా భారత్‌లో వర్తకం చేయడానికి అందరికీ అవకాశం కల్పించారు. భారత్‌లో మిషనరీలు ప్రవేశించి చర్చిలు, ఆసుపత్రులు, విద్యాలయాలు స్థాపించడం వల్ల మతమార్పిడులకు వెసులుబాటు కలిగింది.

చార్టర్ చట్టం-1833

- ఈస్టిండియా కంపెనీ పాలనను మరో 20 ఏళ్లకు పొడిగించారు.
- బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఈ చట్టం ద్వారా 'ఇండియన్ గవర్నర్ జనరల్'గా మార్చారు. ఈ హోదాలో మొదటి భారత గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్.
- రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలు రద్దయ్యాయి. కార్యనిర్వాహక మండలి సమేతుడైన గవర్నర్ జనరల్‌కు పూర్తి శాసనాధికారాలు లభించాయి.
- కంపెనీ వ్యాపార లావాదేవీలను రద్దుచేసి, పరిపాలనా సంస్థగా మార్చారు.
- సివిల్ సర్వీసుల నియామకాల్లో సార్వజనిక పోటీ పద్ధతిని ప్రతిపాదించారు. కానీ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకించడం వల్ల ఇది అమల్లోకి రాలేదు.
- భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి భారతీయ 'లా' కమిషన్‌ను నియమించారు. దీనికి తొలి అధ్యక్షుడు లార్డ్ మెకాలే.
- ఈ చట్టాన్ని భారతదేశంలో 'కేంద్రీకృత పాలనకు తుదిమెట్టు'గా అభివర్ణిస్తారు.

చార్టర్ చట్టం-1853

చార్టర్ చట్టాల్లో చివరిది. అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చార్టర్ చట్టం ఇదే. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి చార్టర్ చట్టాలను పొడిగించడం అనే ఆనవాయితీ ప్రకారం దీన్ని రూపొందించారు. కానీ దీని ద్వారా కంపెనీ పాలనను పొడిగించలేదు. దీంతో కంపెనీ పాలన త్వరలోనే అంతమవుతుందని సూచించినట్లయింది.

ముఖ్యాంశాలు

- గవర్నర్ జనరల్ సాధారణ మండలి అధికారాలను శాసన, కార్యనిర్వాహక విధులుగా విభజించారు. శాసనాలు రూపొందించే ప్రక్రియ కోసం 'ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. ఇది బ్రిటిష్ పార్లమెంటులా విధులు నిర్వర్తిస్తుంది. అందువల్ల దీన్ని 'మినీ పార్లమెంట్'గా పేర్కొంటారు.
- కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా స్థానిక ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించారు. మొత్తం ఆరుగురు శాసన సభ్యుల్లో.. మద్రాసు, బొంబాయి, బెంగాల్, ఆగ్రా ప్రాంతాల నుంచి ఒక్కొక్కరి చొప్పున నలుగురిని తీసుకున్నారు.
- సివిల్ సర్వీసు నియామకాల్లో 'సార్వజనిక పోటీ విధానం' ప్రవేశపెట్టారు. దీనికోసం 1854లో లార్డ్ మెకాలే కమిటీని ఏర్పాటు చేశారు.
- వివిధ 'లా కమిషన్'ల సిఫారసుల ద్వారా సివిల్ ప్రొసీజర్ కోడ్ (1859), ఇండియన్ పీనల్ కోడ్ (1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1861)ను రూపొందించారు.

కంపెనీ పాలనకు సంబంధించి నిర్దిష్ట వ్యవధి పేర్కొనకపోవడం వల్ల కంపెనీ పాలన చక్రవర్తి చేతుల్లోకి మారడానికి ఈ చార్టర్ చట్టం మార్గం సుగమం చేసిందని భావిస్తారు. భారతీయులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించకపోవడం వల్ల తర్వాత జరిగిన పరిణామాలు సిపాయిలు తిరుగుబాటుకు దారితీశాయి.

బ్రిటిష్ రాణి లేదా రాజు పాలన (1858 -1947)

1858 నుంచి రాజు లేదా రాణి నేరుగా అధికారాన్ని చేపట్టడం వల్ల ఆ తర్వాత చేసిన చట్టాలను/సవరణలను 'భారత ప్రభుత్వ చట్టాలు' లేదా 'కౌన్సిల్ చట్టాలు' అంటారు.

భారత రాజ్యాంగ చట్టం-1858

1857 సిపాయిల తిరుగుబాటుతో భారతదేశంలో కంపెనీ పాలన అంతమై చక్రవర్తి (బ్రిటిష్ రాజు/రాణి) పరిపాలన వచ్చింది. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం. బ్రిటిష్ రాణి 1858 నవంబర్ 1న భారత పరిపాలనా అధికారాన్ని నేరుగా చేపడుతూ ఒక ప్రకటన జారీ చేసింది.

ముఖ్యాంశాలు

- గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్.
- దేశంలో బ్రిటిష్ రాణి మొదటి ప్రత్యక్ష ప్రతినిధి వైస్రాయ్. ఇతడు బ్రిటిష్ రాణి పేరుపై దేశ పాలన నిర్వహిస్తాడు.
- 1784లో ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే ద్వంద్వ పాలన రద్దయింది.
- భారతదేశంలో అత్యున్నత స్థానాన్ని కలిగిన వైస్రాయ్‌ని రాజ ప్రతినిధిగా 5 ఏళ్ల కాలానికి నియమించారు. ఇతడికి సహాయంగా ఒక కార్యనిర్వాహక మండలి ఉండేది.
- 'భారత రాజ్య కార్యదర్శి' అనే కొత్త పదవిని సృష్టించారు. ఇతడు బ్రిటిష్ మంత్రివర్గానికి చెందిన వ్యక్తి. అన్ని విషయాల్లో ఇతడిదే తుది నిర్ణయం. ఇతడికి సహాయంగా 15 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. మొదటి కార్యదర్శి చార్లెస్ వుడ్.

ప్రత్యేక వివరణ

వైస్రాయ్, గవర్నర్ జనరల్ అనే రెండు హోదాలు ఒకరికే ఉంటాయి. బ్రిటిష్ రాజు/రాణి ప్రతినిధిగా ఉంటే వైస్రాయ్‌గా, భారతదేశ పాలనాపరంగా అధిపతిగా ఉంటే గవర్నర్ జనరల్‌గా వ్యవహరిస్తారు.

దేశంలో పాలనాపరమైన అంశాలను.. ముఖ్యంగా ప్రభుత్వాన్ని నియంత్రించడానికి 1858 చట్టాన్ని చేశారని, వీటికి సంబంధించిన మార్పులను ఇంగ్లండులో చేశారేగానీ, భారత్‌లోని పాలనా వ్యవస్థలకు ఎలాంటి మార్పులు చేయలేదని విమర్శకుల అభిప్రాయం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతప్రభుత్వ చట్టం 1935 ప్రకారం కార్యనిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
   - ఎ) బ్రిటిష్‌రాణి / రాజు
   - బి) ఇంగ్లండు పార్లమెంటు
   - సి) సమాఖ్య శాసనసభ
   - డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఏమని పిలుస్తారు?
   - ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
   - సి) క్రౌన్ చట్టాలు డి) పైవేవీకావు
3. 1946 సెప్టెంబరు 2న ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వాన్ని మొదటిసారి ప్రతిపాదించింది?
   - ఎ) సైమన్ కమిషన్ బి) క్రిప్స్‌మిషన్
   - సి) వేవెల్ ప్లాన్ డి) కేబినెట్ మిషన్ ప్లాన్
4. స్టాఫర్డ్ క్రిప్స్ కిందివాటిలో ఎందులో సభ్యుడు?
   - ఎ) కన్జర్వేటివ్ పార్టీ బి) లిబరల్ పార్టీ
   - సి) లేబర్ పార్టీ డి) అధికార శ్రేణి
5. బ్రిటిషర్లు ఏ సంవత్సరంలో బెంగాల్‌లో సుప్రీం కోర్టును ఏర్పాటు చేశారు?
   - ఎ) 1776 బి) 1775
   - సి) 1777 డి) 1774

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) డి; 4) సి; 5) డి.

ఉద్యోగాలు

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 81 ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ఆపరేటర్, డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 81.
» **పోస్టుల వివరాలు:** డ్రైవర్-21, ఆపరేటర్-60.
» **విభాగాలు:** అంబులెన్స్ వ్యాన్, సీఐఎస్ఎఫ్, స్టాఫ్ కారు, ట్రక్, డీజిల్ క్రేన్స్, ఫైర్ టెండర్, ఫోర్క్‌లిఫ్ట్/ఏరియల్ వర్క్ ప్లాట్‌ఫాం తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 57 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 21.08.2024, 22.08.2024.
» **వేదిక:** రిక్రియేషన్ క్లబ్, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, తేవర గేట్, కొచ్చి-682015.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in/

ఎన్ఐబీ, నోయిడాలో వివిధ పోస్టులు


నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్(ఎన్ఐబీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ గ్రేడ్1-01, సైంటిస్ట్ గ్రేడ్2-02, జూనియర్ సైంటిస్ట్-02, అసిస్టెంట్ 2-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.nib.gov.in/

భౌతిక శాస్త్రం - కాంతి



దృష్టి లోపాలు- రకాలు

- **హ్రస్వదృష్టి:** కంటికి దగ్గరగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి, దూరంగా ఉన్న వాటిని సరిగా చూడలేకపోవడాన్ని 'హ్రస్వదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న వికేంద్రీకరణ (పుటాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.
- **దూరదృష్టి(లేదా)దీర్ఘదృష్టి:** కంటికి దూరంగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వాటిని చూడలేకపోవడాన్ని 'దూరదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న కేంద్రీకరణ(కుంభాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.
- **అసమదృష్టి:** కంటిలోని కార్నియాలో లోపం వల్ల ఈ సమస్య వస్తుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఒక వస్తువును చూసినప్పుడు అది అడ్డుగీతలు లేదా నిలువు గీతలుగా మాత్రమే కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి స్తూపాకార కటకం వాడతారు.
- **చత్వారం:** కొంత మందిలో వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను దాని నేత్రానుగుణ్యతను కోల్పోతుంది. ఫలితంగా దగ్గరగా ఉన్న వస్తువును లేదా కొంత దూరంలో ఉన్న వస్తువును చూడటం వీలుకాదు. ఈ దృష్టి లోపాన్ని సవరించడానికి ద్వినాభి కటకాన్ని ఉపయోగిస్తారు.
- **రేచీకటి:** విటమిన్-ఎ లోపం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. రేచీకటితో బాధపడే వారు పగటి సమయంలో మాత్రమే చూడగలుగుతారు. రాత్రివేళలో కృత్రిమ కాంతి జనకాల నుంచి వచ్చే కాంతి తీవ్రత వీరిలో దృష్టిజ్ఞానాన్ని ప్రేరేపించదు. ఈ సమస్య నివారణకు విటమిన్-ఎ ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి.
- **వర్ణాంధత్వం:** కంటిలోని కోన్లలో తలెత్తే లోపం వల్ల వర్ణాంధత్వం కలుగుతుంది. ఈ సమస్య ఉన్నవారు అన్ని రంగులను గుర్తించలేరు. తల్లిదండ్రుల జన్యువుల ద్వారా పిల్లలకు సంక్రమిస్తుంది. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఔషధాలు, చికిత్సా విధానం అందుబాటులో లేదు.

అదృశ్య వికిరణాలు

- **పరారుణ కిరణాలు:** వీటిని విలియం హెర్షెల్ కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 7,500 Å- 40,00,000Å. అన్ని రకాల గాజు పదార్థాలు ఈ కిరణాలను శోషించుకుంటాయి. రాతి ఉప్పుతో తయారైన పట్టకాలు, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకొని వెళ్లలేవు. కాబట్టి ఈ కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.
- పరారుణ కిరణాలు తమ వెంట ఉష్ణాన్ని మోసుకెళుతూ ఎదురుగా ఉన్న వస్తువులను తాకినప్పుడు వాటికి ఉష్ణాన్ని బదిలీ చేస్తాయి. అందువల్ల ఈ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఉష్ణ వికిరణ సూత్రం ఆధారంగా థర్మోపైల్, బోలోమీటర్ సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

అనువర్తనాలు

- కండరాల నొప్పి, బెణకడం వల్ల వచ్చే నొప్పుల నివారణకు పరారుణ కిరణాలను ఉపయోగిస్తారు. పక్షవాతానికి చికిత్సలో, టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వీటిని వినియోగిస్తారు.
- ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రహస్య సాంకేతికాలను ప్రసారం చేయడానికి ఈ కిరణాలు ఉపయోగపడతాయి.
- రిమోట్ సెన్సింగ్ విధానంలో వాడతారు.
- గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- పరారుణ కిరణాల తరంగదైర్ఘ్యం ఎక్కువ. అందువల్ల పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా ఈ తరంగాలు తక్కువ పరిక్షేపణం చెందుతాయి. రుజుమార్గంలో ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. కాబట్టి ఇలాంటి పదార్థాల ద్వారా వస్తువులను చూడటానికి, ఫొటోలు తీయడానికి ఈ కిరణాలను వాడతారు.
- భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించడానికి వాడతారు.
- నైట్ విజన్ కెమెరా, బైనాక్యులర్లలో ఈ కిరణాలను వాడతారు. రాత్రి వేళల్లో ఈ పరికరాలతో వస్తువులను స్పష్టంగా చూడవచ్చు.
- పరిశ్రమల బట్టీలు, కొలిమిల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలను సృష్టించడానికి వాడతారు.
- పరారుణ కిరణాల ఆధారంగా వస్తువుల ఉష్ణోగ్రతను కొలిచే పద్ధతిని థర్మోగ్రఫీ అంటారు.
- గ్లోబల్ వార్మింగ్‌ను, ఒక ప్రదేశంలోని శీతోష్ణస్థితులను అధ్యయనం చేయడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.
- టెలిస్కోప్ పనిచేయడానికి కూడా ఈ కిరణాలను ఉపయోగిస్తారు.
- **అతినీలలోహిత కిరణాలు:** వీటిని రిట్టర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 100Å -4000Å. క్వాంటం సిద్ధాంతం ప్రకారం ఈ కిరణాల శక్తి చాలా ఎక్కువ. క్వార్ట్జ్ గాజు మినహా మిగతా గాజు పదార్థాలన్నీ ఈ కిరణాలను శోషించుకుంటాయి. అందువల్ల క్వార్ట్జ్‌తో నిర్మించిన కటకాలు, పట్టకాలను ఉపయోగించి ఈ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.
- **గమనిక:** అతినీలలోహిత కిరణాలను తేనెటీగలు చూడగలుగుతాయి.

అనువర్తనాలు

- పాలు, నీళ్లలో ఉన్న హానికర బ్యాక్టీరియాను నశింపజేయడానికి, ఆహార పదార్థాలను మన్నికగా ఎక్కువ కాలం నిల్వ చేయడానికి అతినీలలోహిత కిరణాలను ఉపయోగిస్తారు.

గమనిక: ఆహార పదార్థాలను నిల్వ చేయడం కోసం వాటిలో సోడియం బెంజోయేట్‌ను కలుపుతారు.

- వైద్య రంగంలో స్టెరిలైజేషన్ కోసం (హానికరమైన బ్యాక్టీరియాను నశింపజేయడానికి) ఈ కిరణాలను ఉపయోగిస్తారు.
- పాడైన కోడిగుడ్లను గుర్తించడానికి వాడతారు.
- సహజ, కృత్రిమ దంతాల మధ్య తేడాలను తెలుసుకోవడానికి వీటిని ఉపయోగిస్తారు.
- టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లోనూ వినియోగిస్తారు.
- తొలిదశలో ఉన్న కేన్సర్ గడ్డలను కరిగించడానికి వీటిని వాడతారు.
- వేలిముద్రలను విశ్లేషించడానికి వాడతారు.
- వృక్షాలు కిరణజన్య సంయోగక్రియ జరపడానికి వీటిని ఉపయోగించుకుంటాయి.
- అతినీలలోహిత కిరణాలు మన శరీరంపై పడినప్పుడు 1 మి.మీ. లోతుకు చొచ్చుకెళ్లి విటమిన్-డిని ప్రేరేపిస్తాయి. రికెట్స్ వ్యాధి రాకుండా విటమిన్-డి తోడ్పడుతుంది.
- నకిలీ డాక్యుమెంట్లు, కరెన్సీ నోట్లను గుర్తించడానికి వినియోగిస్తారు.
- **నష్టాలు:** సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల శక్తి అధికంగా ఉంటుంది. వీటి ద్వారా చర్మ కేన్సర్ సోకుతుంది. ఈ కిరణాలు నేరుగా భూమిని చేరకుండా వాతావరణంలోని ఓజోన్ పొర శోషించుకుంటుంది. కానీ క్లోరోఫ్లోరో కార్బన్‌లు, ఫ్రియాన్ వాయువుల వల్ల ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. వీటి ద్వారా అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరుతాయి.
- **రేడియో తరంగాలు:** వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మిల్లీమీటరు నుంచి 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇవి ఒక రకమైన విద్యుదయస్కాంత కిరణాలు. కాబట్టి శూన్యంలో, గాలిలో రేడియో తరంగాల వేగం కాంతి వేగానికి ($C = 3.10^8$ m/s) సమానంగా ఉంటుంది.

అనువర్తనాలు

- రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వినియోగిస్తారు.
- టెలిస్కోప్‌లు పనిచేయడానికి వాడతారు.
- రాడార్‌లు పనిచేయడానికి ఉపయోగిస్తారు.
- వాతావరణంలోని మార్పులను ముందుగా గుర్తించడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.
- **మైక్రోవేవ్స్:** వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మీటరు - 1 మిల్లీ మీటరు. మైక్రో తరంగాలు ఒక రకమైన విద్యుదయస్కాంత తరంగాలు. గాలిలో, శూన్యంలో వీటి వేగం కాంతి వేగానికి సమానం.

అనువర్తనాలు

- నావిగేషన్ విధానంలో (వాహనాలు, నౌకలు, విమానాల మార్గాలను తెలుసుకోవడానికి) ఉపయోగిస్తారు.
- టెలిమెట్రీ విధానంలో వాడతారు. భూమి నుంచి ఒక అంతరిక్ష నౌక మధ్య ఉండే దూరాన్ని కొలిచే పద్ధతిని టెలిమెట్రీ అంటారు.
- భూమి ఉపరితలం నుంచి మేఘాల ఎత్తు, అవి కదిలే దిశను తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వీటిని వినియోగిస్తారు.
- మైక్రో ఓవెన్‌లో ఆహార పదార్థాలను వేడిచేయడానికి వాడతారు.
- ఈ తరంగాలు ఆహార పదార్థంలోని అణువుల లోపలికి చొచ్చుకెళ్లి వాటి కంపనాలను పెంచుతాయి. అందువల్ల ఈ కణాల కంపన శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది. ఫలితంగా ఆహార పదార్థాలు వేడుక్కుతాయి.
- అల్యూమినియం, రాగి, ఇనుము తదితర లోహాల ద్వారా మైక్రోవేవ్స్ చొచ్చుకెళ్లలేవు. కానీ అలోహాలైన గాజు, ప్లాస్టిక్, పేపర్ తదితరాల ద్వారా చొచ్చుకెళతాయి. కాబట్టి అలోహ పదార్థాలతో తయారుచేసిన పాత్రల్లో మాత్రమే ఆహార పదార్థాలను ఉంచి మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చేయాలి. మైక్రో ఓవెన్‌ను స్పెన్సర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

మాదిరి ప్రశ్నలు

1. ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
   1) రుజువర్తనం 2) వ్యతికరణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) వివర్తనం
2. కాంతి వ్యతికరణాన్ని కనుగొన్నది ఎవరు?
   1) హైగెన్స్ 2) థామస్ యంగ్
   3) న్యూటన్ 4) గ్రిమాల్డి
3. కాంతి పరిక్షేపణం దేనిపై ఆధారపడుతుంది?
   1) కాంతి కిరణాల కోణం
   2) కాంతి తరంగ దైర్ఘ్యం
   3) కాంతి కిరణం ఢీకొంటున్న కణాల పరిమాణం 4) పైవన్నీ
4. ఆకాశం నిజమైన రంగు ఏది?
   1) నీలం 2) నలుపు
   3) తెలుపు 4) వర్ణ రహితం
5. నీటిపై నూనెను వెదజల్లినప్పుడు రంగులు కనిపించడానికి కారణం?
   1) వ్యతికరణం 2) వక్రీభవనం
   3) రుజువర్తనం 4) విశ్లేషణం
6. సీడీ, డీవీడీలపై కాంతి పతనమైనప్పుడు భిన్న రంగులు కనిపించడానికి కారణం?
   1) రుజువర్తనం 2) వివర్తనం
   3) విశ్లేషణం 4) ధ్రువణం
7. ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణమయ్యే కాంతి ధర్మం?
   1) వక్రీభవనం 2) విశ్లేషణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) పైవన్నీ
8. హోలోగ్రఫీ విధానాన్ని ఆవిష్కరించింది ఎవరు?
   1) గేబర్ 2) ఫెర్మీ
   3) ఫారడే 4) బ్రిటేయిన్
9. రామన్ ఫలితంలోని కాంతి ధర్మం ఏది?
   1) రుజువర్తనం 2) పరిక్షేపణం
   3) విశ్లేషణం 4) ధ్రువణం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 4; 5) 1; 6) 2; 7) 4; 8) 1; 9) 2.